వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 17 సంచిక : 3 హైదరాబాద్ 212 మార్చ్ 2019 పేజీలు : 68 రు. 25

- కేంద్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బడ్జెట్లు
- పుల్వామా దాడిని ఎలా చూడాలి?
- తెలంగాణలో యజ్ఞయాగాలు
- ఆంధ్రప్రదేశ్‌లో చుక్కల భూముల కబ్జా
- విస్ఫోటక స్థాయిలో ఆర్థిక అంతరాలు
- కునారిల్లుతున్న పాఠశాల విద్య
- బంగ్లాదేశ్ రాజకీయ పరిణామాలు

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్	9705055738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర)	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర)	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా)	8977995537
రెడ్డి బుక్‌స్టాల్	అశోక్‌నగర్, హైదరాబాద్	
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహిదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
లక్ష్మణ్	చిక్కడపల్లి, హైదరాబాద్	93910 12051
మల్లిఖార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
బాల్‌రెడ్డి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	98660 18829
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్‌స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీథి, ప్రొద్దటూరు	81210 02112
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీథి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091

212 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

మార్చ్ 2019
సంపుటి : 17
సంచిక : 3

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ వేసిన అప్పీల్‌కు స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థికసహాయం అందించిన కాకాని సాంబశివరావు, నిజామాబాద్ - రు. 10,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం ఫిబ్రవరి సంచికలో 'కొత్త రిజర్వేషన్లు–సంఘ్‌పరివార్ కుట్ర' వ్యాసంలో వేణుగోపాల్ ఎన్నో కోణాలతో చక్కగా వివరించారు. కొత్త రిజర్వేషన్ విధానం వల్ల తమకేదో మేలు జరుగుతుందని ఆశించడానికి ఏమీలేదు. అసలు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వాలు ప్రజల్ని అసలు విషయం నుంచి ప్రక్కదారి పట్టించి అసలైన శత్రువుని వదిలేసి తమ మధ్య విభేదాలు సృష్టించడానికి ఉపయోగపడే ఈ కొత్త రిజర్వేషన్ల గురించి ఎంతో సందేశంతో ప్రతి ఒక్క కోణం నుంచి వివరంగా ఉన్న వ్యాసం ఎంతో బాగుంది.

– ప్రకాశ్

టిటాగర్, కొల్‌కత్తా

వీక్షణం సంపాదకులకు నా వ్యాసం 'అర్బన్ నక్సల్స్–అసమ్మతి' ఫిబ్రవరి 2019 వేసినందుకు తద్వారా వాస్తవాలను ప్రజలకు, ప్రజాస్వామ్య వాదులకు తెలియ పరిచినందుకు ధన్యవాదాలు. కానీ అదే సంచికలో ఎన్. నారాయణరావు (ప్రధాన కార్యదర్శి పౌరహక్కుల సంఘం తెలంగాణ) రాసిన 'ఆలోచనలని నిర్బంధించగలరా?' అన్న వ్యాసం పట్ల కొన్ని అభ్యంతరాలను అర్బన్ నక్సల్ కోఆర్డినేటర్‌గా రాజ్యం చేత ముద్ర పడి బిలాస్‌పూర్ జైల్‌లో ఉన్న ఎన్. వెంకట్రావు సహచరిగా, అతని న్యాయవాదిగా తెలియపరచదలుచు కున్నాను. ఈ వ్యాసం నాల్గవ పేరాలో నేషనల్ జియో ఫిజికల్‌కి చెందిన టెక్నికల్ ఆఫీసర్‌ను నాగపూర్‌లో అరెస్టు చేశారని చెప్పారు. అది నిజమే కాని మిత్రులను కలవడానికి వెళ్లిన వెంకట్రావ్‌ను డిసెంబర్ 20న కస్టడీలోకి తీసుకుని నిర్బంధించి ఆ తరువాత 23వ తారీఖున నాకు ఛత్తీస్‌గడ్ ఐ.జి.సింగ్ సమాచారమిచ్చారు. అంతేగాని ఏ బంధువుకో సమాచారాన్ని ఇవ్వలేదు.

అదే పేరాలో ఈ అరెస్టు వెనుక మహారాష్ట్ర మావోయిస్టు ఉద్యమంలో పనిచేసి లొంగిపోయిన సీనియర్ నాయకుడు పహాడీ సింగ్ పాలకులకు పట్టి ఇచ్చినట్టుగా వెంకట్రావ్ తెలియచేశారని, అతను వారి కుటుంబ సమస్య పరిష్కారం కోసం గతంలో ఒకటి రెండు సార్లు మిలింద్‌ని కలిసాడని, కలిసినపుడు పహాడి సింగ్ వెంకట్రావ్ దగ్గరే ఉండి తనతో మాట్లాడినాడని రాసాడు. కానీ వెంకట్రావ్ అరెస్ట్ అయిన వెనువెంటనే వెళ్లినపుడు గాని ఆ తరువాత ప్రతి పిపికి వెళ్లినపుడు కానీ ఆ విషయాలను అతను తెలియజెప్పలేదు. వెంకట్రావ్ పోలీస్ స్టేట్‌మెంట్‌లో ఇదే నారాయణరావు రెండు వాకి టాకీలు, ఒక లెటరు మావోయిస్టులకు అందజేయమని ఇచ్చారని పోలీసులు వారి ఎఫ్.ఐ.ఆర్.లో పెట్టారు. కానీ ఈ విషయాన్ని నారాయణరావు ప్రస్తావించలేదు. ఎందుకో అతనికే తెలియాలి. ఇది నిజం కాదు. పోలీసులు అక్రమంగా మూడు రోజులు నిర్బంధించి మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ మొదలగు అనేక చోట్ల తిప్పి బలవంతపు ఒప్పుకోళ్లకు బలిచేశారు. ఒక సహచరిగా వెంకట్రావ్ కోసం వాదించే న్యాయవాదిగా పై వ్యాఖ్యలకు అభ్యంతరం తెలియజేస్తున్నా. ఈ విషయాలను వెంకట్రావ్‌తో జైల్లో చర్చించిన తరువాత మాత్రమే మీ అందరికి తెలియజేస్తున్నా. కాబట్టే ఒక ప్రజాసంఘానికి బాధ్యుడై ఉండి కూడా వ్యాసం రాసే ముందు మొత్తంగా స్వయంగా తెలుసుకొని ఆలోచించి రాసినట్లైతే అది వ్యక్తులకు, సంస్థలకు, కేసులకు హాని కలిగించదు. ఇటువంటి వ్యాఖ్యల వలన కేసులను ఎదుర్కొంటున్న వారిని ఇబ్బందుల్లో పడవేయడమే కాక రాజ్యానికి పరోక్షంగా సహకరించినవారమవుతాము. ఈ విషయాన్ని రచయిత గమనించాలి. ఈ వాస్తవాలని ప్రచరిస్తారని ఆశిస్తున్నాము.

– హేమా వెంకట్రావు

హైదరాబాద్

వీక్షణం ఫిబ్రవరి 2019 సంచికలో 'కొత్త రిజర్వేషన్లు సంఘపరివార్ కుట్ర' సుదీర్ఘ సంపాదకీయం చదివాను. ఓటింగులో 124వ రాజ్యాంగ సవరణను లోక్‌సభ ఆమోదించింది. ముగ్గురు మాత్రం బిల్లును వ్యతిరేకిస్తు

(మిగతా 62వ పేజీలో...)

Statement about ownership and other particulars of periodical **Veekshanam** as required to be published in the first issue of every year after the last day of February

Form IV (See Rule 8)

1. Place of publication	:	Hyderabad
2. Periodicity of its publication	:	Monthly
3. Printer's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency 3-6-394, Street No. 3 Himayatnagar, Hyderabad - 500 029.
4. Publisher's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency 3-6-394, Street No. 3 Himayatnagar, Hyderabad - 500 029.
5. Editor's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency 3-6-394, Street No. 3 Himayatnagar, Hyderabad - 500 029.
6. Name and addresses of individuals who own the newspaper	:	N. Venugopal Rao

I, N. Venugopal Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

(N. Venugopal Rao)

Date : 1st March, 2019 Signature of the Publisher

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

వోట్ల పంటల కోసం నెత్తుటి విత్తనాలు

సాధారణంగా ఒక పని ఎందుకు ఎలా జరిగి ఉంటుందో నిర్ధారించడంలో పరిశోధకులు ఆ పని వల్ల ప్రయోజనం పొందేవారెవరు, ఆ పనిలో వారి హస్తం ఎంత అని ప్రారంభిస్తారు. ఫిబ్రవరి 14న కశ్మీర్ లోని అవంతిపురా దగ్గర సిఆర్‌పి ఎఫ్ వాహనశ్రేణి మీద పేలుడుపదార్థాలు నిండిన వాహనంతో ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు దాడి చేసి, నలభైకి పైగా జవాన్లను చంపివేయడం, ఆ తర్వాత పన్నెండు రోజులకు సరిహద్దు అవతలి గ్రామం మీద భారత వైమానిక దళం దాడి, దేశ వ్యాప్తంగా గత రెండు వారాలుగా జరుగుతున్న సైనిక అనుకూల, యుద్ధ అనుకూల, పాకిస్తాన్ వ్యతిరేక ప్రదర్శనలు, మొత్తంగా పెరుగుతున్న యుద్ధోన్మాదం వంటి గొలుసుకట్టు పరిణామాలను పరిశీలిస్తే ఈ పరిణామాలతో లాభపడనున్నదెవరో స్పష్టంగానే కనబడుతున్నది. ఈ ఘర్షణ వాతావరణం తమ ఎన్నికల ఫలితాలను సానుకూలంగా ప్రభావితం చేస్తుందని స్వయంగా భారతీయ జనతా పార్టీ నాయకులెందరో ప్రకటిస్తూనే ఉన్నారు. నానాటికీ దిగజారిపోతున్న ప్రతిష్ఠను పెంచుకోవడానికి, 2019 ఎన్నికల్లో విజయావకాశాలను మెరుగు పరచుకోవడానికి నరేంద్ర మోడీ నాయకత్వంలో సంఘ్ పరివార్ ఏవో కుటిల పన్నాగాలు పన్నుతుందని చాలకాలంగా పరిశీలకులు చేస్తున్న ఊహాగానాలను, వెలిబుచ్చుతున్న అనుమానాలను నిజం చేస్తూ ఈ నెత్తుటి వానలు మొదలయ్యాయి. ఈ నెత్తుటి వానలు నరేంద్ర హిట్లర్ కు ఇబ్బడి ముబ్బడిగా వోట్ల పంటలను సాధించి పెట్టవచ్చు. తమ వోట్ల పంట కోసం సంఘ్ పరివార్ శక్తులు ఇరు దేశాల ప్రజల ప్రాణాలనూ బలిపెట్టి హింసాకాండకూ యుద్ధోన్మాద వాతావరణం పెంచడానికీ ప్రయత్నించవచ్చు. కాని ఈ వ్యవహారంలో బుద్ధిజీవులు ఆలోచించవలసిన కీలకాంశాలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వ ప్రచారపు జడిలో, చిలకపలుకుల ప్రచారసాధనాల అబద్ధాల పునరుక్తిలో కొట్టుకుపోకుండా వర్తమానంలోనూ భవిష్యత్తులోనూ శాంతి సామరస్యాల కోసం ఆలోచించవలసిన విషయాలెన్నో ఉన్నాయి.

మొట్టమొదట, ప్రస్తుత ఘర్షణకు మూలంగా చెపుతున్న పుల్వామా దాడి దానికదిగా మొదలూ కాదు, చివరా కాదు. ఏడు దశాబ్దాలుగా రెండు దేశాల ప్రభుత్వాలూ కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను కాలరాస్తూ సాగిస్తూ వస్తున్న దుర్మార్గాల వరుసలో అది ఒకానొక ఘటన మాత్రమే. స్వతంత్ర దేశంగా ఉన్న ఒక ప్రాంతాన్ని విలీనం చేసుకుంటూ, ఆ విలీనం ఒక ప్రత్యేక పరిస్థితిలో జరుగుతున్నది గాని పరిస్థితి కుదుటపడగానే జనాభిప్రాయసేకరణ జరిపి ప్రజలు ఏది కోరుకుంటే అది అమలు చేస్తామని వాగ్దానం చేసి, ఏడు దశాబ్దాలుగా ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోకుండా కశ్మీరీల నేలను ఆక్రమించి సైనిక పాలన సాగిస్తున్న భారత ప్రభుత్వం, మూడు యుద్ధాలలో దొరికినంత భాగాన్ని ఆక్రమించుకుని తిష్ట వేసి కూచున్న పాకిస్తాన్ ప్రభుత్వం, కశ్మీరీ ప్రజల స్వాతంత్ర్యాకాంక్షను అణచివేయడానికి, అపమార్గం పట్టించడానికి హింసనూ తీవ్రవాదాన్నీ జాతిహననాన్నీ సాగిస్తున్నాయి. భయభీతావహ వాతావరణాన్ని నెలకొల్పాయి. స్థానిక ప్రజల ప్రాథమిక హక్కులపై ఉక్కుపాదం మోపడం దగ్గర ప్రారంభించి ఐక్యరాజ్య సమితితో సహా అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నాయి. తరాలు గడిచినా సమస్య అపరిష్కృతంగా మిగిలిపోతున్న దుస్సహ స్థితి వల్ల యువత అనివార్యంగా ఇతరేతర పరిష్కారమార్గాలు ఎంచుకుంటున్నారు. సంక్షుభిత జలాలు ఉన్నప్పుడు చేపలు పట్టడానికి ఎవరైనా వస్తారన్నట్టు ఈ వ్యూహాత్మక ప్రాంతంలోని వివాదాన్ని, ఆగ్రహాన్ని, నిరాశను వాడుకుని, పరిస్థితిని మరింత జటిలం చేయడానికి ఎన్నో శక్తులు సిద్ధంగా ఉన్నాయి.

ఈ సంక్షుభిత చారిత్రక పూర్వరంగాన్ని దృష్టిలో పెట్టుకుని సున్నితంగా, జాగ్రత్తగా, దౌత్యనీతిని పాటిస్తూ ఈ సమస్యకు పరిష్కారం కనిపెట్టడంలో భాగస్వాములందరితోనూ చర్చలు జరపవలసిన భారత ప్రభుత్వం కశ్మీరీ ప్రజల మనోభావాలను అవమానిస్తూ, అణచివేస్తూ 'కశ్మీర్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగం' అనే మొండివైఖరి తీసుకుంటున్నది. పుల్వామా దాడి ఎన్నికల సందర్భంలో జరిగినందువల్ల అది మోడీ సృష్టి కావచ్చుననే అనుమానాలు ఉన్నాయి గాని, ఒకవేళ అది నిజమైన దాడే అయినా దాన్ని ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవలసి ఉంది. దాన్ని అర్థం చేసుకోవడం అలా ఉంచి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే దాన్ని అపార్థం చేయించడానికి, దాని ద్వారా యుద్ధోన్మాదాన్నీ, కుహనా దేశభక్తినీ రెచ్చగొట్టి వోట్లుగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నది. పచ్చి అబద్ధాలు, అతిశయోక్తులు ప్రచారం చేస్తున్నది.

ప్రధానస్రవంతి ప్రచార సాధనాలన్నీ కూడ ఈ ప్రభుత్వ కుట్రలో భాగస్వాములవుతున్నాయి. సాధారణంగా ప్రభుత్వాలు అబద్ధాలు చెపుతాయని తెలిసినవారు, ప్రభుత్వం చెప్పే అబద్ధాలను ఖండించేవారు కూడ దేశం, 'దేశభక్తి', విదేశీ వ్యవహారాలు, యుద్ధం వంటి విషయాలు వచ్చేసరికి ప్రభుత్వం చెపుతున్న అబద్ధాలను నిరభ్యంతరంగా మింగడానికి సిద్ధంగా ఉంటారు. అలా ఇవాళ దేశవ్యాప్తంగా మధ్యతరగతి మేధావులు, ఆలోచనాపరులు, ముఖ్యంగా ప్రచారసాధనాలలో, సామాజిక మాధ్యమాలలో తమ గొంతు వినిపించే అవకాశం ఉన్నవారు ఎక్కువమంది ఈ యుద్ధోన్మాదపు మాయాజాలంలో చిక్కుకుని ఉన్నారు. పాలకవర్గ ప్రయోజనాలకోసం, ఒక పాలకవర్గ ముఠా ఎన్నికల ప్రయోజనాల కోసం రెచ్చగొట్టబడుతున్న ఈ యుద్ధోన్మాదాన్ని ఇలాగే కొనసాగనిస్తే రెండు వైపులా అణ్వాయుధాల కుప్పల మీద కూచున్న ప్రభుత్వాలు ఈ ఉపఖండంలోని రెండు దేశాల అశేష ప్రజానీకాన్ని భస్మీపటలం చేస్తాయి. అప్పుడిక ఈ భూమి మాదనీ, మీదనీ చెప్పుకోవడానికి ప్రజలే మిగలరు. ఆ భయానక దుష్పరిణామాన్ని దృష్టిలో పెట్టుకుని అయినా మధ్యతరగతి బుద్ధిజీవులు మేలుకొనవలసిన అవసరం ఉన్నది. ఒక్క పుల్వామా ఘటన మీద మాత్రమే కాదు, ఏడు దశాబ్దాలుగా సాగుతున్న చరిత్రను నిష్పాక్షికంగా సమీక్షించవలసి ఉన్నది. సొంత ఆస్తి, భూమి, శాశ్వత అంతర్భాగం, మన దేశం వంటి భావనల కన్న న్యాయాన్యాయాలు, నిజానిజాలు, చరిత్ర, ప్రజల ఆకాంక్షలు ఈ సమీక్షకు పునాది కావాలి. హింస, రక్తపాతం, విధ్వంసం సృష్టించే యుద్ధం కన్న మానవ సంబంధాల శాంతి సామరస్యాలు ప్రధానమనే అవగాహన కావాలి. ఎంత జటిలమైన సమస్యనైనా సంభాషణ ద్వారా, చర్చ ద్వారా పరిష్కరించవలసిందే అన్న సమన్వయ వైఖరి కావాలి. తాత్కాలిక క్షుద్ర ప్రయోజనాల కోసం ఇతరుల ప్రాణాలు బలితీసుకునే విద్వేష రాజకీయాలకు ముగింపు పలకాలి. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

బిచ్చం ఏస్తనంటవు గాని హక్కు ఇయ్యనంటవా?

మన గల్ల పెట్టెల పైసపైస ఎట్ల జమైతాందో, దాన్ని బైటికి తీసి మళ్ల ఎవలెవలి నోట్ల ఎట్లెట్ల పెడతవో ఏడాదికోపారి చెప్తవట గద. అయ్యో నాయనా, నీకెంత కష్టమొచ్చె. ఎక్కడెక్కడికెల్లి దెచ్చిన పైసలన్ని నీ నిగ్రానిలనె ఉండాల్నాయె, నీ ఇష్టం వచ్చినట్టే ఖర్చు పెట్టుకోనియ్యాల్నాయె. ఇగో గీడి నుంచి దెచ్చిన, గీడ గీడ ఖర్చు పెడతాన అని నువు ఎవరికో ఎందుకు చెప్పాలె నాయనా. దొర దల్చుకున్నదె చట్టమాయె. రాజు దల్చుకుంటె దెబ్బలకు కొదవా. నిన్ను లెక్కలు జెప్పుమని ఎవలడుగుతాండ్లు కొడకా, ఇంత అన్నాలమా. సరె పోనీ గని, ఎవలెవలకు ఎంతెంత ఇస్తానవు, నువ్వు ఎంత తింటానవు, నీ నౌకరు చాకర్లకు ఎంతిస్తానవు, ఎంత పందారం జేస్తానవు అని అడుగుత లేను, అది నీ ఇష్టం, నివజ్జె. మల్ల గుడ ఆసరా ఇస్తనన్నవట, ఇంక ఎక్కువ గుడ చేస్తనన్నవట. అంటేంది నాయనా, బిచ్చం ఎక్కువ జేస్తవన్న మాట. పది మందిల ఒకరో ఇద్దరో పనికి రాకుండ అయింద్రు కావచ్చు గాని, మిగిలిన ఎనిమిది తొమ్మిది మంది పని జేసుటానికి బాగనే ఉన్నరు గద. వాళ్లకు పని చూపిచ్చే బదులు బిచ్చం ఏస్తనంటవా. ఆడిపిల్లల పెండ్లిల్లకు ఇచ్చేది ఇచ్చేదేనాయె అన్నవట గద. పెండ్లికి ఇచ్చే బదులు ఆడిపిల్లల చదువుకు, వాళ్ల కాళ్లమీన వాళ్లు నిలబడుతానికి ఇస్తె బాగుండు గాదు నాయనా. చదువుకోని కొలువురాకుండా ఇంట్లె గూచున్న పోరగాండ్లకు గుడ కూకోబెట్టి పైసలు ఇస్తనన్నవట గద. మంచిది నాయనా. కాని ఉత్తగ కూకోబెట్టి పైసలు ఇచ్చెదానికంటె నాలుగు మిల్లులు గట్టి వాళ్లను ఏదన్న కొలువుల బెట్టె మంచిది గాదా. పనికి పనీజేస్తరు, ఇయ్యే పైసలు ఇయ్యొచ్చు. అయినా లచ్చలాది పోరలు పనిలేకుండా ఉత్తుత్తగ తిరుగుతాంటె పదిట్ల ఒక్కనికె అట్ల పైసలు ముడుతయన్నవట గద. మరి మిగిలిన తొమ్మిది మంది ఏం చేయాలె బాంచెన్.

ఇవన్ని సరె గాని నాయనా మస్తుగ అప్పు జేసినవట గద. బరాబర్ జేస్త, నా అంత మొగోడున్నడా అని గుడ సవాల్ జేసినవట గద. అప్పు జేసుడు అంత మంచిపని అని నేనెన్నడు ఇన్లే బాంచెన్. అప్పు జేయొద్దురా, మిత్తితో చచ్చిపోతవు అని మా నాయన అనెటోడు. అప్పు తప్పు నాకు ఒక్కతీర్గనె ఇనబడ్తయి. మరి నువ్వేమొ కొత్తగా అప్పు జేయకుండ కొసెల్లినోడు ఎవడు, అప్పు జేస్తెనే ముందర బడ్తం అన్నవట గద. మంచిగనే ఉన్నది నాయనా. కాని అప్పు ఎవడుతేర్పాలె బాంచెన్. తుపాకి రాముడు తేర్పినట్టయితే కాదు గద. బ్యాంకుకు పది వేల అప్పు పడ్తెనె ఇంట్ల జొచ్చి బిందె తప్పాల ఎత్తుకపో బట్టిరి. పెండ్లాం బిడ్డలను తీరొక్క మాట అనబట్టిరి. మరి కోట్ల కోట్ల అప్పు తేర్పకుంటె ఎట్ల కాలబడ్తది బాంచెన్. తాగినోడు కడ్తడు తాళ్ల పన్ను అని సామెత. అప్పు చేసినోడు తేర్పాలె గద బాంచెన్. ఓహో, అప్పు తెచ్చేది నువ్వు, దాన్ని పప్పు పుట్నాలు పలారం జేసేది నువ్వు, కొసాకరికి తేర్పేది మేం గనుక నీకేమి బాద లేదంటవా. ఎహె అప్పు ముచ్చట అట్లుంచుగాని, పోరలు చదువుకుంటానికి సవులత్ లేదు నాయనా అని ఒర్రంగ గుడ చదువుకు మాత్రం పైసలు అర్గీజ్ ఇయ్యనన్నవట గద. ఇంక మాట్లాడితే పోయినేడు ఇచ్చినన్ని గుడ ఇయ్యనని కోత గోసినవట గద. మా దండి మారాజువు బాంచెన్. చదువుకుంటె పిల్లలు తెలివిన బడ్తరు గద, ఎవన్నంటె వాన్ని ఎట్లబడితే అట్ల ప్రశ్నలు అడుగుతరుగద. ఇజ్జత్‌తోని వాళ్ల కాళ్ల మీన వాళ్లు నిలబడ్తరు గద. మన రాజ్జెంల అట్లుండద్దు గద బాంచెన్. కోటి రూపాయలైన బిచ్చం ఏస్తం గాని, వాని కాళ్ల మీన వాడు నిలబడనీకి పది రూపాయలు గుడ ఇయ్యొద్దుగద బాంచెన్. అబ్బ, ఏమి బంగారు తెలంగాణ నాయనా, ఇటువంటి రోజు నా పాడు కండ్లతోని ఈ జన్మల జూస్తనని అనుకోలేదు.. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్


ఏళ్లు గడిచినా మారని బడ్జెట్ దృక్పథం

బహుశా దేశంలోని ప్రపంచీకరణ భావజాలపు ప్రవక్తలందరినీ ప్రాధాన్య క్రమంలో వరుసగా లెక్కిస్తే ఆ జాబితాలో మొదటి స్థానంలోనో, రెండో స్థానంలోనో ఉండడానికి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉంటారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొమ్మిది సంవత్సరాల్లో అయినా, ఇప్పుడు విభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగున్నర సంవత్సరాలుగా అయినా ఆయన ఆ వైఖరినుంచి అంగుళం కూడ పక్కకు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈసారి పదవీకాలంలో చివరి మూడు నెలలకు గాను బడ్జెట్ ప్రవేశపెట్టడానికి అవకాశం వచ్చినప్పుడు కూడ ఆయన ఆ భావజాలాన్ని యథాతథంగా కొనసాగించారు. అభివృద్ధి పేరుతో బహుళ జాతి సంస్థలకు, దళారీలకు, ఆశ్రితులకు అనేక రకాల సహాయాలు అందించడం, సంక్షేమం పేరుతో ప్రజలను భ్రమల్లో ముంచి వోట్లు దండుకోవడానికి అవసరమైన పథకాలు ప్రకటించడం ఈ విధానంలో ప్రధానాంశాలు. ఫిబ్రవరి 5న ప్రవేశపెట్టిన వోటాన్ అకౌంట్ బడ్జెట్ మూడు నాలుగు అంశాల్లో ఈ చంద్రబాబు వ్యవహార సరళికి అద్దం పడుతుంది. ఒకటి, సాధారణ ప్రజలు ఆశ్చర్యపడేంత పెద్ద అంకెలను ప్రకటించి, 'తిలకాష్ట మహిష బంధనం' లాగ ఏమీ లేని చోట ఏదో ఉన్నట్టు భ్రమలు కల్పించడం. అందుకే ఈసారి బడ్జెట్ కూడ రు. 2,26,177 కోట్లతో తయారయింది. నిజానికి ఈ ప్రభుత్వానికి రానున్న ఆర్థిక సంవత్సరంలో రెండు నెలల అధికారం కూడ లేదు. కాని ఈ భారీ అంకెను ప్రకటించడం ప్రపంచీకరణ భావజాలంలో అనివార్యం. రెండు, ప్రతి బడ్జెట్ లోనూ భారీ కేటాయింపులు చేయడం, చివరికి వచ్చేసరికి పెద్ద ఎత్తున కోత విధించడం గతంలో పాటించినట్టే ఈసారి కూడ సాగింది. మూడు, విద్యా రంగానికి, వైద్య ఆరోగ్య రంగానికి కోతలు విధించడం ప్రపంచ బ్యాంకు ఆదేశాల రోజుల నుంచీ కూడ చంద్రబాబుకు ఇష్టమైన పనులు. ఈ బడ్జెట్ లో కూడ అది కొనసాగింది. నాలుగు, ఎన్నికల సమయం వచ్చేసరికి ఎన్నెన్నో వాగ్దానాలు చేయడం, భారీ కేటాయింపులు చేయడం, ఆచరణలోకి తేలేమని స్పష్టంగా తెలిసిన, తేదలచుకోని సంక్షేమ పథకాలను ప్రకటించడం గతంలోనూ చేశారు, ఈసారి కూడ చేశారు. ఐదు, దళిత, ఆదివాసి, వెనుకబడిన కులాల విషయంలో బహిరంగ వివక్ష, నిర్లక్ష్యం చంద్రబాబు విధానాల్లో అంతర్లీనమైనవి. అవే ఈ బడ్జెట్ గణాంకాల్లో కూడ వ్యక్తమయ్యాయి. అలాగే ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి గురించి గతంలో చేసిన వాగ్దానాలను ఈ నాలుగు సంవత్సరాల్లో ఎంతమాత్రం అమలు చేయని ప్రభుత్వం ఈసారి ఎన్నికల తాయిలంగా నిరుద్యోగ భృతిని ప్రకటించింది. కాని మొత్తం నిరుద్యోగ జనాభా ముప్పై లక్షలకు పైగా ఉండగా, కేటాయించిన బడ్జెట్ ఆరు లక్షల మంది నిరుద్యోగులకు కూడ సరిపోదు. అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలకు గృహ వసతి కల్పిస్తామని భారీ వాగ్దానాలు చేసిన ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో కేటాయించిన నిధులతో పెట్టుకున్న లక్ష్యంలో పదో వంతు చేరడం కూడ సాధ్యం కాదు. ఎన్నికలకు ముందు వోటర్లను ఆకర్షించడం కోసం భారీ వాగ్దానాలు చేయకతప్పని స్థితి ఒకవైపునా, తన మార్గదర్శి అయిన ప్రపంచీకరణ భావజాలం విధించే పరిమితులు మరొక వైపునా ఉండగా ఊగిసలాటలో తయారయ్యేది ఇటువంటి గందరగోళపు, ఆచరణ సాధ్యం కాని, ప్రజావ్యతిరేక అంకెల గారడీ బడ్జెటే. వీ


వెనిజులాలో అమెరికా చిచ్చు

- ఎ. నర్సింహా రెడ్డి


దక్షిణ అమెరికా దేశమైన వెనిజులా అధ్యక్ష స్థానానికి 2018 మేలో జరిగిన ఎన్నికల్లో నికోలస్ మదురో 58 శాతం ఓట్లతో గెలిచి జనవరి 10న అధ్యక్ష బాధ్యతలు చేపట్టాడు. జనవరి 23న రాజ్యాంగ విరుద్ధంగా, ప్రజామోదానికి అతీతంగా ఆ దేశ ప్రతిపక్ష నేత జువాన్ గువాయిడో తాత్కాలిక అధ్యక్షుడుగా తనకు తాను ప్రకటించుకున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆయనను వెనిజులా అధ్యక్షుడిగా గుర్తించారు. లాటిన్ అమెరికాలోని అనేక మితవాద ప్రభుత్వాలు గువాయిడోకు మద్దతు నిచ్చాయి. దీంతో అమెరికా ఈ తిరుగుబాటు వ్యూహాన్ని రూపొందించి అమలు చేస్తున్నట్టు స్పష్టమైంది. దీంతో వెనిజులా దేశ పరిస్థితులు తీవ్ర ఉత్కంఠగా మారాయి. వెనిజులా దేశంలోని ముడి చమురు పై సామ్రాజ్యవాద విషసర్పానికి కళ్లు పడ్డాయి. దేశ సార్వభౌమాధికారాన్ని, స్వావలంబనను కాపాడుకొంటున్న నికోలస్ మదురో ప్రభుత్వాన్ని కాటువేయడానికి అమెరికా విషసర్పం సిద్ధంగా ఉంది. లాటిన్ అమెరికా, యుఎస్‌కు పెరడులాంటిది. తమ చెప్పుచేతల్లో ఉండే నియంతలను బలపరిచిన చరిత్ర దానిది. లాటిన్ అమెరికా విప్లవ పోరాటాల గడ్డ కూడా, గత దశాబ్దంలో అనేక దేశాల్లో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారంలోకి వచ్చాయి. ప్రపంచంలోనే అత్యంత చమురు, బంగారం నిల్వలున్న దేశాలలో ఒకటయిన వెనిజులాకు అప్రజాస్వామికంగా అధ్యక్షుడినని ప్రకటించుకున్న గువాయిడోను గుర్తించడమంటే ఆ దేశ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడమే అవుతుంది. అంతేగాకుండా వెనిజులాతో రష్యా, చైనాలకు గల సన్నిహిత ఆర్థిక, రాజకీయ సంబంధాలను దెబ్బతీయడం కూడా అమెరికా సామ్రాజ్యవాదం నేతృత్వంలో జరుగుతున్న ఈ తిరుగుబాటు లక్ష్యాలలో ఒకటి. చట్టవిరుద్ధ గువాయిడో ప్రభుత్వానికి మద్దతు పలికి వెనిజులాలో సైనిక తిరుగుబాటుకే కాకుండా బయట నుంచి సైనిక జోక్యానికి కావలసిన పరిస్థితులను ట్రంప్ ప్రభుత్వం సృష్టిస్తోంది. అమెరికా జోక్యానికి ప్రతిగా ఆ దేశంతో వెనిజులాకున్న దౌత్య సంబంధాలను రద్దు చేసినట్టు అధ్యక్షుడు మదురో ప్రకటించారు. అంతేకాకుండా 72 గంటలలో అమెరికా దౌత్య సిబ్బందిని దేశం వీడాలని కూడా ఆదేశించారు. ఈ ప్రకటన చెల్లదని, అమెరికా దౌత్య సిబ్బంది దేశంలోనే ఉండాలని 'తాత్కాలిక అధ్యక్షుడు' గువాయిడో కోరినందున తాము వెనిజులాలోనే ఉండదలచామని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది. ఆ విధంగా మదురో ఆదేశాన్ని విస్మరించడం ద్వారా వెనిజులాతో అమెరికా ఘర్షణకు దిగింది. వెనిజులాపై ఆర్థిక ఆంక్షలు విధించింది. తిరుగుబాటుదార్లకు ఆయుధాలు, డాలర్లు అందిస్తోంది. అమెరికా ప్రయోజనం ప్రధానంగా వెనిజులా ఆయిల్. ప్రభుత్వ సంస్థ పిడివిఎస్‌ను భవిష్యత్‌లో ప్రైవేటీకరించే విషయమై వెనిజులాలో పనిచేస్తున్న అమెరికన్ కంపెనీలతో ట్రంప్ ప్రభుత్వం చర్చించినట్లు యుఎస్ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ అంగీకరించారు. అమెరికా కంపెనీలు వెనిజులాలో పెట్టుబడిపెట్టి ఆయిల్ ఉత్పత్తి చేస్తే అది అమెరికా ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని ఆయన ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో చెప్పారు. తమ స్వార్థ ప్రయోజనం కోసం అమెరికా వెనిజులాలో అంతర్యుద్ధం రెచ్చగొడుతుందా, సైనికంగా జోక్యం చేసుకుంటుందా వేచి చూడాలి. ప్రపంచ ప్రజాభిప్రాయం ఆ దుష్టయత్నాలను వెనక్కి కొట్టాలి. వీ



ఈ కార్టూన్ కర్త ఎవరో తెలియదు. ఫేస్‌బుక్ మీద ఒక పోస్ట్ ప్రకారం ఇది ఎనభై సంవత్సరాల కింద అచ్చయిన కార్టూన్. ఇవాళ్టి సందర్భానికి సరిగ్గా సరిపోతుంది.




❖ **తీయని పలకరింపు** – తెలంగాణ బడి పిల్లల కథలు – బొమ్మలు కె. బాబు – మంచి పుస్తకం ప్రచురణలు – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 50




❖ **పురాణ పద బంధాలు** – బమ్మిడి జగదీశ్వరరావు – మంచి పుస్తకం ప్రచురణలు – 134 పేజీలు, 1/8 డెమీ, రు. 75



❖ **జీవన నైపుణ్యాలు : జీవన కళ (1)** – కౌమార వయస్సు బాలలతో ముచ్చట్లు – రచన కమలా భాసిన్ – మంచి పుస్తకం ప్రచురణలు – 60 పేజీలు, డెమీ, రు. 70



❖ **కౌమార వయస్కులని, లైంగికతను అర్థం చేసుకోవడం (2)** – కౌమార వయస్సు బాలలతో ముచ్చట్లు – రచన కమలా భాసిన్ – మంచి పుస్తకం ప్రచురణలు – 96 పేజీలు, డెమీ, రు. 130,
పై నాలుగు ప్రతులకు: మంచి పుస్తకం, ఇ. నెం. 12-13-439, స్ట్రీట్ నెం.1, తార్నాక, సికిందరాబాద్ – 500017, ఫోన్: 9490746614



❖ **వెన్నెల పడవ** – మరికొన్ని కథలు – కె.వి. కూర్మనాథ్ – అల ప్రచురణలు – 134 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **జాబిలి ఖైదు** – కవిత్వం – ఇక్బాల్ – పాలమూరు అధ్యయన వేదిక ప్రచురణలు – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: ఇక్బాల్, ఇక్బాల్ మంజిల్, ఇ. నెం. 6-29, జి.వి. ఎన్‌క్లేవ్, గవర్నమెంట్ స్కూల్ ప్రక్కన, గద్వాల్ – 509125, ఫోన్: 9440775732




❖ **నదిలాంటి మనిషి** – కవిత్వం – ఉదయమిత్ర – పాలమూరు అధ్యయన వేదిక ప్రచురణలు – 216 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: ఉదయమిత్ర, ఇ. నెం. 9-24, చైతన్య నగర్, జడ్చర్ల – 509301, మహబూబ్‌నగర్, ఫోన్: 9985203376




❖ **రీసర్చ్ కార్నర్** – ఆర్థిక, సామాజిక పరిశోధన పత్రాల సంపుటి – డా. ఎం. శ్రద్ధానందం – సిరియల్స్ పబ్లికేషన్స్ ప్రచురణ, న్యూ ఢిల్లీ – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 350, ప్రతులకు: డా. ఎం. శ్రద్ధానందం, అర్థశాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్మూర్, నిజామాబాద్ – 503224, ఫోన్: 9704425028



❖ **పునాస** – సాహిత్య త్రైమాసిక – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 98 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: ఎడిటర్ పునాస, సాహిత్య త్రైమాసిక, తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్ – 500004, ఫోన్: 040-29703142




❖ **మోదుగు పూల వాన** – కవిత్వం – పల్లపు స్వాతి – విరసం ప్రచురణ – 48 పేజీలు, 1/8 డెమీ, రు. 30




❖ **దేశీ సాహిత్యం, సామాజిక చరిత్ర: మార్క్సిజం** – పాణి – విరసం ప్రచురణ – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 10




❖ **అనగనగా అడవిలో** – హిడ్మే మరికొందరు – క్రాంతి – విరసం ప్రచురణ – 96 పేజీలు, 1/8 డెమీ, రు. 70, పై మూడు ప్రతులకు: డి.వి. రామకృష్ణారావు, ఎం.ఐ.జి – 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ – 500040, ఫోన్: 9989189250, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **ఎడారి వాసన** – కవిత్వం – డా. చంద్రయ్య ఎస్ – అభిజ్ఞ ప్రచురణలు – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: డా. చంద్రయ్య ఎస్, ఫోన్: 9963709032, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



❖ **తుర్రెబాజ్ ఖాన్** – క్రీ.శ. 1857లో నాటి బ్రిటిష్ వారిపై, నిజాం నవాబ్‌పై తిరుగుబాటు చేసిన హైదరాబాద్ వాసి తుర్రెబాజ్ ఖాన్ పోరాట గాథ! – ఎస్.డి.వి. అజీజ్ – ఎస్. అబ్దుల్ అజీజ్ ప్రచురణ – 74 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: ఎస్. అబ్దుల్ అజీజ్, 46/634, బుధవారపేట, కర్నూలు – 518002, ఆంధ్రప్రదేశ్ ఫోన్: 8106367175, 9133144138



❖ **భరోసా** – కథలు – జి. ఉమామహేశ్వర్ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 168 పేజీలు, 1/8 డెమీ, రు. 120



❖ **సమాహార** – సాహిత్య వ్యాసాలు – డా. ఏనుగు నరసింహారెడ్డి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 143 పేజీలు, 1/8 డెమీ, రు. 100
పై రెండు ప్రతులకు: ఏనుగు నరసింహారెడ్డి, ఇ. నెం. 3-14-50, విజయశ్రీ కాలనీ, సహార రోడ్, వనస్థలిపురం, హైదరాబాద్ – 500070

2019-20 కేంద్ర ప్రభుత్వ ఎన్నికల బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేసిందనీ, గత బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు కానీ, హామీలు కానీ నెరవేర్చకుండా కేవలం ప్రజలను మభ్యపెట్టడానికేననీ అంటున్నారు డా. ఎ. పున్నయ్య

కేంద్ర ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంపూర్ణ బడ్జెటో, మధ్యంతర బడ్జెటో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెటో అన్న పరిస్థితులను చేధిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని భారత పార్లమెంటరీ ఆర్థిక సాంప్రదాయాన్ని గాలికి వదిలి అర్థం పర్థం లేని 'మధ్యంతర' బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టింది. ఈ మధ్యంతర బడ్జెట్‌లో ఎలాంటి పాలన నిర్ణయాలు ప్రకటించరాదు. కొత్త పథకాలను దీర్ఘకాలిక ఆర్థిక బాధ్యతలను ప్రకటించరాదు, చర్చించరాదు. ఎలాగు మార్చి 31 వరకు ఇప్పటి బడ్జెట్ కొనసాగుతుంది. ఏప్రిల్ 1 నుండి రెండు నెలల కోసం అయ్యే ఖర్చుల కోసం ఓట్-ఆన్-అకౌంట్ మాత్రమే ప్రవేశపెడుతుంది. కాని ఈ బడ్జెట్ భిన్నంగా ఉంది. సరిగ్గా సార్వత్రిక ఎన్నికలను రెండు నెలల ముందు బడ్జెట్ రూపంలో అందివచ్చిన ఆఖరి ప్రచార అవకాశాన్ని ఈ ప్రభుత్వం వదులుకోకూడదన్న ధోరణి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రతిధ్వనించింది. ఇటీవల మూడు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ఎదురైన చేదు అనుభవం పునరావృతం కాకుండా చేసే మరో ప్రయత్నం కన్పించింది. అందుకే ఈ బడ్జెట్ జనాకర్షక ఓట్ల అకౌంటే.

భారత రాజ్యాంగంలో బడ్జెట్ భావనలు : భారత రాజ్యాంగంలో అధికరణ 112 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఏటా ఆదాయ, వ్యయాల అంచనా పత్రాన్ని ఆర్థిక మంత్రి పార్లమెంట్‌కు సమర్పించాలి. దీనినే వార్షిక ఆదాయ వ్యయ పత్రం (ఆన్యుయల్ ఫైనాన్సియల్ స్టేట్‌మెంట్) అంటారు. దీనినే సాధారణంగా బడ్జెట్ అంటారు. మొత్తం వ్యయాన్ని ప్రభుత్వం ప్రణాళిక, ప్రణాళికేతర పద్దులుగా విభజిస్తుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ 1 లోగా ఫైనాన్స్ బిల్లు, అనుబంధ పద్దుల బిల్లును పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఆర్టికల్ 266 ననుసరించి ప్రభుత్వ రాబడుల మొత్తాన్ని జమచేసే నిధిని సంచిత నిధి అంటారు. సంచిత నిధి నుండి డబ్బును వినియోగించాలంటే పార్లమెంట్ ఆమోదం తప్పనిసరి.

నిజానికి రాజ్యాంగంలో తాత్కాలిక బడ్జెట్, ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్ వంటి నిబంధనలు కన్పించవు. కానీ పార్లమెంటరీ సంప్రదాయం ప్రకారం ఎన్నికల ముందు పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టరు. కేవలం నాలుగు నెలల కోసమే ఓట్-ఆన్-అకౌంట్ రూపంలో అనుమతి పొందుతారు. కేవలం ఆదాయ వ్యయాలకే పరిమితం కావాలి. ఎన్నికల రీత్యా జనాకర్షక పథకాలకు ప్రాధాన్యత ఇవ్వరాదు.

2019-20 కేంద్ర బడ్జెట్ లక్ష్యాలు : విత్తమంత్రి తన ప్రసంగంలో గ్రామీణాభివృద్ధి పైన దృష్టి సారించాలని దేశ వ్యాప్తంగా రోడ్లెక్కి నిరసన నినాదాలు చేస్తున్న రైతన్నను ప్రసన్నం చేసుకునేందుకు నేరుగా రైతు

2019-20 బడ్జెట్ స్వరూపం (కోట్లలో)

వివరాలు	2017-18 తుది లెక్కలు	2018-19 అంచనాలు	2018-19 స. అంచనాలు	2019-20 అంచనాలు
రెవెన్యూ ఆదాయం	14,35,233	17,25,738	17,29,682	19,77,693
ఎ. పన్ను ఆదాయం	12,42,488	14,80,649	14,84,406	17,05,046
బి. పన్నేతర ఆదాయం	1,92,745	2,45,089	2,45,276	2,72,647
పెట్టుబడి ఆదాయం	7,06,742	7,16,475	7,27,563	8,06,507
ఎ. రుణ వసూళ్లు	15,633	12,199	13,155	12,508
బి. ఇతర వసూళ్లు	1,00,045	80,000	80,000	90,000
సి. రుణాలు	5,91,064	6,24,276	6,34,398	7,03,999
మొత్తం ఆదాయం	21,41,975	24,42,213	24,57,235	27,84,200
మొత్తం ఖర్చు	21,41,975	24,42,213	24,57,235	27,84,200
రెవెన్యూ లోటు	4,43,602	4,16,034	4,10,930	4,70,214
నికర రెవెన్యూ లోటు	2,52,568	2,20,689	2,10,630	2,69,474
ద్రవ్య లోటు	5,91,064	6,24,276	6,34,398	7,03,999
ప్రాథమిక లోటు	62,112	48,481	46,828	38,938

ఖాతాల్లోకి డబ్బు పంపే చర్యలు తీసుకోనున్నారు. ఆదాయ పన్ను రిబేట్ 2.5 లక్షల నుండి 5 లక్షలకు పెంచి గంపగుత్తగా మధ్యతరగతి మొత్తాన్ని తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం కన్పిస్తుంది. అసంఖ్యాకంగా ఉన్న అసంఘటితరంగ కార్మికుల కోసం పింఛన్లు ఇస్తామంటూ సరికొత్తగా ముందుకొచ్చారు. ఇదే సమయంలో దీర్ఘకాలిక అభివృద్ధికి సంబంధించిన వ్యూహాలు కన్పించలేదు. అందుకు అవసరమైన నిధుల కేటాయింపు సంస్థాగత నిర్మాణం సన్నాహక చర్యలను విస్మరించిన తీరు స్పష్టంగా కన్పిస్తుంది. ఏడాది క్రితం రు. 24.42 లక్షల కోట్ల బడ్జెట్‌లో సేద్యాన్ని గ్రామీణాభివృద్ధిని పునరుత్తేజపరిచి, మౌలిక రంగాన్ని బలోపేతం చేసి ఆర్థికంగా బలహీన వర్గాలకు ఆరోగ్య రక్షణ కల్పిస్తామన్న ప్రభుత్వం చతికిలా పడింది. కేవలం రు. 3.42 లక్షల కోట్ల పెంపుతో రు. 27.84 లక్షల కోట్ల బడ్జెట్ పద్దుగా నిర్ధారిస్తే ఈ బడ్జెట్ ఎంతటి మాయబజారో అర్థమవుతుంది. బడ్జెట్‌లో ఆదాయ వ్యయాలు చూపించడంలో అంకెల గారడి ప్రదర్శించాడు. దీనిని కార్పొరేట్ మీడియా మరింత మోసపూరితంగా ప్రజలకందించడం బాధాకరం.

పది ముఖ్యమైన అంశాలతో కార్యాచరణను ప్రకటించిన బడ్జెట్ : పియుషి గోయల్ తన ప్రసంగ పాఠం పరిచయంలో భారత్ అత్యంత బాధ్యతాయుతంగా సృజనాత్మకతను సంతరించుకొని ప్రజలందరికీ సేవ చేసే ఉద్యోగిస్వామ్యం రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ తాత్వికతను తమ బడ్జెట్ ద్వారా ప్రతిఫలింప జేస్తుందని దీనికి ముఖ్యమైన పది అంశాలతో కార్యాచరణను ప్రకటించిందన్నారు. పది అంశాలు వరసగా నివాస వసతి, డిజిటల్ ఇండియా, కాలుష్య నివారణ, ఉద్యోగాల కల్పన, నదుల శుద్ధి, సముద్ర తీర ఆధారిత నీలి విప్లవం, అందరికీ ఆరోగ్యం, ఆహార ఉత్పత్తి అధికం చేయడం, ఆర్గానిక్ వ్యవసాయం, సుపరిపాలన వంటి లక్ష్యాల సాధనే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అవిద్య, పేదరికం, నిరుద్యోగం గత కాలం జ్ఞాపకాలుగా మిగులుతాయని అరచేతిలో వైకుంఠం చూపించినారు.

బడ్జెట్ – గణంకాలు : ప్రభుత్వం ఒక సంవత్సర కాలంలో అమలు చేయనున్న పథకాలకు ఎంత ఖర్చు అవుతుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంత రాబడి రానుంది అని ఉజ్జాయింపుగా అంచనా వేస్తుంది. బడ్జెట్ అంటేనే అంచనాలు. ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టనుంది అనేది ఆ సంవత్సరంలో ఎంత రాబడిని పెంచదల్చుకుంది అనే అంశంపై ఆధారపడి ఉంటుంది. చాలా సందర్భాల్లో బడ్జెట్‌లో వేసుకున్న అంచనాలు, రాబడికి మధ్యన పొంతనే ఉండదు. ఈ అనిశ్చితి ఏ బడ్జెట్‌కైనా ఉంటుంది. కాని రాబడిని శాస్త్రీయంగా అంచనా వేయడమనేది ప్రభుత్వాల దార్శనికతపై ఆధారపడుతుంది.

బడ్జెట్ అంచనాలు మూడు భాగాలుగా ఉంటాయి. బడ్జెట్ అంచనాలు, సవరించిన అంచనాలు, వాస్తవ అంచనాలు. ఈ మూడు అంచనాల్లో భారీ వ్యత్యాసం ఉంటే ఆ బడ్జెట్ నిర్దిష్టతను దార్శనికతను కోల్పోయినట్లుగా అర్థమవుతుంది.

ప్రభుత్వానికి రాబడి మార్గాలు పన్నులు, ప్రభుత్వ ఆస్తుల అమ్మకం, అప్పులు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాబడి పెరిగినట్లు ధృవీకరిస్తలేదు. పన్నుల విధానంలోని సంస్కరణల ఫలితంగా పన్ను చెల్లింపుదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని దీనితో ప్రభుత్వ ఆదాయం పెరిగిందని ఊదరగొడుతుంది. అధికారికంగా పార్లమెంట్‌కు సమర్పించిన రాబడి లెక్కలు గమనిస్తే జిఎస్‌టి వల్ల అధనంగా వచ్చిన ఆదాయం ఏమీలేదు. జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని చెప్పడానికి దిగుమతి సుంకాల ద్వారా 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఒక లక్షా ఇరవై ఎనిమిది కోట్లు అయితే 2018-19లో ఒక లక్షా ఇరవై ఆరువేల కోట్లు మాత్రమే. ఇక కేంద్ర ఎక్సైజ్ సుంకాలు 2017-18లో రెండు లక్షల యాభై ఎనిమిది కోట్లు కాగా 2018-19లో కేవలం రెండు లక్షల యాభై తొమ్మితి వేల కోట్లు మాత్రమే. 2019-20లో ఇంతకన్నా ఎక్కువ పెరగదని విశ్లేషకులు అంచనా వేశారు. ఈ ప్రభుత్వ అసత్యాలు, అర్ధ సత్యాలను అర్థం చేసుకొనుటకు ఈ పద్దులు ఉదాహరణలుగా ఉన్నాయి. కేంద్ర ఆదాయం పెరగడానికి మరో మార్గం ప్రత్యక్ష పన్నులు వేతన జీవుల మీద విధించే ఆదాయపు పన్ను, కంపెనీల మీద విధించే కార్పొరేట్ పన్ను, సంపన్నుల మీద విధించే సంపద పన్ను. ప్రభుత్వ వాగ్దానం ప్రకారం రు. 2.5 లక్షలుగా ఉన్న ఆదాయపు పన్ను పరిమితి పార్లమెంట్ సాక్షిగా 5 లక్షల పరిమితికి రిబేట్ కల్పించినారు. కార్పొరేట్ల కనుసన్నల్లో నడిచే ఈ ప్రభుత్వం కార్పొరేట్ పన్నులు పెంచదు. ప్రధాన ఆదాయపు వనరు పెరగకపోయినా గానీ బడ్జెట్ మోతాదును పెంచింది.

2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రు. 21,41,975 కోట్లు కాగా 2018-19లో రు. 24,42,213 కోట్లు అంచనాలేసి మరో 35,022 కోట్లు అధనంగా రు. 24,57,235 కోట్లు ఆశిస్తుంది. 2019-20 సంవత్సరంలో రు. 27,84,200 కోట్లు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత రెండేళ్లలో స్థూల రాబడిలో ఎలాంటి మార్పులేదు. ఆర్థికాభివృద్ధి గురించి కేంద్రం చెపుతున్న మాటలకు వాస్తవ గణాంకాలకు పొంతన లేదు. రాబడికి మార్గాలు లేకుండా 2019-20 ఆర్థిక సంవత్సరానికి దాదాపు రెండున్నర లక్షల కోట్లు ఎక్కువ ఉంటుందని అంచనా వేసింది. ఈ మొత్తాలను అప్పు చేయాలని ప్రతిపాదించింది. ఇప్పటికే దేశ సార్వభౌమాధికారాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టింది. కొత్త అప్పుకు దేనిని తాకట్టు పెట్టనుందో ఆచరణలో తేలిపోనుంది. ఆ అసత్యాలు బడ్జెట్ లెక్కలపై గల నమ్మకాలను వమ్ముచేస్తాయి. 2019-20 బడ్జెట్‌లో పన్నులపై వస్తుందని చూపిన అంచనాలు కూడా ఇదే వరసలోకి వస్తాయి. 2018-19కి చెందిన సవరించిన అంచనాల ప్రకారం రు. 6.71 లక్షల కోట్ల ఆదాయం వాస్తవ రూపం ధరించే అవకాశం లేదు. దీనినే తిరిగి 2019-20 సంవత్సర బడ్జెట్ అంచనాలలో పెద్ద ఎత్తున రు. 7.6 లక్షల కోట్లుగా చూపారు. గతంలో చూపిన విధంగా సిజిఎస్‌టి ద్వారా వచ్చే ఆదాయం 2018-19 సంవత్సరానికి రు. 4.52 లక్షల కోట్లకు మాత్రమే చేరే అవకాశముంది. దీనిని మరింతగా అంచనా వేసి 2019-20 సంవత్సర బడ్జెట్ అంచనాల్లో రు. 6.10 లక్షల కోట్లకు పెరుగుతుందని చూపారు.

ఆదాయాల్లో అట్లా అసత్యాలను వల్లిస్తూ వ్యయాల్లో కూడా అదే కొనసాగించినారు. 2019-20 బడ్జెట్‌లో పేదల సమస్యల పట్ల ఏమాత్రం ఆసక్తి చూపకపోవడం శోచనీయం. జాతీయ ఉపాధి హామీ పథకానికి చేసిన కేటాయింపులు 2018-19 సంవత్సరం కంటే రు. 1000 కోట్లు తక్కువ. 2018-19 సంవత్సర బడ్జెట్‌లో చేసిన ఈ కేటాయింపుల మూడవ త్రైమాసికానికే అడుగంటినాయి. ముందు చెప్పినట్లు బడ్జెట్

అంచనాలను, సవరించిన వాస్తవ అంచనాలతో సరిపోల్చడంతో జరిగే లోపాల పట్ల ఆసక్తి, శ్రద్ధ ప్రదర్శించాలి. వాస్తవ రాబడి వసూలు అనేది సింహభాగం పన్నుల నుంచే వస్తుంది. ఇది ప్రభుత్వ పథకాలకు వాస్తవ నిధుల విడుదలను ప్రభావితం చేస్తుంది. కావున బడ్జెట్ అంచనాలను వీలైనంత నిర్దిష్టంగా ఖచ్చితంగా అంచనా వేయడం దార్శనికత కలిగిన ప్రభుత్వాల లక్షణంగా ఉంటుంది.

ప్రమాద సూచిని తెలిపే ఆర్థిక లోటు : 2018 నాటికే స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) లో ఆర్థిక లోటు మూడు శాతానికి పరిమితం చేయాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. కానీ ఈ ఆర్థిక సంవత్సరంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలోను ఆర్థిక లోటు 3.4 శాతం ఉండబోతుంది. దీనివల్ల ప్రభుత్వం కొత్తగా అప్పులు చేయడం కష్టమవుతుంది. దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలకు తగినంతగా కేటాయింపులు చేయలేని పరిస్థితి ఎదురవుతుంది. నిధుల కొరతను ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ద్వారా కొంత మేరకు అదిగమించే ఆలోచన ప్రభుత్వానికుంది. కాని అది ఆచరణాత్మకంగా జరగలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రు. 80,000 కోట్లు ఈ ప్రక్రియ ద్వారా సమకూర్చుకోవాలని గత బడ్జెట్‌లో ప్రతిపాదిస్తే నేటి వరకు సమకూరింది రు. 35,100 కోట్లు మాత్రమే. వర్తమానంలో ఇది అనుభవంలో ఉన్నప్పటికీ ఈ సంవత్సరం రు. 90,000 కోట్లు పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ద్వారా లభిస్తాయని ప్రస్తుత బడ్జెట్‌లో అంచనా వేయడం దివాలాకోరుతనమే.

వినియోగాన్ని పెంచే నిర్ణయాలు తప్ప – మూలధన వ్యయ ప్రస్తావన లేదు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతం వృద్ధిరేటు సాధిస్తామని లక్ష్యంగా పెట్టుకొని ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం అత్యంత వేగవంతమైన వృద్ధి సాధిస్తుందని సంకలు గుద్దుకుంటుంది. 130 కోట్ల జనాభా ఉన్న దేశానికి ఈ వృద్ధిరేటు ఎంతమాత్రం సరిపోదు. దీనితో సంబరపడిపోతే అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో భారత్ చేరడానికి ఎంతకాలం పడుతుందో ఊహించడమే కష్టం. భారత్ అభివృద్ధి చెందాలంటే కొన్నేళ్ల పాటు రెండంకెల వృద్ధి సాధించాలి. అప్పుడే జీవన ప్రమాణాల్లో స్పష్టమైన మార్పు సాధ్యమవుతుంది. తద్వారా మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, విద్యా, వైద్య రంగాల్లో ఉన్నత ప్రమాణాలు అందుకోవడానికి వీలుపడుతుంది. వీటన్నింటిని సాధించాలంటే మూలధన పెట్టుబడులు పెరగాలి. మౌలిక సదుపాయాల కల్పన విద్యుత్ ఉత్పత్తి, రైల్వేలు, రవాణా, ఇంజనీరింగ్, సాంకేతిక అభివృద్ధి వంటి కీలక అంశాలకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలి. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించాలి కాని, మొత్తం బడ్జెట్‌లో వినియోగాన్ని పెంపొందించే నిర్ణయాలే కనిపిస్తున్నాయి కాని దీర్ఘకాలిక ములధన వ్యయ ప్రణాళిక బడ్జెట్‌లో కనిపించడం లేదు. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు శరవేగంతో అభివృద్ధి సాధించాలంటే దీర్ఘకాలిక మూలధన వ్యయ ప్రణాళికలు అనుసరణీయం.

విద్యా రంగానికి విలువలను నింపని బడ్జెట్ కేటాయింపులు : విద్యాశాఖ పద్దుల్లో గుర్తించదగిన పెరుగుదల ఏమిలేదు. ఈ రంగానికి కేటాయించిన నిధులు తీవ్ర వైరుధ్యాన్ని కలిగిస్తున్నాయి. విద్యారంగ అభివృద్ధే అన్ని రంగాలకు సూచిక. అభివృద్ధి చెందుతున్న ఈ దశలో సుస్థిరాభివృద్ధికి ప్రధాన వాహకం ఈ రంగమే. మానవ జీవన ప్రమాణాలు పెరగడానికి విద్యా రంగాన్ని సామాజిక పెట్టుబడిగా భావించే స్థితి ఉండేది. నేడది అనుత్పాదక వ్యయంగా భావించే పరిస్థితి కనిపిస్తుంది. ఈ ప్రభుత్వం 2014 ఎన్నికల ప్రణాళికలో విద్యా రంగానికి 1964లో ప్రొ. కొఠారీ చెప్పినట్లు 6 శాతం (జిడిపిలో) కేటాయిస్తామన్న ఈ ప్రభుత్వం ఆరు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినప్పటికీ మూడు శాతం దాటలేదు. ఉన్నత విద్యకు కేటాయించిన నిధుల్లో రు. 37,461 కోట్లతో గతం కంటే భారీగా కోత విధించింది. ఐఐటిలకు రు. 6,223 కోట్లు, ఐఐఎంలకు రు. 415 కోట్లను, ప్రతిష్టాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్‌లకు రు. 660 కోట్లను, అఖిల భారత సాంకేతిక మండలికి రు. 485 కోట్లను కేటాయించింది. 48 కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు రు. 6,484 కోట్లను కేటాయిస్తే, యుజిసి నిర్వహిస్తున్న 394 రాష్ట్ర యూనివర్సిటీలకు రు. 4900 కోట్లు అనగా సగటున రు. 12 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఈ నిధులు పెద్ద విశ్వవిద్యాలయాల్లో జీత బత్యాలకే సరిపోతాయి. విశ్వవిద్యాలయాల నిధుల సంఘాన్ని రెండుగా చీల్చినారు. దీనితో అకడమిక్ కార్యక్రమాలు పరిశోధనలను వేరు చేసింది. దీని ద్వారా విశ్వవిద్యాలయాలు ఉనికిని కోల్పోతాయి. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు గిరాకి పెరుగుతుంది. ప్రభుత్వం నూతన కార్యక్రమం హయ్యర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ ఏజెన్సీ (ఎచ్ఇఎఫ్ఎ) ద్వారా 12 వేల కోట్ల నిధులు సేకరించి ఉన్నత విద్యా సంస్థలను అభివృద్ధి పరుస్తామని ప్రకటించారు. 2017 భారత ప్రభుత్వ మానవ వనరుల మంత్రిత్వ శాఖ, కెనరా బ్యాంక్ ఉమ్మడిగా హయ్యర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ ఏజెన్సీ మార్కెట్ల నుండి బాండ్ల రూపంలో నిధులు సేకరించి విద్యా రంగాన్ని 2022 నాటికి ప్రపంచ స్థాయి ర్యాంకింగ్‌కు తీసుకుపోయే ప్రయత్నం జరుగుతుంది. ఈ క్రమంలో కొద్ది మందికి ఫెలోషిప్స్ అందిస్తుంది. కాని ఈ కొద్ది మందితో పాటు మరింత మందికి అవకాశాలను కల్పించే ప్రయత్నం తీవ్రంగా జరగాలి. అప్పుడే లక్ష్యం నెరవేరుతుంది. ఈ మేరకు 2018–19కి వంద కోట్ల లక్ష్యం పెట్టుకుంది. ఏ మేరకు చేరుతుందో వేచి చూడాలి.

రాష్ట్ర విశ్వవిద్యాలయాలు నామ మాత్రం నిధులతో నిర్వాహణ బోధన పరిశోధనలు క్షీణిస్తున్నాయి. కేంద్రం నుంచి సహకారం లేక రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించే స్థితుల్లోలేక విశ్వవిద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. కేవలం ధృవ పత్రాలను ఇచ్చే సంస్థలుగా విశ్వవిద్యాలయాలు పరిణామం చెందుతున్నాయి. గతంలో రివిటలైజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సిస్టమ్స్ ఆన్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా 2022 నాటికి ఉన్నత విద్య, వైద్య, సాంకేతిక విద్యా సంస్థలను ఏటా లక్ష కోట్ల వ్యయంతో ఉన్నత స్థాయికి చేరుస్తామన్న ప్రకటన నేటికీ కాగితాలకే పరిమితమైంది. పాఠశాల విద్యను, కళాశాల విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. పెరిగే జనాభాకు తగిన కేటాయింపులు లేకపోగా గత కేటాయింపుల్లో కోతలు విధించడం విద్యారంగం పట్ల పాలకులు చూపిస్తున్న కుటిల నీతి అర్థమవుతుంది.

సంక్షోభంలోకి వ్యవసాయ రంగం – రైతన్నను ప్రసన్నం చేస్తున్న రాజకీయం : వ్యవసాయ రంగ సంక్షోభాన్ని పరిష్కరిండంలో గత బడ్జెట్‌లు విఫలమయ్యాయి. ఉపాధి, ఉద్యోగావకాశాలు పెంపొందించడం ద్వారా

వ్యవసాయ రంగంపై ఆధారపడినవారి సంఖ్యను గణనీయంగా తగ్గించాల్సి ఉండగా, ఆ దిశగా ఏమాత్రం ప్రగతి లేదు. వ్యవసాయ రంగంలో ఆధునిక పోకడలు తీసుకవచ్చి అదికోత్పత్తిని సాధించేందుకు, పండించిన పంటకు అధిక ధర లభించే విధంగా నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలను కల్పించడంతో పాటు సమర్థవంతమైన పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఈ రంగం లాభాసాటిగా మారేది. స్వామినాథన్ ప్రతిపాదనలను కనీసంగానైనా గుర్తించడం లేదు.

దీనికితోడు వ్యవసాయానికి అందజేస్తున్న సబ్సిడీలను ప్రభుత్వం ఉపసంహరించుకోవడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. వాణిజ్య పంటలతో పాటు ఆహార ధాన్యాలకు కూడా మద్దతు ధరను ఉపసంహరించడం, మార్కెట్‌లో ధరలు ఒడిదుడుగులకు గురికావడంతో ఈ రంగం తీవ్రంగా దెబ్బతిన్నది.

గడిచిన పాతిక సంవత్సరాలలో రైతుల సంఖ్య 1.5 కోట్లు తగ్గింది. రైతుల ఆత్మహత్యలు పెరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తెలియజేస్తే 2017 నుండి ఈ వివరాలు వెల్లడించకుండా ప్రభుత్వం కట్టడి చేసింది. ఈ కారణంగా రైతన్నలు దేశ వ్యాప్తంగా రోడ్లెక్కి నిరసనలు చేస్తున్నారు. ముంబాయి పుర వీధులు మొదలుకొని మధ్యప్రదేశ్‌లోని ముడసర్, మహారాష్ట్ర ఇట్లా దేశం నలుమూలలతో పాటు ఢిల్లీ వీధుల్లో కూడా వీరి ఆగ్రహం వెల్లువెత్తింది. ఈ నేపథ్యాన్ని గుర్తించిన ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల ముందట రైతన్నను ప్రసన్నం చేసుకునేందుకు ఈ బడ్జెట్‌ను అనివార్యంగా వేదిక చేసుకుంది. ఈ కోవలోనే కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు ఎకరాకు రు. 6000 చొప్పున నేరుగా నగదు చెల్లించే పథకాన్ని ప్రకటించింది. దీనిని మూడు విడతలుగా చెల్లిస్తుంది. ఇందులో తొలి విడత రు. 2000 వచ్చే ఎన్నికలలోపు రైతు ఖాతాలోకి జమచేస్తున్నట్లు ప్రకటించింది. భూమిలేని కౌలు రైతులకు ఈ పథకంలో చోటులేదు. వ్యవసాయం పునరుత్తేజింపబడాలంటే డా. స్వామినాథన్ అందించిన శాశ్వత పరిష్కారాలను ఈ ప్రభుత్వం అమలు జరపాలి. అప్పుడే దున్నేవాడికి వెన్నుదన్నుగా ప్రభుత్వాలున్నట్లవుతుంది.

ఆదాయపు పన్ను రిబెట్ పరిమితి పెంపు : మధ్యతరగతి ప్రజల వార్షిక ఆదాయం ఐదు లక్షల రూపాయలకు దిగువన ఉన్న పక్షంలో మినహాయింపు పొందవచ్చు. ఏడాదికి రు. 6.5 లక్షల ఆదాయం ఉన్నవారు ఎటువంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. సెక్షన్ 80 సి కింద మినహాయింపు పొందవచ్చు. స్టాండర్డ్ డిడక్షన్ రు. 50 వేలకు పెంచినారు. 5 లక్షల ఆదాయం దాటిన వారికి స్లాబుల్లో మార్పు చేయకపోవడం వల్ల ఒరిగేది ఏమిలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 12 కోట్ల మంది కొత్తగా ఆదాయం పన్ను రిటర్నులు దాఖలు చేశారు. అందులో ఉండే ఉద్యోగులు చాలా తక్కువ. ఈ ప్రభుత్వంలో కొత్తగా ఉద్యోగంలో చేరినవారు కోట్ల సంఖ్యలో లేరు. అందులో ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే ఉద్యోగులు స్వల్పమే. మధ్యతరగతికి ఓట్ల కోసం ఇది మహత్తర ప్రణాళిక. మధ్యతరగతి ప్రజలకు లాభం లేకపోయినా ప్రచారంతో ప్రభుత్వానికి లాభం జరుగుతుంది.

గందరగోళంలో అసంఘటిత రంగం : అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధాన్ పేరుతో నూతన పించన్ పథకాన్ని ప్రతిపాదించారు. రెండు జాతీయ కార్మిక కమిషన్లు ఏర్పాటై సంవత్సరాల తరబడి చర్చించినా కార్మికుల స్థితిగతులపైన దస్త్రాలకు దస్త్రాలు రిపోర్టులు రాసినా అసంఘటిత రంగానికి నిర్వచనం ఇవ్వలేకపోయారు. ఉజ్జాయింపుగా ఈ రంగంలో పదికోట్ల మంది కార్మికులున్నట్లు అంచనా. ఈ పథకం ఉద్దేశం ఎవరైన ఇందులో చేరి నెలకు 100 రూపాయలు చెల్లిస్తూ 30 నుంచి 40 సంవత్సరాలు కొనసాగితే తర్వాత వారికి నెలకు రు. 3000 చొప్పున పించను లభిస్తుంది. ఇప్పటికే అటల్ ఫించన్ యోజన పేరుతో ఒక పథకం అమల్లో ఉంది. ఇందులో నెలకు రు. 5000. ఈ కొత్త పథకం ద్వారా 30 ఏళ్లకు ఫించను రు. 3000 వస్తే పెరిగే ధరలకు ఏ మూలకు సరిపోవనేది యథార్థం.

చిన్న పరిశ్రమలకు చెయ్యిచ్చిన బడ్జెట్ : దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపాధికి అత్యంత కీలకమైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఈ బడ్జెట్ మొండిచెయ్యి చూపిందనాలి. 2016లో చేపట్టిన పెద్దనోట్ల రద్దు, 2017లో అమలు చేసిన జిఎస్‌టి వల్ల ఈ పరిశ్రమలు తీవ్రంగా నష్టపోయాయి. గత బడ్జెట్‌లో 72,000 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణాలందిస్తామన్న వాగ్దానం నేటికి పూర్తి చేసుకోలేదు. మొత్తం పారిశ్రామిక రుణాల్లో 82.6 శాతం కార్పొరేట్లకు ఇవ్వగా, 17.4 శాతం మేర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఇచ్చారు. ఉద్యోగితను పెంచి వృద్ధిని సాధించడానికి ఉపయోగపడే ఈ పరిశ్రమలకు చేయూత ఇవ్వలేదు.

రక్షణ రంగాన్ని ప్రక్షాళన చేయాలి : రక్షణ రంగానికి 2019–20 బడ్జెట్‌లో 3.18 లక్షల కోట్లు కేటాయించి క్రితంతో పోలిస్తే ఇది 7.93 శాతం అధికం. ప్రస్తుత కేటాయింపులో రు. 2.10 లక్షల కోట్లు కేవలం రెవెన్యూ వ్యయానికి సరిపోతుంది. ఇక మూలధన అవసరాలకు మిగిలేది రు. 1.08 లక్షల కోట్లు మాత్రమే. సాధారణంగా రాఫెళ్ల నుంచి ఫైటర్ విమానాల వరకు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేస్తున్నాం. ఆయుధాలు, రక్షణ సామాగ్రి సొంత తయారీ అనేది 70 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఇంకా కలగానే ఉంది. బోఫోర్సు కుంభకోణం మొదలుకొని రాఫెల్స్ వరకు విచారణలు జరుగుతూనే ఉన్నాయి. దీర్ఘకాలిక వ్యూహాలతో రక్షణ రంగాన్ని కట్టుదిట్టం చేసుకోవాలి.

భారత పార్లమెంటరీ సంప్రదాయాలకు భిన్నంగా ఈ బడ్జెట్ ప్రజాకర్షక అంశాలతో ప్రవేశపెట్టినారు. ఇది ఓటరు కేంద్రంగా, ఓట్ల కోసమే రూపకల్పన చేసినట్లు స్పష్టమవుతుంది. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విదేశాల్లో దాగిన నల్లధనాన్ని స్వదేశానికి తెచ్చి పేదల ఖాతాల్లో 15 లక్షలు బదిలీ చేస్తామన్న హామీ, సంవత్సరానికి కోటి ఉద్యోగాలను కల్పిస్తామన్న హామీతో పాటు రైతుల పెట్టుబడి రెట్టింపు లాంటి హామీలను ఈ నాలుగున్నర సంవత్సరాల్లో గాలికి వదిలింది. ఈ బడ్జెట్‌లో అభివృద్ధి ఊసేలేదు. నిధుల కేటాయింపు లేకపోగా దీర్ఘకాలిక వ్యూహాన్ని ఆవిష్కరించలేదు. సంక్షేమానికి, ప్రజాకర్షక పథకాలకు పరిమితమైన బడ్జెట్ ఇది. ఈ ప్రభుత్వం మళ్లీ గెలవడానికి వేసిన వల మాత్రమే. రాబోయే బడ్జెట్‌లైనా గణాంకాల్లో వృద్ధిని చూడకుంటే స్థూలంగా జాతియోత్పత్తి పెరిగే సామాజిక సంబంధాలను చర్చించాలి.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటీ) వీ

హిందుత్వ గోరక్షణ వాద బడ్జెట్

***కేంద్ర బడ్జెట్‌లో గో సంరక్షణకు ఇచ్చిన ప్రాధాన్యత స్త్రీలకు, దళితులకు, మైనారిటీలకు ఇవ్వలేదనీ, ఈ బడ్జెట్‌ను పరిశీలిస్తే ఇది హిందుత్వ బడ్జెట్, ఎలక్షన్ బడ్జెట్ అనేది స్పష్టమవుతుందనీ అంటున్నారు* డా. కత్తి పద్మారావు**

నరేంద్ర మోడీ ప్రభుత్వం పార్లమెంట్‌లో 2019, ఫిబ్రవరి 1న ఆర్థిక ఉపమంత్రి పియూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాజిక న్యాయదూరంగా ఉంది. హిందూవాద భావజాలంతో ఉంది. దానిలో మొదటి అంశం భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించి ఓట్ ఆన్ అకౌంట్‌గా పెట్టవలసిన బడ్జెట్‌ను 2019-20 బడ్జెట్‌గా పెట్టడంతో అంబేడ్కర్ నిర్మించిన భారత రాజ్యాంగ సూత్రాన్ని నిర్ద్వందంగా నిరాకరించారు.

మోడీ మొదటి నుండి అంబేడ్కర్ సిద్ధాంతాలకు వ్యతిరేకి, దళిత బహుజన ద్వేషి కూడా. ఆయన మెదడులో ఆర్‌ఎస్ఎస్ భావజాలం కూరుకొని ఉంది. ఆర్‌ఎస్ఎస్ మొదటి నుండి మనుస్మృతి భావజాలాన్ని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా భారతీయుల మెదడులోకి తీసుకెళ్లాలనే భావం కలిగి ఉంది. నరేంద్రమోడీ భారత రాజ్యాంగం ప్రకారం చేయవలసిన ప్రతి పనిని నిరాకరిస్తూ వచ్చారు. ప్రజాస్వామ్యం మీద, లౌకికవాదం మీద, సామ్యవాదం మీద ఆయనకు అవగాహన లేదు. అందుకే ఆయన కాలంలో దళితులు, హేతువాదులు వేధించబడ్డారు, వేటాడబడ్డారు, హత్యలకు గురయ్యారు.

పీయూష్ గోయల్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మొత్తం కేటాయింపులు రు. 27.84 లక్షల కోట్లు. బడ్జెట్‌లోని కీలకాంశాలు ఇలా ఉన్నాయి. రైల్వేకు రు.64,587 కోట్లు, రక్షణ రంగానికి రు.3,05,296 కోట్లు, పెన్షన్లు రు.1,74,300 కోట్లు, ప్రధాన సబ్సిడీలకు రు.2,96,684 కోట్లు, వ్యవసాయం, అనుబంధ రంగాలకు రు.1,49,981 కోట్లు, వాణిజ్యం, పరిశ్రమలకు రు.27,600 కోట్లు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి రు.3,000 కోట్లు, విద్యకు రు.93,848 కోట్లు, ఇంధన రంగంకు రు.44,101 కోట్లు, విదేశీ వ్యవహారాలకు రు.16,062 కోట్లు, ఆర్థికశాఖకు రు.19,812 కోట్లు, ఆరోగ్య రంగానికి రు.63,538 కోట్లు, హోంశాఖకు రు.1,03,927 కోట్లు, ఐటి, టెలికాంకు రు.21,549 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రు.1,38,962 కోట్లు, సాంఘిక సంక్షేమానికు రు.49,337 కోట్లు, రవాణా వ్యవస్థకు రు.1,56,187 కోట్లు, పట్టణాభివృద్ధికి రు.48,032 కోట్లు, ఇతర రంగాలకు రు.75,822 కోట్లు.

ఈ పద్దును మనం ఒకసారి చూస్తే ఇందులో బూటకం, నాటకం ఎక్కువ కనబడుతుంది. అన్నింటి కంటే కూడా హిందూ భావజాలం ఎక్కువగా కనపడుతుంది. హిందూ మైండ్‌లో మూల బూత అంశం ఏమిటి? అణగారిన సామాజిక శ్రేణుల ప్రస్తావన లేకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం. నిజానికి ఏ బడ్జెట్‌లో అయినా దళితులు, ఆదివాసులు, స్త్రీలు ప్రధాన పాత్రలో ఉండాలి. అయితే మోడీ ప్రభుత్వానికి వీళ్లు ముఖ్యులు కారు. వాళ్లు దృష్టిలో కూడా లేరు.

దేశం అస్పృశ్యతలో మగ్గిపోతున్న ఈనాడు, కులవైశమ్యాలతో కొట్టుమిట్టాడుతున్న ఈనాడు, ఆ అస్పృశ్యత నివారణ లేకుండా నేను హిందూ ప్రధాన మంత్రిని అని ప్రకటించుకోవడం కోసం గో సంపద వృద్ధికి 'రాష్ట్రీయ కామధేన ఆయోగ్' అనే పథకాన్ని రూపొందించారు.

వేలమంది రక్తలేమితో పిల్లల్ని కనలేక ఆదివాసి స్త్రీలు చనిపోతున్నారు. దోమతెర లేక లక్షలాది మంది గిరిజనులు చనిపోతున్నారు. వారి ప్రస్తావన మోడీ బడ్జెట్‌లో లేదు. నిజానికి ఇది ఓట్ ఆన్ అకౌంట్ కాదు. ఓట్లు కొల్లగొట్టడానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్. ఓట్ల కోసం హిందువుల్ని రెచ్చగొట్టాలని, గో సంపదను జన్యుపరంగా తీర్చిదిద్దాలని, రాష్ట్రీయ గోకుల్ మిషన్ కోసం 750 కోట్లు పెంచారు. అంటే ఒక తల్లి బిడ్డను కనలేక రక్తలేమితో మరణిస్తుంటే ఆమె పౌష్టికాహారానికి ఇవ్వాల్సిన ధనాన్ని దళితులు, ముస్లింలు గోమాంసం భుజిస్తారనే ఉద్దేశంతోనే ఈ కేటాయింపులు చేశారు.

ప్రాజెక్ట్‌ల పేరుతో భారతదేశ వ్యాప్తంగా ఇతర దేశాలకు మోడీ చంద్రబాబు ఎన్నో భూముల్ని అమ్ముకున్నారు. ఆ భూముల్లో నివసిస్తున్న వారు ఆదివాసులు, దళితులు. వారికి పునరావాసం కల్పించకుండా గిరిజనులను, దళితులను వేటాడుతున్నారు. భారతదేశం అంటే వీరి ఉద్దేశం హిందూ దేశం. భారతదేశాన్ని నిర్మించిన ఆదివాసులది, దళితులది అనే ఉద్దేశం వీరికి లేదు.

మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకు కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రు.29 వేల కోట్లను కేటాయించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ దఫా కేటాయింపులు 20 శాతం తగ్గాయి. ప్రసూతి కార్యక్రమాలకు కేటాయింపులను చూద్దాం. ప్రధానమంత్రి మాతృవందన యోజన (సిఎంఎంవివై) కు రు.2,500 కోట్ల కేటాయింపు. సమగ్ర శిశు అభివృద్ధి సేవల (ఐసిడిఎస్ కింద చిన్నారుల సంరక్షణ సేవా కార్యక్రమాలకు రు.1500 కోట్ల కేటాయింపు. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు రు.29,164,90 కోట్ల కేటాయింపు. 'బేటీ బచావో బేటీ పడావో' పథకానికి రు. 280 కోట్లు.

జాతీయ పౌష్టికాహార కార్యక్రమానికి (ఎన్ఎన్ఎం) రు.3,400 కోట్లు. మహిళా శక్తి కేంద్రాలకు రు.150 కోట్లు. ఉద్యోగినులు కార్యాలయాల నుంచి తిరిగి వచ్చే వరకూ వారి పిల్లల ఆలనాపాలనా చూసే కేంద్రాలకు సంబంధించిన జాతీయ క్రెచ్ పథకానికి రు.50 కోట్ల కేటాయింపు. వర్కింగ్ విమెన్స్ హాస్టల్ పథకానికి రు.165 కోట్లు. అక్రమ రవాణా బాధితుల పునరావాస కార్యక్రమం ఉజ్వలకు రు.30 కోట్ల కేటాయింపులు. వితంతు శరణాలయాలకు బడ్జెట్ కేటాయింపులు రు.15 కోట్లు కేటాయించారు.

మొత్తం భారతదేశం 130 కోట్ల జనాభాలో ఉన్న 65 కోట్ల మంది స్త్రీలకు మీరు కేటాయించేది ఎంత వందల పదుల కోట్లు మాత్రమే. ఇక్కడ స్త్రీ సంరక్షణ ఎక్కడ ఉంది. వీరిలో మనుస్మృతి భావాలు గూడుకట్టుకొని ఉన్నాయి.

స్త్రీ గురించి మనుస్మృతి ఇలా చెప్తుంది. *శ్లో॥శయ్యాసనమలంకారం కామం క్రోధ మనార్జవం/ద్రోహ భావం కుచర్యాం చస్త్రీభ్యోమను కల్పయత్*

(శయ్య, పీఠము, భూషణములను, కామ క్రోధములను, కపటమును పరద్రోహమును, పరహింస, కుత్సితపు నడవడి కలిగియుండుట వీటన్నిటిని స్త్రీలకు మనువు మొదటనే కల్పించెను. కనుక వీరిని ప్రయత్నముతో రక్షింపవలయును.)

శ్లో॥ నాస్తి స్త్రీణాంక్రియా మంత్రైరితి ధర్మో వ్యవస్థిత:/నిరింద్రి యాహ్మా మంత్రశ్చస్త్రీ యోఒనృత మితిస్థితి:

(జాతక కర్మ, నామకరణాదులు స్త్రీలకు మంత్రవత్తుగా లేవని ధర్మ శాస్త్రాలు పలుకుచున్నవి కనుక స్త్రీలు మంత్ర వత్సంస్కారములు లేని వారలు కావున పాప రహితులును, ప్రమాణములగు వేదస్మృతులు లేని వారలు కావున ధర్మజ్ఞులు కానివారలను పాపములు పోకార్చు మంత్ర జపములు మున్నగునవి లేనివారలు గావున పాపము కలగినను దానింబోకార్చు శక్తిలేని వారలగుటచే కల్లమాడిన శుభలైన వారిని శాస్త్రములు పలికెను కావున వారిని ప్రయత్నములో రక్షింపవలయును).

ఇది పితృస్వామ్యమైన బడ్జెట్, మొత్తం భారతదేశంలో వితంతువుల సంఖ్య ఎంత? లెక్కలున్నాయా. మీ మద్యపాన విధానాల వల్ల, రహదారుల విధానాల వల్ల ఎందరో పతులు త్వరగా మరణిస్తున్నారు. ఎంతో మంది వితంతువులుగా మిగిలిపోతున్నారు. వీరికి పునరావాస కేంద్రాలు ఏవి, వాటి నిర్మాణం ఏది? ఈ వితంతువుల్లో అన్ని కులాలు మతాల స్త్రీలు ఉన్నారు కదా! వీరికి మహాత్మాపూలే నిర్వహించినట్లు పునర్వివాహ కేంద్రాలు ఎందుకు నిర్వహించడంలేదు.

ప్రధాన మంత్రి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పేరిట ఎకరాకు 6 వేలు ఇవ్వాలని నిర్ణయించాడు. 100కి 80 శాతం భూమిని కౌలు రైతులు సాగుచేస్తున్నారు. వారిలో ఎక్కువ మంది గిరిజనులు, దళితులు ఉన్నారు. మరి వారి సంగతి ఏమిటి. గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయం చేసే గిరిజనులకు పట్టా పుస్తకాలు, పాసు పుస్తకాలు లేవు. భూయాజమాన్య హక్కుల ఆధారంగా బ్యాంక్ రుణాలు తీసుకొనే రైతులకు కేంద్రం నేరుగా ధనం బదిలీ అవుతుంది. ఇవి లేని దళిత, గిరిజన రైతుల పరిస్థితి ఏమిటి? అంటే దళితులు రైతులు కాదా! వారిని నిరక్ష రాస్యులుగా ఉంచడమే గాక, వారిని ఊరికి దూరంగా ఇంకా ఉంచిన మీది హిందూ మనస్తత్వం కాదా?

సాగు చేస్తూ భూ హక్కులు లేనివారి సంఖ్య ఒక ఆంధ్ర రాష్ట్రంలోనే 25 లక్షల పైనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 16 లక్షల మంది ఉన్నారు. ఇందులో పది లక్షల మంది దళితులే ఉన్నారు. కె.సి.ఆర్. తెలంగాణాలో దళితులను దెబ్బతీయాలనే కేవలం రైతులకు నగదు బ్యాంకుల్లో వేశాడు. చంద్రబాబు నీరు, చెట్టు పేరుతో దళితుల భూములు లాక్కొని సొంత కులాలకు ఇచ్చాడు. ఇప్పుడు భూముల పేరుతో దళితుల భూములు లాక్కుంటున్నాడు. మోడీ, కె.సి.ఆర్., చంద్రబాబు హిందూ మనస్తత్వంతోనే ఇదంతా చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కౌలు రైతులు ముందే రైతులకు ఎకరాకు 30 వేలు వడ్డీలకు తెచ్చి చెల్లిస్తున్నాడు. తుఫాన్‌లు వస్తే నష్టాన్ని తామే భరిస్తున్నాడు.

దళితులు వ్యవసాయ కూలీల నుండి కౌలు రైతులుగా మారే క్రమంలో వారిని అప్పుల్లో ముంచే ప్రయత్నం కేంద్రం రాష్ట్రం చేస్తుంది. దీనికి కారణం మోడీలాగే అన్ని రాష్ట్రాలను పాలిస్తున్న ముఖ్యమంత్రులు భూస్వామ్య కులాలకు సంబంధించిన వారు కౌలురైతులుగా దళితులు రూపొందుతున్నారని ప్రభుత్వానికి తప్పక తెలుసు. రైతుకు 6 వేల రూపాయలు మూడు విడతలుగా బ్యాంక్‌లో వేయడం జరుగుతుంది. ఇదీ రైతులకు అవమానమే. ప్రభుత్వాన్ని పోషించాల్సిన రైతును బిక్షగాళ్లగా మార్చుతున్నారు. అడుక్కొనే స్వభావాన్ని నేర్పుతున్నారు. అసలు భూమి ప్రతి రాష్ట్రంలో 5 భూస్వామ్య కులాల చేతిలో ఉంది.

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఐఐఎంలకూ కలిపి ఇచ్చిన రు.415.41 కోట్లలోనే ఏపి ఐఐఎంకి ఎంతో కొంత పొందాల్సి ఉంటుంది. అన్ని ఎన్‌ఐటిలకూ కలిపి కేటాయించిన రు.3,730.50 కోట్లలోనే తాడేపల్లి గూడెం ఎన్‌ఐటి ఎంతో కొంత దక్కించుకోవాల్సి ఉంటుంది. ఐఐఎస్‌ఈఆర్‌లు అన్నింటికీ కలిపి రు.660 కోట్లు కేటాయించారు. అందులో తిరుపతి భాగమెంతో దేవుడికే తెలియాలి. ట్రిపుల్ ఐటి లన్నింటికీ కలిపి రు.203.34 కోట్లు కేటాయించారు. అందులో కర్నూలు ట్రిపుల్ ఐటికీ ఎంతో తెలియదు.

బడ్జెట్ పద్దుల్లో ఏపి విద్యా సంస్థల పేర్లు ప్రత్యేకంగా చూపినప్పటికీ కేటాయింపులు మాత్రం చేయలేదు. దేశవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థలకు జరిపిన కేటాయింపుల్లోనే వీటికి వాటా దక్కుతుందని చెప్పడం మినహా దేనికెంత అన్న స్పష్టత ఇవ్వలేదు. ప్రత్యేకంగా చెప్పడం వల్ల ఏపీకి జరుపుతున్న కేటాయింపులపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలోనే కేంద్రం ఈ ఎత్తు వేసినట్లు కనిపిస్తోంది.

రెండు తెలుగు రాష్ట్రాలకు కల్పిస్తున్న పారిశ్రామిక రాయితీలదీ ఇదే పరిస్థితి. క్రితం సంవత్సరం వరకు కేంద్ర వాణిజ్యమంత్రిత్వ శాఖ పద్దుల కింద ఈ మొత్తం పెడుతూ వచ్చారు. ఈసారి దాన్ని ఆర్థిక శాఖలో కలిపేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఏర్పాటుచేసే పారిశ్రామిక యూనిట్లకు వడ్డీరాయితీ కింద 2018-19లో కేటాయించిన రు.100 కోట్ల వడ్డీ రాయితీ మొత్తాన్ని తాజా బడ్జెట్‌లో ఎత్తేశారు. సవరించిన అంచనాల్లోనూ రూపాయి కూడా పెట్టలేదు. ఈ మొత్తాన్ని ఆర్థిక శాఖ ద్వారా ఇవ్వబోతున్నందున ఈ ఏడాది వాణిజ్య శాఖ పద్దుల్లో పెట్టలేదని వివరణ ఇచ్చారు.

ఏపి కేంద్ర విశ్వవిద్యాలయానికి రు.13 కోట్లు కేటాయించారు. ఇందులో బడ్జెట్ సపోర్ట్ కింద రు.12.25 కోట్లు సమకూరుస్తారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్స్ ఏజెన్సీ (హెఫా) నుంచి తీసుకున్న రుణంపై వడ్డీ కింద రు.25 లక్షలు, అసలు కింద రు.50 లక్షలు చెల్లిస్తారు. ఏపి, తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయాలకు కలిపి రు.8 కోట్లు కేటాయించారు. అందులో బడ్జెట్ సపోర్ట్ కింద రు.7.50 కోట్లు సమకూరుస్తారు. మిగిలిన రు.50 లక్షలను హెఫా రుణం, వడ్డీ కింద చెల్లిస్తారు. ఈ రెండు యూనివర్సిటీలకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో రు.20 కోట్లు కేటాయించినా అంచనాల సవరణ సమయానికి దాన్ని కేవలం ఒక కోటి రూపాయలకే పరిమితం చేశారు. అంటే క్రితం బడ్జెట్‌లో రు.19 కోట్ల మేర కోత పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ఐటీకి ప్రత్యేకంగా ఈ ఏడాది ఏమీ కేటాయించలేదు.

2018-19 బడ్జెట్‌లో రు.50 కోట్లు కేటాయించినా అంచనాల సవరణ నాటికి అది రు.86 కోట్లకు చేరింది. దాదాపు రు.36 కోట్లు

అధికంగా ఖర్చు పెట్టారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అన్ని ఐఐటీలకు కలిపి రు.6,143.02 కోట్లు కేటాయించారు. అందులోనే ఏపీ ఐఐటీకి సర్దుబాటు చేయనున్నట్లు బడ్జెట్ పద్దులో చెప్పారు. అయితే ఎంత అన్నది మాత్రం స్పష్టం చేయలేదు.

ఆంధ్రప్రదేశ్ ఐఐఎంకీ ఈ బడ్జెట్‌లో ఏమీ కేటాయించలేదు. 2018-19 బడ్జెట్‌లో రు.42 కోట్లు కేటాయించి, చివరకు దాన్ని రు.36 కోట్లకు తగ్గించారు. తాడేపల్లి గూడెం ఎన్ఐటీకి ఏమీ కేటాయించలేదు. 2018-19 బడ్జెట్ అంచనాల రు. 54 కోట్లను అంచనాల సవరణ నాటికి రు.98 కోట్లకు పెంచారు. తిరుపతి ఐఐఎస్ఈఆర్‌కీ ఈ ఏడాది సున్నా చుట్టారు. 2018-19లో కేటాయించిన రు. 49 కోట్లను మాత్రం అంచనాల సవరణ సమయానికి రు.70.40 కోట్లకు పెంచారు. కర్నూలులో ఏర్పాటుచేస్తున్న ట్రిపుల్ ఐటీకీ ఈ బడ్జెట్‌లో ఏమీ కేటాయించలేదు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రు.30 కోట్లను కూడా చివరకు రు.27 కోట్లకు తగ్గించారు. పెట్రోలియం యూనివర్శిటీకి రు.31.82 కోట్లు కేటాయించారు. 2018-19లో రు.32 కోట్లు కేటాయించి చివరకు రు.24 కోట్లకే పరిమితం చేశారు.

ఈ కేటాయింపులు చూస్తే నరేంద్రమోడీ భారత రాజ్యాంగాన్ని అధ్యయనం చేయలేదని మనకు అర్థమవుతుంది. ఒక మనిషిలో అహంకారం వ్యక్తిగతంగా వస్తే అది ఆ మనిషికే ప్రమాదం గాని ఒక దేశాధినేతకు అహంకారం వస్తే ఆ దేశం మొత్తానికి కూడా ప్రమాదమనే విషయం అతను గుర్తించలేకపోయాడు. అందుకే డా. బి.ఆర్. అంబేద్కర్ ఈ దేశాన్ని ఎవరైనా పాలించవచ్చు. ప్రజాస్వామిక, లౌకిక, సామ్యవాద దృక్పథం ఉండాలని చెప్పారు.

అనేక కారణాలతో రాజ్యం కొందరికి రావచ్చు. మేథావులకి, నీతిపరులకి, సామాజిక సంస్కర్తలకి, ప్రబోధకులకి రాజ్యం రాకపోవచ్చు. అంత మాత్రాన వీళ్లందరూ చెప్పే మాటల్ని పెడచెవిన పెట్టి ప్రజలు నాకు అధికారం ఇచ్చారని అహంకారంతో ముందుకు వెళ్లితే ప్రజలు తిరుగుబాటు చేస్తారు. నాయకులు తిరుగుబాటు చేస్తారు. కోర్టులు నిలేస్తాయి. దేశం మొత్తం అల్లకల్లోలం అవుతుందని చెప్పారు.

ఇంతకు ముందు కూడా భారతదేశాన్ని పాలించిన పరిపాలకులకు రాజ్యాంగ స్ఫూర్తి లేకపోవడం వలన అనేక సంక్షోభాలు వచ్చినాయి. వాళ్ల మనస్సుల్లో రాజ్యాంగం ప్రకారం నడవాలనే భావం లేకుండా పోయింది. రాజ్యాంగం ఏమీ చెప్తుంది. జాతికి, కులానికి, లింగానికి, పుట్టుకకి అతీతంగా భారతదేశంలోని పౌరులందరిని ఒక్కటిగా చూడాలని రాజ్యాంగం చెప్పింది.

నిజానికి భారతదేశంలో దళితుల రాజ్యాంగ హక్కుల గురించి పాలకులకే సరైన అవగాహన లేదు. అప్పటికే ఆస్తి హక్కు ఉన్నటువంటి వాళ్లకి, ఆస్తికి రక్షణ కల్పిస్తూ వారు కట్టే పన్ను నుంచి భూమిలేని, భుక్తి లేని వారికి రిజర్వేషన్లు సంక్షేమాన్ని కల్పించడానికి కూడా ద్వేషం పూనడం తెలివిలేని పని. ఆస్తి హక్కు ఎప్పుడైతే ఉందో తప్పక సంక్షేమం, రిజర్వేషన్లు అవసరం అవుతాయి. రిజర్వేషన్లు ఎత్తివేసి ఆస్తిని పంచవచ్చును. ఈ ధర్మ సూక్ష్మం తెలియాలంటే రాజ్యాంగ నిర్మాణం అర్థం కావలసిందే.

ఈ కేంద్ర బడ్జెట్‌ను చూస్తే తప్పకుండా మోడీ దళిత మైనార్టీ స్త్రీ ద్వేషి అని అర్థం అవుతుంది. 'హిందూ' సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి 'గోవు'ను కేంద్రం చేసి మళ్లీ రాజ్యానికి రావాలని చూస్తున్నాడు.

ఈ సందర్భంగా లౌకిక వాదుల, వామపక్షవాదుల, సామాజిక ఉద్యమ కారుల, హేతువాదుల ఐక్యత రాజకీయంగా పటిష్టం కావాల్సిఉంది. అదే సందర్భంలో చంద్రబాబు, కె.సి.ఆర్. హిందూ రాజకీయవాదులే. అవకాశవాదులే అని గుర్తించాల్సి ఉంది. నియంతలు కూలిపోవడం చారిత్రక అనివార్యం. లౌకికవాదులదే అంతిమ విజయం.

(రచయిత సామాజిక తత్వవేత్త,
వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్రపార్టీ) వీ

అవగాహన తెనాలి

భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని కా. పొట్టి పోలేశ్వర్ రావు రాసిన

"చాటవలె...! ఎలుగెత్తవలె...! గొంతెత్తవలె...!!!"

అనే గేయాన్ని పాడినవారికి బహుమతి ఇవ్వబడును. మార్చ్ 24 ఆదివారం ఉదయం 9 గంటల నుండి వి.జి.కె. భవన్ సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్, కవిరాజు పార్క్, నందులపేట, తెనాలిలో మహాసభ ఏర్పాటు చేయడమైంది. ఈ సభలోనే ఒక్కరుగా లేదా బృందంగా పాడవచ్చు. వాయిద్యాలు ఉపయోగించి లేదా లేకుండా అయినా పాడవచ్చు. మొదటి బహుమతి రు. 5000, రెండవ బహుమతి రు. 3000, మూడవ బహుమతి రు.2000. ప్రోత్సాహక బహుమతులుగా ఇద్దరికి రు. 1000 చొప్పున ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమానికి నలుగురు లేదా ఐదుగురు జడ్జీలు న్యాయ నిర్ణేతలుగా ఉంటారు. గేయ ప్రతిని రచయిత వద్ద నుండి పొందవచ్చును.

రచయిత చిరునామా:
***పి. పోలేశ్వర్ రావు,** రిటైర్డ్ అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్,*
నందులపేట, తెనాలి. సెల్ 9492664530
అవగాహన తెనాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ - 2019-20

***ఇప్పటికే అప్పుల కుప్పగా ఉన్న రాష్ట్రాన్ని మరింత అప్పుల పాలు చేసేలా ఈ ఏడాది బడ్జెట్ ఉందనీ, రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలను, ముఖ్యంగా రైతులను మభ్యపెట్టే విధంగా ఉందనీ అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

2019 ఫిబ్రవరి 5న రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, శాసనమండలిలో మున్సిపల్ శాఖా మంత్రి పి. నారాయణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇది కేవలం రాబోయే శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలను ఏదో ఒక విధంగా మరోసారి మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలనే దృష్టితోనే తయారు చేసినట్లు కనబడుతున్నది. ఇది పూర్తిగా 'ఓట్ ఆన్ అకౌంట్' బడ్జెట్ – ఓట్ బ్యాంక్ బడ్జెట్‌గా మారిపోయింది.

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాల నుంచి చేసిన పనులను, వారి భాషలో 'అభివృద్ధి–సంక్షేమం'అనే రెండు జంట పదాలకు వీరే ఆద్యులన్నట్లుగా ప్రచారం చేసుకుంటూ అసలు మౌలిక అంశాలను స్పృశించకుండా కేవలం సామాన్య పౌరులను ఏదో ఒక విధంగా మరోసారి మభ్యపెట్టినట్లు ఈ బడ్జెట్ రూపకల్పన జరిగింది. బడ్జెట్ ప్రసంగంలో ముఖ్యమంత్రిని పొగడ్తలతో ముంచెత్తడం తమకు తామే గొప్పలు చెప్పుకుంటూ భజన చేసినట్లు కనిపించింది. అప్పులతో పాటు రాని ఆదాయ వనరులను చూపిస్తూ కాగితాలపై భారీగా కేటాయింపులు చేశారు.

రు. 2,26,177 కోట్లతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, వచ్చే ఎన్నికలలో తామే అధికారంలోకి వస్తామనే ధీమాతో రాజ్యాంగ విరుద్ధంగా పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వారి అతి విశ్వాసానికి, రాజ్యాంగ విలువలను తోసిపుచ్చే ప్రక్రియకు నిదర్శనం. పోయిన సంవత్సరం బడ్జెట్‌తో పోలిస్తే రు. 35 వేల కోట్ల అదనపు మాటే కాని, అన్నింటిలోనూ న్యాయం జరుగలేదు, కోత విధించారు. ఆదాయ వనరులు లేకపోయినా, అదనపు ఆదాయం లేకపోయినా ఊహాజనిత గణాంకాలతో భారీగా బడ్జెట్ కేటాయింపులు చేశారు.

రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిని పరిగణలోనికి తీసుకోకుండా, ద్రవ్యోల్బణాన్ని పరిగణలోనికి తీసుకోకుండా, విద్యా, ఆరోగ్యం, సామాజిక రంగాలకు, మహిళా సంక్షేమానికి, స్కిల్ డెవలప్‌మెంట్‌కు కోతలు పెట్టారు. గత సంవత్సరం బడ్జెట్‌లో విద్యకు 12.79 శాతం ఉండగా ఈసారి 11.48 శాతానికి తగ్గించారు. గత ఏడాది బడ్జెట్‌తో పోల్చగా 18.38 శాతం పెరిగింది. ఉన్నత విద్యకు కేటాయించిన 3 వేల కోట్ల రూపాయలు ఆ శాఖలోని సిబ్బంది జీతభత్యాలకు కూడా సరిపోతుందని చెప్పలేం. ప్రజారోగ్యం పైన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. రోజూ ఎంతో మందికి సేవలందించే ప్రజారోగ్య పథకాలకు ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. వైద్యారోగ్య శాఖకు కేటాయించిన పదివేల కోట్లలో 70 శాతం మొత్తం సిబ్బంది జీతాలకే పోతే మిగిలిన 30 శాతంతో పథకాల నిర్వహణ కష్టసాధ్యమవుతుంది.

ఎన్నికల ముందు రైతులను మభ్యపెట్టేందుకు 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రకటించారు. కానీ ఈ పథకానికి విధి విధానాలు తయారు చేయలేదు. దీనికోసం బడ్జెట్‌లో ఐదు వేల కోట్ల రూపాయలను కేటాయించారు. ఈ నిధులను ఎలా ఖర్చు చేస్తారు అనేదానిపై స్పష్టత లేదు. గత ఎన్నికలలో రైతులకు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు 'రైతు రుణమాఫీ' సంపూర్ణంగా చేయలేదు. రైతులకు 80 వేల కోట్ల అప్పులు ఉంటే ఈ పథకానికి పలు అడ్డంకులు వేసి 24 వేల కోట్లకు కుదించారు. అదైనా పూర్తి చేశారంటే అదీలేదు. ఐదు సంవత్సరాల పరిపాలనా కాలం పూర్తి కావస్తున్నా, ఈ తాత్కాలిక బడ్జెట్‌లో రుణమాఫీకి అవసరమైన రు. 9 వేల కోట్లను కేటాయించలేదు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు కుటుంబానికి ఏటా ఆరు వేల రూపాయలను అందజేసే పథకం ప్రతిపాదించినందున దానికి పోటీగా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రవేశపెట్టింది ఈ రాష్ట్ర ప్రభుత్వం.

గ్రామీణాభివృద్ధికి గత బడ్జెట్‌లో 14.74 శాతం కేటాయిస్తే, ఈసారి 14.28 శాతం మాత్రమే కేటాయించారు. జల వనరుల శాఖకు గతంలో కంటే 0.74 శాతం కేటాయింపులు తగ్గించారు. డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ పూర్తిగా చేస్తాననే హామీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కూడా అన్యాయమే చేశారు. వడ్డీలేని రుణాలు (బకాయి) రు. 2,350 కోట్లు ఉండగా బడ్జెట్‌లో కేవలం రు. 1100 కోట్లు కేటాయించారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ కేటాయింపుల్లోనూ ప్రభుత్వం అంకెల గారడీ చూపించింది. ఈ బడ్జెట్‌లో ఎస్‌సి సబ్‌ప్లాన్‌కు 27.96 శాతం పెంచి రు. 14,367 కోట్లు, ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు 28.97 శాతం పెంచి రు. 5,385 కోట్లు, బిసి సబ్‌ప్లాన్‌కు 33 శాతం పెంచి రు. 16,226 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి 18.57 శాతం పెంచి రు. 1304 కోట్లు కేటాయించారు. అయితే గడిచిన నాలుగేళ్లలో ఎస్‌సి/ఎస్‌టి/బిసి సబ్‌ప్లాన్‌ల నిధులు ఖర్చు చేసింది చాలా తక్కువేనని ఆర్థిక మంత్రే రాష్ట్ర శాసన సభలో ప్రకటించారు. గత బడ్జెట్‌లోని కేటాయింపుల్లో దాదాపు రు. 5 వేల కోట్లు మిగిలి ఉన్నాయనేది ఒక వాస్తవం. కాబట్టి ఈ బడ్జెట్‌లోని కేటాయింపులంతా ఆయా వర్గాలను మభ్యపెట్టడానికి తప్ప వారి సంక్షేమానికి కాదనేది స్పష్టమవుతున్నది. ప్రతీ కులానికి కార్పొరేషన్ అంటూ ప్రకటించారే తప్ప ఆయా కార్పొరేషన్ల మూల నిధి బడ్జెట్‌లో కేటాయింపులు జరుగలేదు.

ఇంటికో ఉద్యోగం – ఉపాధి కల్పిస్తామని, ఇవ్వలేకపోతే నెలకు రు. 2,000 నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఎన్నికలలో వాగ్దానం చేసిన చంద్రబాబు నాయుడు నాలుగేళ్ల నుంచి ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ ఎన్నికల సంవత్సరంలో మొదట నిరుద్యోగ భృతి రు. 1,000, ఇప్పుడు రు. 2 వేలు ఇస్తామని అంటున్నారు. ఇప్పుడు ఈ పథకానికి

రు. 1200 కోట్లు కేటాయించారు. 2016లో ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో పదవతరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకూ చదివిన ఎస్‌సి/ఎస్‌టి/బిసి కులాల నిరుద్యోగులు దాదాపు 34 లక్షల మంది ఉన్నట్లు తేలింది. ఇప్పుడు కేటాయించిన 1200 కోట్లు పై వర్గాలకు ఏ విధంగా పంచగలుగుతారు అనేది మన ముందున్న ప్రశ్న?

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి రాగానే పేదలందరికి 12 లక్షల ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చింది. ఇంతవరకూ అరకొరగానే నిర్మాణాలు జరిగాయి. 2014-15 నుంచి 2018-19 వరకు కేవలం ఎనిమిది వేల కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ మొత్తాన్ని పూర్తిగా ఖర్చు చేయలేదు. ఈసారి రు. 4,099 కోట్లు కేటాయించడం ద్వారా ఆ లక్ష్యాన్ని ఎలా చేరుకోగలుగుతుంది? ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లలో కొన్నయినా పూర్తి కావాలంటే కనీసం రు. 15 వేల కోట్లు కావాల్సి ఉంటుందని ఆ శాఖకు చెందిన అధికారులు చెబుతున్నారు. ఒక పక్కన పేదలకు లక్షల సంఖ్యలో ఇళ్లను మంజూరు చేస్తూ, ఆచరణలో డబ్బు విషయంలో ఇంత తక్కువ మొత్తం కేటాయించడమంటే, ఆయా వర్గాలను మోసగించడం తప్ప మరొకటి కాదు.

వివిధ వర్గాల పేద ప్రజలను ఆకట్టుకునేందుకు కేటాయింపులయితే చేశారు గాని, ఈ రెండు - మూడు నెలల్లో అంతపెద్ద మొత్తాన్ని ఖర్చు పెట్టడం సాధ్యం కాదు. కేవలం పేద ప్రజల ఓట్లను రాబట్టేందుకు మాత్రమే ఈ బడ్జెట్‌ను రూపకల్పన చేసినట్లు స్పష్టమవుతున్నది. ఎలాగూ ఖర్చు పెట్టని కేటాయింపులు ఎంత చేసినా ఇబ్బంది లేదంటూ తమకు ఇష్టం వచ్చిన విధంగా బడ్జెట్‌ను తయారు చేశారు.

ఉత్పత్తేతర రంగాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. కీలకమైన రంగాలకు కోత విధించారు. ఇది విచారకరం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎక్కువ భాగం వ్యవసాయాధారిత రాష్ట్రం. తరచుగా ఏదో ఒక విధంగా విపత్తుల భారిన పడుతుంది. వ్యవసాయం సంక్షోభంలో ఉంది. కోస్తా ప్రాంతంలో తుఫాన్ వైపరీత్యాల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోతుంటే, రాయలసీమలో వర్షాలు లేక వ్యవసాయం దెబ్బతింటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో తాను చేసిన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ, తాను అధికారంలోకి వచ్చిన వెంటనే 'ధరల స్థిరీకరణ నిధి'ని ఏర్పాటు చేయడం. వ్యవసాయాభివృద్ధిపై నియమింపబడిన పలు కమిషన్‌లు కూడా ఇదే విషయాన్ని స్పష్టపరుస్తూ, 'విపత్తు సహాయ నిధి'ని కూడా ఏర్పాటు చేయాలని సూచించాయి.

ముఖ్యమంత్రి గత నాలుగు సంవత్సరాల కాలంలో ఏమాత్రం రైతుల గురించి పట్టించుకోకుండా, ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది దిక్కుతోచని స్థితిలో 'అన్నదాత సుఖీభవ' పథకం ప్రవేశపెడుతున్నాడు. ఉద్యానవన పంటలు, సరైన మార్కెట్ లేక రోడ్లవెంట ఆ పంటలను పారబోశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా దోషే. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ సంక్షేమానికి వెయ్యి కోట్ల రూపాయలతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేశాడు. వ్యవసాయాభివృద్ధి 'రెండంకెల వృద్ధి' రేటు సాధిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రతిచోటా ప్రచారం చేస్తున్నాడు. కాని, వాస్తవ లెక్కలు వేరే ఉన్నాయి. చేపలు, రొయ్యలు తదితరముల ద్వారా వచ్చే ఆదాయమే ఎక్కువగా ఉన్నది తప్ప, వ్యవసాయాభివృద్ధి ఏదీ లేదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను 'సంక్షేమ బడ్జెట్'గా ప్రచారం చేసుకున్నప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి, ఇటీవల ప్రకటించిన పథకాలకు నిధుల కొరత వెంటాడుతూనే ఉంది. ఈ మూడు నెలల కాలానికి రు. 30 వేల కోట్లు అప్పు చేయాల్సి ఉంటుందని ఆర్థిక శాఖా మంత్రే చెబుతున్నాడు. ఇప్పుడు ప్రకటించిన పథకాలకు నిధులు ఎక్కడి నుండి తెస్తారో కూడా తెలియదు. అందుకే 'పసుపు - కుంకుమ' కింద ఇచ్చే నిధులు చెక్కుల రూపంలో ఇచ్చారు. వాటిని కూడా విడతల వారీగా బ్యాంక్‌లో జమ చేసుకోవాలనే నిబంధన కింద ఇస్తున్నారు. మహిళలకిచ్చే రు. 10 వేలను 3 విడుతలుగా ఇస్తామంటున్నారు. రుణమాఫీ గురించి మాత్రం ప్రభుత్వం చేతులెత్తేసింది.

మొత్తం మీద ఈ బడ్జెట్ ఉత్పత్తేతర వ్యయం పెంచేసి 'సంక్షేమ - అభివృద్ధి' మధ్య సమతుల్యం పాటించలేదు. కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే పేద ప్రజల ఓట్ల కోసం 'వల' విసిరినట్లు ఉంది.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు) వీ

తెలంగాణ బడ్జెట్ 2019 అసలు లక్ష్యాలేమిటి?

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2019-20 వోటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా మొత్తంగా బడ్జెట్ తయారీ గురించీ, ప్రస్తుత బడ్జెట్ గురించీ విశ్లేషిస్తున్నారు ఎన్ వేణుగోపాల్

రెండోసారి ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి ఇప్పటికింకా పూర్తిస్థాయి మంత్రివర్గాన్నీ ఏర్పాటు చేయలేదు, ఆర్థికశాఖకు ప్రత్యేకంగా ఒక మంత్రినీ నియమించలేదు. ఆర్థిక శాఖ మంత్రి లేనందువల్ల స్వయంగా ముఖ్యమంత్రే బడ్జెట్ ను ప్రవేశపెట్టారు గాని అది కూడ పూర్తిస్థాయి బడ్జెట్ కాదు. ఈ ఏప్రిల్ 1 న మొదలై 2020 మార్చ్ 31న ముగిసే ఆర్థిక సంవత్సరానికి పూర్తి బడ్జెట్ ను ప్రవేశపెట్టగలిగిన అవకాశం ఉన్నప్పటికీ, మధ్యంతర (వోటాన్ అకౌంట్) బడ్జెట్ ను మాత్రమే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సాధారణ ఎన్నికలు జరుగుతున్నందువల్ల, కేంద్ర ప్రభుత్వం పూర్తి బడ్జెట్ ను ప్రవేశపెట్టకుండా వోటాన్ అకౌంట్ బడ్జెట్ తో సరిపుచ్చిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడ వోటాన్ అకౌంట్ బడ్జెట్ నే ఎంచుకుంది. ఇది సమర్థనీయమేనా, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల్లో, పన్నులలో వాటాలో కొత్త ప్రభుత్వం పెద్ద మార్పులు ఏమన్నా చేయగల అవకాశం ఉందా, స్వల్ప మార్పులు మాత్రమే ఉండే అవకాశం ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆ కారణం చూపి మధ్యంతర బడ్జెట్ మార్గాన్ని ఎంచుకోవచ్చునా అని ప్రశ్నించవచ్చు గాని, కారణాలేమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ పద్ధతిని ఎంచుకున్నదనేది ఒక వాస్తవం. ఈ బడ్జెట్ రూపకల్పనలో ప్రభుత్వం ప్రకటించిన, వ్యక్తం చేసిన ప్రాధాన్యతలేమిటి, కేటాయింపుల పరిస్థితి ఏమిటి, మొత్తంగా బడ్జెట్ ధోరణి ఎలా ఉంది అని చర్చించబోయే ముందు అసలు మన ఆర్థిక వ్యవస్థలో బడ్జెట్ నేపథ్యం గురించి కొంత తెలుసుకోవాలి.

మన ఆర్థిక వ్యవస్థలో, ఆ మాటకొస్తే ప్రపంచవ్యాప్తంగా ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా, ఆదాయ వ్యయాల లెక్కలు, ముందస్తు అంచనాలు, బడ్జెట్లు ఇప్పుడు సర్వసాధారణమైపోయాయి గాని ఇవి మానవ సమాజపు సహజ అవసరాలేమీ కావు. సుదీర్ఘకాలంగా ఉన్నవీ కావు. ఒకానొక చారిత్రక పరిణామ దశలో మానవసమాజం తయారు చేసుకున్న ఏర్పాట్లు మాత్రమే. ప్రజల నుంచి గోళ్లూడగొట్టి పన్నులు వసూలు చేసి రాజ్య ఖజానా నింపుకుని తమ ఇష్టారాజ్యంగా విలాసాల మీద, ఆశ్రితుల పోషణ మీద, దేవాలయాల మీద, దండయాత్రల మీద ఖర్చుపెట్టిన రాజరిక రాజ్యాలలో రాజు ఆలోచన మాత్రమే అంతిమం గనుక ఇటువంటి ఆదాయ వ్యయ లెక్కల అవసరం రాలేదు. రాజ్యఖజానా నింపడం ప్రజల బాధ్యత, భోగాలు అనుభవించడం రాజు హక్కు అనే మధ్యయుగాల ఆలోచనలో ఎప్పుడూ ఖజానా ఖాళీ కాకుండా చూసుకోవడం తప్ప ఆదాయవ్యయాల లెక్కలు ప్రజలతో పంచుకోవలసిన అవసరం లేకపోయింది. తన ఆదాయానికీ, వ్యయానికీ ఎవరికీ జవాబుదారీ కానక్కర లేదని అనుకున్న రాజరికం, భూస్వామ్యం రూపంలోనైనా అదృశ్యమైనాకనే రాజ్యఖజానా లెక్కలతో ప్రజలకు ప్రమేయం ఉందనే ఆలోచన మొదలయింది. తమను తాము పార్లమెంటరీ వ్యవస్థలుగా, ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థలుగా ప్రకటించుకున్న ఆధునిక రాజ్యాలు రాజ్య ఖజానా ఆదాయం ఎక్కడి నుంచి ఏ రూపంలో వస్తున్నదో, వ్యయం ఏయే అవసరాల కోసం ఎంతెంత ఖర్చవుతున్నదో ప్రజలకు, కనీసం తమను తాము ప్రజా ప్రతినిధులుగా పిలుచుకునేవారికి చెప్పవలసిన అవసరం ఉందని భావించాయి. అందువల్ల రూపొందినదే బడ్జెట్. రాజ్య ఖజానా అధికారంలో ఉన్నవారి ఇష్టారాజ్యం కాదనీ, ఆ అధికారంలో ఉన్నవారు ప్రజల పట్ల జవాబుదారీగా వ్యవహరించి ఆదాయంగా వచ్చే ప్రతి పైసాకూ, ఖర్చుపెట్టే ప్రతి పైసాకూ బహిరంగంగా, పారదర్శకంగా, నిర్దిష్టంగా లెక్క చెప్పవలసిందే అనే ప్రజాస్వామిక సూత్రం బడ్జెట్ రూపకల్పనకు పునాది. అంటే బడ్జెట్ అనేది మౌలికంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు సృష్టి.

బ్రిటన్ లో ఒక బూర్జువా ప్రజాస్వామిక విప్లవ ఫలితంగా రూపొంది, అభివృద్ధి చెందిన అన్ని పార్లమెంటరీ వ్యవస్థలనూ ఈ దేశంలో అంటు కట్టినట్టే, బ్రిటిష్ వలసవాద ప్రభుత్వమే 1860లలో బడ్జెట్ ప్రక్రియను కూడ భారతదేశంలో ప్రవేశపెట్టింది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి, ఉత్పత్తి సంబంధాలలో మార్పులు, సామాజిక అంతర్మథనం, సమూలమైన విప్లవం వంటి పరిణామాలు ఏమీ జరగకుండానే, అరకొరగా జరిగి, ఈ సమాజంలో మూలాలు లేకుండానే ఇక్కడికి వలస వచ్చిన అన్ని పార్లమెంటరీ వ్యవస్థల లాగే, ప్రక్రియల లాగే బడ్జెట్ ప్రక్రియ కూడ భారతదేశంలో దాని జవాబుదారీ, బాధ్యతాయుత, ప్రాతినిధ్య స్వభావాన్ని పోగొట్టుకుని వక్రరూపంలో మిగిలిపోయింది. రూపంలో ఇది పార్లమెంటరీ ప్రాతినిధ్య వ్యవస్థ బడ్జెట్ గా, ప్రజాస్వామిక బడ్జెట్ గా, సమాజంలోని విభిన్న వర్గాల మధ్య సంపదనూ, ఆదాయాలనూ పంపిణీ చేస్తూ, సమతుల్యతను సాధించేదిగా చెప్పుకుంటున్నప్పటికీ, సారంలో ఒక వర్గపు శ్రమ ఫలితమైన సంపదను, శ్రమించని మరొక వర్గానికి బదిలీ చేసే తంతుగా మాత్రమే మిగిలిపోయింది.

అయితే ఈ నగ్నమైన వర్గ దోపిడీ స్వభావాన్ని, అసమాన పంపిణీ స్వభావం పైకి కనబడకుండా మేలి ముసుగు కప్పడానికి కాలక్రమంలో అనేక ఆకర్షణీయమైన మాటలు, ఆచ్ఛాదనలు, డొంకతిరుగుడు వాదనలు, అబద్ధపు సమర్థనలు, గంభీరపు వాగ్దానాలు, గందరగోళపు గణాంకాలు కూడ బడ్జెట్లల్లో ప్రవేశించాయి. సాధారణ ప్రజానీకానికి మాత్రమే కాదు, విద్యావంతులలో కూడ అత్యధికులకు అర్థం కాని, భ్రమలు కల్పించే పద్ధతిలో అంకెల గారడీ బడ్జెట్ లో ప్రధాన అంశం అయింది అందువల్లనే.

ప్రతి ఒక్కరి జీవనం అర్థశాస్త్ర పరిధిలోకి వచ్చేదే అయినప్పటికీ, ఏ ఒక్కరికీ అర్థం కాకుండా, తెలిసిన విషయాలనే తెలియని భాషలో మసిపూసి మారేడుకాయ చేయడానికి అర్థశాస్త్ర పరిభాష అభివృద్ధి కాగా, మరింత భయపెట్టడానికి, పరాయీకరించడానికి బడ్జెట్లు అంకెల పరిభాష మాట్లాడడం మొదలయింది. వర్గ సమాజంలో అత్యంత కఠినమైన వాస్తవాలకు ముసుగు కప్పుతూ తటస్థతను ప్రదర్శించడం బడ్జెట్ పని అయింది. ఒకవైపు వర్గప్రయోజనాలకు అనుగుణంగా సామాజిక ఉత్పత్తిని, సంపదను, మిగులును పాలక వర్గాలకు మళ్లిస్తూనే, సాధికారత కోసం, ప్రదర్శన కోసం పాలిత వర్గాలకు ఏవో కొన్ని ఎంగిలి మెతుకులు విదల్చడం బడ్జెట్ ప్రధాన కర్తవ్యమయింది. వాస్తవంగా శ్రమదోపిడీకీ, సంపద అక్రమ, అసమ పంపిణీకీ నిలయమైన బడ్జెట్ తటస్థ ఆర్థిక వ్యవస్థా నిర్వాహక ప్రక్రియగా నటించవలసి వచ్చిన ప్రహసనం వల్ల కొంత, ఉన్నది ఉన్నట్టు చెప్పకుండా మరుగుపరచడంలో కొంత బడ్జెట్ అనేది అవకతవకల కుప్పగా మిగిలిపోయింది. అందులోనూ రానున్న సంవత్సరపు ప్రతిపాదనల అంచనాలు, ఈ సంవత్సరం కోసం గత సంవత్సరం ప్రకటించిన అంచనాల సవరింపులు, గత సంవత్సరం కోసం నిర్ధారణ జరిగిన వాస్తవ గణాంకాలు అనే మూడు అంకెల మధ్య ప్రజల కళ్లు కప్పడానికి ప్రభుత్వాలకు అవకాశం దొరికింది. అంతమాత్రమే కాదు, ప్రతిపాదించిన కేటాయింపులను పూర్తిగా ఖర్చు పెట్టకపోవడం, ఒక పద్దుకు ప్రతిపాదించిన కేటాయింపులను మరొక పద్దుకు బదలాయించడం వంటి పనుల ద్వారా పాలకులు బడ్జెట్ లో ఏమి ప్రకటించినప్పటికీ, ఇష్టారాజ్యంగా నిధులు సేకరించడానికి, ఖర్చు పెట్టడానికి అవకాశం దొరికింది. అంటే ఎంతగా ప్రజా ప్రాతినిధ్య పాలన అని చెప్పుకున్నప్పటికీ రాచరికపు రోజుల ఇష్టారాజ్యపు నిధుల సేకరణ, ఖర్చు కొనసాగుతున్నాయి.

ప్రజాస్వామ్యం ముసుగు కప్పుకున్న దోపిడీ పీడనల వర్గ సమాజంలో బడ్జెట్ సమాజానికంతా మేలు చేసేదిగా, సమాజ పురోభివృద్ధికి ఉపయోగపడేదిగా, తటస్థంగా ఉండడం అసాధ్యం. ఆ పరిమితి లోపలే అయినా, కనీసం ఏవో కొన్ని ప్రజా సమూహాలకు ప్రదర్శనా వస్తువుగానైనా సంపద పునఃపంపిణీ ఎలా జరుగుతున్నదో, అందులో న్యాయాన్యాయాలేమిటో చర్చించవచ్చు. మొత్తంగా సమాజం ఉత్పత్తి చేసిన సంపదను మళ్లీ ఆ సమాజం మీద ఖర్చు పెడుతున్నప్పుడు కనీసం ఎవరి శ్రమ ఫలితం వారికి కాకపోయినా, ఆయా సమూహాల జనాభా నిష్పత్తిగానైనా ప్రతిఫలం దక్కుతున్నదా లేదా, సమష్టి అవసరాల కోసం ఖర్చులు న్యాయబద్ధంగానే జరుగుతున్నాయా లేదా, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం ప్రస్తుత తరం వెచ్చించవలసిన సంపద సక్రమంగానే కేటాయింపు జరుగుతున్నదా లేదా, కొన్ని వర్గాలు సామాజిక సంపదలో ఎక్కువ వాటాను తమ హక్కు భుక్తం చేసుకుంటున్నాయా వంటి ప్రశ్నలను చర్చించడానికి బడ్జెట్ ను ఉపయోగించవచ్చు. అలాగే ఒక సమూహపు, ఒక ప్రాంతపు ప్రత్యేక చారిత్రక స్థితిని బట్టి కూడ ఆ సమూహపు సంపద ఉత్పత్తి, పంపిణీల విషయంలో ప్రత్యేక పద్ధతుల గురించి చర్చ జరపవచ్చు.

బడ్జెట్ గురించిన ఈ స్థూల నేపథ్యంలో, తెలంగాణ అనే ప్రత్యేక ప్రాంతపు బడ్జెట్ ఎలా ఉండవలసి ఉండింది, గత ఐదు సంవత్సరాలుగా ఎలా ఉంటున్నది, ఈ సంవత్సరం ఎలా ఉన్నది చర్చించవచ్చు.

ఏ బడ్జెట్ అయినా నిర్ణయించుకున్న ఆర్థిక సంవత్సరంలో ఆ ప్రభుత్వానికి వచ్చే మొత్తం ఆదాయం ఎంత, ఆ ప్రభుత్వం పెట్టదలచిన మొత్తం ఖర్చు ఎంత తెలియజేస్తుంది. ఆదాయం అన్నప్పుడు ప్రజల మీద విధించే పన్నులు, గతంలో నిర్మించిన సంస్థల, చేసిన పనుల నుంచి వచ్చే వార్షిక ఆదాయం, రాష్ట్రాల సమాఖ్య అయిన దేశంలో ఒక రాష్ట్రానికి వచ్చే వాటా వంటివి ప్రధానంగా ఉంటాయి. వ్యయం అన్నప్పుడు ఆ సమాజంలోని వివిధ వర్గాల మనుగడ కోసం, అభివృద్ధి కోసం, భవిష్యత్ తరాల వినియోగం కోసం ఏయే పనులు చేపట్టాలి, ఏ పనికి ఎంత ఖర్చు పెట్టాలని ప్రతిపాదిస్తున్నారు వంటి లెక్కలు ఉంటాయి. ఏ ఆధునిక వ్యవస్థలోనైనా ఆదాయమూ వ్యయమూ సరిసమానంగా ఉండవు. సాధారణంగా వ్యయమే ఎక్కువగా కూడ ఉండవచ్చు. ఆదాయ వ్యయాల మధ్య ఖాళీని అప్పుల ద్వారా పూరిస్తారా, పన్నులు పెంచడం ద్వారా పూరిస్తారా వంటి ప్రశ్నలు బడ్జెట్ తయారీలో ప్రధానంగా ఉంటాయి.

ఈ సాధారణ ఆర్థిక సూత్రాలతో పాటు తెలంగాణకు ప్రత్యేక చారిత్రక పరిస్థితి ఉంది. ఆరు దశాబ్దాల పాటు మరొక ఆర్థికవ్యవస్థలో భాగంగా ఉండి, అక్కడ ఆర్థిక నిర్వహణలో తమకు దక్కవలసిన వాటా దక్కలేదని, అంటే తమ ప్రజల పురోభివృద్ధికి అవసరమైన నిధులు, సౌకర్యాలు అందలేదని ఫిర్యాదులతో, తమ ప్రాంతంలోని విభిన్న వర్గాల ప్రజల ప్రయోజనాలు స్వపరిపాలనలోనే, సొంత రాష్ట్రంలోనే, సొంత ఆర్థిక నిర్వహణలోనే నెరవేరుతాయనే ప్రజాఉద్యమ ఫలితంగా ఏర్పడిన రాష్ట్రమిది. అందువల్ల తెలంగాణ బడ్జెట్ అంతకుముందరి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ లాగ ఉండగూడదని, విభిన్నంగా, వినూత్నంగా ఉండాలని ఎవరైనా ఆశిస్తారు. నిధుల సేకరణ పద్ధతి, కేటాయింపుల పద్ధతి, ఖర్చు పద్ధతి, విభిన్నవర్గాల అభ్యున్నతి కోసం చేపట్టే పథకాల పద్ధతి విభిన్నంగా ఉండాలని ఉద్యమ కాలంలో ఆయా వర్గాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోరుకున్నాయి.

కాని 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి, తెలంగాణ రాష్ట్ర సమితి అధికారం చేపట్టిన నాటి నుంచీ కూడ బడ్జెట్ తయారీలో అటువంటి వినూత్న శైలి ఎక్కడా కనిపించలేదు. నీటిపారుదల పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడం అనే ఒక్క మార్పు మినహా మిగిలిన అన్ని విషయాలలోనూ పాత పద్ధతే కొనసాగుతూ వస్తున్నది. ఆ నీటి పారుదల పథకాల ప్రాధాన్యత కూడ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల ప్రతిఫలనంగా ఎంత, కాంట్రాక్టర్ల, రాజకీయ నాయకుల ప్రయోజనం కోసం ఎంత అనే చర్చ ఉండనే ఉంది. రాజ్యఖజానాను విలాసాలకూ, ఆశ్రితుల పోషణకూ, దేవాలయాలకూ, దండయాత్రలకూ ఖర్చు పెట్టిన మధ్యయుగాల రాచరికంతో సరిసమానంగా తెలంగాణ పాలకుల ఆర్థిక విధానం ఉండడం యాదృచ్ఛికమేమీ కాదు. ఆ నాలుగు పద్దులలో సైనిక దండయాత్ర బదులు ఆలోచనలను ఏమార్చే ప్రచారసాధనాల మానసిక దండయాత్ర వచ్చి చేరడం మాత్రమే మార్పు.

ఈ వరుసలో మొదటి దఫా పదవీకాలాన్ని పూర్తి చేయకుండానే మధ్యంతర ఎన్నికలకు వెళ్లి, తిరిగి ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన తెలంగాణ రాష్ట్ర సమితి రెండో దఫాలో మొదటి బడ్జెట్ గా ఈ 2019-20 వోటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశపెట్టింది. మే 2019 తర్వాత కేంద్రంలో ఏర్పడనున్న ప్రభుత్వం కొత్త ప్రాధాన్యతలతో, కొత్త

కేటాయింపులతో, కొత్త పథకాలతో పూర్తి బడ్జెట్ ను ప్రవేశపెట్టిన తర్వాత ఆ కేటాయింపులను బట్టి తాను పూర్తి బడ్జెట్ ను మరొక మూడు నాలుగు నెలల తర్వాత ప్రవేశపెడతానని ప్రకటించింది. అలా ప్రస్తుత బడ్జెట్ పూర్తి స్థాయి బడ్జెట్ కాదు గనుక దీని మీద సంపూర్ణమైన అంచనాకు రావడం సాధ్యం కాదు. ఇప్పుడు ప్రకటించిన పథకాలు, కేటాయింపులు, అంకెలు అన్నీ కూడ పూర్తి స్థాయి బడ్జెట్ నాటికి మారే అవకాశం ఉంది. అయితే ఈ బడ్జెట్ లో చేసిన ప్రకటనలు, నిధుల కేటాయింపులు ప్రభుత్వ ఉద్దేశాలకు, ప్రాధాన్యతలకు, ధోరణికి సూచికలుగా గ్రహించి, పూర్తిస్థాయి బడ్జెట్ కూడ ఈ దిశలోనే తయారవుతుందని ఊహించవచ్చు.

ఈ బడ్జెట్ అంచనాల ప్రకారం మొత్తం ఆదాయం రు. 1,82,059 కోట్లు కాగా అందులో ప్రధాన పద్దులు కేంద్ర పన్నుల్లో వాటా రు. 20,583 కోట్లు, సొంత పన్ను ఆదాయం రు. 84,814 కోట్లు, పన్నేతర ఆదాయం రు. 9,960 కోట్లు, గ్రాంట్లు రు. 22,835 కోట్లు, బహిరంగ మార్కెట్ రుణాలు రు. 31,158 కోట్లు. మొత్తం వ్యయం రు. 1,82,016 కోట్లు కాగా అందులో ప్రధాన పద్దులు రెవెన్యూ వ్యయం రు. 1,18,822 కోట్లు, వడ్డీ చెల్లింపులు రు. 12,807 కోట్లు, మూలధన వ్యయం రు. 32,81,539 కోట్లు, పాత అప్పుల అసలు చెల్లింపులు రు. 8,266 కోట్లు.

ఈ అంకెలను విడిగా చూస్తే అవి ఎందుకు అలా ఉన్నాయో, అలా ఉండడం అంటే ఏమిటో, భిన్నంగా ఎందుకు లేవో, ఇలా ఉండడం ఏ పాలనా రీతికి నిదర్శనమో ఏమీ అర్థం కాదు. పైగా ఈ భారీ అంకెలు భయపెడతాయి. కాని ప్రతి అంకె వెనుకా ఒక సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రక్రియ ఉంటుంది. ఆ అంకెను ఆ ప్రక్రియతో కలిపి చూసినప్పుడు మాత్రమే ఆ అంకెల అసలు వాస్తవాలు బైటపడతాయి. అలా చూసినప్పుడు ఇది ఎక్కువగా మాటల, వాగ్దానాల, వాగాడంబరపు బడ్జెటే తప్ప చేతల, ఆచరణాత్మక, వాస్తవిక ప్రజాప్రయోజనకర బడ్జెట్ కాదని తేలుతుంది. అంకెల గారడీ ద్వారా ఏదో జరుగుతున్నట్టు అశేష ప్రజానీకంలో భ్రమలు కల్పిస్తూ, వాస్తవంగా మాత్రం ఆశ్రిత వర్గాల ప్రయోజనాలు నెరవేర్చడానికే ఒక్కొక్క పథకమూ, కేటాయింపూ రూపకల్పన జరిగాయని తేలుతుంది.

ఈ బడ్జెట్ లో ప్రధానమైన అంశం, తప్పనిసరిగా పరిశీలించవలసిన అంశం ఇందులో ప్రభుత్వమే అంగీకరిస్తున్న రుణభారం. ఈ సంవత్సరానికి ప్రభుత్వం చూపుతున్న మొత్తం రెవెన్యూ ఆదాయం రు. 1,38,193 కోట్లు కాగా అందులో బడ్జెట్ గణాంకాల ప్రకారమే కనీసం రు. 33,558 కోట్లు రుణాల ద్వారా వస్తున్నది. అందులో బహిరంగ మార్కెట్ రుణాలతో పాటు కేంద్ర ప్రభుత్వ రుణాలు, ఇతర రుణాలు కూడ ఉన్నాయి. వీటిలో ఏయే రుణాలు ఎంత వడ్డీ మీద తెచ్చుకుంటున్నవో, చెల్లింపు కాల పరిమితులేమిటో, ఆయా రుణాలకు రుణదాత సంస్థలు విధిస్తున్న షరతులేమిటో ఒక్కొక్క పద్దునూ నిశితంగా పరిశీలించినప్పుడు మాత్రమే తేలుతుంది. అప్పుడు మాత్రమే ఈ రుణాల ప్రమాదకర పరిణామాలు అర్థమవుతాయి.

వ్యయం వైపు నుంచి చూస్తే, రాష్ట్ర ప్రభుత్వ మొత్తం వ్యయం రు. 1,82,016 కోట్లు, రెవెన్యూ వ్యయం రు. 1,31,629 కోట్లు కాగా, ఇందులో కేవలం గత రుణాల వడ్డీల చెల్లింపులకే రు. 12,808 కోట్లు ఖర్చు కానున్నాయి. రుణాల అసలు చెల్లింపుల కోసం మరొక రు. 8,266 కోట్లు ఖర్చు కానున్నాయి. అంటే మొత్తం మీద రు. 21,074 కోట్ల తెలంగాణ ప్రజాధనం గత రుణాల అసలు, వడ్డీ చెల్లింపులకే ఖర్చయిపోతున్నది. మరొక మాటల్లో చెప్పాలంటే ఈ సంవత్సరం తెచ్చుకోవలసిన రుణంగా ప్రతిపాదిస్తున్న రు. 33,558 కోట్లలో మూడింట రెండు వంతులు పాత రుణం చెల్లింపులకే సరిపోతుంది. ఇలా పాత అప్పుల అసలు, వడ్డీలు తీర్చడానికి కొత్త అప్పులు చేయడం అనే ప్రక్రియ గురించి గత నాలుగైదు దశాబ్దాలలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక శాస్త్రవేత్తల మధ్య విస్తారమైన చర్చ జరిగింది. డెట్ ట్రాప్ (రుణ విషవలయం, రుణాల ఊబి) అనే ఈ పద్ధతిని అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు, వారి దళారీ సంస్థలు ఎలా పేదదేశాల మీద రుద్దుతూ వచ్చాయో, చివరికి అది డెత్ ట్రాప్ (మృత్యు వలయం) గా ఎలా మారిందో ఎందరో అర్థశాస్త్రవేత్తలు సవివరంగా, గణాంకాలతో రుజువు చేశారు. తెలుగు పాఠకులకు చిరపరిచితమైన 'ఒక దళారీ పశ్చాత్తాపం'లో రచయిత జాన్ పెర్కిన్స్ అనేక దేశాల్లో తన స్వానుభవంతో ఈ రుణాల ఊబిలో ఎలా దించుతారో వివరించారు.

అప్పులు చేయడం తప్పా, అప్పు చేయనివారు ఎవరన్నా ఉన్నారా, అమెరికాకు అప్పులు లేవా, చైనాకు అప్పులు లేవా, మనకు అప్పు ఇస్తున్నారంటే మనకు ఎంత పతార, పరపతి ఉన్నట్టు అని ముఖ్యమంత్రి దబాయిస్తున్నారు. కాని ఈ బుకాయింపులు తర్కానికి నిలిచేవి కాదు. ఇవి విదేశీ సంస్థల అప్పులు కావు అనే వాదన కూడ పూర్తి నిజం కాదు. అసలు అప్పు చేయవలసిన అవసరం ఏమిటి, తెచ్చిన అప్పును ఎందుకు ఖర్చుపెడుతున్నారు, అది సంక్షేమ పథకాల పేరు మీద పప్పు పుట్నాలకే ఖర్చయిపోతున్నదా, కొత్త ఆదాయ వనరులను సృష్టిస్తున్నదా, దుప్పటి ఉన్నంతవరకే కాళ్లు చాపుకోవాలనే ప్రాచీన వివేకం ఏమైపోతున్నది అనే ప్రశ్నలు కీలకమైనవి.

అప్పు తేవడం తప్పా అని గుద్దురిమినంత మాత్రాన అప్పు తేవడం తప్పు కాకుండా పోదు. అప్పు చేయడం, ఆ అప్పు అసలు, వడ్డీ తీర్చడం వ్యక్తుల విషయంలో, కుటుంబాల విషయంలో వారి సొంత వ్యవహారం కావచ్చు. తీర్చలేకపోతే ఆ వ్యక్తో, కుటుంబమో మునిగిపోవచ్చు, ఆత్మహత్య లాంటి అఘాయిత్యానికి ఒడిగట్టవచ్చు. కాని ఒక సమాజం విషయంలో, అందులోనూ పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అని చెప్పుకునే చోట ఐదు సంవత్సరాల కోసం ఎన్నికైన ఒక ప్రభుత్వం అప్పు చేస్తున్నదంటే, ఆ అప్పు అసలు, వడ్డీ తీర్చవలసిన బాధ్యత ఆ సమాజానిది అవుతుంది. అప్పు చేసిన ప్రభుత్వం, ఆ ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు దిగిపోవచ్చు, కొత్త ప్రభుత్వం, కొత్త వ్యక్తులు గద్దెనెక్కవచ్చు. అప్పుడు అప్పు తీర్చే బాధ్యత ఆ కొత్తవారిదవుతుంది. ఒక ప్రభుత్వం అనాలోచితంగా, లేదా దురుద్దేశపూర్వకంగా, లేదా తన ప్రాబల్యం పెంచుకునేలా పప్పు పుట్నాల్లా ఖర్చు పెట్టుకునేందుకు, తన వాగాడంబరాన్ని ప్రదర్శించుకునేందుకు చేసిన అప్పును ఆ తర్వాతి తరాల సమాజం, ఆ తర్వాత అధికారానికి వచ్చే ప్రభుత్వం ఎందుకు భరించాలన్నది కీలకమైన ప్రశ్న. లేదా రాచరికం లాగ ఎల్లకాలానికీ మేమే, మా పుత్ర పౌత్రులే ప్రభుత్వంలో ఉంటారు అనుకున్నప్పటికీ, అప్పుల అసలు, వడ్డీలు చెల్లించేది ఆ రాజకుటుంబం కాదు, ఆరుగాలం కష్టపడే ప్రజానీకం చెమటతో, నెత్తురుతో సృష్టించిన సంపదల మీద

విధించే పన్ను నుంచే ఆ అసలు, వడ్డీలు చెల్లిస్తారు. కనుక ఇది అప్పు తేవడానికి ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో ఉన్న పరపతి వ్యవహారం కాదు, ఆ వ్యక్తి, ఆ కుటుంబ ఇష్టాయిష్టాల సమస్య కాదు, ఇది సామాజిక సమస్య. భవిష్యత్తు సమస్య.

ఈ రుణభారపు సమస్యనే మరి కాస్త ముందుకు కొనసాగిస్తే, ఆ రుణ నిధులను ఆదాయవనరుల మీద వెచ్చించినప్పుడు, అది కూడ అసలు వాయిదా, వడ్డీ చెల్లింపుల కన్న ఎక్కువ ఆదాయాన్ని సంపాదించగలిగే వనరుల మీద జాగ్రత్తగా వెచ్చించినప్పుడు ఆ రుణం తేవడానికి కొంతైనా సమర్థనీయత ఉండవచ్చు. కాని రుణం తెచ్చిన డబ్బును ఏ ఆదాయ వనరు కల్పన మీద ఖర్చు పెడుతున్నారో చెప్పగల ప్రత్యేక విడివిడి గణాంకాలు ప్రభుత్వం దగ్గర లేవు. ఒక పద్దు కింద వచ్చిన, కేటాయించిన నిధులను మరొక పద్దు కింద ఖర్చుపెట్టడం, అటూ ఇటూ మార్చడం, కొన్ని చోట్ల అసలు కేటాయించినంత ఖర్చు పెట్టకపోవడం, కొన్ని చోట్ల కేటాయించినదానికన్న ఎక్కువ ఖర్చు పెట్టడం, విపరీతమైన దుబారా, లంచగొండితనం, కేటాయించిన నిధుల్లో అత్యధిక భాగం కాంట్రాక్టర్లకు, మధ్య దళారీలకు మాత్రమే దక్కడం వంటి ఎన్నో అక్రమాలు ప్రభుత్వ వ్యయంలో సాధారణంగా జరుగుతున్నవే.

అప్పు తెచ్చిన నిధుల నుంచి అయినా, సొంతంగా సేకరించిన నిధుల నుంచి అయినా తప్పనిసరిగా ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం, మౌలిక సౌకర్యాల కల్పన, వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఉద్యోగకల్పన, మానవాభివృద్ధి సూచికల మెరుగుదల వంటి ఉపయోగకర రంగాల మీద ఖర్చుపెట్టవలసి ఉంటుంది. ఈ అన్ని రంగాలలో కేవలం మౌలిక సౌకర్యాల కల్పన, అది కూడ నీటి పారుదల సౌకర్యాల కల్పన, రోడ్ల నిర్మాణం మాత్రమే ఈ ప్రభుత్వానికి ప్రాధాన్య రంగాలుగా కనబడుతున్నాయి. ఈ రెండు ఉప రంగాలు కూడ వేల కోట్ల రూపాయలు ఖర్చయ్యేవి. తప్పనిసరిగా కాంట్రాక్టర్ల ద్వారా అమలు జరిపేవి. అంటే ఎక్కువ దుబారాకు, లంచగొండితనానికి, ముడుపులకు వీలు కల్పించేవి. బహుశా అందువల్లనే ఇవి ప్రాధాన్యతా రంగాలు అవుతున్నాయేమో కూడ.

ఒక ఆధునిక సంక్షేమ రాజ్యంలో తప్పనిసరిగా అత్యంత ప్రాధాన్యతా రంగంగా ఉండవలసిన విద్యాభివృద్ధికి ఈ ప్రభుత్వ ప్రణాళికల్లో, కేటాయింపుల్లో ఎంత చిన్నచూపు, నిర్లక్ష్యం దొరుకుతున్నదో చూస్తే ఈ ప్రభుత్వ ధోరణి స్పష్టంగా అర్థమవుతుంది. తక్షణ వోట్లుగా మార్చుకోవడానికి వీలైన తాయిలంగా ఉన్న సంక్షేమ పథకాలకేమో చేతికి ఎముక లేనట్టు వేలకోట్ల రూపాయలు కేటాయిస్తున్న, ఖర్చుపెడుతున్న ఈ ప్రభుత్వం, అంత తక్షణమే ఫలితాలు చూపని, సమాజానికి అత్యవసరమైన విద్యా రంగానికి కేటాయిస్తున్న, ఖర్చుపెడుతున్న నిధులు చూస్తే ఈ ప్రభుత్వపు అసలు ఉద్దేశాలేమిటో స్పష్టమవుతాయి.

అక్షరాస్యతలో దేశంలోని ఇరవై తొమ్మిది రాష్ట్రాలలో అట్టడుగున ఇరవై ఎనిమిదో స్థానంలో ఉన్న తెలంగాణ ప్రాథమిక విద్య మీద కేంద్రీకరించి ఇబ్బడి ముబ్బడిగా నిధులు కేటాయించి, ప్రత్యేక శ్రద్ధతో కార్యక్రమాలు రూపొందించి అమలు చేయవలసి ఉండగా, పాఠశాల విద్యకు గత సంవత్సరం కేటాయించిన నిధులు రు. 10,830 కోట్లు కాగా, ఈ సంవత్సరం కేటాయింపులు రు. 9,908 కోట్లు. ఉన్నత విద్యకు గత సంవత్సరం కేటాయించినది రు. 2,025 కోట్లు కాగా, ఈ సంవత్సరం కేటాయించినది రు. 1,916 కోట్లు, సాంకేతిక విద్యకు గత సంవత్సరం కేటాయించినది రు. 422 కోట్లు కాగా, ఈ సంవత్సరం కేటాయించినది రు. 394 కోట్లు. అంటే విద్యారంగం రానున్న ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి చెందకపోవడం మాత్రమే కాదు, ఇప్పుడున్నదానికంటే ఇంకా దిగజారిపోతుంది. ఈ సంవత్సరం మాత్రమే కాదు, 2014-15 బడ్జెట్ నుంచీ వరుసగా మొత్తం బడ్జెట్ లో విద్యారంగ కేటాయింపులు నిష్పత్తిగా చూసినప్పుడు ఏటేటా తగ్గుతూ వస్తున్నాయి. విద్యారంగపు కేటాయింపులు వచ్చే సంవత్సరం ఎంత మాత్రం పెరగడం లేదంటే విద్యారంగంలో అధ్యాపకుల, ఉపాధ్యాయుల ఖాళీలను వచ్చే సంవత్సరం కూడ భర్తీ చేయబోవడం లేదని అర్థం. అంటే పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య దాకా వచ్చే సంవత్సరం మరింతగా నిధుల లేమితో, సౌకర్యాల లేమితో, ఉపాధ్యాయుల లేమితో కునారిల్లనున్నది. ఒకవైపు విద్యారంగాన్ని ఇలా నిర్లక్ష్యం చేస్తూ, కొత్తగా వచ్చిన విద్యా మంత్రి వచ్చే విద్యాసంవత్సరం 119 గురుకుల పాఠశాలలను తెరవబోతున్నాం అని అదేదో ఘనకార్యమన్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలుగా ఊదర గొడుతున్న గురుకుల పాఠశాలలన్నీ కలిపి విద్యార్థుల సంఖ్య ఐదు లక్షల లోపు. రాష్ట్రంలో మొత్తం పాఠశాల విద్యార్థుల సంఖ్య అరవై రెండు లక్షలు. అంటే ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పలన్నీ కేవలం ఎనిమిది శాతానికి తక్కువవి మాత్రమే. తొంబై రెండు శాతాన్ని జీవచ్ఛవంలా మార్చి, ఎనిమిది శాతాన్ని అభివృద్ధి చేస్తున్నామని అదే ఘనతగా ప్రకటించుకోవడం ఈ ప్రభుత్వం చేస్తున్న పని.

అలాగే ఈ బడ్జెట్ సందర్భంగా మిషన్ భగీరథకు యూజర్ చార్జీలు వసూలు చేస్తామని, వ్యవసాయ రుణమాఫీ విడతల్లోనే తప్ప ఒక్కసారిగా ఇవ్వబోమని, రైతు బంధు పథకంలో కౌలుదార్లను ఎంతమాత్రం గుర్తించబోమని ప్రభుత్వం కుండబద్దలు కొట్టినట్టు ప్రకటించింది. ఇంటింటికీ మంచినీళ్లు ఇస్తామని నాలుగు సంవత్సరాలుగా పలికిన ప్రగల్భాలు చివరికి యూజర్ చార్జీల పేరుతో ప్రతి ఇంటి మీద తాగు నీటి పన్నుగా పరిణమించనున్నాయి. వ్యవసాయ రుణమాఫీని విడతల్లో ఇవ్వడమంటే వడ్డీ రూపంలో బ్యాంకులకు ప్రజాధనాన్ని దోచిపెట్టడం మినహా రైతులకు వాస్తవంగా దక్కేదేమీ లేదు. రైతు బంధు పథకాన్ని పంట పెట్టుబడి పథకంగా తెచ్చామని ఇన్నాళ్లుగా చెపుతున్న గొప్పలు అబద్ధమని, ఇది పండించేవాళ్లకు ఉత్పాదకాల సహాయం పథకం కాదని, కేవలం పట్టా ఉన్నవారికి ముడుపు ఇచ్చే పథకం మాత్రమేనని, వాస్తవ సాగుదార్లయిన కౌలుదార్లను మినహాయించడం ద్వారా ప్రభుత్వం స్పష్టంగా ప్రకటిస్తున్నది.

ఇలా ఒక్కొక్క పద్దునూ, పథకాన్నీ, కేటాయింపునూ పరిశీలిస్తూ వెళితే, ఈ బడ్జెట్ తెలంగాణ పాలకులు తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం తయారు చేసింది కాదని, అసలు ఉద్దేశాలు తమ ఆశ్రితులకు, కాంట్రాక్టర్లకు, దళారీలకు దోచిపెట్టడమేనని అర్థమవుతుంది. ఆ అసలు ఉద్దేశాన్ని మరుగుపరచడానికే సంక్షేమ బడ్జెట్ అనీ, సంక్షేమ పథకాలకు కేటాయింపులనీ ప్రజలకళ్లలో దుమ్ము కొట్టే ప్రయత్నం జరుగుతున్నది.

(నవతెలంగాణ దినపత్రికలో నా శీర్షిక 'తెలంగాణార్థం' లో రాసిన వ్యాసం నుంచి కొన్ని భాగాలు ఇక్కడ పునరుక్తమయ్యాయి)

(రచయిత వీక్షణం సంపాదకుడు) వీ

యజ్ఞాలు, యాగాలు ఎవరి కోసం?

***యజ్ఞాలు, యాగాల వల్ల ప్రజలకు ఏ రకంగానూ ప్రయోజనం ఉండదనీ, అవి కేవలం పాలకుల భావజాలాన్ని చాటుకోవడానికి మాత్రమే ఉపయోగపడతాయనీ అంటున్నారు* వంగాల సంపత్ రెడ్డి**

తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఎర్రవల్లిలోని తన ఫాం హౌస్‌లో జనవరి 21 నుండి ఐదు రోజులు మహారుద్ర సహిత చండీ మహాయాగం నిర్వహించారు. మూడు సంవత్సరాల క్రితం అయుత చండీయాగాన్ని కూడా ఇక్కడే నిర్వహించారు.

రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దిగ్విజయంగా ముందుకు సాగాలని, రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని, ప్రజలు క్షేమంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, వ్యవసాయం సుభిక్షంగా ఉండాలని యాగ రుత్వికులు పూజలు చేసారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. దైవభక్తి గలవారు ఎవరైనా ప్రజల కోసం కెసిఆర్ ఎంతటి మహత్కార్యం నిర్వహిస్తున్నారోనని సంతోషిస్తారు.

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ప్రపంచ బ్యాంకు ప్రాయోజిత అభివృద్ధి. ఈ అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడదు. ఎందుకంటే ప్రపంచ బ్యాంకు ప్రజల అభివృద్ధి గురించి ఎప్పుడు మాట్లాడదు. అది కేవలం బహుళజాతి కంపెనీల అభివృద్ధి, కార్పొరేట్ కంపెనీల అభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడుతుంది. రూపంలో ప్రజల అభివృద్ధి గురించి మాట్లాడిందంటే సారాంశంలో బహుళజాతీ కంపెనీల అభివృద్ధి గురించి మాట్లాడడమే. రాష్ట్రంలో చేసట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలు దిగ్విజయంగా ముందుకు సాగాలని కోరుకోవడమంటే ప్రస్తుత స్థితిలో ప్రపంచ బ్యాంకు విధానాలను ప్రజలు వ్యతిరేకించకుండా ఉండాలని కోరుకోవడమే. సకల రంగాలు అభివృద్ధి చెందడం అంటే సకల రంగాలు ప్రైవేటీకరణ దిశగా ముందుకు సాగాలని కోరురోవడమే. వ్యవసాయం సుభిక్షంగా ఉండడం మంటే కార్పొరేట్ వ్యవసాయం సుభిక్షంగా ఉండాలని కోరుకోవడమే.

పాలకవర్గాలు తాము చేసే ప్రతి యాగం లోక కళ్యాణం కోసమేనని అంటారు. ప్రజల క్షేమం కోసం తాము చేస్తున్న యాగాల గురించి గొప్పగా ప్రచారం చేసుకుంటారు. నిజానికి ఏ యాగం లోకకళ్యాణం కోసం మాత్రం కాదు. కేవలం తమ బలహీనతలను కప్పిపుచ్చు కోవడానికి, ప్రజలలో తలెత్తిన అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి మాత్రమే పాలక వర్గాలు యాగాలు చేస్తాయి. యాగాలు లోక కళ్యాణం కోసమే అయితే వైదిక ధర్మాన్ని నిరసించి ప్రజలు బౌద్ధాన్ని ఎందుకు ఆదిరించారు? జైనాన్ని ఎందుకు ఆదరించారు? మౌర్యుల తరువాత అధికారంలోకి వచ్చిన శుంగులు, కణ్వులు, గుప్తులు, అనేక మంది రాజపుత్రులు, శాతావాహనులు, పల్లవులు, చోళులు, చాళుక్యులు రెడ్డిరాజులు ఎవరైతేనేం ఎన్ని యాగాలు చేసారని. అయినా ఎందుకు వారు తమ రాజ్యాలు కోల్పోయారో, వారి వంశాలు ఎందుకు నాశనం అయ్యాయో చెప్పగలరా?

పోనీ, ఏ యాగం ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించింది? నిరుద్యోగాన్ని నిర్మూలించిందా? నిరక్షరాస్యతను తొలగించిందా? ఉపాధిని పెంచిందా? సరియైన ఆలోచనలను పెంపొందించిందా? మూఢాచారాలను రూపుమాపిందా?

జరిగేదంతా మంచికని అనుకోవడం, మంచి జరుగకపోతే మన కర్మ అని అనుకునే దేశంలో భూస్వామ్య ఆధిపత్య భావజాలాన్ని కాపాడడానికి, అసమానతలనే పెంచిపోషించడానికి, కొంతమంది చేతులలోనే సంపద కేంద్రీకృతం కావడానికి, కొంతమంది చేతులలోనే అధికారం నిలబెట్టుకోవడానికి, ప్రజలు తమ అసంతృప్తులను బయటపెట్టకుండా ఉండటానికి యాగాలు ఉపయోగపడుతాయే తప్ప మరి దేనికి పనికిరావు.

సమాజం బాగుకోరే వారు ఎవరైనా ప్రజల జీవితం బాగుపడాటానికి ఏం చేయాలని ఆలోచిస్తారు. కాని పాలకులు తమ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ప్రజలలో మూఢ విశ్వాసాలను పెంచటానికి యాగాలు చేస్తున్నారు.

పాలక వర్గాలు మిగులు ఉత్పత్తిని సొంతం చేసుకోవడానికి రాజ్యాన్ని, రాజ్యాంగ యంత్రాన్ని, మతాన్ని, దేవుడిని సృష్టించారు.

ఇటీవల ముఖ్యమంత్రి యాగం తన వ్యక్తిగతమని అన్నాడు. తెలంగాణను పాలించే వ్యక్తికి వ్యక్తిగత అంశాలు ఉంటాయా? యాగాన్ని కెసిఆర్ చేసారు అంటారా? తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ చేసారు అంటారా? కెసిఆర్ వ్యక్తిగత హోదాలో యాగాన్ని చేసుకుంటే ప్రింట్ మీడియా మొదటి పేజీలలోనే ప్రముఖంగా ఎందుకు కథనాలు రాసింది? ఎలక్ట్రానిక్ మీడియా విస్తృతంగా యాగాన్ని ఎందుకు ప్రసారం చేసింది? వ్యక్తిగతమైతే మీడియాను ఎవనైనా అనుమతిస్తారా? అనుమతించారు అంటే వ్యక్తిగతం కాదన్నమాగే గదా. రాజ్యాంగ పదవిలో ఉన్నవాళ్లు ఏ హోదాలో ఈ యాగానికి హాజరయ్యారు? వ్యక్తిగత హోదాలో అయితే వాళ్లు తమ భద్రతను, తమ ప్రభుత్వ వాహనాలను వాడుకోకుండా యాగానికి రావాలి కదా. కాని అలా జరిగిందా? అలా జరుగలేదు అంటే వ్యక్తిగత హోదాలో వారు యాగంలో పాలుపంచుకో లేదన్నా మాటే గదా. అంటే అధికార దుర్వినియోగం జరిగినట్టే కదా. అధికార దుర్వినియోగం జరిగితే సంబంధిత బాధ్యులపై. చర్యలు తీసుకోవాలి కదా మరి, తీసుకున్నారా? లేదు కదా. ముఖ్యమంత్రి వ్యక్తిగత హోదాలో యాగాన్ని చేస్తే, యాగం జరిగినన్ని రోజులు పాలన ఆగిపోయినట్టే కదా. పాలించడానికి ప్రజలు అధికారాన్ని ఇస్తే పాలనను పక్కన పెట్టి యాగాలు చేయడం లోక కళ్యాణమవుతదా?

భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడనే భావన మీద ఏర్పడిన జ్యోతిష్యం ఎలా అశాస్త్రీయమో, సూర్యుడు ఇంకా ఒక గ్రహమేనని వక్కాణించి చెప్పడం ఎంత అబద్ధమో లోక కళ్యాణ కోసం యాగాలు అని చెప్పడం అంతే అబద్ధం. నేతి బీరలో నెయ్యి ఎంత ఉంటుందో యాగ ఫలితం కూడా అంతే ఉంటుంది.

కొనసాగుతున్న కుల హత్యల పరంపర

ఆధునిక సమాజంలో నేటికీ కులం, మతం పేరుతో ఎంతో మంది అమాయక ప్రజలు బలవుతున్నారనీ, కులాంతర వివాహాలను ప్రోత్సహించి, వారికి రక్షణగా నిలవాల్సిన అవసరం చాలా ఉందనీ అంటున్నారు డా. లక్ష్మణ్ గడ్డం

కులం ఉన్మాదుల చేతిలో మారణాయుధమైంది. కులాంతర వివాహాలు చేసుకున్న వారు అర్ధాంతరంగా రాలిపోతున్నారు. నవయుగ శకానికి చెందిన యువతీ యువకులు కులాల కంచుకోటలను ఛేదించి ఒక్కటవుతున్నారు. కాని కాపాడుకునే వ్యవస్థ లేక పోవడం వలన చివరికి ఓడిపోతున్నారు. ఉన్మాదుల అగ్రకుల, బ్రాహ్మణీయ, భూస్వామ్య, పితృస్వామ్య ఆదిపత్య దుర్మార్గాలకు బలవతున్నారు. ఇది అత్యంత విషాదకరమైన పరిణామం. కొంత మంది ఒక్కటి కాక ముందే చెట్లకు వేలాడుతున్న జంటలెన్నో!

మెదక్ జిల్లా, రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన పర్వీనా(19) ఝూన్సీ, లింగాపూర్ గ్రామానికి చెందిన నల్ల బాలేష్ (21) గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు. మతాలు వేరైనా తాము ఒక్కటై జీవితాంతం బతుకుదామనుకున్నారు. విషయం తెల్సిన బాలేష్ కుటుంబ సభ్యులు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో కలిసి జీవించ లేకున్న కలిసి చావాలనుకున్నారు. ఒకరోజు ముందే ఇంట్లో నుంచి వచ్చిన వీరు రాత్రంతా ఝూన్సీ లింగాపూర్ శివారులోని అటవీ ప్రాంతం లో గడిపి ఫిబ్రవరి 16న ఒకే చెట్టుకు ఒకే చున్నీతో ఉరి వేసుకుని తనువు చాలించారు. పెద్దలకు మాత్రం కులం, సజీవంగా మనుగడ సాగించాలి. కాని తమ పిల్లలు ప్రాణాలు కోల్పోయినా పర్వాలేదు. అటువంటి వారికి కులాలు, మతాలు దాటి ప్రేమించుకున్న వారి శవాల కాళ్లు ముట్టుకోవడానికి గాని, కన్నీరుపెట్టడానికి అర్హత లేదు.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన పద్మశాలి కులానికి చెందిన అయ్యోరు లక్ష్మణ్, యాదవ కులస్థురాలు పిండి అనురాధలు ప్రేమించుకున్నారు. 2018 డిసెంబర్ 3న హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకున్నారు. అనంతరం డిసెంబర్ 25న స్వగ్రామం చేరుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మాకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసి లక్ష్మణ్ ఇంటికి వెళ్లారు. అదే రోజు రాత్రి 7.30 గంటలకు అనురాధ తండ్రి సత్తయ్య, తల్లి లక్ష్మి అన్న మహేష్‌లు లక్ష్మణ్ ఇంట్లో చొరబడి అనురాధను జుట్టుపట్టి బయటకు లాగి కొట్టుకుంటూ ఇంటికి తీసుకొనిపోయారు. దెబ్బలు తాకిడికి అనురాధ సొమ్మసిల్లి పోయింది. నీళ్లు చల్లి లేపారు. లక్ష్మణ్‌ను మర్చిపొమ్మన్నారు. వారిస్తున్న వినలేదు. తర్వాత తండ్రి ఒక బైకుపై, మహేష్ అతని స్నేహితుడి మధ్యలో అనురాధను కూర్చోబెట్టుకుని మరో బైక్‌లో జిల్లా పరిధి దాటి నిర్మల్ జిల్లా మల్లాపూర్ గ్రామ శివారుకు చేరుకున్నారు. నక్కలింగమూర్తి గుట్టపైకి తీసుకుని పోయి మళ్లీ విపరితంగా కొట్టారు. లక్ష్మణ్‌ను మరిచి పోవాల్సిందే అన్నారు. ససేమిరా అంది అనురాధ. జీవితాంతం లక్ష్మణ్‌తోనే ఉంటానని తేల్చి చెప్పింది. అన్న, నాన్నలు కోపంతో ఊగిపోయారు. విషయాలు అన్ని విన్న తల్లి దాన్ని చంపేయండని ఆదేశాలిచ్చింది. తండ్రి కూతురు గొంతు నులిమి చంపేశారు. మహేష్ కట్టెలు పేర్చి చెల్లిని కిరాతకంగా కాల్చేశాడు. శవం పూర్తిగా కాలే వరకు కావలి ఉండి మంటలు ఆరాక బూడిదను, అస్తికలను పక్కనే ఉన్న వ్యవసాయ కాలువలో పారేశాడు. ఘటనా స్థలాన్ని పేడతో అలికేశాడు. ఇలా జరుగుతుందని ముందే ఊహించిన అనురాధ ఇంటికెళ్లే ముందే పోలీసులకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేస్తే పోలీసులు రక్షణ కల్పించ లేదు. రాజకీయ నాయకులకు మాత్రమే సలాంలు కొడుతారు కాని సామాన్య ప్రజల ప్రాణాలు లెక్కలేదు వారికి. మరోవైపు తనకు ప్రాణహాని ఉందంటూ అనురాధ పెళ్లైన మరుసటిరోజు ఓ వీడియో స్నేహితులకు వాట్సాప్ చేసింది. పోలీసులు, స్నేహితులు, సమాజం అనురాధను కాపాడలేక పోయింది.

సామాజికంగా కులం కంటే లక్ష్మణ్ కులంపై మెట్టుకులమే. అయినప్పటికీ అనురాధ కుటుంబం ఆ వివాహాన్ని అంగీకరించలేదు. కన్న కూతురు బూడిదలో పోయిన పరువును సమతుల్యం చేయాలను కున్నారు. కులాన్ని, దాని పరిధులను రక్షించుకోవడం మీదున్న తాపత్రయం కన్నపిల్లలపై ఎందుకు చూపలేకపోతున్నారు. కులాన్ని ధ్వంసం చేయకుండా కులోన్మాద హత్యలు ఆగిపోవు. కుల ధ్వంస రచనకు రాజ్యం పూనుకోవాలి. కులాంతర వివాహాలు ప్రభుత్వమే నిర్వహించి కాపురాలను, ప్రాణాలను నిలబెట్టాలి.

పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంథని మధుకర్ మున్నూరు

పాలకులు చేస్తున్న యాగాల వల్ల సమాజంలో మూఢాచారాలను పెంచి పోషించబడుతాయి. అశాస్త్రీయ భావాలు పెరుగుతాయి. ఈ దేశంలో వెనుకబాటు పట్టిన మనుధర్మం తిరిగి బుసలు కొట్టడానికి యాగాలు ఉపయోగపడుతాయి.

యాగాల వల్ల వర్ణాశ్రమ ధర్మం తిరిగి వర్ధిల్లుతుంది. కులవ్యవస్థ బలపడుతుంది. సమిష్టితత్వం దెబ్బతింటుంది. అసమానతలు పెంచి పోషింపబడుతాయి.

కొద్దిమంది చేతులలోనే సంపద కేంద్రీకృతం కావడానికి ఉపమోగపడుతాయి. ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కావడానికి దోహదం చేస్తాయి. కర్మ సిద్ధాంతం తిరిగి ఉనికి లోకి వస్తుంది. కర్మసిద్ధాంత ప్రచారం నిజమని నమ్మే స్థితి మళ్లీ వస్తుంది.

తమ గొప్పతనాన్ని చెప్పుకోవడానికి పాలకవర్గాలు చేసే యాగాలవల్ల ప్రజలకు ఎటువంటి మేలు జరుగదు. యాగాలను వ్యతిరేకించి శాస్త్రీయ భావాలను ప్రచారం చేసే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం, యాగా లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడం బుద్ధిజీవుల పని.

(రచయిత అధ్యాపకుడు) వీ

కాపు కులానికి చెందిన శిరీషల ప్రేమ విషాదం, మాల సామాజిక వర్గం ప్రణయ్ కోమటి కులానికి చెందిన అద్భుత ప్రేమ వివాహ విషాదం, భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం లింగరాజు పల్లెకు చెందిన చాకలి నరేష్ బలమైన రెడ్డి కులానికి చెందిన స్వాతి ప్రేమ వివాహం విషాదం మరిచి పోక ముందే 2019 ఫిబ్రవరి 10న జనగాం జిల్లా గూడూరులో మరో విషాదం జరగడం సమాజంలో కులోన్మాదం పెట్రేగి పోతుందని, సమాజాన్ని నిలువునా చీలుస్తుందనే సంకేతాలు వెలువడుతున్నాయి.

వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన మాదిగ కులస్థురాలు కందిక కోమల భర్త చనిపోవడంతో కారుణ్య ప్రాతిపదికన ప్రభుత్వం జనగాం జిల్లా పాలకుర్తి మండలం గూడూరు హైస్కూల్‌లో అటెండర్‌గా ఉద్యోగం ఇచ్చింది. దీంతో కోమల ఇద్దరు కొడుకులు సుచరణ్, సువిక్షణ్, కూతురు సుస్మతతో గూడూరు చేరుకుని పద్మశాలి కులానికి చెందిన మాచర్ల రాజయ్య ఇంటి ఎదురుగా ఉన్న ఇంట్లోకి కిరాయికి దిగింది. ఈ క్రమంలో మాచర్ల రాజయ్య పెద్ద కుమారుడు రమేష్ బి.టెక్ చదువుతుండగా ఇంటర్ చదువుతున్న సుస్మతను ప్రేమించాడు. వీరి ప్రేమ వ్యవహారం ఆరు సంవత్సరాలుగా కొనసాగింది. తర్వాత రమేష్ హైదరాబాద్‌లో ఎం.టెక్ చేస్తుండగా వరంగల్‌లో సుస్మత హాస్పిటల్ అనుబంధ హాస్టల్‌లోనే ఉండేది. రమేష్ కూడా హైదరాబాద్‌లోనే ప్రైవేట్ సోలార్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ స్నేహితుల వద్ద ఉంటూ తరచుగా సుస్మతను హాస్పిటల్‌కి వచ్చి కలిసేవాడు.

ఈ క్రమంలో ఇరువురు ఇరు కుటుంబాలకు చెప్పకుండానే స్నేహితుల సహాయంతో బల్కంపేట ఆర్య సమాజ్‌లో 2016 నవంబర్ 4న పెళ్లి చేసుకున్నారు. ఎర్రగడ్డలో రూమ్ తీసుకుని కాపురం పెట్టారు. అయినప్పటికీ ఈ సమాచారం ఊరంతా పాకిపోయింది. రమేష్ తల్లిదండ్రులు తెలియనట్లు నటిస్తూ రమేష్‌ను పిలిచి వేరే సంబంధం కాయంచేసి కట్న కానుకలు కూడా మాట్లాడుతున్నారు. నిశ్చితార్థం రోజు దగ్గరపడుతుండడంతో మానసిక ఒత్తిడికి లోనైన రమేష్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. ఆసుపత్రికి తరలించగా కోలుకున్నాడు. కుటుంబీకులు నిలదీయగా అసలు విషయాలు వెల్లడించాడు. సుస్మతను పెళ్లి చేసుకున్నానని, భార్య రెండు నెలల గర్భవతి అని వెల్లడించాడు. నిర్ఘాంతపోయిన కుటుంబీకులు గట్టి పథకం రూపొందించి ఏది ఏమైనా గర్భస్రావం చేయించాలని, అమ్మాయిని వదిలిపెట్టాలని గట్టిగా నూరిపోశారు. దీంతో పూర్తిగా మారిపోయిన రమేష్ హైదరాబాద్ వచ్చి సుస్మతను వేదించంచడం మొదలు పెట్టాడు. ఒకవైపు బాబాయ్, మేనమామలు, బావల ఫోన్ల ఒత్తిడి, మేం చెప్పింది చేశావా లేదా అని ఆరాతీయడం, చివరికి రమేష్ కూల్‌డ్రింక్‌లో అబార్షన్‌కు సంబంధించిన మందులు కలిపి తాగించి, సుస్మత మత్తులోకి చేరుకున్న తర్వాత నేను గుర్తుతెలియని ప్రాంతానికి వెళ్లిపోయి చచ్చిపోతానని లెటర్ రాసి వెళ్లిపోయాడు. ఎక్కడికి వెళ్లలేదు, బాబాయి పుల్లయ్య దగ్గరికి వెళ్లిపోయాడు. తెల్లవారు జామున స్పృహలోకి వచ్చేసరికి రక్తస్రావం, అబార్షన్ అయింది. రాసిపెట్టిన లెటర్ కనబడింది. ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. లెటర్ తీసుకుని పోలీస్ స్టేషన్‌లో ఇచ్చింది. పోలీసులు మాత్రం రమేష్ ఎక్కడికి వెళ్లడు, చావడు, నీవు తక్కువ కులం దానివి కనుక వదిలించుకోవడానికి ఇదంతా చేసుంటాడు. వాళ్ల బాబాయి పుల్లయ్య దగ్గరే ఉండి ఉంటాడు కనుక సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమన్నారు. తల్లి నివసిస్తున్న కరుణాపురం చేరుకుని మమునూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాని వాళ్లు పాలకుర్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లమన్నారు. అక్కడికెళ్లి పోలీసులను కలిసింది. పోలీసులు రమేష్‌ను కూడా పిలిపించారు. నిజంగానే పుల్లయ్య దగ్గర తలదాచుకున్నాడు. ఎస్ఐ, సిఐలు భర్తపైన ఫిర్యాదు చేయమన్నారు. కాని సుస్మత నా భర్త మంచోడే, తనని ప్రభావితం చేస్తున్న పుల్లయ్య, రాజవ్వ, నవీన్, నరేష్, సుమన్‌లపై చర్య తీసుకోవాలని కోరింది. ఆ పని మేం చేయలేమని పోలీసులు కరాఖండిగా చెప్పారు. పైగా ఇరు కుటుంబాల వాళ్లు కలిసి మాట్లాడుకోండని సలహా ఇచ్చారు.

ఇరు వర్గాల కుల పెద్దలందరూ కలిసి కుల పంచాయితీ ఏర్పాటు చేసుకున్నారు. పుల్లయ్య మాత్రం ఎన్ని డబ్బులు కావాలో అడగండి కాని, అమ్మాయిని తోలుకొమ్మని నిర్ధారణగా చెప్పాడు. నాకు నా భర్తే కావాలని సుస్మత గట్టిగా పట్టుబట్టింది. ఎట్టకేలకు రమేష్ సుస్మతలు కలిసి జీవించడానికి ఒప్పందం జరిగింది. తర్వాత ఇద్దరు కలిసి స్టేషన్ ఘన్‌పూర్‌లో హైదరాబాద్‌కు రైలు ఎక్కారు. కాని రమేష్‌కు ఫోన్లు వస్తూనే ఉన్నాయి. అవతలి నుంచి బోదచేస్తూనే ఉన్నారు. చివరికి ఇరువురు కాజీపేటలో దిగి స్టేషన్ బయటకు రాగానే రమేష్ పరుగులు తీసి సిద్ధంగా ఉన్న కారులో ఎక్కి వెళ్లిపోయాడు. సుస్మత కూడా ఆయనను పట్టుకోవడానికి పరుగెత్తే సరికి కాలు బెణికి కింద పడిపోయింది. ఏదో జరుగబోతుందని శంకించిన సుస్మత మేనమామ ప్రమోదు వీరికి తెలియకుండా వీరిని వెంబడించాడు. అనుకున్నట్లుగానే రమేష్ పారిపోగానే సుస్మతను తీసుకుని ఆ రాత్రి ఇళ్లు చేరుకున్నాడు.

మరుసటి రోజు గూడూరులోని రమేష్ ఇంటికి వెళ్లి ఓ రూంలో లోపలి నుంచి గడియపెట్టుకుంది. పుల్లయ్య, రాజయ్య పోలీసులను పిలిపించారు. సుస్మత ఎస్ఐతో మాట్లాడుతూ నా భర్త వస్తేనే బయటికి వస్తాను, లేకపోతే రానని గట్టిగా చెప్పింది. నా భర్తను కిడ్నాప్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. సాయంత్రం ఎస్ఐ తిరిగి వచ్చి ఇదిగో ఈ ఫోను ఎసిపిగారు చేస్తున్నారు. నీతో మాట్లాడ్తడంట అన్నాడు. ఆ ఫోను తీసుకోవడానికి తలుపు తెరిచిన సుస్మతను ఎస్ఐ చేయిపట్టి గట్టిగా బయటకి లాగాడు. వెంటనే రూమ్‌కు తాళం వేశాడు. ఫోన్‌లైన్‌లో ఎసిపి లేడు, ఎవరూ లేరు. సుస్మత బిత్తరపోయింది. అమాయకులను మోసం చేయడమే పోలీసుల ప్రవృత్తి.

మరుసటి రోజు హైదరాబాద్ చేరుకుని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌లో, మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎసిపి, డిసిపి, కలెక్టర్‌కు తనకు జరిగిన అన్యాయాన్ని వివరంగా రాసి ఇచ్చింది. వరంగల్ ఎంపి పసునూరి దయాకర్‌కు కూడా ఫిర్యాదు చేసింది. మళ్లీ ఎర్రబెల్లి దయాకర్ ఎంఎల్ఏను కలిసి కాళ్లమీద పడి నా భర్తను నా దగ్గరికి పంపించండని వేడుకున్నది.

చివరగా డిసిపి వెంకన్నను కలిసింది. డిసిపిగారు రమేష్‌ను అతని తల్లిదండ్రులను, బాబాయి పుల్లయ్యను పిలిపించి మాట్లాడాడు. అమ్మాయిని కాపురానికి తీసుకపోకపోతే అందరిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటానని గట్టిగా హెచ్చరించాడు. అందరూ వెనక్కి తగ్గి అమ్మాయి – అబ్బాయి కలిసి జీవించడానికి ఒప్పుకున్నారు. రమేష్ కూడా నేను చాలా తప్పు చేశానని ఒప్పుకున్నాడు. సుస్మతను వేదింపులకు గురి చేయనని, బాగానే చూసుకుంటానని రాసిచ్చి సుస్మతను తీసుకుని హైదరాబాద్ వెళ్లిపోయాడు. చాలా కాలం వరకు కాపురం సజావుగానే సాగుతుంది. కాని ఈ బాగుండడం పుల్లయ్య, రాజయ్యలకు అసలు గిట్టలేదు. రెగ్యులర్‌గా ఫోన్ల ద్వారా బ్రెయిన్‌వాష్ చేస్తూనే ఉన్నారు ఈలోగా సుస్మత మళ్లీ గర్భవతి అయింది. విషయం తెలిసిన సుస్మత తల్లి మొదటి అనుభవం దృష్టిలో పెట్టుకుని సుస్మతను కరుణాపురం తెచ్చుకుంది.

రమేష్ రోజూ ఫోన్లు చేయడం, మధ్యలో వచ్చిపోవడం జరుగుతూనే ఉంది. ఇరువురూ సంతోషంగానే ఉన్నారు. సుస్మృత పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. సంతోషించిన రమేష్ వెంటనే వచ్చి చూసి పోయాడు. బాబు తొట్టెల కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. దేవర్ష అని పేరు పెట్టుకున్నారు. దంపతులకు బియ్యం పోసి, బట్టలు, బంగారం, బైక్ పెట్టారు.

ఇదిలా ఉండగా 2019 జనవరి 30న సర్పంచ్ ఎన్నికల సందర్భంలో ఓటు వేయడానికి సుస్మృత బాబును తీసుకుని కరుణాపురం నుండి గూడూరుకు వచ్చింది. అంతకు ముందే తనకు, బాబుకు మాచర్ల ఇంటి పేరుతో ఆధార్ కార్డు, ఓటర్ కార్డు తీసుకొని ఓటర్‌గా నమోదు చేసుకుంది. కనుక ఓటర్ లిస్టులో మాచర్ల సుస్మృతగా నమోదయింది. కనుక ఓటు హక్కును వినియోగించుకున్నది. సుస్మృత బాబుతో ఊరికి రావడం, మాచర్ల ఇంటి పేరుతో ఓటు వేయడం పుల్లయ్యకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఒక మాదిగది మా వంశం మోస్తదా? పైగా మాకొక మాదిగ దాని కడుపులో పుట్టిన వంశోద్ధారకుని ఇస్తదా? ఈ పరిణామాన్ని భరించలేకపోయాడు. ఇదే నీ చివరి ఓటు అని బెదిరించాడు. ఎలాగైనా పీడ వదిలించుకోవాలని తల్లి కొడుకులనిద్దరిని హతమార్చాలనుకున్నారు పుల్లయ్య, రాజయ్యలు. పథకంలో భాగంగా రమేష్ మనసు మళ్లీ మార్చేశారు. ఊర్లో మా పరువు పోయింది. దాన్ని, దానికి పుట్టిన బాబును వదిలించుకొమ్మని గట్టిగా నూరిపోశారు. అనుకున్నట్లు గానే రమేష్ ఫిబ్రవరి 7న కరుణాపురం వచ్చి సుస్మృతను హైదరాబాద్ తీసుకెళతానన్నాడు. భయపడ్డ కుటింబీకులు పంపించలేదు. కోపంగా వెళ్లిపోయాడు. కాని సుస్మృతకు వరుసగా ఫోన్లు చేసి రమ్మని ఒత్తిడి చేశాడు. మనం కలిసి సంతోషంగా బాబుతో హైదరాబాద్‌లో బతుకుదామని నమ్మించాడు. నీవిపుడు రాకపోతే ఇక ఎప్పటికీ నిన్ను తీసుకెళ్లనని బెదిరించాడు. దీంతో భయపడిన సుస్మృత చావో బతుకో రమేష్‌తోనే తేల్చుకుంటానని ఇంట్లో చెప్పి ఫిబ్రవరి 9న హైదరాబాద్‌కు చేరుకున్నది. ఏం అనుమానం వచ్చిందో కాని పాలకుర్తి పోలీసులకు ఈ సమాచారం రాతపూర్వకంగా ఇవ్వమని మేనమామకు చెప్పి వెళ్లిపోయింది. భయపడిన కుటింబీకులు సుస్మృత పెద్దమ్మ కొడుకు ప్రకాశ్‌ను వెంట పంపించారు. సుస్మృత చేరుకున్న తర్వాత ప్రకాశ్‌ను వెనక్కి పంపించేశాడు రమేష్.. బాబును ఎత్తుకుని ముద్దాడాడు రమేష్. కొద్దిసేపటికి మేనమామ ప్రమోద్ సుస్మృతకు ఫోన్ చేస్తే బేకరిలో ఉన్నాను, బాబుకు పాలుపడుతున్నానని చెప్పింది. ఇది చివరి సంభాషణ. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. మళ్లీ రమేష్‌కు ఫోన్ చేస్తే భయం భయంగా మాట్లాడుతూ నేను ట్రాఫిక్‌లో ఉన్నానని చెప్పి కట్ చేశాడు.

తండ్రి, బాబాయ్‌లు ఇచ్చిన పథకం ప్రకారం భార్య, కొడుకు ఇద్దరిని అదే రోజు రాత్రి హత్య చేశాడు. కట్టుకున్న భార్య అని కాని, కన్న కొడుకు అని కాని కనికరం చూపలేదు. క్రూరంగా ప్రవర్తించాడు. శవాలను దహనం చేశాడు. మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలం కొండాపూర్‌లోని మాధవరెడ్డి బ్రిడ్జి సమీపంలోని ప్రభాకర్ ఎన్‌క్లేవ్ వందల ఎకరాలతో నిర్మానుష్యంగా ఉంది. జనవరి 30 నుంచి వేసుకున్న పథకం ఈ ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నాడు. మెయిన్ రోడ్డు నుండి ఈ ఎన్‌క్లేవ్‌లో 3 కిలోమీటర్ల లోపలికి శవాలను తీసుకెళ్లి కట్టెలు పేర్చి పెట్రోల్ పోసి కాల్చేశాడు. ఇది ఒక్కడు చేయగలిగే పనికాదు. తండ్రి రాజయ్య, బాబాయి పుల్లయ్య, మేనమామ మొగిలి, రాజులు, మేన బావలు నరేష్, నవీన్, సుమన్‌లు కాని, మరే ఇతరవ్యక్తుల సహకారం లేకుండా సాధ్యపడేదికాదు.

ఫిబ్రవరి 10న రమేష్ పథకం ప్రకారం పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయి కొడుకు, భార్యను తనొక్కడే హత్య చేసి, దహనం చేసినట్లు ఒప్పుకున్నాడు. రమేష్‌ను ఘట్‌కేసర్ పోలీసులకు అప్పచెప్పారు. కేసు విచారణ జరుగుతుంది. పాలకుర్తి పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న సుస్మృత కుటింబీకులు కన్నీరు మున్నీరయ్యారు. రమేష్‌తో పాటు ఆయనను అలా తయారు చేసిన వారినందరినీ శిక్షించాలని డిమాండ్ చేశారు. పాలకుర్తిలో తమకు న్యాయం చేయాలని ధర్నా నిర్వహించారు. హత్యకు ముందే రమేష్ తల్లిదండ్రులు ఇళ్లు వదిలి పారిపోయారు. పశువులను సైతం పక్క ఊరి బంధువుల ఇంటికి పంపించారు.

తల్లితో పాటు ఐదు నెలల పసికందు కూడా మంటల్లో కాలి బూడిద అయిందన్న విషయం తెలుసుకున్న బొల్లికుంట, గూడూరు గ్రామస్థులు, దళితులు సుస్మృత కుటుంబానికి అండగా నిలబడి ఉద్యమించారు. ఉద్యమాన్ని చాలా ముందుకు తీసుకెళ్లారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఏకమై రమేష్ ఇళ్లును జప్తు చేసుకున్నారు. తాళాలు పగులగొట్టి ఏ ఇంట్లోకైతే మాదిగదనే పేరుతో సుస్మృతకు ప్రవేశం నిరాకరించారో అదే ఇళ్లును సుస్మృత కుటింబీకులు ఆక్రమించుకున్నారు. తల్లి కొడుకుల అస్థికలు తీసుకొని అదే ఇంటి ముందు గోతి తీసి అందులో పాతిపెట్టి దానిపై సమాధికట్టారు. సమాది దగ్గర టెంటువేసి ఆందోళన నిర్వహిస్తు న్నారు. పౌరహక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి.

భారత సమాజంలో వేల ఏళ్లుగా అణచివేతకు గురికాబడ్డ వాళ్లకు నిరాకరించబడిన విద్య అందుబాటులోకి వచ్చిన తర్వాత చైతన్యం పెరిగింది. ప్రతిఘటనా పోరాటాల హక్కుల స్పృహ తోడయ్యింది. సమాజ పురోగమనానికి అదృశ్య ఆటంకాలను తొలగించ పూనుకొని సమాజంలోని వ్యక్తులందరూ సమానమని, సమానంగా గౌరవించ బడాలని నవతరం కోరుకుంటుంది. ఈ నూతన భావాలకు పాతతరం అడ్డుతగులుతుంది. మతతత్వ, భూస్వామ్య భావజాలం నిండిన రమేష్ తల్లిదండ్రులు తనని కుటుంబం నుంచి దూరం పెట్టి తమ్ముడి పెళ్లికి సైతం పిలవకుండా మానసిక ఒత్తిడికి గురిచేశారు. తక్కువ కులం దాన్ని చేసుకోవడం తప్పు అనే భావన కలిగించి మళ్లీ పాతతరం భావాల్లోకి లాక్కున్నారు. మరోవైపు సమాజ సంక్లిష్టత సుస్మృతను ఉక్కిరి బిక్కిరి చేసింది. సమాజంలో ఆడదానికి పెళ్లి ఒకేసారి జరుగుతుందని, ఒకే జీవితం ఒకే పెళ్లని, కట్టుకున్న వాడితో కడదాకా ఉండాలని, ఈ హద్దులు దాటితే సమాజం చిన్నచూపు చూస్తుందని భయపడింది. భర్తను వదిలేసి ఇంట్లో ఉంటే తన ఇద్దరు తమ్ముళ్ల పెళ్లిళ్లకు అడ్డమవుతానని, భర్త చనిపోయిన బాధలో ఉన్న తల్లికి మరింత భారమవుతానని తీవ్ర ఆవేదనకు గురైంది.

కట్టుబాట్లను ఛేదించి ఒకడుగు ముందుకు వేసి కులాంతర వివాహం చేసుకున్నాను కనుక దీన్ని నిలబెట్టాలన్న పట్టుదలతో కూడిన ఒత్తిడికి లోనైంది. ఒంటరి పోరుతో సమిధ అయింది. అందుకనే ఫిబ్రవరి 9న పుట్టినిల్లు గడప దాటిన తరువాత పాలకుర్తి పోలీసులకు చెప్పమని చెప్పిందంటే అభద్రతతోనే చెప్పినా చావు ధిక్కరించే సాహసం చేసింది. కాని అగ్రకుల భావజాలం వారిని బలితీసుకుంది. కాలిన ఎముకలు, కాలి మెట్టెలు చితిలోంచి మూటగట్టుకొచ్చాయి ప్రజా సంఘాలు. ఈ ఆనవాళ్లు, సాక్ష్యాలు హంతకులను, సూత్రదారులను బోనులో నిలబెడతాయా, శిక్ష వేయిస్తాయా చూడాల్సిందే. కుల రక్కసికి చితి పేరుస్తాయా ఆలోచించాల్సిందే. కుల రహిత సమాజ నిర్మాణ సవాలును ఆలోచనాపరుల ముందు నిలిపి వెళ్లిపోయింది సుస్మృత. ఇలా సుస్మృత బలికావచ్చు, ఇలాంచి సంఘటన మరొక్కటి జరగకుండా ఉండేందుకు సమాజం ముందుకు రావాలి.

(రచయిత అధ్యక్షులు, పౌరహక్కుల సంఘం) వీ

ఆంధ్రప్రదేశ్‌లో చుక్కల భూముల కబ్జా

దళితులకు, అట్టడుగు వర్గాల ప్రజలకు బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చిన భూములను ప్రభుత్వమే అక్రమంగా ఆక్రమిస్తూ ఆశ్రితులకు ఏ విధంగా కట్టబెడుతున్నదో వివరిస్తున్నారు **వై. వెంకటేశ్వరరావు**

దళిత, అట్టడుగు ప్రజలకు బ్రిటిష్ పాలకులు ఇచ్చిన భూములను రాజకీయ నాయకులు, వారి అండతో అనుచరులు, భూస్వాములు భూకబ్జాలకు పాల్పడుతున్నారు. అక్రమంగా ఆక్రమించిన భూమిని చేపల చెరువులుగా, రియలెస్టేట్‌గా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. భూమిలేని నిరుపేదలకు ఇవ్వాల్సిన ప్రభుత్వ భూములను నాయకులు అక్రమంగా ఎలా కాజేస్తున్నారో వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం ఉద్దేశం.

వినుకొండ మండలం, కొప్పుకొండలో మూడువందల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఆక్రమించి, చేపల చెరువులుగా మార్చిన ఎంఎల్ఎ మేనమామ ఇనిమెళ్ల వెంకటేశ్వర్లు అతని అనుచరులు చుక్కలు భూముల చట్టం ద్వారా ప్రభుత్వ భూములను చట్టబద్ధం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

వినుకొండ మండలం, కొప్పుకొండలో 1940లో నిమ్నజాతుల సొసైటీకి 40 ఎకరాలు, పేదలకు 150 ఎకరాలు బ్రిటిష్ పాలకులు కేటాయించారు. ఈ భూమిలో 17.80 య/సెం, జె.వి.ఎస్. ఆక్వాకల్చర్, శ్రీ రాజ్యలక్ష్మి ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలు 1980లో ముగ్గురి దగ్గర కొనుగోలు చేసి, రికార్డుల్లో ఎక్కించుకున్నారు. వాస్తవానికి ఈ భూములు అమ్మడాలు, కొనడాలు చట్టబద్ధంగా నిషేధం.

వినుకొండ ఎంఎల్ఎ జి.వి.యస్. ఆంజనేయులు మేనమామ ఇనిమెళ్ల వెంకటేశ్వర్లు మరికొందరు 17.80 సెంట్లు భూమిని 3 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి, చుట్టుపక్కల 300 ఎకరాలకు పైగా ఉన్న చుక్కల భూములు ఆక్రమించి, 25 చేపల చెరువులుగా చేసి, చుట్టుపక్కల ఉన్న దళితుల, పేద రైతుల భూములను కూడా ఆక్రమించారు. కొండల్లో నుంచి వచ్చే వర్షపు నీటిని పంటపొలాలకు, మంచినీటి చెరువులకు వెళ్లనీయకుండా మొత్తం నీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్నారు. ప్రశ్నిస్తున్న పేద రైతులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా వినుకొండకు కూతవేటు దూరంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపల చెరువులుగా మార్చితే ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు.

అంతేకాకుండా ఎం.పి. రాయపాటి కుటుంబం బొల్లాపల్లి మండలం, సరికొండపాలెంలో 680 ఎకరాలు దళితుల భూములు ఆక్రమించింది. బినామీ పేర్లతో ఐఎన్‌జీ వైశ్యాబ్యాంక్ నుండి 18 కోట్ల రూపాయలు భూముల అభివృద్ధి పేరుతో రుణం పొందింది. ఇదే మండలం కనుమలచెరువు పంచాయితీ, గాంధీనగర్ (సంఘం) గ్రామ యానాదులకు చెందిన సొసైటీ భూములు, 50 ఎకరాలకు పైగా అధికార పార్టీకి చెందిన భూక్యాగోపాల్ నాయక్ ఆక్రమించి, రికార్డుల్లో తమ కుటుంబ సభ్యుల పేర్లు (ఐ-బి అడంగల్) ఎక్కించుకోవడం, నూజెండ్ల మండలం తలార్లపల్లి పంచాయతీలోని దాట్లవారిపాలెంలో సర్వే నెం. 646/4 లో 123 ఎకరాలు, సర్వే నెం. 682 లో 54 ఎకరాలు ఆర్.ఎం.పి. డాక్టర్ పోతుల వెంకటేశ్వరరెడ్డి ఆక్రమించి చేపల చెరువులుగా మార్చాడు. ఇంకా ఈ నియోజక వర్గంలో మొత్తం 15 వేల ఎకరాలు భూస్వాముల కబ్జాలో ఉన్నాయి.

సాధారణంగా భూమిని దాని యాజమాన్య స్వభావం ఆధారంగా ప్రభుత్వ పోరంబోకు, మాన్యం, ఈనాం భూమి తదితర పేర్లతో పిలుస్తారు. ఆంగ్లంలో డాటెడ్ ల్యాండ్స్‌గా గుర్తింపు పొందిన వాటిని తెలుగులో చుక్కల భూములు అంటారు. 1906 నుండి 1916 వరకు ప్రభుత్వం ఒక సర్వే నిర్వహించింది. కొన్ని ప్రాంతాల్లో భూమి ఉన్నా, అవి రెవిన్యూ రికార్డుల్లో నమోదై ఉన్నా వాటి యజమాని ఎవరో తెలియదు. దీంతో చట్టబద్ధంగా యజమాని అధీనంలో లేని భూములన్నింటికి ప్రభుత్వం గుర్తుకోసం తన రికార్డుల్లో చుక్కలు పెట్టింది. అందువల్ల ఆయా భూములకు చుక్కల భూములు అనే పేరు వచ్చింది. నాటినుండి ఈ భూములు అధిక శాతం ప్రభుత్వ అధీనంలోనే ఉన్నాయి.

2009లో ఈ భూములన్నింటినీ నిషేధిత భూముల జాబితా (22ఎ)లో చేర్చారు. దానితో అంతకు ముందు జరిగిన రిజిస్ట్రేషన్లు కూడా నిలిచిపోయాయి. ఈ చర్య పెత్తందార్లకు మింగుడుపడడం లేదు.

ఇప్పటికే పచ్చని పంటపొలాలు, అసైన్డ్ భూములు, కొండ పోరంబోకు భూములు, లంక భూములను నయానో, భయానో చేజిక్కించుకున్న పెత్తందార్లు ఇప్పుడు చుక్కల భూములను కూడా సొంతం చేసుకునే పనిలో పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షల ఎకరాలు ఉన్న చుక్కల భూములు, చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చి ఈ భూములు తమ వర్గీయులకు కట్టబెట్టాలని తీవ్ర ప్రయత్నం చేస్తుంది. 2019 జనవరి 30న చుక్కల భూముల ఆర్డినెన్సును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గవర్నర్‌కు పంపగా ఆయన ఆమోదించకుండా తిరస్కరించారు. ముఖ్యమంత్రి ఎలాగైనా చుక్కల భూములు తమ వర్గం ఖాతాలో వేసుకోవాలని, ఫిబ్రవరి 6న అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించారు.

గతంలో ఏ ప్రభుత్వం కంటపడని ఈ భూములు ఇప్పుడు తెలుగుదేశం పార్టీ కంటపడ్డాయి. దున్నేవాడికే భూమి దక్కాలన్నది ప్రజల నినాదం కబ్జాదారుడిదే భూమిగా మారిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఎవరి స్వాధీనంలో ఉన్న భూములు వాళ్లవే, నెల రోజుల్లో పట్టాలిస్తామని ప్రకటించారు. అంతే కాకుండ షేర్లను అమ్ముకున్నంత తేలిగ్గా భూములు కూడా అమ్ముకోవచ్చు అని ప్రకటించాడు.

బిల్లు రాకముందే ఈ భూములను తమ ఖాతాల్లో వేయించుకునేందుకు గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రికార్డుల్లో ఈ భూములు తమవని తప్పుడు ఆధారాలు సృష్టించి పెడితే, బిల్లు చట్టరూపం దాల్చగానే దాని ప్రకారం చుక్కల స్థానంలో భూయాజమాన్య రికార్డు (ఐబి) లో తమ పేరు చేరుతుందని భావిస్తున్నారు. డబ్బుకోసం కొందరు, రాజకీయ ఒత్తిడివల్ల మరికొందరు,

నంద్యాల శ్రీనివాసరెడ్డి మృతి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నంద్యాల శ్రీనివాసరెడ్డి (101) నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ముత్యాలమ్మగూడెంలో ఫిబ్రవరి 20న మృతి చెందారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామంలో 1920లో శ్రీనివాసరెడ్డి జన్మించారు.ఆయన విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమం వైపు మళ్లారు.



1940లో మల్కాపూర్ ఆంధ్ర మహాసభకు తొలిసారి హాజరయి ప్రసంగించారు. కమ్యూనిస్టు పార్టీ పూర్తికాలం కార్యకర్తగా మారారు. ఆయన తన ఇంటి నుంచే ఉద్యమ కార్యాచరణ రూపొందించి తనకున్న 900 ఎకరాల్లో నుంచి కొంత భూమిని పేదలకు పంచారు. దొరల గడీలపై దాడులు చేసి పేదలకు ఆహారం, భూమి పంపిణీ చేశారు. సాయుధ పోరాటంలో దళ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అనేక గ్రామాల్లో వెట్టి చాకిరీ, దొరల పెత్తనంపై ప్రజా ఉద్యమాన్ని నిర్మించి పోరాడారు. 1949లో అరెస్టై ఏడాది పాటు జైలు జీవితాన్ని గడిపారు. దొరల గడీలపై దాడుల కేసులో మిలిటరీ ట్రిబ్యునల్ ఆయనకు ఉరిశిక్షను విధించింది. 1950 మే 3న ఆయన జైలు నుంచి తప్పించుకొని మళ్లీ ఉద్యమంలోకి వెళ్లారు.

ఆయనకు నివాళి అర్పిస్తూ, వీక్షణం 2006 జులై సంచికలో ప్రచురించిన ఆయన ఇంటర్వ్యూను పునర్ముద్రిస్తున్నాం.

'తెలంగాణలో ప్రతీ కుటుంబానికీ పెన్షన్ ఇవ్వాలి'

బహుశా అలాంటి మృత్యుంజయులు అరుదుగా ఉంటారేమో, నిజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో పాల్గొని, స్పెషల్ ట్రిబ్యునల్చే ఉరిశిక్ష విధింపబడిన పన్నెండుమందిలో నంద్యాల శ్రీనివాసరెడ్డిగారు ఒకరు. 1949వ సంవత్సరంలో అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో వీరికి ఉరిశిక్ష విధించవద్దంటూ అనేక దేశాల్లో ప్రదర్శనలు జరిగాయి. అప్పట్లో టైమ్ పత్రిక వీరి కేసు గురించి ముఖచిత్ర కథనం వేసింది.

ప్రఖ్యాత లండన్ న్యాయవాది డి.ఎన్. ప్రిట్ ఈ కేసును ముద్దాయిల తరపున వాదించారు. కేసు విచారణలో ఉండగానే హైకోర్టు భవనం నుండి పోలీసుల కన్నుగప్పి శ్రీనివాసరెడ్డి పారిపోయారు. పోరాట విరమణ తరువాత జరిగిన ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థిగా నకిరేకల్ నియోజక వర్గం నుండి ఎంఎల్ఏగా ఎన్నికయ్యారు. గత కొన్నేళ్లుగా సిపిఎంలో కొనసాగుతున్న వీరు స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ స్క్రీనింగ్ కమిటీలో సభ్యులుగా కూడా ఉన్నారు. సాయుధ పోరాటం గురించీ, పెన్షన్ల సమస్య గురించి అడిగినప్పుడు ఇలా స్పందించారు.

'దొరలు, దేశ్‌ముఖ్‌లు ప్రజలపై సాగిస్తున్న అత్యాచారాలు, ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులు కట్టలేక ప్రజలు అనుభవిస్తున్న బాధలు, వెట్టిచాకిరీ విధానం ఇవన్నీ నన్ను ఈ పోరాటంలో పాల్గొనేటట్టు చేశాయి. రజాకార్లపై అనేకచోట్ల మా దళం దాడి చేసింది.

నిజాం దిగిపోయిన తరువాత కూడా మేం పోరాటం కొనసాగించాం. మితవాదులు మాత్రం నిజాం దిగిపోవడంతో మన పోరాటం ఆపాలని నిర్ణయించారు. మేం మాత్రం పోరాట కాలంలో ప్రజలకు పంచిన భూములు వారి స్వంతమయ్యే వరకూ పోరాటం సాగాల్సిందే అన్నాం. ఫలితంగా భారత సైన్యం చేతిలో దారుణ నిర్బంధం ఎదుర్కొన్నాం.

హైదరాబాద్‌లో పొరపాటున పోలీసులకు చిక్కాను నేను. రెండుసార్లు జైలు నుండి తప్పించుకోవడానికి విఫలయత్నం చేశాను. చంచల్‌గూడ జైలులోంచి సొరంగం తవ్వి బైటపడేందుకు నేను నా సహ ఖైదీలు ప్రయత్నించి విఫలమయ్యాం. స్పెషల్ మిలటరీ ట్రిబ్యునల్ మాపై అనేక కేసులు మోపి ఉరిశిక్ష విధించింది. పార్టీ నన్ను తప్పించేందుకు ఏర్పాటు చేసింది. హైకోర్టు భవనం నుండి విచారణ జరుగుతుండగా తప్పించుకున్నాను.

తరువాత పరిణామాల వల్ల సిపియంతో అనుబంధం కొనసాగిస్తున్నాను. పెన్షన్ అప్లికేషన్ల స్క్రీనింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాను. పెన్షన్లు రాకపోవడానికి బిజెపి, కాంగ్రెస్‌లు రెండూ సమాన కారణాలు. మనవాళ్లు కూడా కొన్ని డౌట్‌ఫుల్ అప్లికేషన్లు పాస్ చేయడంతో పరిస్థితి బాగా చెడిపోయింది. సిబిఐ వాళ్లు కూడా మా కమిటీ అప్లికేషన్లు తీసుకోవడం ఆపేయాలని సూచించారు.

నిజంగా పోరాటం చేసిన వాళ్లు ఎక్కువమందే ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నకిలీ అప్లికేషన్లు వచ్చాయి. అయినా ఆ రోజుల్లో ఉద్యమం ఉధృతంగా ఉన్న ప్రాంతాల్లో పోరాటంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాల్గొనని కుటుంబం లేదు. బాల సంఘాలని ఉండేవి. 12-15 ఏళ్ల పోరగాండ్లు జెండా పట్టుకుని, పాటలు పాడుకుంటు తిరిగేటోళ్లు. నాకు తెలిసి అలాంటి చిన్నపిల్లలను కూడా నైజాం పోలీసులు కాల్చి చంపారు. అందుకే తెలంగాణలో ప్రతి కుటుంబానికీ పెన్షన్ ఇచ్చినా తప్పులేదు.

పోరాటం విరమించే ముందు జరిగిన సంఘటన ఒకటి చెప్పాలె మీకు. అడవిలో అందరం సమావేశమయ్యాం. మా నాయకులు ఆయుధాలు అప్పగించమని ఆదేశించారు. అందరం అప్పగించాం కానీ ఒక దళిత కుర్రాడు మాత్రమే అసలు ఒప్పుకోలేదు. ఎంత అడిగినా వినలేదు. 'మీరు భూమి జాగ ఉన్నోళ్లు, వెనకకు పోయి మీరు వ్యవసాయమో ఇంకో పనో చేసుకుంటారు కానీ నేను? దొరను కాదని ఇండ్లకు వచ్చిన. వెనకకు పోయి ఏం జేసి బతకాలె, అని అడిగిండు. మా ఎవరి దగ్గరా ఆ ప్రశ్నకు జవాబు లేకుండె ఆనాడు. వీ

క్షేత్రస్థాయి సిబ్బంది, టి.డి.పి. నేతలకు సహకరించి తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారు. పేదల అధీనంలోని చుక్కల భూములను కూడా గుంజుకుంటున్నారు. వీటి అనుభవదారులను బెదిరించి రికార్డులు తారుమారు చేస్తున్నారు. వినుకొండ ఎంఎల్ఎ జి.వి.యస్. ఆంజనేయులు తమ నియోజకవర్గంలో చుక్కల భూముల పంపకం వల్ల 10 వేల మందికి ప్రయోజనం అని ప్రకటించారు. వినుకొండ ప్రాంతంలో తన బంధువులు, తన అనుచరులు వేల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే దానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తుంటే దాన్ని అడ్డుకున్నాడే కాని ఎప్పుడు పేద ప్రజల పక్షాన నిలబడింది లేదు. చుక్కల భూములతో సహా అన్ని రకాల ప్రభుత్వ భూములు ప్రతి దళిత కుటుంబానికి ఐదు ఎకరాల చొప్పున పంచాలి. చుక్కల భూముల బిల్లు ద్వారా భూస్వామ్య వర్గాలకు మేలుచేసే విధానాలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేద్దాం.

(రచయిత దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

రైతుకు ప్రయోజనం లేని రైతు పథకాలు

రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర, మార్కెట్లో స్థానం కల్పించాలి కాని రాజకీయ ప్రయోజనాల కోసం చేసే ఆర్థిక సహాయం వల్ల రైతుకు ఆర్థిక విముక్తి కలగదని అంటున్నారు కేశవ్

వ్యవసాయం భారత దేశంలోని అతి ముఖ్యమైన ఉపాధి. దాదాపు దేశంలోని 75 శాతం, అంతకంటే ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. అత్యంత ముఖ్యమైన ఈ ఉపాధి గత కొన్ని సంవత్సరాలుగా అత్యంత అస్థిరతలోకి మరలింది. రైతులకు పర్యావరణ మార్పుల కారణంగానూ, తప్పుడు వ్యవసాయ విధానాల కారణంగానూ, వ్యవసాయంలో మార్కెటీకరణ కారణంగానూ పంట పోవడమో, ఒకవేళ పంట చేతికి వచ్చినా , గిట్టుబాటు ధర రాకపోవడమో, తక్కువ ధరకు పంటల్ని అమ్మాల్సి రావడమో, వ్యవసాయం చెయ్యడానికి ఖర్చు విపరీతంగా పెరిగి పోవడమో, పెరిగిన ఖర్చుల్ని భరించలేక, తీసుకున్న అప్పుల్ని చెల్లించ లేక, ఆత్మహత్య చేసుకోవడమో చూశాం. అందుకే, రైతుల ఆత్మహత్యలూ, న్యాయం కోసం రైతుల ర్యాలీలూ గత కొన్ని నెలలుగా ప్రధాన మీడియాలోని మొదటి పేజీలని ఆక్రమిస్తున్నాయి.

ప్రభుత్వానికి ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. మొత్తం మీద గత 2013 నుండి సంవత్సరానికి 12000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని కేంద్రం సుప్రీం కోర్టుకి తెలియజేసింది. 2015లో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్, తమిళ్‌నాడు లోనే దాదాపు 87.5 శాతం రైతుల ఆత్మహత్యలు నమోదయ్యాయి.

పరిష్కారంగా, కొందరేమో పూర్తిగా వ్యవసాయ రంగం రుణాలనే మాఫీ చెయ్యాలని అంటున్నారు. తను అధికారంలోకి వస్తే మొత్తం వ్యవసాయ రంగం రుణాలనే మాఫీ చేసేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అంటున్నాడు. రైతులకు న్యాయం చెయ్యాలనే ఆలోచనలో కూడా నిపుణుల్లో విభేదాలు ఉన్నాయి. రైతుల రుణాలను మాఫీ చెయ్యడమే రైతులకు సరయిన పరిష్కారమని కొందరు భావిస్తున్నారు. రుణాలు మాఫీ చెయ్యడం సరయిన ఆలోచన కాదనీ, ఇలా అలవాటు చెయ్యడం కారణంగా ప్రభుత్వం మీద విపరీతమైన భారం పడుతుందనీ, అప్పుల్ని చెల్లించే అలవాటు తగ్గుతుందనీ మొండి బాకీలు మరింత పెరిగే పరిస్థితికి దారి తీస్తుందనీ మరో వర్గం భావిస్తుంది.

ప్రభుత్వాలు ఎలా స్పందించాయి?

రైతుల రుణాలకూ, రైతుల సమస్యలకూ వివిధ రాష్ట్రాలు వివిధ రకాలుగా స్పందించాయి. రైతుల సమస్యలను పరిష్కరించే దిశలో ఇటీవల కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని స్కీములు ప్రకటించాయి. కేంద్ర బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రైతుల కోసం ఫ్రీబీలను ప్రకటించింది. భారత ప్రభుత్వం తన బడ్జెట్లో ప్రవేశపెట్టిన 'ప్రధాన్ మంత్రి కిషాన్ సమ్మాన్ నిధి' స్కీము రైతుకు న్యాయం చేస్తుందని ప్రభుత్వం అంటుంది. రెండు హెక్టార్ల వరకు దున్నే భూమి ఉన్న రైతుకు ఈ స్కీము కింద సంవత్సరానికి మొత్తం ఆరు వేల రూపాయలు మూడు విడతల్లో రెండు వేలు చొప్పున అందజేస్తారు. డబ్బులు అకౌంట్ లోకి నేరుగా పడతాయి. చిన్న రైతులకు బాగా ఉపకరిస్తుందని సెలవిస్తున్నారు. ఒక విధంగా చూస్తే, ఈ స్కీము బాగానే ఉపకరిస్తుందని చాలా మందికి అనిపిస్తుంది. కష్టాల్లో ఉన్న రైతుకి ఆపదలో అదుకుంటుందని అనిపిస్తుంది. అయితే, వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటాయి. నెలకు సరాసరి అయిదు వందల రూపాయలు వ్యవసాయదారుడికి నిజంగా ఉపయోగపడతాయా? ఒక వేళ అయిదు వందల రూపాయలతోనే వ్యవసాయం అయిపోయే పరిస్థితి ఉంటే, రైతులు లక్షల్లో అప్పులు ఎందుకు చెయ్యాల్సి వస్తుంది? ఆ అప్పులు తీర్చలేక ఎందుకు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుంది? ట్రాక్టర్లో డీజిల్ కోసం కూడా ఈ డబ్బులు చాలవు. ఇక వ్యవసాయానికి సంబంధించిన ఇతర ఖర్చులు ఎన్నో ఉన్నాయి.

తెలంగాణలో 'రైతు బంధు' స్కీమ్ కింద 12 వేల కోట్ల రూపాయలను 2018-2019 సంవత్సరానికి గాను బడ్జెట్లో తెలంగాణ ప్రభుత్వం కేటాయించింది. ఎకరానికి నాలుగు వేల రూపాయలు చొప్పున రెండు పంట రుతువుల్లో వ్యవసాయ పనిముట్ల కోసం, వ్యవసాయ ముడి సరుకుల కోసం రైతుకు ఇస్తారు. తెలంగాణలోని రైతు బంధు కార్యక్రమం ఎన్నికల్లో మంచి డివిడెండ్లు ఇచ్చిన తర్వాత, ఒడిసాలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కాలియా(క్రిషక్ అసిస్టెన్స్ పర్ లైవ్‌లిఉడ్) పేరు మీద కార్యక్రమం ప్రకటించింది. ఈ స్కీము తెలంగాణ రైతు బంధు స్కీము కంటే మరింత మెరుగైనది. భూమి లేని రైతు కుటుంబాలను కూడా ఇందులో చేర్చడం ప్లస్ పాయింట్. తెలంగాణ ప్రభుత్వం భూమి లేని రైతుల్ని స్కీములో చేర్చలేదు. ఒడిసా ప్రభుత్వం ఈ మైనస్ పాయింట్‌ని అధిగమించింది, ఈ స్కీము రాష్ట్ర ప్రభుత్వం మీద మూడు సంవత్సరాల్లో పది వేల నూట ఎనభై కోట్ల రూపాయాల భారాన్నివేస్తుంది. కాలియా కార్యక్రమం రాష్ట్రం లోని వ్యవసాయ భూముల్ని కలిగి ఉన్న చిన్న, మధ్య తరగతి రైతుల్ని, పనిచేసే భూములు లేని రైతుల్ని కలుపుకుంటుంది. చిన్న, మధ్య స్థాయి రైతులు దాదాపు 30.17 లక్షల మంది ఉంటారు. భూములు లేని వ్యవసాయ కార్మికులు మరో పది లక్షలు ఉంటారు. భూములున్న రైతుల కుటుంబాలకు ఒక పంట రుతువుకు ఐదువేల రూపాయల చొప్పున ఐదు రుతువులకు ఇస్తారు. భూములు లేని రైతులకు ఒకే సారి రు.12500 ఇస్తారు. ఇలా పది లక్షల మంది ప్రయోజనం

పొందుతారు. మరో పది లక్షల మంది అత్యంత దారిద్ర్యంలో ఉన్న రైతులకు ఒకే సారి పది లక్షల రూపాయలు ఇస్తారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 'కృషక్ బంధు' స్కీమ్‌ని ప్రకటించింది. రాష్ట్ర బడ్జెట్లో 2019–20 సంవత్సరానికి గాను 7 వేల కోట్ల రూపాయలను కేటాయించింది. ఇందులో పై రెండు స్కీముల్లో లేని ఇన్సురెన్సు కవరేజి ఉంది. ఎకరానికి అయిదు వేలు లెక్క రెండు సార్లు ఇస్తారు. రైతు చనిపోతే, కుటుంబానికి రెండు లక్షలు ఇస్తారు. కానీ, రైతు వయసు 18 నుండి 60 సంవత్సరాల లోపు ఉండాలి.

రైతు బంధు స్కీములా? రుణ మాఫీలా?

రైతులకు ఆదుకొనే ఇలాంటి రైతు బంధు, కృషక్ బంధు, కాలియాలు అవసరమా లేదా రైతుల రుణాలను ఏకంగా మాఫీ చెయ్యడం అవసరమా అనే విషయంలో కూడా ఎవరికి వారు చర్చలు చేస్తూనే ఉన్నారు. రుణాల మాఫీ విషయానికి వస్తే, జాతీయ బ్యాంకుల్లో పేరుకుపోతున్న విపరీతమైన రైతుల మొండి బాకీలను మాఫీ చెయ్యడమే నిజమైన పరిష్కారమని ఒక వర్గం భావిస్తోంది. కొన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల వాగ్దానాల్లో కూడా ఈ అంశాన్ని చేర్చుకుంటున్నాయి. అయితే, మొండి బాకీలు నిజంగానే మాఫీ చేసేస్తే, దేశం ఆర్థిక పరిస్థితి మీద విపరీతమైన భారం పడుతుంది. పైగా బ్యాంకుల్లో రుణాలను తీసుకున్న రైతుల్ని పరిశీలిస్తే, ముప్పై శాతం మంది రైతులు మాత్రమే ప్రయోజనం పొందుతారు. మిగిలిన డెబ్బై శాతం మంది రైతులు పేద రైతులు. వీరు రుణాల కోసం బ్యాంకుల మీద ఆధారపడే పరిస్థితి లేదు. వీరు బ్యాంకులకు వెళ్లి కాగితాలు చూపించి, రుణాలకు అప్లై చేసేటంత అక్షరాస్యతలో లేరు. వీరు ఎక్కువగా అప్పులిచ్చే కాబూలీల మీదనే, అందుబాటులో ఉన్న చిన్న సంస్థల మీదనే ఆధార పడే పరిస్థితి ఉంది. కాబట్టి బ్యాంకుల రుణాలను మాఫీ చేసేస్తే, ప్రయోజనం పొందే వారిలో ఎక్కువ మంది పెద్ద రైతులే ఉంటారు. రుణాలను మాఫీ చేసే అలవాటును పెంచితే, రుణాలను చెల్లించని పరిస్థితిని అలవాటు చేసినట్టు ఉంటుందని నిపుణులు అంటున్నారు, అందుకే ఇటుకీ, అటుకీ కాక చాలా ప్రభుత్వాలు మధ్యే మార్గం ఎంచుకుంటున్నాయి. ఇక రైతులకు ఆదుకునే ఈ స్కీంలను చూస్తే, ఏమీ లేని, భయంకరమైన పరిస్థితిలో, అస్థిరతలో ఉన్న రైతుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడం రైతుకు కాస్తంత ఉపశమనం కలిగిస్తాయి. అయితే, ప్రకటించిన స్థితి నుండి, చేతికి దొరికిన వరకు నిర్ణయించిన పైకం రైతుకు చేతికి అందుతుందో, అధికారుల పాకెట్లోకి కొంత ప్రయాణం చేస్తేనే తప్ప లభించే పరిస్థితి ఉంటుందో ఇంకా తెలీదు.

వాస్తవ పరిస్థితులూ – నిజమైన న్యాయం

అయితే, రైతుకు వాస్తవంగా జరగాల్సిన న్యాయం రుణాల మాఫీ లోనూ లేదు. ఆదుకునే స్కీం లలోనూ లేదు. ఇవన్నీ కొంతవరకు ఊరట కలిగిస్తాయే తప్ప శాశ్వత పరిష్కారం ఇవ్వవు. వ్యవసాయ రంగంలో మౌలిక మార్పులు నేడు అవసరం. ఒక టూత్‌పేస్టు తయారు చేసే కార్పొరేట్ తను నిర్ణయించిన రేటుకి తన వస్తువు అమ్మగలుగుతున్నాడు. ఏభై రూపాయల రేటు పెట్టి దుకాణాల్లో అమ్మకానికి పెడితే, అయిదు రూపాయలకు అమ్మితే తప్ప అమ్మకం కాని పరిస్థితి లేదు. అలా అమ్మకం కాని టూత్‌పేస్టులను కంపెనీ వాడు కోపంగా రోడ్ల మీద విసిరేసే పరిస్థితి లేదు. ఏ వినియోగదారుల వస్తువుల విషయంలో కూడా జరగని పరిస్థితి రైతుల విషయంలో ఎందుకు జరుగుతోంది? ఎంతో శ్రమకోర్చి పండించిన పంట అత్యంత తక్కువ ధరకు అమ్మే పరిస్థితి, అలా అమ్మక పోతే అమ్మకం కాని పరిస్థితి, విధి లేక అత్యంత తక్కువ తక్కువ ధరకు అమ్మే పరిస్థితి లేదా ఉల్లిపాయల్ని, మిరప కాయల్ని రోడ్ల మీద విసిరేసే పరిస్థితి ఎందుకు ఉండాలి? వ్యవసాయోత్పత్తుల ధరల్లో నిలకడ లేదు. ఏ పదార్థాల ధరలు ఎప్పుడు పెరుగుతాయో తెలీదు. ఎప్పుడు తగ్గుతాయో తెలీదు. పెరుగుతున్నాయని చెప్పి ఆ పంటలు పండిస్తే ఆ పంటల ధరలు తగ్గిపోతాయి తగ్గుతున్నాయని ఆ పంటలు మానేస్తే ఆ ధరలు పెరిగి పోవొచ్చు. ఆ కారణంగా రైతులు తమ పంటలను మాటిమాటికీ మార్చాల్సివస్తోంది. పూర్తిగా అస్తవ్యస్తమైన పరిస్థితి. ఉదాహరణకు, 1990ల మధ్యలో పత్తి ధరలు మన దేశంలోనూ ప్రపంచంలోనూ పెరిగాయి. 1990 చివరిలో మరలా పత్తి ధరలు విపరీతంగా తగ్గాయి. మెట్ట ప్రాంతాలలో సాంప్రదాయకంగా పండించే జొన్న, సజ్జ వంటి పంటలను విడిచి వేరు శనగను పండించడం ఆరంభించారు.. వీటి ధరలు కూడా నిలకడగా ఉండవు. ఎరువులూ, పురుగు మందులూ, విత్తనాలూ అన్నిటినీ బహుళ జాతి కంపెనీల దగ్గరే కొనాల్సి వస్తుంది. దీంతో పెట్టుబడి ఎక్కువ అవుతుంది. అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వస్తుంది. పంట చేతికి అందిన తర్వాత ఎంత ధర గిట్టుబాటు అవసరమో అంతధర మార్కెట్లో ఉండదు. పంట అమ్మకానికి పెడితే సాధారణ కుటుంబ పోషణకే డబ్బు రాదు. ఇంకా అప్పులు తీర్చగలుగుతారెలా? అందుకే, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. పంటలు రోడ్ల మీదకు విసిరేసిన సంఘటనలు కోకొల్లలు.

ప్రతి కంపెనీ తను నిర్ణయించిన ధరకు అమ్మగలిగే పరిస్థితి మార్కెట్లో ఉన్నపుడు, రైతుకు న్యాయంగా రావల్సిన ధర ఎందుకు రాదు? రైతులకు ఫ్రీ బీలను అందించడానికి, రైతుల రుణాలను మాఫీ చెయ్యడానికి ముందుకొచ్చిన ప్రభుత్వాలు రైతు మౌలికంగా ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నాడో, వాటిని పరిష్కరించే దిశలో పని చేస్తే ఏ స్కీము అవసరం కూడా ఉండదు. రైతుకు పంట పండించడానికి పెట్టే పెట్టుబడి గణనీయంగా పెరుగుతోంది. విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా యంత్రాలు నేడు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. ప్రపంచీకరణ అనీ, స్వేచ్ఛా వాణిజ్యం అనీ ప్రభుత్వాలు మెల్ల మెల్లగా ఎరువుల మీద, విత్తనాల మీద సబ్సిడీల నుండి వైదొలగుతున్నాయి. మాన్‌శాంటో లాంటి బడా కార్పొరేట్లు నేడు విత్తనాల మార్కెట్‌ని నియంత్రిస్తున్నాయి. మెల్ల మెల్లగా కార్పొరేట్ల రంగ ప్రవేశం పెరుగుతోంది. వ్యవసాయం నేడు వ్యాపారం అయిపోయింది. భారత దేశమే కాదు. ప్రపంచం మొత్తం మీద అభివృద్ధి చెందుతున్న దేశాల వ్యవసాయ రంగం నేడు కార్పొరేట్ల నియంత్రణలో ఉంది. విత్తనాల మార్కెట్‌నీ, ఎరువుల మార్కెట్‌నీ నేడు కొన్ని పెద్ద కంపెనీలు కబళించి ఉన్నాయి. ప్రపంచీకరణలో, రైతులు తమకంటూ ఒక ప్రత్యేకతను కోల్పోతున్నారు. రైతు నేడు పంట పండించే రైతన్న కాదు. కార్పొరేట్లకు ఒక కొనుగోలుదారుడు. కార్పొరేట్ల కబందాల్లో ఇరుక్కున్న ఒక బందీ. 2010 లో అలఎన్స్ ఫర్ సస్టెనెబుల్ అగ్రికల్చర్ ఆద్వర్యంలో ఆహారం, రైతులు, స్వేచ్ఛా' నినాదంతో దేశ వ్యాపితంగా నడిచిన కిషాన్ స్వరాజ్ యాత్ర హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పదిహేడేళ్ల అమ్మాయి అక్కడున్న పెద్దల్ని

నిలదీస్తూ ఇలా అంది. 'మా నాయన లాంటి రైతులు ఆత్మ హత్య చేసుకోవడానికి మీ ప్రభుత్వాలే కారణం, చాతనయితే రైతు ఆత్మహత్యలకు దారితీసే మార్గాలను మార్చండి. మాకు మీ సానుభూతి మాటలు అవసరం లేదు'

రైతు పండించిన పంటల్ని మధ్యవర్తులు ఇష్టం వచ్చిన రేటుకి కొని, మరల వారు తమ ఇష్టం వచ్చిన రేటుకి అమ్మి లాభ పడుతున్నారు. రైతు పంటలకు రావలసిన రేటు రైతుకి రావడం లేదు. మధ్యవర్తులు కొట్టేస్తున్నారు. వ్యవసాయ రంగంలో పేరుకుపోయిన మార్కెటీకరణ గాలుల్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. రైతుల నిజమైన సమస్యలు ఏమిటి? వారు విత్తనాలు నాటిన రోజు నుండి, పంట చేతికి వచ్చి అమ్మాల్సిన స్థితి వరకు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి? స్వామినాథన్ కమిటీ సిఫారసులు ఏమిటి? ఆత్మ హత్యలు చేసుకోవలసిన పరిస్థితి రైతుకు ఎందుకు వస్తుంది? 1960లో ఆఫ్రికా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సంతృప్తిలోఉండేది. ఎగుమతులు కూడా చేసుకునే స్థితిలోఉండేది. కానీ, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ సలహాలను అమలు చేసినందుకు గాను నేడు దాదాపు 25 శాతం పంటల్ని దిగుమతి చేసుకుంటోంది. భారతదేశం కాకుండా అభివృద్ధి చెందిన దేశాల వ్యవసాయాన్ని జన్యుమార్పిడి పంటలుగా మార్చేసి కోట్లు సంపాదించాలని బహుళ జాతి సంస్థలు కాచుకొని కూర్చున్నాయి. జన్యు మార్పిడి విత్తనాలు అధిక దిగుబడి నిస్తాయని నమ్మించి మొత్తం వ్యవసాయానికే చరమ గీతం పాడడానికి సిద్ధంగా ఉన్నాయి. మన స్వయం సమృద్ధి మంట గలిసి ఇతర దేశాల మీద ఆధార పడేలా చేస్తాయి. వ్యవసాయం కొందరికి బంగారు బాతు గుడ్డయితే, వ్యవసాయదారుడికి కత్తి మీద సాము. అందుకే, రైతులు అప్పుల్లో మునిగిపోతున్నారు. అప్పు చెయ్యకపోతే పంట పండించ లేరు. పండించిన తర్వాత, అమ్మకానికి వచ్చేటప్పుడు ధరలు పడిపోతే ఆ అప్పులు తీర్చలేరు. అలా తీర్చలేని అప్పుల మీద వడ్డీలు, వాటి మీద మరలా వడ్డీలు. ఇలా అప్పుల చట్రంలో ఇరుక్కుపోవడమే తప్ప తీర్చడం వీలు కాదు. నీరవ్ మోదీ లాంటి వారు హాయిగా తిరుగుతారు. రైతుకు మాత్రం అభయ హస్తం కనిపించదు. రైతుల రుణాల్లో అత్యధిక భాగం ఉత్పాదక అవసరాల కోసమే. విత్తనాలూ, పురుగుల మందులూ, ఎరువులూ, వ్యవసాయానికి అవసరమైన పరికరాలూ అన్నీ నేడు బహుళజాతి సంస్థలే నియంత్రిస్తున్నాయి. వ్యవసాయ రంగం నేడు జీవనాధారమనే పాత ఆలోచనకు స్వస్తి చెప్పి అన్ని వ్యాపారాల్లాగానే వ్యాపారమై పోయింది. పెట్టుబడి, లాభం అనే పదాలు వచ్చి చేరాయి. ఎరువులమ్మే కంపెనీలు ఎరువులతో వ్యాపారం చేస్తున్నాయి. పురుగుల మందులమ్మే కంపెనీలు పురుగు మందులతో వ్యాపారం చేస్తున్నాయి. విత్తనాలమ్మే కంపెనీలు విత్తనాలతో వ్యాపారం చేస్తున్నాయి. దీనికి తోడు జన్యు మార్పిడి పంటల్ని, విత్తనాల్ని కూడా మన దేశంలోకి చొప్పించి మన వ్యవసాయ భూములకు ఈ విత్తనాలను అలవాటు చేసి ఆ విత్తనాలు వేస్తేనే పంటలు పండే పరిస్థితిని ఏర్పరచి ఈ విత్తనాల కోసం మరలా బహుళ జాతి సంస్థల మీద ఆధార పడే నిస్సహాయ పరిస్థితి కూడా ఎక్కువ దూరంలో లేదు. మరోవైపు, ఇటీవలే, సమ్మె చేసిన చెరుకు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. తమ దగ్గర చెరుకు కొన్న చెరుకు మిల్లులు ఇంతవరకు వీరికి డబ్బులు చెల్లించలేదు. వందలు వేలు కాదు. లక్షల్లో కాదు. మే 2018 నాటికీ దాదాపు 22 వేల కోట్ల రూపాయలు దేశం మొత్తం మీద చెరుకు రైతులకు చెరుకు మిల్లులు బాకీ పడి ఉన్నాయి. బ్రెజిల్ తర్వాత చెరుకు పంటలో రెండో పెద్ద దేశమైన మన దేశంలోని చెరుకు రైతుల వ్యథను అర్థం చేసుకొని సత్వరమే పరిష్కారం ఇవ్వాల్సిన అవసరం ఉంది. సంవత్సరానికి ఆరువేలు రూపాయలు సరైన పరిష్కారం కాదు.

న్యాయం చెయ్యని కిసాన్ సమ్మాన్ నిధి

పంట పండించడానికి లక్షల అప్పుల్లో కూరుకుపోయిన రైతుకు సంవత్సరానికి ఆరువేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తే మాత్రం న్యాయం జరుగుతుందా? ఆరువేల రూపాయలు అందుకున్న రైతు మరో సంవత్సరం పంట పండించడానికి ఈ ఆరు వేలు ఏ విధంగా ఉపయోగ పడతాయి. లక్షలు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితిని ఈ ఆరువేలు నియంత్రించగలవా? రైతు పంట పండించడానికి పెరుగుతున్న ఖర్చులు తగ్గే మార్గం కావాలి. భారీ లాభాలను అందించే వ్యాపారంగా మార్చేసే వ్యవసాయ విధానంలో, పరిస్థితుల్లో మార్పులు రావాలి. అలానే పంట పండి చేతికొచ్చిన తర్వాత పంట అమ్మేటప్పుడు సరయిన న్యాయమైన ధర రైతుకు దొరికే పరిస్థితులు కావాలి. రైతు పంటను అమ్మేటప్పుడు ఎలాంటి విపత్కర పరిస్థితులు రాని విధానం ఉండాలి. తక్కువ ధరకి అమ్మేలా రైతు గురయ్యే పరిస్థితి ఉండకూడదు. చేసిన అప్పులు తీర్చలేకుండా, పంటను గిట్టుబాటు ధరకు అమ్మలేకుండా ఆత్మహత్యకు పాల్పడే పరిస్థితికి రైతు గురవ్వని సామాజిక వ్యవస్థను కేంద్ర ప్రభుత్వాలూ, రాష్ట్ర ప్రభుత్వాలూ ఏర్పరచాలి. ఏదైనా రంగంలో వేల కొలది ప్రజలు ఆత్మ హత్యలు చేసుకుంటున్నారూ అంటే అది వారి వ్యక్తిగత, కుటుంబ సమస్య కాదు. రైతులు వేల సంఖ్యలో ఆత్మ హత్య చేసుకుంటున్నారు అంటే అది వారి సొంత సమస్య, కుటుంబ సమస్య కాదు. అది సామాజిక సమస్య. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు సత్వరమే ముందుకొచ్చి తీర్చాల్సిన సమస్య. వ్యవసాయ రంగంలో మౌలిక మార్పులు చెయ్యకుండా, ప్రపంచీకరణకు ఎర్ర తివాచీ పరుస్తూ వ్యవసాయాన్ని, వ్యవసాయ పనిముట్లను, ఎరువుల్ని, వాటి ధరలను,, రుణాల కాబూలీల్ని, మధ్యవర్తుల్ని, బడా పెట్టుబడిదారుల్ని నియంత్రించకుండా కేవలం ఆర్థిక సహకారాన్ని మాత్రమే ఉదతాభక్తిగా అందించే యాచక విధానం శాశ్వత పరిష్కారాన్ని అందివ్వదు. ఈ రకమైన ఆర్థిక సహకారాలు చేరాల్సిన వ్యక్తికి న్యాయంగా ఎంత చేరాలో అంత చేరవు. అసలు సహకారం అవసరం లేని పెద్ద రైతులు, భూస్వాములు బెంజ్ కారుల్లో వచ్చి తమ భూముల రికార్డులు చూపించి ప్రజల పన్నుల డబ్బులు లొసుగులున్న స్కీముల నుండి తీసేసుకుంటారు. మరికొన్ని చోట్ల తమ భూముల్లో వ్యవసాయం చెయ్యని రైతులు భూమి రికార్డులు చూపించి ప్రయోజనం అనుభవిస్తారు. అదే భూముల్లో సంవత్సరాల తరబడి వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులు సమస్యల్లోనే ఉంటారు. పైగా ఈ విధానం మరింత ఆర్థిక భారాన్ని మోపుతూ, కేంద్రం మీదా, రాష్ట్రాల మీదా వేల, లక్షల కోట్ల రూపాయల అప్పుల భారం మోపుతూ కేంద్రాన్నీ, రాష్ట్రాలనూ మరింత అప్పుల ఊబిలోకి తీసుకు పోతుంది. ఇలాంటి స్కీములు రైతుకు తాత్కాలికంగా కాస్తంత ఊరటనిచ్చినా శాశ్వత పరిష్కారం ఎంతవరకు ఇవ్వగలవన్నది సందేహమే. .

(రచయిత ఉపాధ్యాయులు, 'జాగృతి సమీక్ష' త్రైమాసిక పత్రిక సంపాదకులు) వీ

అసర్ నివేదిక - ప్రాథమిక విద్యా వైఫల్య సూచిక

***ప్రాథమిక విద్యారంగంలో కనీస స్థాయి ప్రమాణాలు లేకపోవడాన్ని అసర్ నివేదిక ఎత్తిచూపిందనీ, బడ్జెట్ కేటాయింపుల్లో పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందనీ అంటున్నారు* బి. రామకృష్ణ**

ప్రాథమిక విద్యకు సంబంధించి ప్రథమ్ అనే సంస్థ 2005 నుండి 2018 వరకు ఆన్యేల్ స్టేటస్ ఆప్ ఎడ్యుకేషన్ రిపోర్టు - ఎఎస్ఇఆర్ పేరుతో మొత్తం 13 నివేదికలను విడుదల చేసింది. అసర్ - 2018ని 2019 జనవరి 15న ఢిల్లీలో విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 596 గ్రామీణ జిల్లాల్లోని 17,730 గ్రామాలలో 3,54,944 ఇళ్లను సందర్శించి 3 నుండి 16 ఏళ్ల పిల్లలు 5,46,527 మందిని సర్వే చేసి ఈ నివేదికను రూపొందించారు. ఈ నివేదికలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను వివరించారు. 1 నుండి 8 తరగతుల వరకు ప్రత్యేకించి 3,5,8 తరగతుల్లో చదవడం, గణిత సామర్థ్యం అలాగే పాఠశాలల్లో ఉండే వసతులు, నమోదు వివరాలను పొందుపరిచారు. ఇందులో 2012, 2014, 2016 నివేదికలతో 2018 నివేదికలోని సమాచారాన్ని పోల్చి చూపించడం జరిగింది. ఈ నివేదిక 2018 సంవత్సరంలో దేశవ్యాప్తంగా అలాగే అనేక రాష్ట్రాలలోని ఎలిమెంటరీ (1 నుండి 8 తరగతులు), విద్య స్థితిగతులను తెలుపుతుంది.

దేశవ్యాప్తంగా 6-14 సంవత్సరాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో 65.6 శాతం ప్రయివేటు పాఠశాలల్లో 30.9 శాతం, పాఠశాలలకు అవల 2.8 శాతం ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 57.4 శాతం ప్రభుత్వ పాఠశాలలో, 41.8 శాతం ప్రయివేటు పాఠశాలల్లో, 0.6 శాతం పాఠశాలలకు అవతల ఉన్నారు. 2016-17లో తెలంగాణ ప్రభుత్వ లెక్కల ప్రకారం 1-10 తరగతుల వరకు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో 51.26 శాతం, ప్రభుత్వ పాఠశాలల్లో 48.74 శాతం మంది ఉన్నారు.

అసర్ 2018లో 1 నుండి 8 తరగతుల వారిగా పిల్లలు చదివే అలాగే లెక్కలు చేయగలిగే సామర్థ్యాలను పట్టికల రూపంలో వివరించడం జరిగింది. దేశవ్యాప్తంగా 3,5,8వ తరగతుల్లో కనీసం అక్షరాలు కూడా చదవడం రాని పిల్లలు వరుసగా 12.1 శాతం, 5.9 శాతం, 1.9 శాతం మంది ఉన్నారు. అక్షరాలు చదవగలిగి పదాలు చదువలేనివారు వరుసగా 22.6 శాతం, 11.7 శాతం, 5.3 శాతం మంది ఉన్నారు. పదాలు చదవగలిగి 1వ తరగతి స్థాయి పాఠ్యాంశాలను చదువలేనివారు వరుసగా 20.8 శాతం, 13 శాతం, 6.7 శాతం మంది ఉన్నారు. 2వ తరగతి పాఠ్యాంశాలను చదువగలిగే వారు వరుసగా 27.2 శాతం, 50.3 శాతం, 72.8 శాతం మంది ఉన్నారు.

దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు మొత్తం పాఠశాలలు అన్ని కలిపి 3,5,8 తరగతుల పిల్లలు 2వ తరగతి పాఠ్యాంశాలను సహితం చదువలేని వారు వరుసగా 78.2 శాతం, 49.7 శాతం, 27.2 శాతం మంది ఉన్నారు. 3,5,8 తరగతుల పిల్లలు 2వ తరగతి పాఠ్యాంశాలను చదవలేని వారు తెలంగాణ రాష్ట్రంలో వరుసగా 82 శాతం, 56.3 శాతం, 31 శాతం మంది ఉన్నారు. దేశ మొత్తంతో చూస్తే తెలంగాణలో చదువలేని పిల్లలు ఎక్కువగా ఉన్నారు. 5వ తరగతి పిల్లల్లో దేశం మొత్తం మీద సగం మంది, తెలంగాణలో అయితే సగానికి పైగా (56.5 శాతం) కనీసం 2వ తరగతి పాఠ్యాంశాలు కూడా చదువలేకపోతున్నారు. ఇలా కనీసం చదవడం రాని వారు ఆ పై తరగతుల్లో అన్ని పాఠ్యాంశాలలో ఏమాత్రం ప్రతిభ కనపరుస్తారో అర్థం చేసుకోవచ్చు.

లెక్కల విషయానికొస్తే 3,5,8 తరగతుల్లో చదివే పిల్లల్లో 1నుండి 9 అంకెలను సహితం గుర్తు పట్టలేని వారు వరుసగా 7.6 శాతం, 3.3 శాతం, 1.1 శాతం ఉన్నారు. 9 వరకు అంకెలను గుర్తించగలిగి 10 నుండి 99 వరకు అంకెలను గుర్తించలేని వారు వరుసగా 26.9 శాతం, 13.8 శాతం, 5.6 శాతం మంది ఉన్నారు. 1 నుండి 99 వరకు గుర్తించగలిగి తీసివేతలు చేయలేని వారు వరుసగా 37.5 శాతం, 30.5 శాతం, 27.3 శాతం మంది ఉన్నారు. 3,5,8 తరగతుల్లో కనీసం భాగాహారాలు చేయడం రాని వారు వరుసగా 91.5 శాతం, 72.2 శాతం, 56.1 శాతం వారున్నారు.

తెలంగాణలో 3,5,8 తరగతులలో తీసివేతలు రాని వారు వరుసగా 51.5 శాతం, 28.5 శాతం, 16 శాతం భాగహారాలు రానివారు 96.8 శాతం, 72.9 శాతం, 51.7 శాతం ఉన్నారు. కనీస ప్రమాణాలను సాధించడంలో ఎంతగా వెనుకబాటుతనం ఉన్నదో ఈ సమాచారం స్పష్టం చేస్తున్నది. ఏ తరగతిలో సాధించవల్సిన కనీస అభ్యసన సామర్థ్యాలు ఆ తరగతిలో సాధించబడుట లేదనేది ఈ నివేదిక ద్వారా స్పష్టం అవుతున్నది. 5వ తరగతిలోని సగానికి పైగా పిల్లలు 2వ తరగతి స్థాయి సామర్థ్యాలను సహితం కలిగి ఉండడం లేదు. 8వ తరగతి పిల్లల్లో కనీస భాగాహారం రాని వారు సగానికి పైగా కనీస తీసివేతలు రానివారు నాలుగో వంతుకు పైగా ఉంటున్నారు. ఇదెంత అవమానకరమో, విద్యా వ్యవస్థ వైఫల్యమో తేటతెల్లం చేస్తున్నది.

ఈ విధంగా 3,5,8 తరగతుల్లో కనీస అభ్యసన స్థాయిలు దేశవ్యాప్తంగా హీనస్థాయిలో ఉండడానికి కారణాలేమిటో కూడా ఈ నివేదిక అధ్యయనం చేస్తే మరెన్నో ముఖ్యమైన విషయాలు తెలిసేవి. నిజానికి ఈ పని ప్రభుత్వ విద్యా యంత్రాంగం చేయవల్సినట్టిది. దేశస్థాయిలో సిబిఎస్ఇ, ఎన్సిఇఆర్టి రాష్ట్రాల స్థాయిల్లో ఎస్సిఇఆర్టిలు అలాగే పాఠశాల విద్యతో సిలబస్, బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యంకనాలు మొదలగు మొత్తం పాఠశాల వ్యాసాంగంతో సంబంధం ఉన్న ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు, రాష్ట్రాల పాఠశాల విద్యాశాఖ

డైరెక్టరేట్‌లు, మంత్రిత్వశాఖలు దేశవ్యాప్తంగా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ప్లానింగ్, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ, యూనివర్సిటీలు చేయవల్సినవి. ఇవన్నీ కూడా అధ్యయనం/పరిశోధన చేసి ఎప్పటికప్పుడు సమస్య పరిష్కారానికి మార్గాలు చూపెట్టాల్సిన సంస్థలు. అవేవీ కూడా పాఠశాల విద్యా వ్యవస్థలోని లోపాలను, ఖాళీలను కనిపెట్టి పరిష్కారాలు చూపకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్న నేపథ్యంలో దేశంలోని ప్రథమ్ అనే ఓ ఎన్‌జిఓ కొంతమేరకు అధ్యయనం చేసింది. అసలు కారణాలు చెప్పలేదు, పరిష్కారాలు సూచించలేదు. కాని దయనీయ పరిస్థితులను మాత్రం చూపించగలిగింది.

పాఠశాల విద్యా యంత్రాంగాన్ని నడిపించే విద్యా మంత్రిత్వ శాఖలు, గాని అత్యున్నత స్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థలు గాని సమస్యల మూలాలను వెతికి శాస్త్రీయంగా విశ్లేషించి పరిష్కారాలను చూపెట్టి కార్యాచరణను చేపట్టవల్సిన అవసరాన్ని గుర్తించినట్లుగా అనిపించడం లేదు. ఇది స్పష్టంగా దేశ, వివిధ రాష్ట్రాల పాలకులకు విద్యపై ఉన్న అశ్రద్ధ, అలసత్వంను చూపిస్తున్నది. అలా అనేకంటే ప్రజలు విజ్ఞాన వంతులు కావద్దని అనుకుంటున్నారంటే సరిపోతుంది.

ఇన్నేళ్ల స్వాతంత్రం తరువాత కూడా, ఇంతగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో చెప్పుకోదగిన ప్రగతి సాధిస్తున్న సందర్భంలో కూడా కనీస ప్రమాణాలు సాధించడం లేదు. నిజంగా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలనుకుంటే ఇదో సమస్య కాదు.

దేశవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలో 32.8 శాతం ఆట స్థలాలు లేవు. 83.5 శాతం ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేకమైన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు లేరు. తెలంగాణలో 89.1 శాతం పాఠశాలలో ప్రత్యేక ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు లేరు. ఉన్న వాటిల్లోను గుణాత్మకత గాని, ఆటల పట్ల ఉండాల్సిన శాస్త్రీయ వైఖరులు, ఆచరణలు గాని ఎంతమేరకు ఉన్నాయనేది మరో విషయం. చాలా వరకు ప్రాథమిక(1-5 తరగతులు) పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులే లేవు. తెలుగు రాష్ట్రాలలో గాని అనేక రాష్ట్రాలలో గాని అసలు ఆ పోస్టులు లేనే లేవు అంటే ఆశ్చర్య పోవల్సిందేమిలేదు. అంటే ఉన్నవారిలో ఎవరో ఒక టీచరు ఆ పని చేయవల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో పిల్లలకు ఆటలు ఆహ్లాదకరంగా ఉండే పరిస్థితి ఎక్కడ ఉంటుంది. శారీరక వికాసం మేధో వికాసంపై ప్రభావం చూపుతుందనేది తెలియందేమి కాదుకదా. పిల్లల శారీరక, మానసిక, బౌద్ధిక వికాసాలకు ఆటలు, వ్యాయామాలకు మధ్య విడదీయలేని సంబంధం ఉన్నదనేది ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన సత్యమే కదా. అటువంటి ఆటలు వ్యాయామ ప్రక్రియలు ప్రాథమిక దశలో అందకుండా పోవడం అనేది చదువుల్లో వెనుకబాటు తనానికి కారణం కాకుండా పోతుందా.

దేశవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో 43.3 శాతం, తెలంగాణలో 34.8 శాతం (తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం అంచనావేస్తే తెలంగాణలో 67 శాతం) పాఠశాలలో 60 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్నారు. ఇటువంటి పాఠశాలలో ఇద్దరే టీచర్లుంటారు. ఆ ఇద్దరే అన్ని తరగతులకు అన్ని సబ్జెక్టులు, సహ పాఠ్యంశాలతో సహ దినమంతా నిర్వహించాల్సి ఉంటుంది. ఇటువంటి పాఠశాలల్లో తరగతికో గది, తరగతికి ఒక టీచర్, అనేది అసాధ్యం. ఒకరిద్దరే టీచర్లు ఏక సమయంలో అన్ని తరగతులకు ఒకే గదిలో బోధించడంతో పాటుగా శారీరక, మానసిక, మేధోపర వికాసాలకు తోడ్పడే ఆరోగ్య, వ్యాయామవిద్య ఆటలు, కళలు, సాంస్కృతిక విద్య, పని కంప్యూటర్, గ్రంథాలయం, జీవ నైపుణ్యాలు విలువలు మొదలైన సహ పాఠ్యాంశాలను అందించడం సాధ్యపడుతుందా? నిజమైన అర్థంలో సహ పాఠ్యాంశాలను నిర్వహించగలిగే వాతావరణం పాఠశాలల్లో ఉన్నదా?

దేశవ్యాప్తంగా 25.2 శాతం ప్రాథమిక పాఠశాలలో (తెలంగాణలో 42.8 శాతం) తాగునీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్లు లేని పాఠశాలలు 25.8 శాతం, (తెలంగాణలో 33 శాతం), బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేనివి 33.6 శాతం (తెలంగాణలో 28.1 శాతం) ఉన్నాయి. గ్రంథాలయ సౌకర్యం లేని పాఠశాలలు 22.4 శాతం (తెలంగాణలో 25.8 శాతం) ఉన్నాయి. 25 శాతం పాఠశాలలో విద్యుత్ సౌకర్యం (తెలంగాణలో 13.6 శాతం) లేదు. కంప్యూటర్లు 78.7 శాతం (తెలంగాణలో 89.5 శాతం) పాఠశాలల్లో లేవు.

2వ తరగతి విద్యార్థులు ఇతర తరగతుల పిల్లలతో కలిసి ఒకే చోట కూర్చుంటున్న ప్రాథమిక పాఠశాలలు 63.4 శాతం (తెలంగాణలో 60.5 శాతం), ప్రాథమికోన్నత పాఠశాలలు 60.9 శాతం, 4వ తరగతి విద్యార్థులు ఇతర తరగతుల పిల్లలతో కలిసి కూర్చుంటున్న ప్రాథమిక పాఠశాలలు 58 శాతం (తెలంగాణలో 49 శాతం), ప్రాథమికోన్నత పాఠశాలలు 48.1 శాతం ఉన్నాయి. బహుళ తరగతి బోధన ద్వారా ఏ తరగతికి చెందిన పిల్లలకైనా సరైన బోధనాభ్యసన జరపడానికి వీలు కాదు. బహుళ తరగతి బోధనకు సంబంధించి ఎలాంటి ఉపాధ్యాయ శిక్షణను నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ గాని ఎన్‌సిఇఆర్‌టి, ఎస్‌సిఇఆర్‌టిలు గాని రూపొందించలేదు. అటువంటి శిక్షణ ఏ ఒక్క ఉపాధ్యాయునికి ఇవ్వబడలేదన్నది గమనంలో ఉంచుకోవాలి. ఎన్‌సిఇఆర్‌టి, ఎస్‌సిఇఆర్‌టిలు కాని, బిఇడి, డిఇడి కాలేజీల్లో గాని ఇటువంటి తరగతుల్లో బోధన, పాఠశాల నిర్వహణ ఎలా చేయాలో స్పష్టం చేయబడలేదు. ఉన్న ఒకరిద్దరు టీచర్లే తమకు తోచిన రీతిలో అరకొరగా తప్పిస్తే సమర్థవంతంగా కనీస అభ్యసన సామర్థ్యాలను పిల్లల్లో పెంపొందించడం సాధ్యపడుతుందా? ఇలాంటి పరిస్థితుల్లో అభ్యసనా ఫలితాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవడం కష్టమేమి కాదు.

కేంద్ర ప్రభుత్వం 2017-18 నుండి 2019-20లకు సంబంధించి ఏప్రిల్ 2017లో విడుదల చేసిన నీతి అయోగ్ డాక్యుమెంట్ ప్రకారం దేశవ్యాప్తంగా 50 కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలు 3.7 లక్షలు ఉన్నాయి. వీటిని రేషనలైజేషన్ పేరుతోనో, విలీనం పేరుతోనో మూసేయాలని, ప్రైవేటు వారికి కొంతమొత్తం చెల్లించి వారిచే ప్రభుత్వ పాఠశాలలను నడపడాన్ని(దత్తత ఇవ్వాలని) ప్రతిపాదించారు. ఇప్పటికే ఈ పేర్లతో దేశవ్యాప్తంగా లక్షకు పైగా పాఠశాలలు మూసేసారు. లక్షకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు నేటికీ ఉన్నాయంటే ఆశ్చర్యం అవసరం లేదు. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో నైతే గత ఐదేళ్లుగా గురుకుల పాఠశాలల్లో తప్పిస్తే రెగ్యులర్ పాఠశాలల్లో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేసింది లేదు. అంప్రెస్ టీచర్లని, పారా టీచర్లని, విద్యా వాలంటీర్లని, కాంట్రాక్ట్ టీచర్లని దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో నియమిస్తూ రెగ్యులర్ టీచర్లను నియమించకుండా అశాస్త్రీయ విధానాలను పాటిస్తూ వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు తగ్గుతున్నప్పుడు ప్రభుత్వ పరంగానే అన్ని

సౌకర్యాలతో గుణాత్మకమైన విద్యను అందించడం ద్వారా సమస్యను అధిగమించవచ్చు. నేడు ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వం ఇలాంటి అడుగులు వేస్తున్నట్లుగా కనిపిస్తున్నది. అలా కాకుండా ఉన్న వాటినే మూసేస్తూ పోతూ మరోవైపు విచ్చలవిడిగా ప్రయివేటు వాటికి అనుమతులిస్తూ పోవడం అనేది మోస పూరితమే అవుతుంది.

విద్యా హక్కు చట్టం 2009ని అనుసరించి గదులు, ఆట స్థలాలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు మొదలైన మౌలిక వసతులు కల్పించడం సాధ్యం కాదని వాటి నుండి మినహాయింపును కోరుతూ విద్యాహక్కు చట్టంలోనే సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు నిరసనలు తెలుపుతున్నాయి. ఇవేవి లేకుండా ఫలితాలు రాబడుతున్నాయని వారు చెబుతున్నారు. ఈ వాదనతో ప్రభుత్వం ఏకీభవిస్తున్నది. ఈ వాదనలో ఫలితాలంటే ర్యాంకులు, గ్రేడులు, మార్కులే తప్ప సమగ్ర వికాసం విద్యాతాత్వికతలోని మౌలిక అంశాల సాధన కాదనేది అర్థం చేసుకోవచ్చు. విద్యాసంస్థలను మార్కులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలుగా చూడడం దురదృష్టకరం.

విద్య కోసం సరైన బడ్జెట్ కేటాయించకపోవడం అనేది స్వాతంత్రానంతరం నేటి వరకు ఏ రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లను గమనించినా కూడా తెలిసే విషయమే. కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం కేటాయించాలని చెప్పిన కొఠారీ కమిషన్ సిఫారస్‌లు ఎప్పుడూ కూడా అమలుకు నోచుకోలేదు. గత రెండేండ్లుగా ఢిల్లీ ప్రభుత్వం దీనికి మినహాయింపుగా నిలిచింది. గత మూడు, నాలుగు దశాబ్ధాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, సిబ్బందిని కల్పించకుండా కుట్ర పూరితంగానే అవి కునారిల్లి పోయేలా చేస్తున్నాయి.

పార్లమెంటరీ రాజకీయ పార్టీల అజెండాల్లో ఎప్పుడూ కూడా విద్య తగు స్థానానికి నోచుకోలేదు. ఆయా పార్టీల మేనిఫెస్టోలలో గత అరవై, డెబ్బై ఏళ్లుగా స్పష్టమైన విధానపర హామీలు కనిపించవు. 2014 ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సమితి కె.జి. నుండి పి.జి. వరకు ఉచిత విద్య గురించి మాట్లాడింది. కాని గత ప్రభుత్వాల కంటే కూడా తక్కువ బడ్జెట్‌లను కేటాయిస్తూ వచ్చింది. ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేసిందీ లేదు. కొత్తగా గురుకుల పాఠశాలలను తెరిచి అవే కెజి నుండి పిజి విద్య అని బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ పాఠశాలలు తెలంగాణలోని అందరి విద్యార్థులకు ఏమూలకూ సరిపోవన్నది దాచేస్తే దాగని నిజమే కదా. ఏవో కొన్ని పార్టీలు అక్కడక్కడ మాట్లాడినప్పటికీ అది అంతంత మాత్రంగానే, ప్రాధాన్యత లేనట్టిదిగానే మిగిలిపోతున్నది. గుణాత్మకమైన విద్య కొరకు దీర్ఘకాలిక, అలాగే తక్షణ వ్యూహాలను, విధానాలను రూపొందించిందేమీ లేదు. రూపొందించినవి కూడ ప్రైవేటీకరణ వైపుకే దారులేసాయి. చదువులను అంగట్లో వినియోగ సరుకుగా మార్చేసాయి.

కనీస అభ్యసనా ఫలితాల విషయంలో ప్రయివేటు పాఠశాలలు ఏమైనా బాగున్నాయా అంటే అదీ కూడా లేదు. 3,5,8 తరగతుల పిల్లల్లో కనీసం 2వ తరగతి పాఠ్యాంశాలను చదువలేనివారు వరుసగా 59.4 శాతం, 34.9 శాతం, 17.1 శాతం ఉన్నారు. అలాగే 3వ తరగతిలో కనీసం తీసివేతలు చేయలేనివారు 56.5 శాతం, 5,8 తరగతుల్లో కనీసం భాగాహారం చేయలేనివారు వరుసగా 61.2 శాతం, 55.8 శాతం ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ఎంతో కొంత మెరుగు అనుకునే ప్రయివేటు వాటిల్లో కూడా కనీస అభ్యసన ఫలితాలు ఇలా ఉన్నాయని తేలుతున్నప్పుడు లోపమెక్కడ ఉన్నట్లు?

మౌలిక వసతులతో పాటుగా పాఠ్య, సహ పాఠ్యాంశాల నిర్వహణకు సరిపోను ప్రధానోపాధ్యాయులు, ఇతర టీచర్లు, ప్రతి తరగతిలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20గా ఉండాల్సిన అవసరం ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా దేశవ్యాప్తంగా ప్రత్యామ్నాయ విద్యా విధాన, బోధనాభ్యసన ప్రక్రియలపై జరిగిన, జరుగుతున్న పరిశోధనలను గమనంలో ఉంచుకుని ఉపాధ్యాయ శిక్షణ సిలబస్‌తో పాటు మొత్తంగా అక్కడ ఇవ్వబడే శిక్షణ మౌలిక మార్పులకు గురికావాల్సి ఉన్నది.

మాంటిస్సోరి విధానం, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలోచనలు, గుజరాత్‌లో గిజుభాయి, జపాన్‌లోని సొసాకు కొబయాషి, సహోమ్లినిస్కి, లూనాచార్‌స్కి, పాలో ఫ్రియరీ, మకరెంకో, ఏ.ఎస్.నెల్, జాన్‌హోల్ట్, డేవిడ్‌హార్స్‌బరో, డేనియల్ గ్రీన్‌బర్డ్ వంటి వారు ఎందరో బోధనాభ్యసన ప్రక్రియల్లో చేసిన కృషి, ఆచరణ, ప్రయోగాలు వాటి ఫలితాలను అధ్యయనం చేస్తూ మన దేశకాల పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానాలను, సిలబస్, పాఠ్య ప్రణాళికలను, బోధనాభ్యసన ప్రక్రియలను, రూపొందించుకోవల్సిన అవసరాన్ని అసర్ పరిశీలనా ఫలితాలుగాని, గతంలో ఎన్‌సిఇఆర్‌టి, ఎస్‌సిఇఆర్‌టి తదితర సంస్థలు చేసిన సర్వేల ఫలితాలు గాని తెలుపుతున్నాయి.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

భిన్నాభిప్రాయమే రాజద్రోహం అంటున్న చోట...

పాలకులు ప్రజల ప్రాథమిక వాక్ స్వేచ్ఛా స్వాతంత్ర్య హక్కుల్ని కాలరాస్తూ, వలస పాలనలో అమలు చేసిన కాలం చెల్లిన చట్టాలతో పౌరులను నిర్బంధించి తమ వర్గ ప్రయోజనాలను కాపాడుకుంటున్నారని అంటున్నారు **సతీష్ బైరెడ్డి**

గత జనవరిలో జెఎన్‌యు విద్యార్థి నాయకులు కన్హయ్య కుమార్, ఉమర్ ఖలీద్ లపై 2016 ఫిబ్రవరిలో జరిగిన ఒక సమావేశ సందర్భంగ పార్లమెంటుపై దాడి కేసులో ఉరిశిక్ష విధించబడిన అఫ్జల్‌గురుకు అనుకూలంగా మాట్లాడారని, నినాదాలు ఇచ్చారనే కేసులో రాజద్రోహం అభియోగాలను మోపడంతో వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఈ చట్టంపై దేశవ్యాప్తంగా చర్చ మళ్లీ మొదలైంది. జాతీయోద్యమకాలంలో ఇంగ్లండ్ రాణికి అవిశ్వాస పాత్రులుగా భారతీయులు ఉండకూడదన్న ఉద్దేశంతో మొత్తంగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తలెత్తే ఏ ప్రజా ఉద్యమాన్నైనా అణచివేతే లక్ష్యంగా మెకాలే ఈ రాజద్రోహ చట్టాన్ని రూపొందించాడు.

జాతీయ వాదులుగాను, దేశభక్తిలో తమకే పేటెంటు ఉన్నదన్నట్లు వ్యవహరించే సంఘపరివార్ పాలకులు ఇవాళ వారి పాలనపట్ల కనీసమైన, సహేతుకమైన విమర్శను కూడా సహించలేక రాజద్రోహం పేరుతో, జాతీయోద్యమకాలంలో భారతీయ శిక్షాస్మృతిలో ప్రవేశపెట్టిన 124–ఎ ను ప్రయోగించి తమకు సైద్ధాంతిక వ్యతిరేకులనుకుంటున్న వారందరిని బలహీనపరిచేలా వ్యవహరిస్తున్నది. తమ మాటలు, రాతలు, చేతల ద్వారా ప్రజా భద్రతను విచ్ఛిన్న పరిచేలా, హింసను ప్రేరేపించేలా, వ్యవహరించిన వ్యక్తులు, సంఘాలను ఈ చట్టం పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యమగొంతుకల్ని మూగపరిచే తతంగం గత శతాబ్ద కాలానికి పైగానే జరుగుతున్నది. రాజపీఠాల్ని కాపాడడానికి ఏర్పరచిన ఈ చట్టం ప్రజాస్వామ్య వ్యవస్థగా చెప్పుకుంటున్న నేటికీ అమలులో ఉండడమే విడ్డూరం. చరిత్రలో గాంధీ, బాలగంగాధర్ తిలక్ వంటి బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమకారులపై ఈ చట్టాన్ని మోపారు. రాణి పీఠంపై అవిశ్వాసం తలెత్తకుండా, అణచివేత సాధనంగా ఎంచుకున్న ఇంగ్లండ్‌లోనే రద్దయి పోయిన ఈ చట్టాన్ని భారతదేశంలో అత్యుత్సాహంతో అమలు చేస్తున్నారు పాలకులు. జాతీయోద్యమం మొదలైన తొలినాళ్లలో వార్తాపత్రికలు ప్రత్యేకించి ప్రాంతీయ వార్తాపత్రికలు ప్రజలపై వేసే ప్రభావాన్ని అడ్డుకునేందుకు బొమ్మల రూపంలోనైనా ప్రభుత్వ వ్యతిరేకతను వ్యక్తపరచినా జీవితకాలం శిక్ష విధించేలా అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం వ్యవహరించింది.

సరిగ్గా కార్టునిస్ట్ అసీంత్రివేదిపైన కూడా నేటి పాలకులు అలాగే వ్యవహరించారు. పౌరుల స్వేచ్ఛను హరించే అత్యంత ప్రమాదకరమైన ప్రధానమైన సెక్షన్ 124–ఎ అని స్వయంగా గాంధీయే పేర్కొన్నాడంటే అది ఆనాడు అమలైన తీరును అర్థం చేసుకోవచ్చు.

రాజ్యాంగ పరిషత్‌లో సభ్యుడైన కె.ఎం. మున్షి దీన్ని వ్యతిరేకిస్తూ ఏ లక్ష్యం కోసం వలస పాలకులు ఈ సెక్షన్‌ను చేర్చారో దాన్ని అలాగే కొనసాగించేలా చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ కూడా ఈ సెక్షన్‌ని అత్యంత అభ్యంతరకరమైన, దుర్మార్గమైనదే కాకుండా ప్రాథమికంగా రాజ్యాంగ వ్యతిరేకమైనదిగా అభివర్ణిస్తూ, భారతీయ శిక్షాస్మృతి నుండి ఎంత తొందరంగా దీన్ని రద్దుపరిస్తే అంతమంచిదని పేర్కొన్నాడు.

1951లోనే తారాచంద్ గోపిచంద్ వర్సెస్ ది స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో పంజాబ్ హైకోర్టు సెక్షన్ 124–ఎ ను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించినది. 1962లో శాంతి భద్రతల పేరుతో ఆర్టికల్ 19(2) భావ ప్రకటన వ్యక్తీకరణపై హేతుబద్ధమైన పరిమితులు విధించవచ్చని అనే భావన ఆధారంగా 124–ఎ ను రాజ్యాంగబద్ధమే అని అంటూనే దాని విధింపుపై అనేక పరిమితులు విధించింది సుప్రీంకోర్టు.

1995లో బల్వంత్ సింగ్ వర్సెస్ పంజాబ్ స్టేట్ కేసులో విప్లవాన్ని బోధించడం, హింసాత్మకంగా రాజ్యాన్ని కూల్చివేయాలని పిలుపునీయడం, నినాదాలు ఇవ్వడం మాత్రమే రాజద్రోహం కిందికి రాదని హింసాత్మక ఘటనలను తక్షణమే రెచ్చగొడితే తప్ప, అని స్పష్టంగా పేర్కొన్నది.

ఇలాంటి స్పష్టమైన కోర్టు తీర్పులు జాతీయోద్యమ కాలపు నాయకుల అభిప్రాయాలు, అనుభవాలు ఉన్నప్పటికీ పార్టీలతో సంబంధం లేకుండా పాలకులంతా ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి, అసమ్మతి స్వరాలను తొక్కేయడానికి, భిన్నాభిప్రాయాలను, పాలక విధానాలపై విమర్శను సైతం ఎదుర్కొలేక ఈ చట్టాన్ని ప్రయోగిస్తున్నాయి.

ఇది ఎక్కడ వరకు వచ్చిందంటే రాజకీయ పరమైన ఉద్యమాలను వదిలేస్తే ఫేస్‌బుక్ పోస్టింగ్‌కు లైకులు కొట్టినందుకు, యోగా గురువులను విమర్శించినా, 'పాకిస్తాన్ నరకం కాదు' అనే అభిప్రాయం ప్రకటించినా, తమకు నచ్చిన క్రికెట్ టీంకు జేజేలు పలికినా, బిగ్గరగా నినాదాలు చేసినా, ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ కార్టున్లు గీసినా, పాటలు పాడినా, కవిత్వం రాసినా, చివరికి సినిమా హాల్లో జాతీయగీతం సమయంలో లేచి నిలబడనందుకు కూడా రాజద్రోహులయ్యే ప్రమాదాన్ని బిజెపి పాలన తెచ్చిపెట్టింది. చనిపోయిన జవాన్లకు సెల్యూట్ చేయక పోయినా, ఆర్మీ ఆకృత్యాలను వ్యతిరేకించినా, జవాబుదారీతనం కోరినా, దేశద్రోహులవుతున్నారు. గోమాంస భక్షణకు పాల్పడినా జాతి ద్రోహులనే ముద్రలను ముఖాన వేసే రోజులు మరీ దూరంలో లేకపోవచ్చు!

తమిళ గాయకుడు కోవన్ ఆ రాష్ట్ర ప్రభుత్వ మద్యం విధానాన్ని విమర్శిస్తూ పాటపాడినందుకు దేశద్రోహి అయ్యాడు. తమిళనాడులోనే కూడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఉద్యమించినందుకు గాను ఊరు ఊరంతా దేశ ద్రోహుల జాబితాలో చేరిపోయింది. 8,856 మంది సాధారణ ప్రజలపై ప్రాజెక్టువల్ల ప్రమాదం ఉందన్న 'మహానేరా'నికి 124–ఎ సెక్షన్‌ని ప్రయోగించారు. జార్ఖండ్‌లో ఆదివాసులు విస్థాపనను

వ్యతిరేకిస్తూ తమ వనరులపై తమకే అధికారం అంటూ బహుళజాతి కంపెనీలకు అడవులను అప్పగించడాన్ని నిరసిస్తూ ఉద్యమించిన పాపానికి 'ద్రోహు'లయ్యారు. రాజ్యాన్ని ప్రశ్నిస్తే రాజద్రోహులు, అన్యాయాన్ని ఎదిరిస్తే తీవ్రవాదులుగా ముద్రలువేసి ముద్దాయిలుగా నిలబెట్టి జీవితాలను విధ్వంసం చేస్తున్నారు. పాలక పార్టీ విధానాన్ని విమర్శిస్తేనే అది జాతిద్రోహం అయి కూర్చుంది!

పాలకుల విశ్వాసాలు, సిద్ధాంతాలను ప్రశ్నించడమే దేశానికి పెనుముప్పు తెస్తుందన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడమే, ఓటువేయడమే ప్రజాస్వామ్య అంతిమ రూపమన్నట్లు ప్రశ్నించడం, భిన్నాభిప్రాయాన్ని, అసమ్మతిని వ్యక్తం చేయడం ప్రజాస్వామిక హక్కుల్లో భాగం కాదన్నట్లుగా వ్యవహరిస్తూ ప్రతి మనిషిని నేరస్తునిగానే చూస్తున్నారు. అతిపెద్ద ప్రజాస్వామిక దేశం అని గొప్పలకు పోయే పాలకులు అత్యంత అనాగరికమైన, అప్రజాస్వామిక చట్టాన్ని అమలు చేయడం వెనుక వారు రక్షించాలనుకుంటున్న వర్గ ప్రయోజనాలు ఉన్నాయి. కాబట్టే ఇంకా 'రాజద్రోహ' చట్టాలు అవసరం ఉందనేలా ప్రచారం చేస్తున్నారు.

ప్రపంచలో మేజారిటీ దేశాలు ఈ చట్టాన్ని ఏనాడో రద్దుపరిస్తే వలస పాలనా కాలపు అవశేషమైన 'ద్రోహ' సెక్షన్‌ను కొనసాగిస్తూ పాలకుల పీఠాలను, ప్రయోజనాలను కాపాడుకునేందుకే గాని ప్రజల ప్రయోజనాలు, స్వేచ్ఛలను హరించేస్తుందనే చారిత్రక అనుభవం ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తూ విస్మరిస్తున్నారు.

ఒక రంగానికి సంబంధించిన వారని కాదు - విద్యార్థులు, అధ్యాపకులు, కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, కార్టునిస్టులు ఇక హక్కుల కార్యకర్తలైతే సరేసరి అనేక జీవన రంగాలకు చెందిన వారిని ఏదో ఒక సందర్భంలో తమ భావ ప్రకటన స్వేచ్ఛలో భాగంగా ఏదైనా చెప్పినందుకో, రాసినందుకో, కళగా ప్రదర్శించినందుకో ఈ సెక్షన్ కింద జైల్లో వేయడం జరుగుతున్నది.

బినాయక్‌సేన్, అరుంధతిరాయ్ లాంటి వాళ్లను ఏ పార్టీ అధికారంలో ఉన్నా బెదిరిస్తూనో, వేధిస్తూనో ఉన్నాయి. అలా కేసు నమోదైన ప్రతి సందర్భంలో ఆ ప్రత్యేక కేసులో యోగ్యతలు, అయోగ్యతలు చర్చించడం అభిప్రాయాలు చెప్పడం, చట్టం దుర్వినియోగం అయిందనే అంశాలే ప్రధానమవుతున్నాయి.

ప్రతిపక్ష పార్టీలు అయితే అదే కేసుకు బాధితులు అయినపుడు సూత్రబద్ధంగా వ్యవహరించడం, ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం చేస్తున్నాయి తప్ప మొత్తంగా ఆ సెక్షన్‌నే తొలగించాలని డిమాండ్‌ను నిజాయితీగా, బలంగా వినిపించలేకపోవడం వెనుక అధికారంలోకి మళ్లీ వస్తే అదే పనిని తాము చేయాల్సి వస్తుందనేమో! దుర్మార్గమైన చట్టాన్ని ప్రయోగించే విషయంలో మానవీయ మార్పులనో, పరిమితులు విధించాలనో దుర్వినియోగం కాకుండా చూడాలనో చేసే వాదనలన్నీ హాస్యాస్పదమైనవి. అది మొత్తంగా నిర్మూలించబడకుండా మానవీయ పూతలు, దుర్వినియోగం అడ్డుకోవాలనే మాటల్ని ద్వంద ప్రమాణాలకు మాత్రమే అద్దంపడతాయి తప్ప సూత్రబద్ధవైఖరిని, ప్రజాస్వామిక విలువలను గౌరవించాలనే దృక్పథాన్ని ప్రతిబింబించవు.

సంఘపరివార్-బిజెపి ఎన్నికలు సమీపిస్తున్న వేళ 'దేశభక్తి' సరుకును ఎన్నికల మార్కెట్‌లోకి మరింతగా తెచ్చి లాభం పొందాలనుకుంటున్నవి. కశ్మీర్ బూచి కావచ్చు, దేశ 'సార్వభౌమాధికారం', రక్షణ ఐక్యత 'శత్రు' దేశాల నుంచి ప్రమాదం పొంచి ఉందనో తమను విమర్శించే, వ్యతిరేకించే వారందరిని భయపెట్టి, బలహీనపరచి, మళ్లీ అధికార పీఠాన్ని నిలుపుకోవాలనుకుంటున్నవి.

ఒకవైపు దేశమంతా కాషాయ మాఫియా విద్వేశపూరితమైన, అసహన సంస్కృతిని పెంచిపోషిస్తూ, మరో మత సమూహంవల్ల దేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందని బెదిరిస్తూ మెజారిటీ మత ప్రజలను రెచ్చగొట్టి లబ్ధిపొందడమనే వ్యూహమే కాకుండా తమ దారికి రాని వారందరినీ 124-ఎ సెక్షన్‌ను అడ్డుపెట్టుకొని తాను పూర్తిగా రాజ్యాంగ బద్ధంగా వ్యవహరిస్తున్నాననే దృశ్యాన్ని బయటి ప్రపంచానికి చూపెడుతున్నది.

కాలం చెల్లిన చట్టాలను రద్దు పరుస్తామని పదేపదే పలికే ప్రధాని నరేంద్రమోదీకి ప్రజల ప్రాథమిక హక్కుల్ని హరించే ఈ అనాగరిక చట్టం ఎందుకు కనిపించడంలేదో మరి? కాలం చెల్లడం అంటే తమ ప్రయోజనాలు తమ వర్గ ప్రయోజనాలను ఆటంకపరుస్తాయన్న చట్టాలో లేదా దళిత, ఆదివాసుల పోరాటాలు, త్యాగాల ద్వారా సంపాదించిన ప్రత్యేక రక్షణలో మరి? నయా ఉదారవాద విధానాల విధ్వంసాన్ని ప్రశ్నించే ప్రతి సందర్భంలోనూ, ఫాసిస్టు చర్యలను ప్రతిఘటించే పనికి పూనుకున్నప్పుడల్లా 'దేశభక్తి', 'జాతి' ప్రయోజనాలు గుర్తుకు వచ్చి దేశద్రోహాల సెక్షన్‌లు ఎందుకు వస్తున్నాయి? దేశ ప్రజలందరి సమిష్టి సంపదైన సహజవనరులన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడం కంటే ప్రజాద్రోహం ఇంకేముంటుంది?

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

అంతరాల భారత్ - ఆక్స్‌ఫామ్ నివేదిక

పాలకులు అభివృద్ధిగా చెపుతున్న వృద్ధి కార్పొరేట్‌లకేనని కోట్లాది మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారని ఇది ముందు ముందు అంతర్గత సంఘర్షణకు దారితీస్తుందని ఆక్స్‌ఫామ్ సంస్థ తెలుపుతున్న వాస్తవాలను వివరిస్తున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

మన దేశంలో ప్రతి పౌరుడికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాల్లో సమానత్వం కల్పించాలన్న అంతస్సూత్రంపై రూపుదాల్చిన భారత రాజ్యాంగం అన్నింటా అందరికీ సమన్యాయం, సమధర్మాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించింది. అయితే ఇండియాలో అసమానతలు ఎంతగా పెచ్చరిల్లుతున్నాయో ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ తాజా నివేదిక కళ్లకు కడుతోంది. భారత్‌లో ఆర్థిక అసమానతలు ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్నాయని, ఇతర దేశాలతో పోటీపడుతూ వృద్ధిరేటులో దూసుకుపోతున్నా, సంపద సృష్టి ప్రతీయేట గణనీయ స్థాయిలోనే పెరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నా ఇవి దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మాత్రం సమానంగా చేరడం లేదు. దీంతో బడాబాబులు మరింత సంపన్నులు గాను, పేదవారు కఠిక పేదవారిగాను మారిపోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం దేశంలోని సంపద పంపిణీకిగాను నిర్దిష్టమైన విధానం అమలులో లేకపోవడం, సంపన్నులకు దన్నుగా నిలిచేలా దేశంలోని రాజకీయార్థిక వ్యవస్థ పనిచేస్తుండడం మరో కారణం.

ప్రపంచవ్యాప్తంగా పేద, ధనిక వ్యత్యాసం అసాధారణ స్థాయిలో పెరిగిపోతున్నదని, దీనిని అదుపు చేయకపోతే సామాజిక కల్లోలాలు సంభవిస్తాయని బ్రిటన్‌కు చెందిన ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ చేసిన తాజా హెచ్చరిక దాదాపు గత మూడు దశాబ్దాలుగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా వరల్డ్ బ్యాంక్ దర్శకత్వంలో అంతటా అమలువుతూ వస్తున్న ఆర్థిక విధానాల దుష్ఫలితమేనని ప్రత్యేకించి చెప్పుకోనక్కరలేదు. ప్రజల సంక్షేమ బాధ్యత నుంచి ప్రభుత్వాలు పూర్తిగా తప్పుకొని, పబ్లిక్ రంగాన్ని క్షీణింపజేసి, ప్రైవేట్‌కు పగ్గాలు అప్పగించిన ఫలితంగానే సంపన్నుల వద్ద మరింతగా సంపద పోగుపడడం పేదలు ఊహించనంత వేగంగా నిరుపేదరికంలోకి కూరుకుపోవడం జరుగుతున్నది. సాధారణ ప్రజలకు తాత్కాలిక ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరుగుతున్నట్టు కనిపించినా, ఆదాయాలు గతం కంటే మెరుగైనట్టు అనిపించినా వారి నికర కొనుగోలు శక్తి అడుగంటిపోవడం వల్ల బతుకులు నిరంతర యాతనగా మారుతున్నాయి.

1947 ఆగష్టు 15న బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం జరిగిన అధికార బదిలీ రోజున ప్రపంచ మానవాభివృద్ధి సూచీలో భారత్ స్థానం ఎనభై ఆరు కాగా 2018 నాటికి ఆ ర్యాంక్ నూట ముప్పైకి దిగజారింది. గత ఏడు దశాబ్దాలుగా పన్నెండు ప్రణాళికలు అమలు చేసినా, మౌలిక లక్ష్యసాధన ఏనాడో గాడి తప్పిందని రుజువైంది. వ్యవస్థాగత వైఫల్యాలు కోట్లాది ప్రజల బతుకుల్ని ఎంతగా గుల్లబార్చాయో సామాజికార్థిక కులగణన (2015) సర్వే సోదాహరణంగా తెలియజెప్పింది. మూడొంతుల మంది గ్రామీణులు నెలకు అయిదు వేల రూపాయల బొటాబొటీ రాబడితో నెట్టుకొస్తున్నారు. మూడోవంతుగా ఉన్న గ్రామీణ వ్యవసాయ కూలీలకు సెంటు భూమి లేదు. పల్లెవాసుల్లో సగం మందికి సరైన విద్య లేనందున శరీర శ్రమతో బతుకీడుస్తున్నవారే. ప్రపంచ బ్యాంకు సరికొత్త ప్రమాణాల ప్రకారం రోజుకు అయిదున్నర డాలర్ల (దాదాపు రు.390) కన్నా తక్కువ సంపాదించేవారు దుర్భర పేదరికంలో మగ్గుతున్నట్లు లెక్క. అందులో సగమైనా కళ్లజూడలేనివారు కోట్ల సంఖ్యలో ఉన్న దేశం మనది!

1947 ఆగస్టు 15 తరువాతి పరిస్థితులను పరిశీలించినట్లయితే సంపన్నులు బహుళ కోటీశ్వర్లుగా మారిపోగా, పేదవాళ్ల పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రతి ఏడాది ఐదు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) సమావేశం జనవరి 21 ప్రారంభానికి ముందు ఆర్థికాభివృద్ధి నివేదిక అందించే ప్రముఖ ఆర్థిక సర్వే సంస్థ 'ఆక్స్‌ఫామ్' తాజాగా 2018 గణాంకాల నివేదికను విడుదల చేసింది. భారతదేశంలో సంపద పంపిణీ ఎంత పక్షపాతంతో జరుగుతున్నదో, ధనిక–పేదల మధ్య అంతరాలు ఎంతగా పెరిగిపోతున్నాయో ఆ నివేదిక దర్పణం పడుతుంది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రజల మతిపోయే వాస్తవ గణాంకాలు వెల్లడించింది. అసమానతలు నివారించడానికి భారత ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిబద్ధత ననుసరించి ప్రపంచ సూచీలో భారత్‌కు కింది నుంచి 11వ స్థానం ఆక్స్‌ఫామ్ ఇచ్చింది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక సంస్కరణలకు బాకా ఊదే పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రవేత్తలు, లాభాల కోసం ఎంతకైనాతెగించే కార్పొరేట్ సంస్థలు, వారి అడుగులకు మడుగులొత్తే దళారీ పాలక వర్గాలు చెబుతున్న వృద్ధి లెక్కల్లోని సారాంశమిదే! బూర్జువా ఆర్థికవేత్తలు చెబుతున్నట్లు ఆర్థికవృద్ధి సహజంగానే బొట్లు బొట్లుగా సహజంగానే కింది వర్గాలకు చేరుకుంటాయన్న అవరోహణ (ట్రికిల్ డౌన్) సిద్ధాంతం వాస్తవిక కార్యాచరణలో కొరగానిదైందని ఆక్స్‌ఫామ్ నివేదికాంశాలు ధృవీకరిస్తున్నాయి. మన దేశ దళారీ పాలకవర్గాలు పెరుగుతున్న అసమానతలను, తరుగుతున్న జీవన ప్రమాణాలను చూడరు. వీరి దృష్టిలో దేశమంటే అంబానీలు... ఆదానీలే! ఆకలి చావుల బారిన పడుతున్న పేదలు, ఆత్మహత్యలకు పాల్పడుతున్న అన్నదాతలు, ఇతర సాధారణ ప్రజానీకం వీరి కళ్లకు కనపడరు. కొందరి ఖజానాలు నిండటాన్నే మసిపూసి మారేడు కాయ చేసి వృద్ధి లెక్కలంటూ తప్పుదోవ పట్టిస్తున్నారు. నిజానికివి పేరు గొప్ప ఊరు దిబ్బ లెక్కలే! వీటి వల్ల దేశ ప్రజలకు ఒరిగే ప్రయోజనం శూన్యం!

ప్రపంచ వ్యాపితంగా ఏఏటికాయేడు సంపన్నులు మరింత సంపన్నులు గాను, పేదలు మరింత పేదలుగా మారిపోతున్నారు. ధనిక–పేదల మధ్య అంతరాలు మరింతగా పెరిగిపోతున్నాయి. ఇందుకు పాలకులు అనుసరిస్తున్న విధానాలే ప్రధాన కారణంగా చెప్పక తప్పదు. ప్రభుత్వాలు కార్పొరేట్ల, ఆశ్రిత పెట్టుబడుదారుల అనుకూల విధానాలను చేపడుతూ వారి సంపద పెరగడానికి దోహద పడుతున్నాయి. మరో పక్క ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా కుంగదీయడమే కాక, అనాలోచిత, తొందరపాటు నిర్ణయాలతో పన్నుల పెనుభారం మోపి వారి నడ్డి విరుస్తున్నాయి. కార్పొరేట్లకు, సంపన్నులకు పన్ను రాయితీలను కల్పిస్తూ వారు మరింత కుబేరులు కావడానికి చేయూతనిస్తున్నాయి. మరోవైపు హక్కుల కొరకు ఉద్యమిస్తున్న ఉద్యమకారుల గొంతు నొక్కి వేస్తూ, ప్రజా ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారు. పాలకుల విధానాలు మారకపోతే కార్మికులు సృష్టిస్తున్న సంపద మరింతగా కుబేరుల చేతుల్లోకి చేరుతుందని ఆక్స్‌ఫామ్ హెచ్చరించింది.

మనదేశ అత్యంత సంపన్నుల్లో అగ్రశ్రేణి ఒక్క శాతం ఆదాయం 39 శాతం పెరగ్గా, దిగువనున్న సగం భారతీయ జనాభా ఆదాయం కేవలం మూడు శాతం పెరిగిందని ఆక్స్‌ఫామ్ నివేదిక తెలిపింది. భారతీయ కోటీశ్వరుల ఖాతాలో గత ఏడాది సగటున రోజుకు రు. 2200 కోట్లు జమయ్యాయి. కాగా అత్యంత పేదలైన పదమూడున్నర కోట్ల మంది 2004 నుండి నేటి వరకు ఎలాంటి ఆర్థికాభివృద్ధి లేకుండా అప్పుల్లో కొనసాగుతున్నట్లు నివేదిక వెల్లడించడం పేద ప్రజల అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం అవగతమవుతోంది. కింది నుంచి అరవై శాతం పేద ప్రజలకు 4.8 శాతం సంపద అందుబాటులో ఉంటే, పైనున్న పది శాతం మంది అగ్రశ్రేణి సంపన్నుల చేతిలో 77.4 శాతం సంపద పోగుబడింది. అందులో ఒక్క శాతం అగ్రశ్రేణి వారి చేతిలోనే 51 శాతం సంపద మూలుగుతోందని, రానున్న నాలుగేళ్లలో రోజుకి డెబ్బై మంది కోటీశ్వరులు పుట్టుకొస్తారని పేర్కొనడం చూస్తే ప్రభుత్వాలు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాల సరళిని బట్టి లక్షలాది మంది ప్రజలు పేదలుగా మారిపోవలసి వస్తుంది.

దేశంలో 2016లో 16 మంది, 2017లో 17 మంది, 2018లో 18 మంది శత కోటీశ్వరులు అదనంగా పెరిగారు. మొత్తం బిలియనీర్ల సంఖ్య 119 కాగా, వారి మొత్తం ఆస్తి 28 లక్షల కోట్లకు చేరింది. ఆర్థిక సంపద పెరుగుతోందంటూ నరేంద్రమోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నప్పటికీ పెరిగిన సంపద ఎవరి చేతుల్లో కేంద్రీకృతం అమవుతున్నదో ఆక్స్‌ఫామ్ కుండబద్దలు కొట్టింది. కార్ల్‌మార్క్స్ 170 సంవత్సరాల క్రితమే 'పెట్టుబడి' గ్రంథంలో చేసిన సూత్రీకరణలు అక్షర సత్యాలని రుజువవుతోన్నాయి. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ 'సంపన్నులను మరింత సంపన్నులుగాను పేదలను మరింత పేదలుగాను మారుస్తుంది'. 'ఒక ధృవము వద్ద సంపద పోగు పడినప్పుడు అదే సమయంలో మరో ధృవము వద్ద పేదరికం, అజ్ఞానం పోగుపడతాయి' అని ఆయన తెలిపాడు.

ప్రపంచ వ్యాప్తంగా ధనికులు–పేదల మధ్య పెరుగుతున్న అంతరాన్ని ఎదుర్కొవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని దావోస్‌లో జనవరి 21 నుంచి 24 వరకు సమావేశమైన రాజకీయ, వాణిజ్య నాయకులను ఆక్స్‌ఫామ్ కోరింది. పెరుగుతున్న ఈ అసమానతలు పేదరికంపై పోరాటాన్ని తక్కువ చేస్తుందని, ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తుందని, ప్రపంచ వ్యాపితంగా ప్రజాగ్రహాన్ని రేకెత్తిస్తుందని కూడా ఆక్స్‌ఫామ్ పేర్కొంది. పేద ప్రజలు ఒక పూట తింటే మరోపూట పస్తులుంటూ, తమ పిల్లల మందులకు, చదువుకు డబ్బులు చెల్లించలేని స్థితిలో ఉండగా, కొద్దిమంది సంపన్నులు భారతదేశ సంపదలో అత్యధిక వాటాను హస్తగతం చేసుకోవడం "నైతికంగా అత్యంత దుర్మార్గం" అని డబ్ల్యుఇఎఫ్‌లో పాల్గొన్న కీలక వ్యక్తుల్లో ఒకరైన ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విన్నీబైయాన్‌యిమా పేర్కొన్నారు.

"ఒకవేళ ఒక్కశాతం అగ్రశ్రేణి సంపన్నులు, మిగతా భారతీయుల మధ్య ఈ అసభ్య అసమానత కొనసాగినట్లయితే, దేశ సామాజిక, ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా పతనమవుతుంది" అని కూడా విన్నీ పేర్కొనడం గమనార్హమైన విషయం. ఆమె వ్యక్తం చేసిన ఆందోళన నేపథ్యంలో భారత ప్రభుత్వ ఏలికలు పరిస్థితి తీవ్రతపై దృష్టి సారించి అంతరాలను రూపుమాపేందుకు తక్షణ చర్యలు చేపట్టవలసి ఉంటుంది. అయితే, కార్పొరేట్లు, ఆశ్రిత పెట్టుబడిదారుల ప్రయోజనాలు పరిరక్షించి, వారి బొక్కసాలు నింపడమే పరమావధిగా పెట్టుకున్న కేంద్రంలోని కాషాయ ప్రభుత్వం అటువంటి చర్యలు చేపడుతుందని ఆశించడం పొరపాటే అవుతుంది. మోడీ నాలుగున్నరేళ్ల పాలనను గమనిస్తే పెట్టుబడిదారుల పట్ల ఎంత ఆశ్రిత పక్షపాతం వహించాడో గమనిస్తూనే ఉన్నాం.

ధనికుల సంపద రోజుకు రెండువేల కోట్ల రూపాయలు పెరుగుతూ రావడాన్ని బట్టి పెద్దనోట్ల రద్దు, ఆర్థిక వ్యవస్థ మందకొడితనం ఇత్యాది బాధలన్నీ పేదలకే తప్ప పెద్దలకు కాదని అర్థమైంది. పెరుగుతున్న ఈ అసమానతలను సరిదిద్దకపోతే సామాజిక అశాంతి ప్రబలిపోతుందనీ, ప్రజాస్వామ్యం ఉనికికే ముప్పు వాటిల్లుతుందనీ ఆక్స్‌ఫామ్ ఈ నివేదికలో మరోమారు హెచ్చరించింది. ఈ హెచ్చరికలను మన పాలకులు పట్టించుకోవడం మానేశారు. దానితోపాటు, పేదలను ఆదుకొనేందుకు ఉద్దేశించిన పథకాలు, కార్యక్రమాలకు నిధులు కోతబెట్టడం కూడా వేగంగా సాగిపోతున్నది. చుట్టూ పేదరికం తాండవిస్తుండగా, మధ్యలో కుబేరులు కోటలు కట్టుకొని కూర్చుంటే అత్యధిక జనాభాకు కడుపు మండదనీ, తిరుగుబాట్లు ఉండవనీ పాలకులు నిజంగా అనుకుంటున్నారో, లేక నిర్దాక్షిణ్యంగా అణచివేయవచ్చునని నమ్ముతున్నారో తెలియదు.

సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటుతో ఉత్పాదకత హెచ్చుతున్నా దేశంలో అత్యధిక జనాభా దారిద్ర్యంలోనూ, నిరాశా నిస్పృహల్లోనూ మగ్గిపోవడం సిగ్గుచేటైన విషయం. బిలియనీర్ల సంఖ్యలు, వారి సంపదలు ఏటా పెరిగిపోతుండటం, పేదలు మరింత దిగజారి పోవడం మన సత్వర ఆర్థికాభివృద్ధి మాయకు నిదర్శనం. బ్యాంకుల్లో 10 లక్షల కోట్ల మేరకు పేరుకుపోయిన నిరర్థక ఆస్తులు కూడా అపరకుబేరుల సంఖ్య ఎలా పెరిగిందో తెలియచెబుతాయి. కొద్దిమంది సంపన్నులకు కాక, ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దమనీ, కార్మిక శక్తికి ప్రాధాన్యం ఇమ్మనీ, వ్యవసాయంలో పెట్టుబడులు పెంచమనీ ఆక్స్‌ఫామ్ చెబుతూంటుంది కానీ, కార్మికచట్టాలను నిర్వీర్యం చేసి, పెట్టుబడిదారులను రెడ్‌కార్పెట్‌తో స్వాగతించడంలో పాలకులకు ఉన్న ప్రయోజనాల ముందు ఇవేవీ నిలవడం లేదు.

ప్రభుత్వ విధానాలతో కార్మిక వర్గం తీవ్రమైన దోపిడీకి గురవుతున్నది. కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా సవరించటం, కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయటం, యూనియన్లు పెట్టుకోవటంపై ఆంక్షలు విధించడం, సమ్మె హక్కును హరించడం, పని గంటలు పెంచడం, వేతనాలలో కోత పెట్టడం, పిఎఫ్ జమ చేయకపోవడం తదితరాలతో కార్మికవర్గంపై దోపిడీని తీవ్రం చేశారు. కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ సర్వీసులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్న సుమారు 60 లక్షల ఖాళీలను భర్తీ చేయకుండా నామమాత్ర వేతనాలతో కాంట్రాక్టు, క్యాజువల్, గౌరవ వేతనం తదితర పేర్లతో దోపిడీ చేస్తున్నారు.

వృద్ధిమాయలో జనాన్ని మభ్య పెడుతున్న పాలకులకు అంతర్జాతీయ సర్వేలు, విశ్లేషణలు మరింత ఊతాన్నిస్తున్నాయి. భారతదేశం ఈ ఏడాది చివరికల్లా ఫ్రాన్స్, బ్రిటన్‌లను దాటేసి, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఐదో స్థానంలో నిలుస్తుందని ఇటీవలే పిడబ్ల్యుసి అనే సంస్థ ప్రకటించింది. కానీ, ఈ లెక్కలకు, క్షేత్ర స్థాయి వాస్తవాలకు ఏ మాత్రం పొంతన లేదు. నోట్ల రద్దు ప్రభావంతో విచ్ఛిన్నమైన అనేక రంగాలు ఇంకా తేరుకోలేదు. భారత రైతాంగం ఉద్యమాల బాట పడుతున్నది. ఆత్మహత్యలు ఆగలేదు. గిట్టుబాటు ధరలు కలగానే మిగిలాయి. అన్ని రంగాల్లోనూ ఉపాధిలేమి స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రజల కొనుగోలు శక్తి దినదినం కృంగిపోతోంది. ఆక్స్‌ఫామ్ నివేదిక పాలకులు అందంగా అల్లిన వృద్ధిమాయను ఛేదించి, అసలు నిజాన్ని మనముందు ఉంచింది.

ప్రపంచంలోని దాదాపు సగం మంది జనాభాలోని 300 కోట్ల అత్యంత పేదల వద్దవున్న సంపదకు సమానమైన సంపద గత ఏడాది 44 మంది వద్ద కేంద్రీకృతం కాగా, ఈ ఏడాది కేవలం 26 మంది వద్దే కేంద్రీకృతమై ఉందని ఆక్స్‌ఫామ్ పేర్కొనడం దిగ్భ్రాంతికరమైనది. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బిజోస్ సంపద గత ఏడాది 112 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగింది. ఆయన సంపదలోని ఒక శాతం 11.5 కోట్ల మంది జనాభా గల ఇథియోపియాదేశ బడ్జెట్‌తో సమానమని ఆక్స్‌ఫామ్ వెల్లడించింది. ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి ప్రభుత్వ సేవలకు తక్కువగా నిధులు కేటాయిస్తూ అసమానతలను ప్రభుత్వాలు ఏ విధంగా పెంచేస్తున్నాయో ఆక్స్‌ఫామ్ వెల్లడించింది. ఒక పక్కన కార్పొరేట్లపై, సంపన్నులపై తక్కువ పన్నులు విధిస్తూ, ఇతరులపై అధిక పన్నులు విధిస్తూ విరుచుకుపడడంతో అసమానతలు పెరగడానికి దారి తీస్తున్నట్లు తమ సర్వేలో వెల్లడైనట్లు భారత్‌లోని ఆక్స్‌ఫామ్ సిఇవో అమితాబ్ బెహర్ చెప్పారు. సామాన్య ప్రజలపై ఉదాసీనత, సంపన్నులపై ఉదారత చూపే విధానాలను ప్రభుత్వం మార్చుకోకపోతే అంతరాలు మరింతగా విస్తరిస్తాయని చెప్పారు.

ప్రజల అలనాపాలనా చూసుకునే బాధ్యత నుంచి ప్రభుత్వాలు తప్పుకొని ప్రైవేట్‌కు ఉత్పత్తి, సేవల రంగాన్ని అప్పగించడానికి చెప్పే ప్రధాన కారణం వేగంగా వృద్ధిని సాధించడం, దాని ద్వారా ఉపాధి అవకాశాలు పెంచి ప్రజలను ఆదుకోవడం. మన దేశ పరిస్థితినే గమనిస్తే ఆర్థిక సంస్కరణల అమలు ప్రారంభమై జోరందుకున్న గత దాదాపు మూడు దశాబ్దాల్లో ప్రజల సంక్షేమం, సంపద క్షీణించి ప్రైవేట్ వ్యక్తులు, శక్తుల వృద్ధి అపరిమితంగా సాగింది. ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రత్యామ్నాయంగా ఆధారపడదగ్గ ఉపాధి అవకాశాలు పెరగలేదు. ప్రైవేట్ రంగం తన కాళ్ల మీద తాను వృద్ధిని సాధించడానికి బదులు ప్రభుత్వ ఖజానాకు చిల్లులు పెట్టడం ద్వారా ఆశ్రిత పోషణపై సంపద పెంచుకుంటున్నది. తయారీ, ఎగుమతుల రంగాలు పుంజుకోకపోగా క్షీణించిపోతున్నాయి.

2008 సంవత్సరంలో సంభవించిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం తరువాత ఈ పదేండ్లలో కార్మికుల వేతనాలు స్తంభించాయి. చాలామంది వేతనాలలో కోతపడింది. వీటితోపాటు మిత వ్యయ విధానాన్ని అవలంభించడం వల్ల విద్య, ఆరోగ్య, సామాజిక, తదితర సేవలు కుంటుపడ్డాయి. ఈ సమయంలోనే సంపద కొందరి చేతుల్లోనే పోగుపడింది. గత ఎనిమిదేండ్లుగా ఆక్స్‌ఫాం వంటి సంస్థలు ఎంతగా హెచ్చరించినా పాలకవర్గాలు అసమానతలను అరికట్టడం లేదు. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ పరిస్థితి మరింతగా దిగజారుతోంది. ప్రయివేటు లాభాల, ఫైనాన్స్ మార్కెట్ల నియంతృత్వాన్ని అంతమొందించి కార్మికులు సృష్టించే సంపదను సమాజపరం చేయటం జరిగితేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములను, అటవి భూములను లాక్కొని కార్పొరేట్ సంస్థలు, బడా వ్యాపారులు, కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నది. లక్షల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ రంగ పరిశ్రమల వాటాల విక్రయం (డిజ్ఇన్వెస్ట్‌మెంట్) పేరుతో పెట్టుబడిదారులకు అప్పగిస్తోంది. గనులు, సముద్రం, తీరప్రాంతం, అడువులు,ఆకాశం-స్పెక్ట్రం-తదితర జాతి సహజ సంపదలను మొత్తంగా పెట్టుబడిదారుల పరం చేస్తున్నారు. అందువల్లనే ప్రజలు దరిద్రులవుతుంటే పెట్టుబడిదారుల సంపదలు పెరుగుతున్నాయి. బిజెపి ప్రభుత్వ పాలనలో శత కోటీశ్వరుల సంపదలు మరింత వేగంగా పెరగడం ఆ పార్టీ బడా పెట్టుబడిదారులకు మరింత విశ్వాసంగా పనిచేస్తున్నదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పెట్టుబడిదారులు సమర్థులవడం వలన వారి సంపదలు పెరగడం లేదని, దోపిడీదారులకు అనుకూలంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు వారి సంపద పెరగడానికి కారణం అవుతున్నాయని పై వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

సామాన్యులకు చెందాల్సిన సంపదలోని వాటా వారికి దక్కకుండా సంపన్నుల చేతికి పోతుంది. సంపన్నులకు వంతపాడే ప్రభుత్వాలు ఏర్పడకుండా అప్రమత్తంగా ఉండవలసిన బాధ్యత, కర్తవ్యం దేశ ప్రజలందరిపై ఉన్నదని గుర్తెరగాలి. గత ఎనిమిదేండ్లుగా ఆక్స్‌ఫాం వంటి సంస్థలు ఎంతగా హెచ్చరించినా పాలకవర్గాలు అసమానతలను అరికట్టడానికి పూనుకోవటం లేదు. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ పరిస్తితి మరింతగా దిగజారిందని విధితమవుతోంది. ప్రైవేటు లాభాల, ఫైనాన్స్ మార్కెట్ల నియంతృత్వాన్ని అంతమొందించి కార్మికులు సృష్టించే సంపదను సమాజపరం చేయడమే ఈ సమస్యకు పరిష్కారం. ప్రభుత్వరంగంలోనే ఉత్పత్తిని సాగించి ప్రైవేట్ పెట్టుబడులకు చరమగీతం పాడితేనే స్వావలంబన సాధించగలుగుతాం. సహకార, సమిష్టి వ్యవస్థలను ఏర్పరుచుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంపదలోని అంతరాలను తగ్గించాలంటే సంపన్నులపై పన్నులు పెంచి సాధారణ ప్రజలపై భారం తగ్గించాలి. ప్రభుత్వ రంగానికి, సంక్షేమానికి ప్రాధాన్యం పెరగాలి. లేని పక్షంలో కల్లోల పరిస్థితులకు దారితీస్తుంది. ప్రజా తిరుగుబాట్లు మరింతగా విస్తరిస్తాయి. ఉద్యమాలకు మించిన మార్గం మరొకటి లేదని చరిత్ర మనకు నిత్యం పాఠం చెబుతూనే ఉంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

మానవత్వం లోపించిన పౌరసత్వ చట్ట సవరణ బిల్లు

రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భిన్నంగా బిజెపి ప్రభుత్వం పౌరసత్వ చట్ట సవరణ బిల్లును మత ప్రాతిపదికన ఎన్నికల ప్రయోజనాల కోసం తెస్తుందని, దీంతో విద్వేషాలు రేగే అవకాశం ఉందని అంటున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

'భారతరత్న' – భారతదేశంలో అత్యంత విలువకలిగినదిగా భావించే అవార్డు. ఏదైనా రంగంలో ప్రపంచంలో దేశ ప్రతిష్టను ఇనుమడింప చేసే కృషి చేసిన గొప్ప వ్యక్తులకు భారత కేంద్ర ప్రభుత్వం ప్రకటించే పురస్కారాలన్నింటికిలోకి మిన్న 'భారతరత్న' బిరుదు. ఈ సంవత్సరం ఆ అవార్డుకు ఎంపికైన వారిలో ప్రఖ్యాత అసోం కవి, గాయకుడు భూపెన్ హజారికా కూడా ఒకరు. ఆయన మరణానంతరం ఈ అవార్డు ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. అయితే, ఈ అవార్డును అందుకోవడానికి తమ కుటుంబం సిద్ధంగా లేదని ఆయన పుత్రుడు, అమెరికాలో స్థిరపడ్డ తేజ్ హజారికా ప్రకటించాడు. ఇది ఆయన నిరసన ప్రకటన. అస్సాంలో, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో స్థిరపడ్డ లక్షలాది మంది ప్రజలకు పౌరసత్వం పేరుమీద కేంద్ర బిజెపి ప్రభుత్వం చేపట్టిన ఇబ్బందికర చర్యలకు వ్యతిరేకంగా హజారికా కుటుంబం నిరసనను ఆయన ఈ విధంగా వ్యక్తీకరించాడు.

'భారతరత్నలు, అత్యంత పొడవైన వంతెనలు అవసరమే కాని, అవి శాంతిని, సామరస్యాన్ని నెలకొల్పలేవు. పౌరసత్వ (సవరణ) బిల్లు – 2016 పట్ల కేంద్ర ప్రభుత్వం చేపట్టే చర్యలు, వైఖరిని బట్టి మా ప్రతిస్పందన ఉంటుంది' అని ఆయన స్పష్టం చేశాడు. కొద్ది రోజుల క్రితం 2006 సంవత్సరపు పద్మశ్రీ అవార్డు గ్రహీత అరిబాయ్ శ్యామశర్మ కూడా పౌరసత్వ బిల్లు లోక్‌సభలో ఆమోదించబడినందుకు నిరసనగా తన అవార్డును తిరిగి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించాడు. ఆయన సినీ నిర్మాత, ప్రముఖ అసామీ సంగీతకారుడు కూడా. 1979–85 అసాం ఉద్యమంలో చురుకుగా పాల్గొని అనేక విధాలుగా పోలీసు హింసను అనుభవించి, ఇంకా సజీవంగా ఉన్న అనేక మంది ఆందోళనకారులను ఇటీవల ఎన్‌డిఎ ప్రభుత్వం సత్కరించింది. వారిలో చాలా మంది తమ సన్మాన పత్రాలను, శాలువాలను ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారు. ఇదంతా కూడా బిజెపి ప్రభుత్వం చేపట్టిన పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ప్రజలు చేపట్టిన వ్యతిరేక కార్యక్రమంలో భాగమే.

2016లో జరిగిన సాధారణ ఎన్నికలలో అసోం అసెంబ్లీలో మెజారిటీ స్థానాలు గెలుచుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుండి పౌరసత్వ చట్టంలో సవరణలు చేయాలన్న తమ అభిప్రాయానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం ప్రారంభించింది భారతీయ జనతా పార్టీ. అందులో భాగంగానే పౌరసత్వ (సవరణ) బిల్లు – 2016 రూపొందింది. అది ఆ ప్రాంత జనాభాను అత్యంత గందరగోళ పరిస్థితికి నెట్టే ప్రక్రియ కాబోతుందని గ్రహించిన అస్సాంతో పాటు మొత్తం ఈశాన్య రాష్ట్రాల ప్రజలు తీవ్ర అశాంతికి, ఆందోళకు గురయ్యారు. త్రిపుల్ తలాక్ బిల్లుతో పాటు ఇంతవరకూ రాజ్యసభ ఆమోదానికి నోచుకోని ఈ పౌరసత్వ బిల్లు భారత ప్రధాని నరేంద్రమోడీ మానస పుత్రిక. దీని ప్రధాన సమర్థకులు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సర్వానంద సోనోవాల్, ఆయన ముఖ్య అనుచరుడు హిమాంత బిశ్వశర్మ. ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల నుండి మత వివక్షకు గురయి భారత్‌కు వలస వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వ హక్కులు ప్రసాదించడం. డిసెంబర్ 2014 నాటికి ఈ దేశానికి వచ్చి ఆరు సంవత్సరాల పాటు ఈ దేశంలోనే నివసించిన వారికి మత ప్రాతిపదిక మీద పూర్తిస్థాయి పౌరులుగా పరిగణన లభిస్తుంది. ఈ సౌకర్యం ముస్లింలకు వర్తించదు. ప్రధానంగా హిందూ మతస్థులకు, వారితో పాటు సిక్కులు, జైనులు, పార్శీలు, క్రిస్టియన్లు, భౌద్ధులకు కూడా వర్తిస్తుంది కాని, ఆ మత సమూహాలకు చెందినవారు స్వల్ప సంఖ్యలో మాత్రమే ఉన్నారు. ఈ బిల్లు చట్టరూపం ధరించి అమలు అయితే ప్రధానంగా లాభపడేది హిందూ మతస్థులు మాత్రమే.

భారత రాజ్యాంగంలోని అధికరణం 14 ప్రజలందరికి సమానత్వాన్ని గ్యారంటీ చేస్తుంది. ఎవరి పట్ల పక్షపాత వైఖరి ఉండకూడదని కట్టడి చేస్తుంది. పౌరులకు, పౌరసత్వం పొందలేకపోయిన వారికి, పౌరులు కాని వారికి కూడా సమానత్వం ప్రాతిపదికగానే ప్రభుత్వ చర్యలు ఉండాలని కూడా నిర్దేశిస్తుంది. ఈ బిల్లు వల్ల ఒనగూడే ప్రయోజనాల నుండి ముస్లింలను మినహాయించడం వల్ల మన రాజ్యాంగంలో ఆర్టికల్ 14ను భారత ప్రభుత్వం ధిక్కరించింది. ఆ రకంగా ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య. ముస్లింలను వేరుచేసి చూడడం వల్ల రాజ్యాంగ సూత్రమైన సెక్యులరిజం, అన్ని మతాలు ఒకటే అని ప్రభుత్వం మత రహితంగా పరిపాలన సాగించాలన్న నిబంధనను అతిక్రమించింది భారత ప్రభుత్వం. కాని, తాము తీసుకున్న ఈ అప్రజాస్వామిక చర్యవల్ల అస్సాం, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లోని బెంగాలి హిందువుల ఓట్లను కొల్లగొట్టవచ్చునన్న వ్యూహంతో మోదీ, అమిత్ షా ద్వయం పెద్ద ఎత్తున వెల్లువెత్తిన ప్రజాందోళనను ఖాతరు చేయకుండా ముందుకే వెళుతున్నది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దన్నుతో నడుస్తున్న సంస్థల సహకారంతో బంగ్లాదేశ్ నుండి వలస వచ్చిన బెంగాలి దళితుల, వెనుకబడిన తరగతులకు చెందిన హిందువులను ఆకర్షించే ప్రయత్నం ముమ్మరంగా కొనసాగిస్తున్నది. ఇంతవరకూ వారికి పౌరసత్వం రాని కారణంగా, వారు బిజెపికి ఆకర్షితులైతే పశ్చిమ బెంగాల్‌లోని ముస్లింలకు వ్యతిరేకంగా వారి మద్దతు కూడగట్టుకోవాలన్న పన్నాగం కూడా ఇందులో మిలితమయి ఉన్నది. ఈశాన్య ప్రాంత ప్రజలలో మత విద్వేషాన్ని రెచ్చగొట్టి ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అయిన హిందూ రాష్ట్ర స్థాపన అన్న లక్ష్యానికి కట్టుబడి ఉండే మూకను తయారు చేయడమే ఈ పౌరసత్వ సవరణ బిల్లు లక్ష్యంగా కూడా చెప్పవచ్చు. బెంగాలి హిందువుల ఓటు బ్యాంకును కొల్లగొట్టడమే పరమావదిగా మోడీ ప్రభుత్వం ఎన్నుకున్న దారి, దేశంలో మత పరమైన ద్వేషపూరిత వాతావరణం పెల్లుబుకడానికి దారితీస్తుంది.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్)

పుల్వామా నేపథ్యంలో రాష్ట్రపతికి లేఖ

- ఆడ్మిరల్ రాందాస్

ప్రియమైన శ్రీ కోవింద్ గారూ,

నేను అడ్మిరల్ రాందాస్ ను. భారత నావికాదళ మాజీ అధిపతిని. మీకు మరొకసారి ఉత్తరం రాస్తున్నాను. ఈసారి 2019 ఫిబ్రవరి 14న పుల్వామా దగ్గర సిఆర్ పి ఎఫ్ బలగాల వాహనశ్రేణి పై జరిగిన పేలుడుపదార్థాల దాడిలో జవాన్ల విషాదకర మరణాలు, తదనంతర పరిణామాల సందర్భంలో ఈ లేఖ రాస్తున్నాను.

సి ఆర్ పి ఎఫ్ కు చెందిన నలభై మందికి పైగా విలువైన ప్రాణాలు దేశ సేవలో 2019 ఫిబ్రవరి 14న ఆహుతి అయిపోయాయి. ఇది నిజంగా దారుణమైన చర్య, విషాద ఘటన. ఇందుకు బాధ్యులైనవారిని తప్పనిసరిగా శిక్షించాలి.

ఈ ఘటన పట్ల సహజంగానే దేశం నలుమూలల నుంచీ, అన్ని వర్గాల ప్రజల నుంచీ తీవ్రమైన, ఆగ్రహపూరితమైన స్పందనలు వచ్చాయి. అంత ముఖ్యమైన వ్యూహాత్మకమైన రహదారి మీద అటువంటి ఘటన జరిగి ఉండగూడదనేది స్పష్టమే. మరీ ముఖ్యంగా ఇటువంటి దుర్ఘటన ఏదో జరగబోతున్నదనే సమాచార నివేదికలు పోలీసు, నిఘా విభాగాలకు అందాయనే వార్తలు కలవరం కలిగిస్తున్నాయి.

ఈ ఘటనకు పథక రచన చేసినదీ, అమలు చేసినదీ జైష్ ఎ మహమ్మద్ అనే సంస్థ అని తెలుస్తున్నది. ఆర్ డి ఎక్స్ తో నిండి ఉన్న ఒకే ఒక్క వాహనం సి ఆర్ పి ఎఫ్ వాహనశ్రేణి మధ్యలోకి ఎలా ఎందుకు చొరబడి ఇంత విధ్వంసం సృష్టించగలిగిందనే ప్రశ్నలు ఉన్నాయి. అటువంటి మరెన్నో ప్రశ్నలకు సి ఆర్ పి ఎఫ్ గాని, ఇతర ప్రభుత్వ సంస్థలు గాని జరిపే అంతర్గత విచారణల్లో జవాబులు వెతుకుతారు.

నావికా దళం మాజీ అధిపతిగా, త్రివిధ దళాధిపతుల సమితికి అధ్యక్షుడుగా, 1993లో పదవీ విరమణ పొందిన నాటి నుంచీ పాకిస్తాన్ తో శాంతి సాధనకే నా సమయంలో అధికభాగం కేటాయించిన వ్యక్తిగా, భారత-పాకిస్తాన్ ప్రజల మధ్య ఒక సంభాషణ సాగించాలని ప్రయత్నిస్తున్న వ్యక్తిగా నా ఆందోళనలు మీతో పంచుకోదలచాను. అవి:

1. మనం కశ్మీర్ సమస్యను సంభాషణల ద్వారా, చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించవలసి ఉంది. ఆ చర్చలలో ఈ వివాదంతో సంబంధం ఉన్న ముగ్గురు భాగస్వాములకు, అంటే జమ్ము కశ్మీర్ ప్రజలకు, భారత ప్రజలకు, పాకిస్తాన్ ప్రజలకు చోటు ఉండాలి. నా ఈ అవగాహనను ఎన్నో దశాబ్దాలుగా వ్యక్తీకరిస్తూ వస్తున్నాను. కశ్మీర్ సమస్య అని ప్రజలందరికీ తెలిసిన వ్యవహారపు సంక్లిష్ట స్వభావం గురించి సమగ్ర అధ్యయనం తర్వాత నేనీ అవగాహనకు వచ్చాను. ఈ సమస్య రెండు దేశాలలోనూ ఎన్నో ప్రాణాలను బలిగొన్నది. అంతకన్న ముఖ్యంగా జమ్ము కశ్మీర్ లోని దురదృష్ట ప్రజానీకాన్ని అంతులేని వేదనకు గురిచేస్తున్నది. వారు భారతదేశంలో అంతర్గత భాగం అనే మాటను మనం మళ్లీ మళ్లీ వక్కాణిస్తూ ఉంటాం. అది నిజమే అని మనం అనుకుంటున్నట్టయితే, వారిని అలాగే చూడవలసి ఉంటుంది. అంటే సమానమైన పౌరులుగా చూడవలసి ఉంటుంది. వాళ్లు జమ్ములో ఉండేవారయినా సరే, లోయలో ఉండే వారైనా సరే, లదాఖ్ లో ఉండే వారైనా సరే. మనం అలా ప్రవర్తించి ఉంటే అక్కడి ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఇవాళ ఉన్న స్థాయిలో పరాయీకరణ జరిగి ఉండేది కాదు.
2. రెండు దేశాల ప్రభుత్వాలూ కర్తార్ పూర్ మార్గాన్ని తెరవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, (సరిహద్దుకు మూడు మైళ్ల దూరంలో పాకిస్తాన్ లోని కర్తార్ పూర్ లో ఉన్న గురుద్వారా దర్బార్ సాహిబ్ అనే సిక్కుల పవిత్ర స్థలానికీ, భారత్ లోని దేరా బాబా నానక్ సాహిబ్ అనే పవిత్ర స్థలానికీ మధ్య వీసా లేకుండా, ఏ ఆంక్షలూ లేకుండా భక్తులు ప్రయాణించడానికి వీలు కల్పిస్తామని రెండు ప్రభుత్వాలూ ప్రపాదిస్తున్నాయి - అను.) అదే వైఖరిని వాస్తవాధీనరేఖ విషయంలో, జమ్ము కశ్మీర్ కు సంబంధించిన ఇతర కీలక అంశాల విషయంలో ఎందుకు అనుసరించగూడదు? ఈ వ్యవహారంలో భాగస్వాములందరి మధ్య సంభాషణ నడపడానికి సానుకూలంగా ఉన్నామని మనం ఎప్పుడు వ్యక్తీకరిస్తామో, ఆ ప్రక్రియను గంభీరంగా, చిత్తశుద్ధితో ఎప్పుడు ప్రారంభిస్తామో, అప్పుడు జమ్ము కశ్మీర్ ప్రజల ఆలోచనల్లో కొంత మార్పును చూడగలుగుతాము.
3. కశ్మీర్ కు స్వేచ్ఛ కోసం, ఆజాదీ కోసం, సుదీర్ఘకాలంగా హామీ ఇస్తున్న స్వతంత్ర ప్రతిపత్తి కోసం ఆదిల్ వంటి ఒక యువకుడు తనను తాను పేల్చుకోవడానికి సిద్ధపడ్డాడంటే, అది ఆ రాష్ట్రపు యువతలో ఆగ్రహం, పరాయీకరణ భావం ఏ స్థాయిలో ఉన్నాయో చూపే శక్తిమంతమైన సూచిక. "కండలు చూపే" కశ్మీర్ విధానం అనబడేదానిలో భాగంగా ఎంత పెద్ద ఎత్తున బలగాలను దించినా ఆ ఆగ్రహాన్నీ, పరాయీకరణ భావననూ అణచివేయడం సాధ్యం కాదు. ఇప్పటికైనా మేలుకొని, చర్చలకు సిద్ధపడి, ఇందులో భాగస్వాములైన అన్ని పక్షాలతో నిజాయితీగా సంభాషణ ప్రారంభించాలి. బహుశా ఆ పనిలో మనం ఇప్పటికే చాల ఆలస్యం చేశామేమో కూడ.
4. అవంతిపురా దగ్గర మన జవాన్ల మీద జరిగిన దాడికి అతి తీవ్రమైన ప్రతిస్పందనగా దేశవ్యాప్తంగా ఎంతో మంది కశ్మీరీల మీద అసాధారణ స్థాయిలో వేధింపులు, మూక హింస, దాడులు, అవమానాలు, దుర్భాషలు జరుగుతున్నాయి. అతిత్వరలోనే ఇది దేశవ్యాప్తంగా ముస్లింల మీద దాడిగా పరిణమించవచ్చు. ఆ పరిణామం ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగడానికి, విస్తరించడానికి మనం అవకాశం ఇవ్వగూడదు. అదే జరిగితే ఎటువంటి దుష్పరిణామాలు సంభవిస్తాయో అంచనా వేయడమే అసాధ్యం.
5. ఒకే ఒక్క పరిష్కారం రాజకీయమైనదే తప్ప సైనికపరమైనది కాదు. అటువంటి రాజకీయ పరిష్కారం అసమ్మతివాదులు, వేర్పాటువాదులతో సహా కశ్మీర్ ప్రజలందరినీ, పాకిస్తాన్ ప్రభుత్వాన్నీ, భారత ప్రభుత్వాన్నీ కలుపుకునే నిజమైన, నిరంతరాయమైన సంభాషణ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

తక్షణమే ఏం చేయగలం

దేశాధిపతిగా, సర్వసైన్యాధ్యక్షుడిగా మీకు సంక్రమించిన అధికారాలతో, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని మీరు చేసిన ప్రమాణం ఆధారంగా, మీరు మీ విధ్యుక్తధర్మంలో, బాధ్యతలో భాగంగా, సంపూర్ణంగా మీ అధికారపరిధిలోనివే అయిన ఈ కింద వివరించిన చర్యలు తీసుకోవాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

అ. పరిస్థితి మరింత విస్తారమైన శత్రుత్వాల స్థాయికి పెరగకుండా చర్యలు చేపట్టడం అనివార్య కర్తవ్యం. ఒకసారి ఆ స్థితికి చేరితే దాన్ని అదుపు చేయడం ఎప్పటికీ సాధ్యం కాదు. ప్రస్తుత సంక్షోభ స్థితి మరింత దిగజారి యుద్ధ పరిస్థితిగా మారితే వచ్చే ప్రమాదకర పరిణామాల గురించి భారత సర్వ సైన్యాధ్యక్షుడుగా మీరు మన సొంత నాయకులను హెచ్చరించవలసి ఉంది. ఇటు భారత్, అటు పాకిస్తాన్ కూడ అణ్వాయుధాలు కలిగిన దేశాలు గనుక అటువంటి యుద్ధమే వస్తే అది సాధారణ, సాంప్రదాయిక అర్థంలో ఘర్షణగా కాక భిన్నంగా ఉంటుంది.

ఆ. తదుపరి చర్యల గురించిన నిర్ణయాలను ఆచితూచి తీసుకోవలసి ఉంటుంది. ప్రతి అవకాశపు మంచి చెడులను, దాని పరిణామాలను బేరీజు వేయవలసి ఉంటుంది. ఉన్నత స్థాయి నిర్ణయాలను ప్రచారసాధనాల ప్రవక్తల ఉన్మాదమూ, సామాజిక మాధ్యమాల ఆగ్రహమూ ప్రభావితం చేయడానికి గాని, ఒత్తిడి చేయడానికి గాని వీలులేదు. ప్రస్తుతం నెలకొని ఉన్న వాతావరణం ఒక ప్రశాంత, ఆలోచనాయుత పద్ధతిలో నిర్ణయాలు తీసుకోవడానికి అనువుగా ఎంతమాత్రం లేదు. భావోద్వేగాలను, ప్రతిస్పందనలను రెచ్చగొట్ట డానికి, ఆజ్యం పోయడానికి ఉద్దేశపూర్వకంగా, బాధ్యతారహితంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇ. పుల్వామా వాహనశ్రేణిపై జరిగిన దాడి గురించి సంపూర్ణ విచారణలు జరుపుతూనే బేషరతుగా కాల్పులు ఆపుతున్నామని ప్రకటించి భారత ప్రభుత్వం ఒక ఉన్నత నైతిక స్థితికి ఎదగాలి. అలా జరిగితే వాస్తవాల మీద నిజమైన పరిశోధన జరుగుతుంది. ఈ దాడి వెనుక సత్యమేమిటో ఆలస్యం లేకుండా నిర్ధారణ అవుతుంది. అటువంటి చర్యకు ఉదాత్తమైన ప్రభావం ఉంటుందనీ, ఇకముందు ఇతోధిక శాంతి చర్యలకు దారి సుగమమవుతుందనీ నా నమ్మకం.

ఈ. దేశంలో ఎన్నో పట్టణాల్లో, నగరాల్లో ప్రశాంతంగా తమ వృత్తి వ్యాపారాలు చేసుకుంటున్న అమాయక కశ్మీరీల మీద సాగుతున్న దారుణమైన ప్రచారసాధనాల యుద్ధాన్ని మనం తక్షణమే ఆపివేయవలసి ఉంది. అలా ఆపివేయాలనే సందేశం దేశంలోని అత్యున్నత స్థానం నుంచి రావలసి ఉంది. మన గౌరవనీయ ప్రధానమంత్రి తలచుకుంటే ఈ ప్రస్తుత ఉన్మాద ప్రతిస్పందనను నిమిషాల్లో ఆపగలరని ఆయనకు సలహా ఇవ్వవలసి ఉంది. దేశ పౌరుల మీద, వారు కశ్మీరీలైనప్పటికీ, ముస్లింలైనప్పటికీ, హింస, బెదిరింపులు, వేధింపులు జరిగితే తీవ్రమైన చర్యలు ఉంటాయని ఆయన ఒక కఠినమైన, విస్పష్టమైన ప్రకటన ఇవ్వవలసి ఉంది. ఆ ప్రకటనను అన్ని ప్రచారసాధనాల చానళ్లలో, అన్ని స్థాయిల్లో, సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయాలి. ప్రస్తుతం నెలకొని ఉన్న భయ, అభద్రతా వాతావరణం మరింత దిగజారకుండా కాపాడేందుకు, మరింత రక్తపాతం, మరిన్ని చర్యలు జరగకుండా అడ్డుకునేందుకు, ఈ చర్యలు అత్యవసరంగా అతి వేగంగా తీసుకోవలసి ఉంది.

ఉ. ఈ మొత్తం వ్యవహారం మీద వెంటనే ఒక నిష్పాక్షిక న్యాయ విచారణకు ఆదేశించండి. ఈ న్యాయవిచారణా బృందంలో సుప్రీం కోర్టు ప్రస్తుత న్యాయమూర్తులను నియమించండి.

ప్రతీకారం తీర్చుకుంటాం అనే హెచ్చరిక వల్ల దేశవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. అణ్వాయుధాలు కలిగి ఉన్న రెండు దేశాల మధ్య ఇటువంటి హెచ్చరికలు చాల ప్రమాదకరమైనవి. ఈ సారి మనం ఈ యుద్ధాన్ని సాంప్రదాయిక యుద్ధం స్థాయికి పరిమితం చేయలేము. త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా, మతోన్మాద కల్లోలాలకు, శాంతి భద్రతల యంత్రాంగం కుప్పకూలిపోవడానికి అవకాశం ఉన్న దృష్ట్యా పరిస్థితి చాల సున్నితమైనదిగా మారుతున్నది.

ఈ పరిణామాలలో ఏ ఒక్కటీ జరగడానికి మనం అనుమతించ గూడదు. మనకు జమ్ము కశ్మీర్‌లో ఎన్నెన్నో వ్యూహాత్మక, మానవ ప్రయోజనాలున్నాయి. ఆ ప్రయోజనాలను దేశం మొత్తమూ, మనమూ కాపాడవలసి ఉంది. అది జరగాలంటే తప్పనిసరిగా మనం మొత్తంగా ప్రజల, ప్రత్యేకంగా జమ్ము కశ్మీర్ ప్రజల హృదయాలనూ మేధనూ చూరగొనవలసి ఉంది.

ఒక 'భావన'ను సైనిక శక్తి ఎన్నటికీ చెరిపివేయజాలదని మనం గుర్తు చేసుకుందాం. గత డెబ్భై సంవత్సరాలలో మన విధానాల గురించీ, మన ప్రవర్తన గురించీ మనం కాస్త లోతుగా ఆలోచిద్దాం.

https://kractivist.org/ex-navy-chief-tells-president-solution-to-kashmir-problem-is-political-not-military/

వీ

కశ్మీరీలపై దాడులు ఉగ్రవాదానికి దారులు

పాలకులు దశాబ్దాలుగా కశ్మీర్ సమస్యను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారే కానీ అక్కడి ప్రజల మనోభావాలను పట్టించుకోవడం కానీ, అభిప్రాయాలకు విలువ ఇవ్వడం కానీ చేయలేదని అంటున్నారు మహేష్

ప్రభుత్వాలు అధికారం కోసం ప్రజల్లో ఉన్న వెనుకబాటుతనాన్ని, కుల, మతాలను రెచ్చగొట్టి ప్రజల మధ్యన చిచ్చుబెడుతున్నారు. అంతేకాక తమ ఆస్తులను, అధికారాన్ని కాపాడుకోవడానికి పోలీసులకు, భద్రతా బలగాలకు విస్తృతమైన అధికారాలు కట్టబెట్టి ప్రజలమీదికి ఉసిగొల్పుతున్నారు. ముఖ్యంగా స్వేచ్ఛాకాంక్షను వ్యక్తం చేస్తున్న కశ్మీరీ ప్రజల జీవితాలను తుపాకి మొన మీద నిలిపి పాలిస్తున్నారు. లక్షలాది మంది కశ్మీర్ యువత, అట్లాగే ప్రభుత్వాలు ఎటువంటి ఉద్యోగాలు కల్పించకపోవడంతో భద్రతా బలగాల్లో చేరి మృతిచెందుతున్న పరిస్థితి. వీరంతా దేశ సంపద. ఉత్పత్తిలో పాల్గొనవలసిన వారు. కాని పాలకులు నిత్యం ప్రజల్ని అభద్రతలో ఉంచడానికి ఏర్పాటుచేసుకున్నదే భద్రతా వ్యవస్థ.

పుల్వామా ఉగ్రఘాతుకం తర్వాత దేశభక్తి పేరుతో కొన్ని మూకలు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాయి. కశ్మీర్ భూభాగం మాత్రమే తమకు ప్రధానం గానీ కశ్మీరీలు కాదు అనే వైఖరిని ఈ మూకలు ప్రదర్శించాయి. పలు రాష్ట్రాల్లోని కశ్మీరీ విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులపై బెదిరింపులు, దాడులకు పాల్పడ్డాయి. జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఆత్మాహుతి దాడిని నిస్సందేహంగా ఖండించాల్సిందే. నలభై మందికిపైగా సిఆర్‌పిఎఫ్ జవాన్లు మరణించడంతో ఉద్వేగానికి లోనవడం సహజమే. కానీ, దాడితో సంబంధమేలేని అమాయక కశ్మీరీలను కొన్ని మూకలు లక్ష్యం చేసుకోవడమే దారుణం.

మెజారిటీ కశ్మీరీలు అటు పాకిస్థాన్, ఇటు భారత్‌తో కాకుండా ఆజాదీ కశ్మీర్‌ను కోరుకుంటున్నారు. భారతదేశం, పాకిస్థాన్ తమకు సంక్షేమాన్ని, స్వేచ్ఛను కల్పించలేవనే నిస్పృహ నుంచి వచ్చిన కాంక్ష అది. ఈ నేపథ్యంలో కశ్మీరీల పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించకుండా శత్రు వైఖరితో మెలిగితే కశ్మీర్ సమస్యకు మరింత ఎగదోసి జఠిలం చేసినట్టే అవుతుంది. వారిలో మనపై నమ్మకం కలిగించకుండా.. మనల్ని నమ్మి ఇతర రాష్ట్రాల్లో చదువుకునేందుకు వచ్చిన విద్యార్థుల, ఉద్యోగులపై దాడులకు పాల్పడడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. కనీసం 40 వరకు కశ్మీరీలపై బెదిరింపులు, దాడులకు పాల్పడిన ఘటనలు జరిగినట్టు సమాచారం. డెహ్రాడూన్‌లో కశ్మీరీ విద్యార్థినులుండే హాస్టల్‌ను ఓ మూక చుట్టుముట్టడంతో బెదిరిపోయిన కశ్మీరీ యువతి.. ఈ గూండాల నుంచి మమ్మల్ని రక్షించండని మొరపెట్టుకున్నదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కాగా, కశ్మీరీలపై దాడులను ఖండిస్తూ పాలకులు స్థిరమైన ప్రకటనలు చేయలేదు. అంతేకాదు బిజెపి బెంగాల్ యూనిట్ మాజీ అధ్యక్షుడు, మేఘాలయ గవర్నర్ తథాగత రాయ్.. కశ్మీర్‌ను, కశ్మీరీలను బహిష్కరించాలనే వ్యాఖ్యను ఆమోదిస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాలకు కశ్మీరీలపై దాడులు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేశాక గానీ ప్రధానమంత్రి ఈ దాడులపై స్పందించకపోవడం గమనార్హం.

కాగా, కశ్మీరీలపై దాడులను ఉగ్రవాద సంస్థలు అనుకూలంగా మలుచుకునే అవకాశాన్ని పాలకులే కల్పిస్తున్నారు. పుల్వామా దాడికి బాధ్యత వహిస్తూ ప్రకటన చేసిన జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ఓ ఆడియో రికార్డింగ్‌ను సామాజిక మాధ్యమంలో విడుదల చేసింది. ఈ దాడి.. కశ్మీరీలపై చేసిన ఆగడాల ఫలితమేనని పేర్కొంది. తాము మరణిస్తాం కానీ, తలవంచబోమని జైషే ఉగ్రవాది రియాజ్ నైకూ ఆ రికార్డింగ్‌లో అన్నాడు. ఈ ఆడియోను పోలీసులు అధికారికంగా ధృవీకరించలేదు. అంటే కశ్మీరీలపై దాడులు చేసేవారు పరోక్షంగా వారిని ఉగ్రవాదంలోకి నెట్టేందుకు దోహదపడుతున్నారని తేలుతున్నది. కశ్మీరీలపై ఉగ్రవాద సంస్థ దుశ్చర్యలను వీరు తమ వంతుగా చేస్తున్నట్టుగానే ఉన్నదనే విమర్శ ఉంది.

పుల్వామా దాడి అనంతరం న్యూస్ వెబ్‌సైట్లు, టివి చానెళ్లలో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజహర్ గురించి, పేలుడుకు ఉపయోగించిన ఆర్‌డిఎక్స్ గురించి, సర్జికల్ స్ట్రైక్ గురించి భారీగా చర్చ జరిగింది. కానీ, కశ్మీర్‌లో నెవకొన్న అసలు సమస్యపై చర్చ జరగవలసే ఉంది. కశ్మీర్‌లో ఉగ్రవాదం లేదని అనలేం. కానీ, అక్కడి యువకుల ప్రాణాలు లెక్కచేయకుండా ఉగ్రవాద సంస్థల్లోకి ఎందుకు చేరుతున్నారనే కీలకాంశంపై చర్చ జరగాలి. బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్ తర్వాత కశ్మీర్ లోయలోని యువకులు పెద్ద ఎత్తున సాయుధ బలగాల్లో చేరారని పలు రిపోర్టులు వెల్లడించాయి. ఈ నెల 15న పుల్వామాలో ఆత్మాహుతికి పాల్పడిన అటాకర్ ఆదిల్ అహ్మద్ దార్ కశ్మీర్‌కు చెందినవాడే కావడం గమనార్హం. కశ్మీర్‌లో సాగుతున్న హింసోన్మాదమే అతడిని ఉగ్రవాదంవైపు మళ్లించాయా? ఆత్మాహుతి దాడికి పురికొల్పాయా? అనే అంశంపై చర్చ జరగాల్సి ఉంది. 2016లో ఉద్రిక్తంగా ఉన్న ప్రాంతం గుండా ఇంటికెళ్తున్న ఆదిల్‌ను పోలీసులు అడ్డుకుని వేధించారని, ముక్కు నేలకు రాయించారని ఆదిల్ మిత్రుడు తెలపడం గమనార్హం. భద్రతా దళాల హింస వల్లే తన కొడుకు మిలిటెన్సీలో చేరాడని ఆదిల్ తండ్రి తెలిపాడు. రాజకీయ నేతలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని, ఇక్కడి యువకులు మిలిటెన్సీలో చేరడానికి వారే కారణమన్నాడు. మరణించిన జవాన్ల తల్లిదండ్రులకుండే బాధనే తనకూ ఉందని వివరించాడు.

పాలకులు పుల్వామా ఘటనను సాకుగా చూపి మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి అంతర్జాతీయంగా పాకిస్తాన్‌తో యుద్ధం, లేదా దేశంలో మరో గుజరాత్ లాంటి విద్వేశాన్ని సృష్టించి అధికారంలోకి రావాలనుకుంటున్నారు. పాలకుల కుట్రలను ప్రజల ముందుంచుతూ బుద్ధిజీవులు ప్రజాస్వామిక హక్కుల కోసం సమిష్టిగా గొంతు వినిపించకపోతే జీవించే హక్కును కూడా కాపాడుకోలేని పరిస్థితి నెట్టివేయబడతాము.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్టు) వీ

పెట్టుబడిదారీ వ్యవస్థ - ప్రాథమిక వైరుధ్యాలు

పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని పదిహేడు అంతర్ వైరుధ్యాల వల్ల పతనం దిశగా పయనిస్తుందని డేవిడ్ హార్వే చేసిన విశ్లేషణను వివరిస్తున్నారు **రమేష్ పట్నాయక్**

డేవిడ్ హార్వే 'పదిహేడు వైరుధ్యాలు – పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం' అన్న పుస్తకాన్ని 2014లో ప్రచురించాడు. ఈ పదిహేడు వైరుధ్యాలలో ప్రాథమిక వైరుధ్యాలుగా పేర్కొనబడిన మొదటి ఏడు వైరుధ్యాలను పరిచయం చేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. ఈ వ్యాసం ఏడు అధ్యాయాలుగా ఉంటుంది. ఈ వ్యాసం అనువాదం కాదు. కనీసం స్వేచ్ఛానువాదం కూడా కాదు.

డేవిడ్ హార్వే ప్రతిపాదించిన మౌలిక అంశాలను చేపట్టి వివరించడం. కొత్త చదవరులకు అనుకూలంగా ఉండాలనే ఉద్దేశ్యంతో రాయబడింది. పైస్థాయి అధ్యయనం కొరకు, కొన్ని సందర్భాలలో బాక్స్ ఐటమ్స్ పొందుపరచడం జరిగింది. డేవిడ్ హార్వే తన పుస్తకాన్ని వైరుధ్యం అన్న భావనను వివరించడంతో ప్రారంభించాడు. ఈ వ్యాసం కూడా వైరుధ్య భావన వివరణతో ప్రారంభం అవుతుంది. మనం ఇక్కడ వైరుధ్యం గురించి కొంత క్లుప్తంగానే చెప్పుకుందాం. రోజువారీ వ్యవహారాలలో వైరుధ్యం అన్న పదాన్ని ఇద్దరి వ్యక్తుల మధ్య విరోధ భావనను తెలియచేయడానికి వాడతాము. తత్వశాస్త్ర పరిభాషలో దీనికి విశేషార్థముంది. జర్మన్ తత్వవేత్త హెగెల్ విశ్వంలో ప్రతి వస్తువు, ప్రతి దృగ్విషయం, ప్రతి ప్రక్రియ మానవుని ఉనికి, ఆలోచన, సామాజిక వ్యవస్థలు, భావనలు వైరుధ్యాలతో కూడుకుని ఉంటాయని చెప్పాడు. హెగెల్ తన గతితార్కిక దృక్పథంలో భాగంగా పరిమాణాత్మక, గుణాత్మక మార్పులు గురించి, నైరూప్యత యొక్క నైరూప్యత గురించి కూడా చెప్పాడు. విశ్వాన్ని, సమాజాన్ని, భావరంగాన్ని విశ్లేషించడానికి హెగెల్ ఈ మూడు నియమాలను సార్వత్రికంగా ఉపయోగించాడు. ఈ మూడు నియమాలను గతితార్కిక నియమాలు అంటారు. మార్క్స్, ఏంగెల్సు ఈ తాత్విక భావనలకు ముగ్ధులైనారు. అయితే, హెగెల్ (1770–1831) భావవాది. మార్క్స్, ఏంగెల్సు భౌతికవాదులు. హెగెల్ గతితర్కాన్ని గ్రహించిన కార్ల్ మార్క్స్ (18181883) గతితార్కిక భౌతిక వాదాన్ని అభివృద్ధిచేశాడు. గతితార్కిక భౌతిక వాదాన్ని అభివృద్ధిచేసే క్రమంలో ఫ్యూయర్‌బా భౌతిక వాదంపై చర్చ మార్క్‌కు ఎంతగానో ఉపయోగ పడింది. జర్మన్ ఫిలాసఫర్, సోషలిస్టు అయిన జోసెఫ్ డీజెన్ స్వతంత్రంగా గతితార్కిక భౌతికవాదం అనే తత్వశాస్త్రాన్ని అభివృద్ధి చేసాడనే వాదన కూడా ఉంది. ఏది ఏమైనా, తాత్విక, ఆర్థిక, రాజకీయ, నైతిక రంగాలన్నింటిలో తన రచనలద్వారా, కార్యాచరణ ద్వారా ప్రపంచాన్ని వివరించడమేగాక, ప్రపంచాన్ని మార్చిన, సమగ్రమైన గతితార్కిక భౌతికవాద అవగాహన కల్పించిన కార్ల్ మార్క్‌కు సాటి ఎవరూ లేరని నిర్ద్వందంగా చెప్పవచ్చు. అదలా ఉండగా, ఈ వ్యాస పరిమితులలో తత్వశాస్త్ర చర్చలోనికి మనం పోలేము. గతితార్కిక సూత్రాలలో వైరుధ్యం అనే సూత్ర వివరణకు మనం పరిమితమవుదాం.

తత్వశాస్త్ర పరిభాషలో వైరుధ్యం అన్న భావనను అర్థం చేసుకోవడానికి ముందుగా కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం. తత్వశాస్త్రం ప్రకృతికి, సమాజానికి కూడా వర్తిస్తుంది కదా. కాబట్టి ప్రకృతిలో ఒకటి లేక రెండు దృగ్విషయాల్ని, సమాజంలో ఒకటి లేక రెండు దృగ్విషయాల్ని తీసుకుని పరిశీలిద్దాం. భూమి చుట్టూ చంద్రుడు పరిభ్రమించడం ఒక ప్రకృతి దృగ్విషయం. చంద్రుడు భూమిని విడిచి పెట్టిపోడు. అలాగే భూమిపై పడిపోడు. దీనికి కారణమేమిటి. 'భూమి – చంద్రుడు' అనే రెండు వస్తువుల వ్యవస్థ రెండు విరుద్ధ బలాల ఫలితంగా ఉనికిలో ఉండడమే దీనికి కారణం. భూమి, చంద్రుల మధ్య గురుత్వ త్వరణం ఒక ఆకర్షణ శక్తికాగా, చంద్రునికుండే గతిజశక్తి ఒక వికర్షణశక్తి . ఈ ఆకర్షణ, వికర్షణ బలాలు నిరంతరం పని చేస్తూ ఉంటాయి. వీటినే అభికేంద్ర, అపకేంద్ర బలాలంటారు. ఒక్క క్షణం భూమి చంద్రుల మధ్య గురుత్వ బలం పనిచేయకపోతే చంద్రుడు తనకున్న గతిజశక్తి కారణంగా (తన పరిభ్రమణ దీర్ఘవృత్తానికి ఒక స్పర్శరేఖా మార్గంలో) భూమికి దూరంగా దూసుకుపోతాడు. చంద్రుడు తన కక్ష్యలో తిరగకుండా ఒక్క క్షణం ఆగితే, అంటే చంద్రుని గతిజశక్తి ఒక్క క్షణం పనిచేయకపోతే చంద్రుడు, భూమి మధ్య ఉన్న గురుత్వాకర్షణ బలం ఫలితంగా చంద్రుడు భూమిని ఢీకొంటాడు. రెండు వ్యతిరేక బలాలు నిరంతరం ఉనికిలో ఉన్న కారణంగానే చంద్రుడు భూమిపై పడిపోకుండా, అదే సందర్భంలో భూమికి దూరంగా వెళ్లిపోకుండా భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాడు. భూమి, చంద్రుల వ్యవస్థ ఉనికిలో కొనసాగుతూంది. సూర్యుని చుట్టూ భూమి పరిభ్రమణాన్ని కూడా ఈవిధంగానే వివరించవచ్చు. సకల పదార్థాలకు మూలమైన పరమాణువులు కూడా విరుద్ధ శక్తుల ఐక్యత వ్యవస్థలుగా ఉంటాయి. పరమాణువులలో ధన విద్యుదావేశిత కేంద్రం చుట్టూ ఋణ విద్యుదావేశ ఎలక్ట్రానులు పరిభ్రమిస్తూ ఉంటాయి. ఇక్కడ కూడా ధన విద్యుదావేశ కేంద్రానికి, ఋణ విద్యుదావేశ ఎలక్ట్రానులకు మధ్య ఆకర్షణ శక్తి పనిచేస్తూంది. ఇక్కడ కూడా ఎలక్ట్రానుల గతిజశక్తి విరుద్ధ బలంగా పనిచేస్తూంది. ఇదికూడా వైరుధ్యానికి ఉదాహరణే. ఈ అన్ని సందర్భాలలో కూడా విరుద్ధ శక్తులు నిరంతరాయంగా పరస్పర చర్యలో ఉంటాయి. సామాజిక ఉదాహరణలు ఇంత సరళంగా ఉండవు. సుమారు ఐదువేల సంవత్సరాల క్రితం భూమండల వ్యాప్తంగా ప్రతిచోట ఆదిమ సమాజాలే ఉండేవి. అవి సమిష్టి వ్యవస్థలు. మాలపల్లి నవలలో ఉన్నవ లక్ష్మీనారాయణగారు రాసినట్లు 'సృష్ట్యాదిన' నీది, నాది అనే భావన లేదు. అప్పుడు దోపిడీ లేదు, దొంగతనమూ లేదు. వ్యక్తిగత ఆస్తి, దానితో ఇతర తారతమ్యాలు పుట్టిన తరువాతే దొంగతనం పుట్టింది. దొంగతనంతోపాటు దొంగతనం చేయరాదు అనే నీతి పుట్టింది. విచిత్ర

మేమంటే దొంగతనం, దొంగతనం చేయరాదనే నీతి రెండూ ఒకే సమాజంలో ఉన్నాయి. అవి కలిసే ఉనికి లోనికి వచ్చాయి. ఉన్నన్నాళ్లు కలిసే ఉనికిలో ఉంటాయి. పోయినప్పుడు కలిసే ఉనికి లోంచి పోతాయి. ఘర్షణ పడుతూ కలిసి ఉండే ఈ దృగ్విషయమే వైరుధ్యం. మరొక ఉదాహరణ చూస్తే ప్రపంచంలో అనేక భూభాగాలలో మొదటి వ్యక్తిగత ఆస్తి వ్యవస్థ బానిస వ్యవస్థ. ఈ వ్యవస్థలో బానిసల వర్గం, బానిస యజమానుల వర్గం నిరంతరం ఘర్షణ పడుతూనే ఉండినాయి. ఒకప్పుడు ప్రత్యక్షంగా, మరొకప్పుడు పరోక్షంగా. బానిస వ్యవస్థ ఉన్నన్నాళ్లు ఈ ఘర్షణ ఉండింది. ఆ వ్యవస్థ., ఆ వర్గాలు, ఆ ఘర్షణ ఒకేసారి ఉనికిలోకి వచ్చాయి. బానిస, బానిస యజమాని వర్గాలు ఉన్నన్నాళ్లు ఘర్షణలోనే ఉంటాయి. పోయినప్పుడు కలిసే ఉనికిలోంచి పోతాయి. అందుకే వీటిని విరుద్ధ శక్తుల ఐక్యత అంటారు. మనం పరిశీలిస్తూపోతే ప్రకృతిలో, సమాజంలో ప్రతి దృగ్విషయంలో ఈ విరుద్ధ శక్తుల పరస్పర చర్య. ఐక్యత, ఘర్షణ కనిపిస్తూనే ఉంటాయి. అందుకే విశ్వం వైరుధ్యాల మయం అన్నాడు హెగెల్. విశ్వంలో ఎల్లెడలా పరిమాణాత్మక, గుణాత్మక మార్పులు, నైరూప్యత నైరూప్యతలు దర్శనమిస్తాయని చెప్పాడు. అయితే హెగెల్ సామాజిక విషయాలకు వచ్చేసరికి ప్రష్యన్ రాజ్యం పరిపూర్ణమైనదని ఇక సామాజిక మార్పులుండవని చెప్తాడు. (మొదటి ప్రపంచయుద్ధ కాలంలో ఈ పరిపూర్ణమైన రాజ్యం తుడిచిపెట్టుకు పోయింది). మార్క్స్ గతితర్కాన్ని విప్లవీకరించాడు. సమాజంలో వర్గ వైరుధ్యాలు పరిమాణాత్మక, గుణాత్మక మార్పులకు నైరూప్యతల పరంపరలకు దారితీస్తూ వర్గరహిత సమాజానికి మార్గం వేస్తాయని, అనంతరం సమాజం స్వార్థ రహిత వైరుధ్యాలతో ముందుకు పోతుందని ప్రతిభావంతంగా విశ్లేషించిచూపాడు. కార్ల్ మార్క్స్ ప్రకారం వర్గరహిత సమాజంలో కూడా, అంటే భవిష్యత్ కమ్యూనిస్టు సమాజంలో కూడ వైరుధ్యాలుంటాయి. అయితే అవి శత్రు వైరుధ్యాలు కాదు, అవి మిత్ర వైరుధ్యాలు. ఆ సమాజంలో వైరుధ్యాలు ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కొరకు కాదు లేదా ఏ ఇతర స్వార్థ ప్రయోజనం కొరకు కూడా కాదు. నాగరికత అభివృద్ధి మార్గాలను నిర్దేశించడంలోనే వైరుధ్యాలుంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రకృతిలో, సమాజంలో ఇప్పటికీ, ఎప్పటికీ వైరుధ్యం సార్వత్రికం. వైరుధ్య సారాంశం, లక్షణం మారుతాయి. అలా మారడమే గుణాత్మక మార్పు. కామ్రేడ్ మావో జెడాంగ్ వైరుధ్యాలపై ఒక పూర్తి వ్యాసాన్ని ప్రచురించారు.

ఉపయోగపు విలువ – మారకపు విలువల మధ్య వైరుధ్యం: ఆర్థిక వ్యవస్థలో వైరుధ్యాలను పరిశీలించడం ఈ అధ్యాయంలో మన ఉద్దేశం. ఉపయోగపు విలువ, మారకపు విలువ మధ్య వైరుధ్యాలను పరిశీలించడానికి ఒక ఉదాహరణను పరిశీలిద్దాం. ఒక వ్యక్తి తన పెరడులో కూరగాయలు పండించి తనే వాటిని ఉపయోగించుకుంటే కూరగాయలకు ఉపయోగపు విలువ మాత్రమే ఉంటుంది గాని మారకపు విలువ ఉండదు. శ్రమతో తయారు చేయబడిన ఒక వస్తువుకు మారకపు విలువ రావాలంటే ఆ వ్యక్తి సమాజంలో ఇతరులకు అవసరమైన ఉపయోగపు విలువను (వస్తువును) ఉత్పత్తిచేసి దానిని అమ్మకానికి పెట్టాలి. ఒక వ్యక్తి ఆ సామాజిక శ్రమ తయారుచేసిన వస్తువు సమాజంలో ఎవరికీ పనికిరానిదైనప్పుడు లేదా ఆ వ్యక్తి దానిని మార్కెట్ కు తీసుకురానప్పుడు దానికి మారకపు విలువ ఉండదు. అంటే ఒక వస్తువుకు మారకపు విలువ ఉండాలంటే సమాజం దృష్ట్యా దానికి ఉపయోగపు విలువ ఉండాలి, అది మార్కెట్‌కు రావాలి. అప్పుడు దానికి ఉపయోగ విలువతోపాటు మారకపు విలువ వస్తుంది, దానిని సరుకు అంటారు. ఈ మాత్రం అవగాహన ప్రస్తుతానికి మనకి సరిపోతుంది.

ఉపయోగపు విలువ లేనిదే మారకపు విలువ ఉండదు. ఏదైనా వస్తువును ఎవరైనా కొనాలంటే వారికి ఆ వస్తువు ఉపయోగపు విలువనివ్వాలి కదా. అంటే ఉపయోగపు విలువ లేనిదే మారకపు విలువ ఉండదు. కాని వైపరీత్యమేమంటే ఉపయోగపు విలువపై ఆధారపడి ఉనికి లోనికి వచ్చిన మారకపు విలువ ఉపయోగపు విలువకు వ్యతిరేకంగా నిలబడడం ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలో చూస్తాం. ఈ వైరుధ్యాన్ని డేవిడ్ హార్వే వివరిస్తాడు. డేవిడ్ హార్వే ఇలా అంటాడు పెట్టుబడిదారీ వ్యవస్థలో మనం కొనే ప్రతి సరుకు ఉపయోగపు విలువను, మారకపు విలువను కలిగి ఉంటాయి. అయితే విలువ యొక్క ఈ రెండు రూపాల మధ్య ఉన్న వ్యత్యాసం చాలా ప్రముఖమైనది. అనేక సందర్భాలలో అవి ఏమేరకైతే పరస్పర విరుద్ధంగా ఉంటాయో ఆమేరకు అవి వైరుధ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ వైరుధ్యం కొన్ని సందర్భాలలో సంక్షోభానికి దారితీస్తుంది. (పుట. 15)

ఈ భావనను వివరించడానికే డేవిడ్ హార్వే ఇల్లు అనే సరుకును ఎంచుకున్నాడు. అంతేగాక సదరు ఇల్లు ఒకే సందర్భంలో ఉపయోగపు విలువగానూ, మారకపు విలువగానూ ఉండే సందర్భం ఎంచుకున్నాడు. అమెరికాలో 2008లో గృహ సౌకర్య సంక్షోభం వచ్చిన విషయం తెలిసిందే. అందుకే తాజా ఉదాహరణ తీసుకున్నట్లు డేవిడ్ హార్వే చెప్పాడు.

ఒక ఇంటి ఆసామి తన ఇంటిని వాడుకోవచ్చు లేదా అమ్ముకోవచ్చు. అంటే దాని ఉపయోగపు విలువనుగాని లేదా దాని మారకపు విలువనుగాని సదరు ఆసామి పొందవచ్చు. మరి వైరుధ్యం ఎక్కడ వస్తుంది. గృహ సౌకర్య సంక్షోభం ఎక్కడ నుంచి వస్తుంది. అమెరికాలో 2008 లో వచ్చిన గృహ సౌకర్య సంక్షోభం నేపథ్యాన్ని ఈ సందర్భంలో మనకవసరమైన మేరకు పరిశీలిద్దాం.

అమెరికా రియల్ వ్యాపారులు ఇళ్లు కడుతూపోయారు. ఈ ఇళ్లు కొనగోలు చేయడానికి బ్యాంకులు పెద్ద ఎత్తున మధ్య తరగతి వారికి ఋణాలు మంజూరు చేస్తూ వచ్చాయి. ఇళ్ల కొనగోళ్లు బాగా పెరిగాయి. డిమాండ్ పెరగడంతో ధరలు పెరుగుతూ వచ్చాయి. బ్యాంకులు తాము ఇచ్చే ఋణ మొత్తాలను పెంచుతూ వచ్చాయి. ఇళ్ల ధరలు ఎంతగా పెరిగాయంటే ఇప్పుడు కాకపోతే తరువాత ఇళ్లు కొనలేమనే భయం వచ్చింది. మధ్య తరగతి వారు ఇంకా ఎగబడ్డారు. ఇళ్ల ధరలు పెరుగుతూనే ఉంటాయన్న ఒక తప్పుడు ప్రచారం ఊపందుకోవడంతో సొంత వాడకానికే కాక ఆస్తిగా ఎత్తి పెట్టుకోవడానికి, అద్దెలకివ్వడానికి అదనంగా అప్పు చేసిమరీ ఇళ్లు కొన్నవారు ఉన్నారు. అంటే ఇది జూదం అయిపోయింది. అవసరాలకేకాక వ్యాపారానికి కూడా ఇళ్లు కొనగోలు చేస్తుండంతో ఇళ్ల ధరలు ఇంకా పెరిగిపోయాయి. గృహ సౌకర్య బూమ్ ఏర్పడింది. 2008 లో ఈ బుడగ పగిలిపోయింది. ఇంటి ధరలు ఒక్కసారి విపరీతంగా పడిపోయాయి. బూమ్, బూమ్ తరువాత సంప్ (ధరలు పెరగడం, పడిపోవడం) ల ఫలితాలను రెండు, మూడు ఉదాహరణలతో పరిశీలిద్దాం.

ఉదాహరణకు, 1990లో ఒక వ్యక్తి ఒక ఇల్లు కొనుగోలు చేసాడనుకుందాం. కొనగోలు చేసిన ఇంటిని బ్యాంకుల్లో కుదువపెట్టి ఆ ఇంటి ధరను రియల్ ఎస్టేట్ కంపెనీకి చెల్లించాడు. సదరు ఇంటికి ఆ వ్యక్తి ఇప్పుడు యజమాని. కాని ఆ ఇల్లు కుదవలో ఉంది. ప్రతి ఇంటిలో ఆ వ్యక్తి నివసిస్తూన్నాడు. 10 సంవత్సరాలపాటు వాయిదాలు చెల్లిస్తే బ్యాంకు రుణం చెల్లిపోయి కుదవ పరిష్కారం అవుతుంది. కాని ఆ వ్యక్తి కొన్ని నెలలు తన పరిస్థితి వలన వాయిదాలు కట్టలేకపోవచ్చు. అలా 3 నెలలు గాని, లేదా ఒక నిర్దిష్ట కాలంపాటు వాయిదాలు కట్టకపోతే బ్యాంకులు ఆ కాలానికి వడ్డీరేట్లు పెంచుతాయి. ఆవ్యక్తి రుణాన్ని రీసర్వీసు చేసుకోవలసి ఉంటుంది. అప్పుడు అసలు వడ్డీ మొత్తానికి ఇల్లు తాకట్టులో పడుతుంది. తిరిగి వ్యక్తి వాయిదాలు కట్టడం కొనసాగిస్తాడు.

ఇందులో అంత కొత్త విషయం ఏమీ లేకపోవచ్చు. అయితే, బూమ్లో, అంటే ఇళ్లధరలు పెరుగుతూ ఉన్న సందర్భంలో సమస్య కొత్త రూపాలను సంతరించుకుంటుంది. మరొక వ్యక్తిని తీసుకుందాం. ఈ వ్యక్తి కూడా 1990లో ఇంటిని కొని బ్యాంకులో తాకట్టు పెట్టి వాయిదాలను కడుతున్నాడు. ఈ వ్యక్తి వాయిదాలను క్రమం తప్పకుండా కడుతున్నాడు. అయితే, ఈ వ్యక్తి వాయిదాలు తీరకముందే ఇళ్ల ధరలు పెరిగాయి. 1995లో బ్యాంకు వాళ్లు నీ ఇంటి ధర 50 శాతం పెరిగింది. అదే ఇంటిపై నీకు మరి 50శాతం రుణం ఇస్తామని ఆఫర్ చేస్తారు. అవసరాల కొరకో, సౌకర్యాల కొరకో మన వ్యక్తి మరింత రుణం తీసుకుంటాడు. తనఖా పత్రాలు తిరిగి సర్వీసు చేయబడ్డాయి. వాయిదాల పరిమాణం, వాయిదాల సంఖ్య పెరుగుతుంది. మరి ఐదు సంవత్సరాలకి అంటే 2000 సంవత్సరం నాటికి ఇళ్ల ధరలు ఇంకా పెరుగుతాయి. బ్యాంకు వారు తిరిగి మన వ్యక్తి వద్దకు వచ్చారు. నీ ఇంటి ధర మరలా 50 శాతం పెరిగింది. మరింత రుణం ఇస్తాం తీసుకోమన్నారు. వ్యక్తి అంగీకరించాడు. తనఖా రీసర్వీసు చేయబడింది. వాయిదా పరిమాణం పెరిగింది. వాయిదాల సంఖ్య పెరిగింది. 2008లో ఇంటి ధరల బుడగ పగిలిపోయింది. ఇంటి ధరలు హటాత్తుగా పడిపోయాయి. బ్యాంకువారు మన వ్యక్తి దగ్గరకు రంకెలు వేసుకుని వచ్చారు. నీ ఇంటి ధర బాగా పడిపోయింది, ఆ తేడా వెంటనే చెల్లించు అన్నారు. వ్యక్తి చేతులెత్తేసాడు. బ్యాంకు ఇంటిని స్వాధీనం చేసుకుంది. మిగిలిన ధనానికి కేసు పెట్టింది. ఈ నిబంధనలన్నీ తాను గతంలో సంతకం పెట్టిన ఒప్పందంలో చిన్న అక్షరాలలో లేదా నిగూఢంగా ఉన్నాయన్న విషయాన్ని మనమిత్రుడు ఇప్పుడే గ్రహించాడు. అయితే అప్పటికే ఆ వ్యక్తి రోడ్డుమీద పడ్డాడు. ఈ విధంగా 2008 సంక్షోభంలో అమెరికాలో 40 లక్షల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

వ్యక్తి చేతులెత్తేయడం వలన నిజానికి బ్యాంకులు నష్టపోయాయా? మనం ఇక్కడ ఒక విశ్లేషణను ప్రతిపాదిద్దాం. ఈ వ్యక్తి అప్పు తీసుకోకపోతే ఆ బ్యాంకు వద్ద అప్పు తీసుకొనేవారే లేరు. అందుకే బ్యాంకు వారు వెంటబడి మరీ అప్పు ఇచ్చారు. అప్పు తీసుకునేవారు లేనప్పుడు వడ్డీలు ఉండవు గదా! వడ్డీలు లేకపోవడం అంటే జీరో ఇంటరెస్ట్ రేటు. జీరో ఇంటరెస్ట్ రేటు అనేది కొత్త విషయంకాదు. అనేక దేశాలలో అనేక సందర్భాలలో ఈ పరిస్థితి ఏర్పడింది, ఏర్పడుతూ ఉంది. అంతెందుకు, 2008 డిసెంబర్ నుండి 2015 డిసెంబరు వరకు అమెరికా సెంట్రల్ బ్యాంకు వడ్డీ లేకుండా వాణిజ్య బ్యాంకులకు పడిపోతాయి. ఇది పారిశ్రామికాభివృద్ధి బాగా మందగించిన రుణమిచ్చింది. నిజానికి అమెరికాలో శూన్య వడ్డీరేట్ల పరిస్థితి దీర్ఘకాలంగా కొనసాగుతోంది. అటువంటి పరిస్థితి నెలకొన్నప్పుడు డిమాండ్ పెంచడానికి బ్యాంకులు కృత్రిమ డిమాండ్‌ను సృష్టిస్తాయి. అటువంటిదే గృహసౌకర్య ధరల బూమ్.

తిరిగి మన వ్యక్తి దగ్గరకు వస్తే బ్యాంకు ఈ వ్యక్తికి ఇచ్చిన రుణం పనిలేని పెట్టుబడి. దానికి వడ్డీ కట్టనంత మాత్రాన బ్యాంకుకు జరిగిన నష్టం ఏమీలేదు. వడ్డీ విషయాన్ని ఇలా అర్థం చేసుకున్న తరువాత అసలు విషయాన్ని పరిశీలిద్దాం. ఈవ్యక్తి కొన్న ఇల్లు బ్యాంకు వారికి ధఖలు పడింది. అంటే బ్యాంకు నుంచి మొదటగా (1990) తీసుకున్న అసలు తీరిపోయింది. ఈవ్యక్తికి బ్యాంకు 2000వ, 2005వ సంవత్సరాలలో అదనంగా అప్పు ఇచ్చింది. ఈమొత్తాలు బ్యాంకుకు చేరాలి కదా. అలాగే, 1990 నుంచి 2008 వరకు మన వ్యక్తి గృహాన్ని ఉపయోగించాడు. ఫలితంగా గృహంలో కొంత తరుగుదల ఏర్పడి ఉంటుంది. ఈతేడా కూడా వ్యక్తి బ్యాంకు వారికి చెల్లించాలి కదా. అయితే 1980 నుండి 2008 వరకు 18 సంవత్సరాలపాటు మనవ్యక్తి వాయిదాల రూపంలో చాలా ధనాన్ని చెల్లించాడు. చెల్లించిన వాయిదాల మొత్తం అదనపు రుణానికి, తరుగుదలకు సరిపోయి ఉంటుంది. అంతేకాదు. ఈ 18 సంవత్సరాల కాలంలో మనవ్యక్తి అనేక సందర్భాలలో సర్వీసు ఛార్జీలు చెల్లించి జై ఉంటాడు. ఇటువంటి మొత్తం వ్యక్తులు చెల్లించిన సర్వీసు చార్జీలు బ్యాంకు నిర్వహణకు సరిపోయి ఉంటాయి. 100 శాతం సరిపోకపోయినా అత్యధికశాతం సరిపోయి ఉంటుంది. ఈ ప్రతిపాదన వాస్తవికతను నిర్ధారించడానికి అమెరికాలో జరిగిన కొన్ని కేస్ స్టడీస్ పరిశీలించవలసి ఉంటుంది. మనం ఆ ప్రయత్నం చేయడంలేదు. మొత్తం పైన బ్యాంకుకు వచ్చే నష్టం ఏమీలేదనేదే ఇక్కడ మనం ప్రధానంగా ప్రతిపాదిస్తున్నాం.

రెండవ ఉదాహరణ. మొదటి ఉదాహరణ బూమ్ ప్రారంభం కావడానికి ముందు ఇల్లు కొనుగోలుచేసిన వ్యక్తికి సంబంధించినది. ప్రస్తుత ఉదాహరణ బూమ్ ఫీక్లో ఉన్నప్పుడు తీసుకోబడిన ఉదాహరణ. 1990లో ఒక డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ లక్షడాలర్లు అనుకుందాం. 1995 నాటికి ఇళ్ల ధరలు 50 శాతం పెరిగాయి. 1995లో ఒక డబుల్ బెడ్ రూం ఫ్లాట్ ధర 1,50,000 డాలర్లు ఉంటుంది. 2000 సంవత్సరం నాటికి ఇళ్ల ధరలు తిరిగి 50శాతం పెరిగి, ఒక డబుల్ బెడ్ రూం ఫ్లాట్ ధర 1,50,000 × 150/100 = 2,25,000 డాలర్లు అయ్యింది. కాబట్టి 2000వ సంవత్సరంలో రియల్టర్ నుంచి ఒక డబుల్ బెడ్ రూం ఫ్లాట్ కొనుగోలుచేసిన వ్యక్తి 2,25,000 డాలర్లు చెల్లించాలి. కొనబోయే ఇంటిని బ్యాంకులో తాకట్టు పెట్టి రియల్టర్‌కు మొత్తం చెల్లించి బ్యాంకుకు నెలసరి వాయిదాలు చెల్లిస్తున్నాడు. అలా 2008 వరకు చెల్లించాడు. ప్రతి నెలా వాయిదాలు చెల్లించాడు. ఈ వ్యక్తి అదనపు రుణం కూడా తీసుకోలేదు. గత ఎనిమిది సంవత్సరాల కాలంలో ప్రతినెల వెయ్యి డాలర్లు చొప్పున సుమారు 90,000 డాలర్లు చెల్లించాడు. మిగతా వాయిదాలు రానున్న కాలంలో చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాడు. అయితే పరిస్థితులు తారుమారయ్యాయి. ఇళ్ల ధరలు హటాత్తుగా పడిపోయాయి. ఇప్పుడు ఆ ఇంటి ధర 75,000 డాలర్లకు పడిపోయింది. వడ్డీ గణించక పోయినా ఇంకా ఆ వ్యక్తి బ్యాంకుకు 1,35,000 డాలర్లు బాకీ ఉన్నాడు. ఆయన రొక్కం తీసుకున్నాడు. ఆ మేరకు తీర్చాలిగదా. బ్యాంకు వారు వచ్చారు. నీ ఇంటి ధర పడిపోయింది. ఇంటి విలువ కంటే నీవు 60,000 డాలర్లు అదనంగా బాకీ ఉన్నావు, చెల్లించమన్నారు. సదరు

వ్యక్తి చేతులెత్తేశాడు. బ్యాంకు ఇల్లు స్వాధీనం చేసుకుంది. 60,000 డాలర్లకు వ్యక్తిపై కేసు పెట్టింది. ఆ వ్యక్తి విషయం తీసుకుంటే, 90,000 డాలర్లు చెల్లించాడు, ఇల్లుపోయింది. 60 వేలడాలర్ల అప్పు మిగిలింది.

ఈ వ్యక్తి తన ఉపయోగం కొరకు ఇల్లు కొన్నాడు. ఎటువంటి వ్యాపార లావాదేవీలలో పాల్గొనలేదు. కాని, ఇల్లు ఒక సరుకుగా మారిపోయిన సందర్భంలో మార్కెట్ బూమ్, సంప్‌ల మాయాజాలంలో బూమ్లో కొని సంప్‌లో అమ్మవలసి రావడం వలన పెద్ద ఎత్తున నష్టపోయాడు. ఈ నష్టం రియల్టర్లకి లాభమయ్యింది. రియల్టర్, బ్యాంకులను కలిపి పెట్టుబడిదారీ వర్గంగా మనం చూడగలిగితే బ్యాంకునుంచి 2.25 లక్షల డాలర్లు రియల్టరకు వచ్చాయి. రియల్టర్ నుంచి ఇల్లు బ్యాంకుకు వెళ్లింది. ఇల్లు, డబ్బులు పెట్టుబడిదారీ వర్గం దగ్గరే ఉన్నాయి. పైగా మన క్లయింట్ 90వేల డాలర్లు చెల్లించాడు, 60వేల డాలర్లకు అప్పుపడ్డాడు. ఈ విధంగా సాధారణ పౌరుల నుండి ధనం పెట్టుబడిదారీ వర్గం గళ్లా పెట్టికి చేరింది.

ఉదాహరణ 3: ఈ ఉదాహరణలో వ్యక్తి అదనపు ఇళ్లను ఆస్తిగా కొనుగోలు చేసిన వ్యక్తి. ఇళ్ల ధరలు పెరుగుతున్నాయి కదా అని తనవద్ద ఉన్నధనంతోగాని, ఇతర స్థిరాస్తులు అమ్మిగాని, 2000 సంవత్సరంలో 2.25 లక్షల డాలర్లు చొప్పున 9 లక్షల డాలర్లకు నాలుగు ఇళ్లుకొన్నాడు. ధరల బుడగ పగిలిపోవడంతో 2008 లో ఈయన ఆస్తి (75,000×4) = 3లక్షల డాలర్లకు పడిపోయింది. డేవిడ్ హార్వే వీరిని ఉద్దేశించి వీరు ఇంకా నీటిలో మునిగే ఉన్నారన్నాడు. ఈ వ్యక్తికి చెందిన 6 లక్షల డాలర్లు రియల్టర్లకు చేరిపోయాయి.

లిక్విడిటీ సమస్య

బ్యాంకులలో డబ్బులు లేని పరిస్థితి ఏర్పడింది. దీనినే లిక్విడిటీ సమస్య అన్నారు. నిజానికి జరిగిందేమిటి? బ్యాంకుల డబ్బులు రియల్టీకి వెళ్లాయి. రియల్టీ ఇళ్లు బ్యాంకులకు వచ్చాయి. ఇప్పుడు ఇళ్లు కొనేవారు లేక బ్యాంకుల చేతిలో డబ్బులు లేవు. ఇంకా బ్యాంకులలో డబ్బులు దాచుకున్న వాళ్లు బ్యాంకులు దివాళా తీస్తున్నాయని తెలిసి తమతమ డిపాజిట్లు విత్డ్రాచేయడం ప్రారంభించారు. బ్యాంకులు చెల్లించలేని పరిస్థితులలో పడ్డాయి. ఈ బ్యాంకులు కొన్ని ఇన్సూరెన్స్ కంపెనీల వద్ద ఇన్సూరుచేసి ఉన్నాయి. ఇన్సూరెన్స్ కంపెనీలు దివాళాతీసే బ్యాంకులను – కొన్ని నిబంధనలకు లోబడి– ఆదుకోవాలి. ఒకటి, రెండు చిన్నా పెద్ద బ్యాంకులు దివాళాతీస్తే ఇన్సూరెన్స్ కంపెనీలు ఆదుకోగలుగుతాయి. అన్ని బ్యాంకులు ఒకేసారి దివాళా తీయడంతో ఇన్సూరెన్స్ దిగ్గజాలు (ఉదాహరణకు లెహ్మాన్ బ్రదర్స్) చేతులెత్తేసాయి. అసలు మొత్తంగా కుప్పకూలి పోయాయి. ఈ మొత్తం ప్రక్రియలో ఇంకా చాలా విషయాలు న్నాయి. బ్యాంకులు, మార్టిగేజి బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు మాత్రమేకాక ఋణాలు చిన్నచిన్న ప్యాకేజీలుగామార్చి వివిధదేశాలలో అమ్మడం, చైనావారు ఎక్కువగా కొనడంవంటివి. అయితే మన ప్రస్తుతచర్చకు ఇవన్నీ అవసరం లేదు. 1970ల నుండి నయా సరళీకరణ ఏకాభిప్రాయం' ముందుకు వచ్చిన లేదా రుద్దబడిన స్థితిలో రాజ్యం గృహవసతి, ఆరోగ్యరక్షణ, విద్య, రవాణా, ప్రజావసరాల (నీరు, ఎనర్జి, మౌలిక సదుపాయాలు) నుండి ఉపసంహరించుకుంది. ఈ రంగాలను ప్రైవేటుకు పెట్టుబడి వృద్ధికి దఖలు పరచింది, మారకపు విలువల ప్రాధాన్యత పెంచడానికి రాజ్యం అలాచేసింది" అని చెప్తూ డేవిడ్హార్వే నయాసరళీకరణ విధానాలే ఈసంక్షోభానికి కారణం అని వివరించాడు.

పరిష్కారమేమిటి? మనలాంటి వాళ్లు ఏమంటారు? అమెరికా ప్రభుత్వం బ్యాంకుల వద్ద పోగుపడి ఉన్న నిరర్థక ఆస్తులైన ఇళ్లనన్నింటిని వాటి అసలు విలువకు కొనివేసి అవసరమైన పౌరులకు ఉచితంగా గాని, కనీసం వడ్డీలేని దీర్ఘకాల రుణంగా గాని ఇవ్వాలి. అలా చేస్తే పౌరులకు గృహ వసతి సమస్య పరిష్కారమవుతుంది. బ్యాంకుల లిక్విడిటీ సమస్య పరిష్కారమవుతుంది. ఇందులో ఇంతకంటే పెద్ద సిద్ధాంతం ఏమీలేదు. సరే అమెరికా ప్రభుత్వం సహజంగానే ఇటువంటి సామ్యవాద పరిష్కారాన్ని పాటించదు. జోసఫ్ సిగిచ్ గురించి విని ఉంటారు. ఈయన సామ్యవాది కాదు. పైగా సామ్యవాదాన్ని వ్యతిరేకిస్తాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ మద్దతుదారుడు. క్లింటన్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఈ స్టిగ్లిచ్ ఆర్థిక సలహాదారుగా పనిచేసాడు. తరువాత (1993–95) ప్రపంచ బ్యాంకుకు ఉపాధ్యక్షుడుగా చేసాడు. ఆయన ఏమన్నాడంటే ప్రభుత్వం పౌరులకు ఋణాలివ్వాలి. పౌరులు బ్యాంకులకు చెల్లించి తమ ఇళ్లు విడిపించుకోవాలి అని అన్నాడు. అయితే అమెరికా ప్రభుత్వం స్టిగ్లిచ్ చెప్పినట్లు కూడా చేయలేదు. అమెరికా ప్రభుత్వం వందల బిలియన్ డాలర్లు బ్యాంకులకు వడ్డీలేని రుణంగా ఇచ్చింది. బ్యాంకుల పరిస్థితి క్రమక్రమంగా మెరుగైంది. పౌరుల పరిస్థితి ప్రభుత్వం పట్టించుకోలేదు.

అమెరికా సెంట్రల్ బ్యాంకు ఆవిధంగా వాణిజ్య బ్యాంకులకు వందల బిలియన్ డాలర్లు ఎత్తిపోయడం వలన తక్షణ తీవ్ర సంక్షోభం దీర్ఘకాల, తక్కువ తీవ్రతగల విస్తృత సంక్షోభంగా మారింది. ఈ విషయాన్ని ఇక్కడితో విడిచిపెడదాం. మనం చేపట్టిన సమస్య ఉపయోగపు విలువ, మారకపు విలువల సంక్షోభం విషయానికి వద్దాం. మొదటి ఉదాహరణలో వ్యక్తి రుణంచేసి ఇలు కొనుక్కున్నాడు. ఇంటిని బ్యాంకులో తనఖా పెట్టాడు. అంటే సదరు వ్యక్తి ఆయన ఉన్న పరిస్థితులలో ఇంటి వినియోగపు విలువను, మారకపు విలువనూ–రెండింటినీ ఒకేసారి ఉపయోగించాడు. బూమ్–సంప్ పరిణామాలలో ఆ వ్యక్తి ఇంటిని కోల్పోయాడు. అంటే విలువకు ఉండే మారకపు విలువ అనే రూపం ఆధిపత్యం వహించింది. రియల్టర్ మార్కెట్లో అమ్మకం కొరకు సమాజంలో ఉపయోగపు విలువగా ఉన్న గృహాన్ని అంటే సరుకును ఉత్పత్తి చేసాడు. కొనగోలుదారుడు ఉపయోగపు విలువగా కొనగోలు చేసాడు. ఇప్పుడది బ్యాంకు చేతిలో సరుకుగా పడివుంది. దానిని కొనే నాథుడు లేడు. అంటే, ఒక జీ ఉపయోగపు విలువ నుంచి వచ్చిన మారకపు విలువ ఉపయోగవిలువనే బంధీ చేసింది. ఈ విలువల మధ్య వైరుధ్యం పెట్టుబడిదారీ వ్యవస్థలో పునరావృతం అవుతూ ఉంటుంది. యు. ఎస్. ఎ తో పాటు ఐర్లాండు, స్పెయిన్ దేశాలలో కూడా ఈ వైరుధ్యం వచ్చింది. అలాగే 1986 లో యు.ఎస్ లోనే పొదుపు –అప్పుల వైరుధ్యం వచ్చిందని 1992 లో స్కాండినేవియన్ దేశాలలో ఆస్తుల మార్కెట్ పతనం అయ్యిందని, 1990 లో జపాన్లో భూమి మార్కెట్ సంక్షోభం ఏర్పడిందని, ఈ వైరుధ్యాలు ప్రపంచ వ్యాప్తంగానూ, తిరిగి తిరిగి వస్తున్నాయి అని సోదాహరణంగా హార్వే చెప్పాడు. ఈ వైరుధ్యం పెట్టుబడి వ్యవస్థ సహజ లక్షణమని, దీనికి పెట్టుబడిదారీ విధానంలో పరిష్కారం లేదని, ఈ వైరుధ్యం ఇతర వైరుధ్యాలతో కలసి పెట్టుబడి వ్యవస్థకే ఎసరు పెడుతుందని డేవిడ్ హార్వే వివరిస్తాడు.

(ఇంకా ఉంది)

(రచయిత విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

బంగ్లాదేశ్ రాజకీయ పరిణామాలు

బంగ్లాదేశ్‌లో హసీనా అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికార యంత్రాంగాన్ని తనకు అనుకూలంగా మలుచుకొని ప్రత్యర్థులను నిర్బంధించి, హింసాత్మక చర్యలకు పాల్పడి తిరిగి అధికారంలోకి వచ్చిందని అంటున్నారు **సంతోష్**

గత సంవత్సరం డిసెంబర్ 31న జరిగిన బంగ్లాదేశ్ 11వ సార్వత్రిక ఎన్నికల్లో నాలుగోసారి ప్రధానమంత్రిగా షేక్ హసీనా వాజెద్ (71) నేతృత్వంలోని అవామీలీగ్ అసాధారణ విజయం సాధించింది. హసీనాకు పరాజయం తప్పదనీ, బ్యాలెట్‌పెట్టెల్లో ప్రజాగ్రహం నిక్షిప్తమై ఉన్నదని పోలింగ్ పూర్తయిన వెంటనే వ్యాఖ్యానించిన విపక్షం ఈ ఫలితాలు చూసి నిర్ఘాంతపోయింది. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇద్దరు మహిళా నేతలు షేక్ హసీనా (లౌకిక మధ్యేవాద అవామీమిగ్), ఖలీదా జియా (పాక్షిక ఇస్లామిస్టు బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ)లు ప్రత్యర్థులుగా ఆ దేశ రాజకీయాలను శాసిస్తున్నారు. వీరిలో హసీనా తనదే పైచేయి అని మరోమారు నిరూపించింది.

మొత్తం 300 స్థానాల్లో అవామీలీగ్ నేతృత్వంలోని మహాకూటమికి 288 (96 శాతం) సీట్లు లభించాయి. బంగ్లాదేశ్ జాతీయ పార్టీ (అవామీ లీగ్ ఫ్రంట్‌లోని భాగస్వామి) 20 స్థానాల్లో గెలిచి రెండో స్థానంలో నిలిచింది. అవామీలీగ్ సొంతంగా 259 సీట్లు గెలిచింది. మొత్తం పోలైన ఓట్లలో 82 శాతం ఈ కూటమికి దక్కాయి.

ఖలీదా జియా నాయకత్వంలోని ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బిఎన్‌పి) 2014లో అధికార పార్టీ అక్రమాలు, విపక్షాల అణచివేత, హక్కుల ఉల్లంఘన తారస్థాయికి చేరిందంటూ 2014 ఎన్నికలను ఖలీదా జియా పార్టీ బహిష్కరించింది. ఖలీదా జియా నాయకత్వంలోని ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) ఆధ్వర్యంలో విపక్ష పార్టీలతో కూడిన జాతీయ ఐక్యతా కూటమి (ఎన్‌యుఎఫ్) 15 శాతం ఓట్లతో ఏడు సీట్లు, ఇతరులు మూడు సీట్లు గెలుచుకున్నారు. ఒక స్థానంలో ఎన్నికలు వాయిదా పడగా, మరోస్థానంలో అభ్యర్థి మరణంతో ఫలితాలను ప్రకటించలేదు.

బంగ్లాదేశ్ ఎన్నికల్లో హింస, అక్రమాలు

హసీనా పాలనను మెచ్చి ప్రజలు ఈ తీర్పునిచ్చారని అవామీలీగ్ నేత హసీనా చెప్పినా, హసీనా నిరంకుశ పోకడలు, ఎన్నికల్లో రిగ్గింగ్, ప్రతిపక్షాలపై దాడులు, దౌర్జన్యాలే తమ దారుణ పరాజయానికి కారణమని బిఎన్‌పి నిందించినా ఆ రెండూ పాక్షిక సత్యాలే అవుతాయి. బంగ్లాదేశ్‌లో హింస, అక్రమాలు లేకుండా స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయని అనుకోవ డానికి వీల్లేదు. హసీనా ఘనవిజయం విమర్శలకు అతీతమైనదేమీ కాదు. ఎందుకంటే బంగ్లాదేశ్‌లో ఎన్నికలు రక్తం ఏరులై పారించే క్రీడల వంటివి. పోలింగ్ రోజున చెలరేగిన హింసలో 18 మంది చనిపోవడమే అందుకు నిదర్శనం. హసీనా ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల రాజకీయ ప్రచారాన్ని అడ్డుకుంది. ప్రదర్శనలకు, సభలకు పోలీసులు అనుమతించలేదు. వేలాది మందిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో నిర్బంధించింది. పోలింగ్ ముగియడానికి ముందు హసీనా ప్రభుత్వ నిర్బంధం వల్ల ప్రతిపక్ష కూటమికి చెందిన 40 మంది అభ్యర్థులు పోటీ నుంచి ఉపసంహరించు కుంటున్నట్లు ప్రకటించారు.

ఈ ఎన్నికల తీర్పును తాము అంగీకరించడం లేదని, తటస్థ తాత్కాలిక ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరిగి ఎన్నికలు జరపాలని బిఎన్‌పి నేతృత్వంలోని రెయిన్‌బో కూటమి నేత, 82 ఏళ్ల ప్రముఖ న్యాయవాది కమల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. అధికారం చేజారిపోతుందన్న భయంలో ఉన్న ప్రభుత్వం ఇలాంటి అవకతవకలకు పాల్పడింది. పోలీసులను అస్త్రంగా మల్చుకొని ఎడాపెడా అరెస్టులు చేయించింది. ఈ దుశ్చర్య నన్ను సిగ్గుతో తలవంచుకునేలా చేస్తోంది. షేక్ ముజిబుర్ రెహ్మాన్ మంత్రివర్గంలో పనిచేశాను. 1972లో లిఖించబడిన రాజ్యాంగ రచయితల్లో నేనూ ఒకడినని పేర్కొనడం గమనార్హం.

నిజానికి మత ఛాందసవాద శక్తులకు కొమ్ముకాస్తూ, యుద్ధ నేరస్తులకు బాహాటంగా మద్దతు పలకడం, అగ్ర నాయకులే అవినీతిలో పీకల్లోతున కూరుకుపోవడం, నయా ఉదారవాద విధానాలను జోరుగా అమలు చేయడం, మైనార్టీలను అభద్రతకు గురిచేయడం వంటి విధానాలే ఖలీదాజియా పార్టీ ఓటమికి కారణం. అయితే 300 స్థానాలున్న బంగ్లాదేశ్ పార్లమెంట్‌లో 299 స్థానాల్లో పోటీ చేసి 288 స్థానాల్లో గెలుపొందిన అధికారపార్టీ అవామిలీగ్ సక్రమ పద్ధతిలో ఘన విజయం సాధించిందనుకోవడానికి వీల్లేదు.

ఇది బంగ్లాదేశ్ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన సంకేతం. బలమైన ప్రతిపక్షం లేకపోతే ప్రజాస్వామ్యం ఉనికికే ప్రమాదం ఏర్పడుతోంది. ఇక మీదట బంగ్లా రాజకీయాల్లో హసీనా నిరంకుశ ఆధిపత్యం మరింత పెచ్చరిల్లే ప్రమాదం ఉంది. ఎన్నికల సందర్భంగా అనేక మంది జర్నలిస్టుల అరెస్టులు, అక్రమ నిర్బంధాలు కొనసాగాయి. ఎన్నికల అవకతవకలపై అబద్దపు వార్తలు ప్రచురించారంటూ జర్నలిస్టులపై అధికారులు కేసులు పెట్టి వేధించారు. అసమ్మతి గొంతు నులిమే కొత్త చట్టాలను ప్రభుత్వం ఇంతకు ముందే చేసి పెట్టింది. ఖుల్నా ప్రాంతంలో రిజిస్టరైన ఓటర్ల సంఖ్య కన్నా చాలా ఎక్కువ సంఖ్యలో ఓట్లు పోలయ్యాయని హిదాయత్ హుస్సేన్, రషీదుల్ ఇస్లామ్ అనే జర్నలిస్టులు బయటపెట్టారు. వారిద్దరిపై డిజిటల్ సెక్యూరిటీ చట్టం కింద కేసు పెట్టారు. ఈ చట్టం సెప్టెంబర్‌లోనే వచ్చింది.

డిసెంబర్‌లో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకువచ్చిన అమానుష చట్టమిది. హిదాయత్ హుస్సేన్ ఇప్పుడు నిర్బంధంలో ఉన్నాడు. రషీదుల్ ఇస్లామ్ తప్పించుకుని రహస్యంగా బతుకుతున్నాడు. ఈ జర్నలిస్టులు అబద్ధపు వార్తలతో ఎన్నికల విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నారంటూ పోలీసులు వారిపై విరుచుకుపడుతున్నారు. పోలింగ్ రోజున భారీ స్థాయిలో హింసాకాండ జరిగింది. ఎన్నికల ప్రచారం కొనసాగినంత కాలం హింసాకాండ కూడా కొనసాగింది. ప్రతిపక్షాలపై వేధింపులు, ప్రతి పక్షాల కార్యకర్తల అక్రమ నిర్బంధాలు, దాడులు, దౌర్జన్యాల ఫిర్యాదులు లెక్కకు మిక్కిలి వచ్చాయి.

ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఎన్‌పి గతసారి ఎన్నికలను బహిష్కరించడం తో ఆ పార్టీ పతనం మొదలైంది. ప్రజల్లో ఆ పార్టీ పునాది పూర్తిగా చెదిరిపోయింది. జియా అవినీతి కేసులో 17 ఏళ్ల జైలు శిక్ష పడి ఎన్నికల్లో పోటీకి అనర్హులు కావడం, మరో నాయకుడు బేగం ఖలీదా జియా కుమారుడు తారిఖ్ జియా మనీ లాండరింగ్, అవామీలీగ్ నేతల హత్యకు కుట్ర పన్నారన్న కేసులో దోషిగా తేలాక లండన్‌కు పారిపోవడంతో బిఎన్‌పికి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎన్నికల ప్రచారంలోను, పోలింగ్ రోజున ఇది స్పష్టంగా కనిపించింది.

బంగ్లా నేషనలిస్టు పార్టీ (బిఎన్‌పి) బహిష్కరించిన 2014 ఎన్నికల్లో అవామీ లీగ్‌కు 234 సీట్లు రాగా, ఈ ఎన్నికల్లో 268 సీట్లు సాధించగలిగిందంటే దానికి కారణమిదే. 2008 ఎన్నికల్లో 33 సీట్లు సాధించిన బిఎన్‌పి కూటమి ఈసారి కేవలం 7 సీట్లకే పరిమితమైంది.

ఈసారి ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలపై విస్తృతంగా జులుం, వారి పోలింగ్ ఏజెంట్లను టోకుగా నిర్బంధించడం ఓటింగ్‌నాడు పోలింగ్ కేంద్రాల నుండి ఓటర్లను తరిమేయడం విరివిగా జరిగాయి. ఓటింగ్ నాడు పలు ప్రాంతాల్లో గొడవలూ హింస, ప్రతిపక్ష ఎన్నికల ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి గెంటివేయడం జరిగాయి. కొంతమంది ప్రతిపక్ష అభ్యర్థులు నిరసనగా ఎన్నికల బరి నుంచి విరమించుకున్నారు.

వీటన్నిటి మధ్య అధికార పార్టీ అవామి లీగ్ నిరంకుశ విజయం సాధించింది. ఎన్నికల ప్రకటన నాటి నుంచి ఓటింగ్ రోజు వరకు ప్రతిపక్ష పార్టీలపై ప్రభుత్వ వ్యతిరేక మీడియాపై అధికార పక్షం, ప్రభుత్వం కత్తి కట్టాయి. ప్రభుత్వాన్ని విమర్శించే వెబ్‌సైట్ మూసేయడం, టివి ప్రసారం ఆపేయడం, విలేకర్లను అరెస్టు చేయడం, పదివేల కంటే ఎక్కువ ప్రతిపక్ష కార్యకర్తలను అరెస్టు, జైలుకి పంపడం ఉద్వేగపూరిత వాతావరణాన్ని సృష్టించింది.

బంగ్లా ఎన్నికల్లో అక్రమాలు ఒక మోతాదుకు మించి లేవని ఎన్నికలు మొత్తం మీద చూసినప్పుడు స్వేచ్ఛగా, న్యాయంగానే జరిగాయని సార్క్, ఒఐసి, భారత పరిశీలకులతో కూడిన హసీనా సానుకూల పరిశీలకుల బృందం వెల్లడించిన అభిప్రాయం పాక్షిక సత్యమే. మరోవైపు దక్షిణాసియా కు చెందిన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కూడా హింసాకాండ, వేధింపులు జరిగాయని అంటున్నారు. ఈ ఫిర్యాదులపై తక్షణం విచారణ జరగాలని కోరారు. బ్రిటన్‌కు చెందిన ఆసియా పసిఫిక్ మంత్రి మార్క్‌ఫీల్ తీవ్రమైన పదాలతో బంగ్లాదేశ్ ఎన్నికలను ఖండించారు. ఎన్నికల దౌర్జన్యాలకు సంబంధించి తన వద్ద విశ్వసనీయ మైన సమాచారం ఉందన్నారు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులతో ప్రతిపక్షాలు ఎన్నికల ప్రచారం చేయకుండా అధికార పక్షం అడ్డుకున్న అనేక సంఘటనలు న్నాయన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి వచ్చిన అన్ని ఫిర్యాదు లపై తగిన విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

బంగ్లాదేశ్‌లో అత్యధికంగా విదేశీ పెట్టుబడులు పెడుతున్న దేశం అమెరికా కూడ బంగ్లాదేశ్ ఎన్నికలపై విమర్శలు చేసింది. వేధింపులు, బెదిరింపులు, హింసాకాండ ఎన్నికలకు ముందు పెద్దఎత్తున జరిగినట్లు విశ్వసనీయమైన సమాచారం తమ వద్ద ఉందని అమెరికా పేర్కొంది. ప్రతిపక్ష అభ్యర్థులు ప్రచారం చేయడం కూడా కష్టమైన పరిస్థితులు సృష్టించారని, సభలు సమావేశాలు నిర్వహించే స్వేచ్ఛ లేకుండా చేశారని అమెరికా వ్యాఖ్యానించింది. చాలా మంది ఓటు వేయకుండా అడ్డుకోవడం కూడా జరిగింది. ఎన్నికల వ్యవస్థ పట్ల ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఈ ఎన్నికలు జరిగాయని అమెరికా విమర్శించింది. ఎన్నికల్లో హింసాకాండ పెద్ద ఎత్తున జరిగిందని, ఈ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగలేదని యూరోపియన్ యూనియన్ కఠిన పదాలతో వ్యాఖ్యానించింది. ఎన్నికల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలు, హింసాకాండపై విచారణ జరగాలని చెప్పింది.

హసీనా ఫాసిస్టు నియంతృత్వ పాలన

బంగ్లా ప్రధానిగా హసీనా పాకిస్థాన్ అనుకూల సంప్రదాయ, ఛాందసవాద మిలిటెంట్ల ఆగడాలను అదుపు చేయడంలో కఠినంగానే వ్యవహరించింది. అలాగని అంతా సవ్యంగా ఉన్నదని చెప్పడం అవాస్తవమవుతుంది. భావప్రకటనా స్వేచ్ఛకు ఆటంకాలు, విచ్చలవిడి ఎన్‌కౌంటర్లు, మనుషుల్ని మాయం చేయడం వంటివి ప్రభుత్వ నిరంకుశ పాలనను ఎత్తి పట్టాయి.

బిఎన్‌పి అధినేత ఖలీదాతో సహా ఎందరో నేతల్ని అవినీతి కేసుల్లో శిక్షలు పడేలా చేయగలిగామని చెబుతున్నా.. స్వపక్షం అవినీతి విషయంలో హసీనా సర్కారు ఉదాసీనంగా ఉంది. భూ కబ్జాలు, మెగా ప్రాజెక్టుల్లో , పబ్లిక్ రంగ సంస్థల్లో అవినీతి, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో విచ్చలవిడిగా రుణాల మంజూరు, ఎగవేతదార్లపై చర్యలు తీసుకోకపోవడం వగైరాలు ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేశాయి. ఏదో ఒక సాకుతో విపక్ష నేతల్ని, వారి మద్దతుదార్లను జైళ్లలోకి నెట్టి ఆ పార్టీలకు నాయకత్వమే లేకుండా చేసిన తీరు ఎన్నికల ప్రక్రియపైనే సందేహాలు రేకెత్తిస్తోంది.

గత దశాబ్ద కాలంలో సౌది అరేబియా ప్రోత్సాహం, సహకారంతో పలు తీవ్రవాద గ్రూపులు ఉనికిలోకి వచ్చాయి. ప్రధానమైనవి 'జమాత్-ఉల్ ముజాదీన్', 'ది హర్కతుల్-జిహద్ అల్-ఇస్లామీ', 'షాహదత్-ఈ-అల్-హిక్మా'. వీటిపైనా హసీనా నిషేధం విధించింది. గత దశాబ్ద కాలంలో అనేక హింసాత్మక సంఘటనలకు పాల్పడ్డాయి. ఆస్తి నష్టం, ప్రాణ నష్టానికి పూనుకున్న, మైనార్టీలపై, నాస్తికులపై, రాజకీయ అసమ్మతి వాదులపై దాడులు చేశాయి.

2016లో ఢాకాలోని ఒక బేకరిపై బాంబులతో తీవ్రవాద చర్యకు పాల్పడింది. దేశ పౌరుల భద్రతకు, స్థిరత్వానికి ప్రమాదమేర్పడినా రాజకీయ అవసరాలరీత్యా హసీనా ప్రభుత్వం ఉదాసీనంగానే వ్యవహరిస్తోంది.

బంగ్లాదేశ్‌లో 80 శాతం జనాభా గ్రామాల్లో నివసిస్తోంది. వీరిలో సగం మందికి భూమిలేదు. మిగితా సగం మందికి ఒక ఎకరాలోపు భూమి ఉంది. తరచూ వరదలకు గురై పంట, ఇళ్లు నష్టపోతున్నారు. కలరా, డెంగ్యు, విరేచనాలు వంటి వ్యాధులకు గురవుతున్నారు. అయినా ప్రభుత్వం సహాయం అందనందున భూములు అమ్ముకొని వలసలు వెళ్తున్నారు.

బంగ్లాదేశ్ అభివృద్ధిలో 70 శాతం విదేశీ పెట్టుబడులే. జిడిపి పెరుగుతున్నా అవిద్య, అనారోగ్యం, పేదరికం వంటి ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావడం లేదు. జాతీయ ఆదాయంలో 30 శాతం పరిశ్రమలు, 20 శాతం వ్యవసాయం, 40 శాతం తయారీ రంగం నుండి లభిస్తుంది. పరిశ్రమల్లో ప్రభుత్వ వాటా 85 శాతం నుండి 40 శాతానికి పడిపోయింది. అంటే ప్రైవేటీకరణ వేగంగా జరుగుతోంది. ప్రభుత్వ రంగంలోని జౌళి పరిశ్రమ పూర్తిగా ప్రైవేటీకరణ చెందింది.

హసీనా ప్రభుత్వం బంగ్లా వనరులను ప్రపంచ కార్పొరేట్లకు, భారత కార్పొరేట్లకు చౌకగా విక్రయిస్తోంది. ఫలితంగా బంగ్లా కార్మికుల భద్రతకు ప్రమాదం ఏర్పడింది. కార్మిక ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచి వేస్తోంది. బంగ్లా రాజధాని ఢాకా నగరంలో జూలై 29న పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న ఇద్దరు చిన్నారులను ఒక వాహనం ఢీ కొట్టింది.

దీంతో పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ట్రాఫిక్ నియంత్రణ చేశారు. వాహనాలు నడిపే డ్రైవర్ల లైసెన్స్‌లు పరిశీలించారు. సగానికిపైగా డ్రైవర్లు శిక్షణ లేనివారని తెలిసింది. విద్యార్థుల ఆందోళనను అర్థం చేసుకుని ఢాకా రవాణా వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి బదులు హసీనా ఫాసిస్టు పద్ధతుల ద్వారా ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం చేసింది. ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించింది. పాఠశాల యాజమాన్యాల ద్వారా విద్యార్థులను భయపెట్టించే ప్రయత్నం చేసింది.

విద్యార్థి ఉద్యమాన్ని అణచివేయడానికి గుండాలను ఉసిగొల్పింది. వీరికి పోలీసు అండగా నిలిచింది. విద్యార్థులపై ఇనుప రాడ్స్, సుత్తెలు, 9 ఎంఎం పిస్తోల్ ద్వారా దాడులు చేయించింది. హసీనా ప్రభుత్వం పాలక పార్టీ గుండాలు విద్యార్థులపై దాడులు చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు. అధికార పార్టీ గుండాలు 14 సంవత్సరాల విద్యార్థినిలపై దాడులు చేశారు. దుర్భాషలాడారు, అత్యాచారాలకు పాల్పడ్డారు. ప్రభుత్వ దమనకాండను అంతర్జాతీయ హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ పూర్వరంగంలోనే యువతను ఆకర్షించే తీవ్రవాద గ్రూపులు విస్తరించాయి. 1971 స్వాతంత్ర్యం అర్థం లేనిదిగా మారిందని విద్యార్థులు, మేధావులు వాపోతున్నారు. మరోవైపు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి బదులు మతతత్వం వైపు యువత ఆకర్షితులౌతున్నారు.

ఈ ఎన్నికల్లో భారత వ్యతిరేకత ఎక్కువగా పనిచేస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. దీనికి కారణం మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరుగుపొరుగు దేశాలతో సత్సంబంధాలు దెబ్బతినడం, అసోంలో పౌర జాబితా తయారీ కారణంగా బంగ్లాదేశ్‌కు చెందిన ఒక మతం వారి భవిష్యత్తు ఆందోళనకరంగా మారుతున్నదనే ప్రచారం, రోహింగ్యాల సమస్యపై మయన్మార్‌తో కలిసి బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా భారత్ వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు రావడం.

అంతేకాదు, మనదేశంలో మైనార్టీలపై, దళితులపై గోరక్షణ పేరిట సాగుతున్న దాడులు ఆ దేశంలో ఆందోళనకు కారణమైంది. భారత్ తన పెట్టుబడులు పెంచుకుంటూ బంగ్లాదేశ్‌పై పెత్తనం చలాయించేందుకు ప్రయత్నిస్తున్నదనే ప్రచారం సాగింది. కానీ ఇవేమీ అవామీలీగ్ విజయంపై ప్రభావం చూపలేకపోయాయి.

హసీనా ప్రభుత్వం పట్ల మోడీ ఆశలు

బంగ్లాదేశ్ వ్యూహాత్మకంగా కీలకస్థానంలో ఉంది. భారతదేశానికి బంగ్లాదేశ్‌కు ఉన్న భౌగోళిక, సాంస్కృతిక సన్నిహితత్వం, సారూప్యం దృష్ట్యా ఆ దేశ ఎన్నికలను సహజంగానే భారత్ ఆసక్తిగా చూసింది. భారతదేశానికి, బంగ్లాదేశ్‌కు మధ్య సరిహద్దు 4000 కిలోమీటర్ల పొడుగునా పరుచుకొని ఉంది. ఇది తరచు వివాదాలకు దారితీస్తోంది. బంగ్లా నుంచి భారత్‌లోకి అక్రమ చొరబాట్లు జరుగుతున్నాయి. ఇది భారత్‌కు తలనొప్పిగా పరిణమిస్తోంది. అదే సమయంలో తూర్పు ఆసియా, దక్షిణాసియా, ఆగ్నేయాసియాల మధ్య ఆ దేశం వారిధిలా వ్యవహరిస్తుంది. కాబట్టి తూర్పు ఆసియాతో వాణిజ్యం, పెట్టుబడులు, అనుసంధానానికి సంబంధించి కీలకంగా ఉన్న బంగ్లాతో సత్సంబంధాలు మెరుగుపరుచుకోవాలని భారత్ ఆశిస్తోంది.

రవాణాతో పాటు భారత్‌లోని కొత్త విపణులకు చేరువకావడానికి, అవకాశాల వృద్ధికి, ఈ బంధం అవకాశం కల్పిస్తుంది. బంగ్లా తన ఓడరేవులను, భూ భాగాన్ని వాడుకునేందుకు అనుమతి ఇవ్వడంతో భారత్ పని తేలికైంది. భారత్ వ్యతిరేకిగా ముద్రపడిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధినేత ఖలీదా జియా అధికారంలో ఉంటే ఇది సాధ్యపడేది కాదు. దక్షిణాసియాలో పెరుగుతున్న చైనా ప్రాబల్యాన్ని అడ్డుకోవడానికి భారత్‌కు బంగ్లా మద్దతు తప్పనిసరి. అందుకు అమెరికా సామ్రాజ్యవాదం తోడ్పాటు అందిస్తోంది.

హసీనా హయాంలో భారత్ పట్ల బంగ్లాదేశ్ సానుకూలంగా ఉంటున్న మాట వాస్తవమే. అదే సమయంలో చైనాతోనూ హసీనా సర్కారు బలమైన స్నేహానుబంధం ముడివేసుకుని ఉండడం విస్మరించరానిది! రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుతం బంగ్లా వాణిజ్యంలో చైనా పెద్ద భాగస్వామి. బంగ్లాకు పెద్దయెత్తున ఆయుధాలు సరఫరా చేస్తున్న దేశాల్లో చైనా మొదటిస్థానంలో ఉంది. చైనా నుంచి కొనుగోలు చేసిన జలాంతర్గాములను త్వరలోనే బంగ్లా ప్రారంభించనుంది. దానివల్ల బంగాళాఖాతంలో బలబలాలపై ప్రభావం పడనుంది. తాను ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన బెల్ట్ రోడ్ ఇనిషియేటివ్ (బిఆర్‌ఐ)లో భాగంగా బంగ్లాదేశ్‌లో 2,400 కోట్ల డాలర్లను చైనా పెట్టుబడిగా పెట్టనుంది. చైనా పన్నిన అప్పుల ఉచ్చులో చిక్కుకుని శ్రీలంక, మాల్దీవులు, మలేసియా వంటి దేశాలు ఎన్నో చేదు అనుభవాలు ఎదుర్కొన్నాయి. వీటి నుంచి హసీనా పాఠాలు నేర్చుకోవలసి ఉంది.

బంగ్లాదేశ్‌లో తీవ్రవాదం తగ్గుముఖం పట్టడం, రొహింగ్యాలకు ఆశ్రయం ఇవ్వడం, భారత్‌తోపాటు చైనాతోనూ సత్సంబంధాలు నెరపడం అవామీలీగ్‌కు ఎన్నికల్లో సానుకూలాంశాలుగా పనిచేశాయి. మరోవైపు బంగ్లాదేశ్ నేషలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధినేత్రి ఖలీదా జియా అవినీతి కేసులో 19 యేండ్ల జైలుశిక్ష అనుభవిస్తుండడంతో పార్టీకి దిశానిర్దేశం కరువైంది. ఆమె పెద్ద కుమారుడు తారిక్ రహమాన్‌కు అవినీతి కేసులో శిక్ష పడింది. అయితే ఆయన లండన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నారు. దీంతో బిఎన్‌పిని నడిపే బాధ్యత డాక్టర్ కమల్‌హుస్సేన్‌పై పడింది. ఆయన బిఎన్‌పి నేత కాదు, కూటమిలోని ఎన్‌యుఎఫ్ పార్టీ నేత. అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన న్యాయవేత్త. దేశ మొదటి న్యాయశాఖ మంత్రి. విపక్ష కూటమి బలహీనతలు పక్కనపెడితే ఈ ఎన్నికలు జరిగిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంతటి భారీస్థాయిలో అవామీ లీగ్ విజయం సాధించడం అంతే ఘోరంగా ప్రతిపక్షం పరాజయం చవిచూడడంతో మతశక్తులు రెచ్చిపోయే అవకాశముంది. ముఖ్యంగా ప్రతిపక్షం పరిధిలోని యువతపై తీవ్రప్రభావం పడే అవకాశం ఉంది. వారు ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని కోల్పోవచ్చు. ఈ క్రమంలో వారు బయట నుంచి మద్దతును కూడకట్టుకునే ప్రయత్నం చేసే అవకాశం లేకపోలేదు. బంగ్లాదేశ్ తాజా పరిణామాలను పాకిస్థాన్, చైనా దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్ రాజకీయాల్లో సమీప భవిష్యత్తులో ప్రజాస్వామ్య వాతావరణం ఏర్పడే అవకాశం కన్పించడంలేదు.

ఎన్నికలు సక్రమంగా జరిగే అవకాశాలు లేవంటూ విపక్ష ఎన్‌యుఎఫ్ ఆరోపిస్తూనే ఉంది. దీనికి తోడు ఈ ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదంటూ కొన్ని అంతర్జాతీయ సంస్థలు కూడా అభిప్రాయ పడుతున్నాయి. దాదాపు వంద మంది అభ్యర్థులు పోలింగ్‌కు ముందే తాము పోటీ నుంచి తప్పుకుంటున్నామని ప్రకటించారు. పోలింగ్ సందర్భంగా పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల్లో అవకతవకలు ఆరోపణలు ఎలా ఉన్నా.. సైనిక జోక్యం లేకుండా క్రమబద్ధంగా ఎన్నికలు జరుగుతున్నందుకు హర్షించాల్సిందే. అయితే రాజ్యాంగపరమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు అన్నీ హసీనా అనుయాయులతో నిండి ఉన్నాయి. అవి స్వతంత్రను, రాజ్యాంగ విలువలను పాటించక హసీనా రాజకీయ పరిరక్షణకే పాటుపడుతున్నాయి.

(రచయిత ఉపాధ్యాయులు)

సామ్రాజ్యవాద వ్యతిరేకి హ్యూగో చావెజ్

అమెరికన్ సామ్రాజ్యవాద ఆంక్షలను, దాడులను ఎదుర్కొని వెనిజులా ప్రజలకు నూతన ఆలోచన విధానాన్ని అందించిన చావెజ్ కృషిని తెలియజేస్తున్నారు **ఎనిశెట్టి శంకర్**

ఒక చిన్న దేశం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడి తనకు తాను అభివృద్ధి చెందేట్లు చేసిన ఘనత ఈ శతాబ్దపు గొప్ప రాజనీతిజ్ఞునిగా నిలిచిన వెనెజులా అధ్యక్షుడు చావెజ్‌ది. బుష్-ఒబామాలు సిద్ధాంతీకరించిన ఉగ్రవాదంపై రాజ్య ఉగ్రవాదం విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించి హింసకు కారణం రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలని తెలిపి ప్రపంచంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడి పోరాడిన ధీశాలి, బహుముఖ ప్రజ్ఞాశాలి 21వ శతాబ్దపు మానవునిగా ఎందరో మేధావులచేత కొనియాడబడినాడు చావెజ్. ఎందరో రచయితలు ఏదో ఒక కోణంలో నుంచి చావెజ్ గూర్చి రాసిన - అతడు 21వ ఈ శతాబ్దపు మానవత్వమున్న గొప్ప నాయకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అని చెప్పవచ్చు.

అమెరికా తొత్తు మిలటరీ ప్రభుత్వం దేశాధ్యక్షుణ్ని అపహరించుకుపోతే 72 గంటల్లో అతణ్ని విడిపించి లక్షలాది మంది ప్రజలు, ప్రజాస్వామ్య వ్యవస్థను నిలబెట్టుకునేలా కృషి చేసిన గొప్ప చైతన్యశీలి. ప్రజా వాహినికి పౌర విధులు నేర్పిన మహావ్యక్తి. ప్రజాస్వామ్యాన్ని రక్షించేది అశేష ప్రజా బాహుళ్యమని శ్రామిక వర్గమని, దానికి బద్ధ శత్రువు ధనిక వర్గం, మిలటరీ అధికారులని తన ఉపన్యాసాల ద్వారా ప్రజల్ని జాగరూకుల్ని చేశాడు.

శతాబ్దాలుగా వెనెజులాను తమ గుప్పెట్లో పెట్టుకొని అంతా తామేనని పాలించిన వర్గానికి వ్యతిరేకంగా ప్రజల్లో పరస్పరావగాహన, తాడిత పీడితుల మధ్య సఖ్యత సాధించి సామూహికతత్వాన్ని బోధించి రాజకీయ అధికారాన్ని శ్రామికవర్గం చేతుల్లో పెట్టి సోషలిస్టు వ్యవస్థ కోసం కృషి సల్పిన దార్శనికుడు అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా లక్షలాది వెనెజులా పౌరుల్ని వదిలించి లాటిన్ అమెరికా అస్తిత్వాన్ని నెలబెట్టిన గొప్ప వ్యక్తి చావెజ్.

ఎప్పటికప్పుడు ప్రజల నుండి, సంస్థల నుండి తన పాలనపట్ల వారి అభిప్రాయాలను, విమర్శలను ఆహ్వానిస్తూ, స్వీకరిస్తూ ప్రజలకు అతి దగ్గరగా మసలుకోవడంలో చావెజ్ కృతకృత్యుడయ్యాడు. ముఖ్యంగా సార్వత్రిక ప్రాథమిక, ఉన్నత విద్య, అందరికీ అందుబాటులో వైద్యాన్ని తెచ్చి ప్రజల మౌలిక అవసరాలను తీర్చడంలో ముందు భాగాన నిలిచినాడు. చావెజ్ తను అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండే పేదల పట్ల, నిరుద్యోగుల పట్ల తన సంసిద్ధతను, కార్యాచరణను పకడ్బందీగా అమలు పరుస్తూ వారి జీవితాలు బాగుపడేవిధంగా అవిరళ కృషి చేశాడు. అతని ఆ నిబద్ధతనే అతని రాజకీయ ప్రయాణంలో చివరి వరకు సాఫీగా నడిచింది, నడిపింది.

అమెరికాపై జరిగిన టెర్రరిస్ట్ దాడుల నేపథ్యంలో ఆ దేశం 'ఉగ్రవాదంపై యుద్ధం' ప్రకటించి జెనీవా ఒప్పందాలన్నింటినీ తుంగలో తొక్కి స్వతంత్ర దేశాల మీద, సంస్థల మీద ఏకపక్ష సైనిక చర్యల్ని సాగిస్తే ఏ ఒక్క దేశమూ అమెరికాను ప్రశ్నించలేదు. తప్పుపట్టలేదు. కాని ఒక్క చావెజ్ మాత్రం ధైర్యంగా నిలబడ్డాడు. ఉగ్రవాదాన్ని రాజ్య ఉగ్రవాదం ఓడించలేదని, సామాజిక సమస్యలకు రాజకీయ, ఆర్థికాలే పరిష్కారాలని నొక్కి చెప్పాడు. చిత్రహింస, బాంబులు, మారణకాండలు ప్రజలను ఉద్ధరించవని కరాఖండిగా చెప్పాడు. ఉగ్రవాదంపై సామ్రాజ్యవాద సిద్ధాంతీకరణ విఫల ప్రయత్నమని చెబుతూ మిలటరీ చర్యలకు దౌత్య సంబంధాలే శరణ్యమని తనదైన నూతన ఆలోచనా విధానాన్ని ప్రకటించాడు. అంతేగాక పాశ్చాత్య రాజ్య ఉగ్రవాదం అత్యంత కిరాతకంగా చెప్పబడ్డ అల్‌ఖైదా ఉగ్రవాదానికి ఏమీ తీసిపోదని అంటాడు.

చావెజ్ ప్రతిపాదనల్లో మూడు అంశాలు ప్రధానమైనవి. ప్రసిద్ధ క్రైస్తవం, బొలీవియన్ జాతీయ, ప్రాంతీయ, సమన్వయం, మార్క్సిస్టు రాజకీయ, ఆర్థిక ఆలోచనా విధానం. న్యాయం పట్ల, హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నవారి పట్ల ఉదార స్వభావం కలిగి ఉండేలా అతని క్రైస్తవంలో నమ్మకం. అతని హయాంలో ఎంతో మందికి ఎలాంటి శిక్షలు పడకపోవడం, మరికొందరు సాధారణ జీవన స్రవంతిలో కలిసిపోవడం చూస్తాం. చావెజ్ తన దేశ ప్రజలను ఒక వైపు అభివృద్ధి పథాన నడిపిస్తూ మరోవైపు అమెరికా సామ్రాజ్యవాదానికి ఎదురొడ్డి నిలిచిన గొప్ప నాయకుడు.

ఇవాళ అమెరికా సామ్రాజ్యవాదం బలహీనమవుతున్నట్లు కనిపిస్తూనే మరోవైపు కొత్త కొత్త దేశాలపై తన పంజా విసరడానికి ఎప్పుడూ ఏవేవో ఎత్తులు, కుయుక్తులు పన్నుతూనే ఉన్నది. ప్రపంచంలో చిన్న దేశాలే అయినా అమెరికా పెత్తనానికి ఎప్పుడూ సవాల్‌గా నిలుస్తుండడం చారిత్రక వాస్తవం. పెద్ద దేశమని చెప్పుకునే మన భారతదేశం మాత్రం ఆనాటి నుండి ఈనాటి వరకు ఏదో ఒక సామ్రాజ్యవాద దేశ పంచన చేరి కాలం గడుపుతుండడం అత్యంత విచారకరం. పైగా ప్రస్తుత ప్రభుత్వం 'దేశభక్తే' పెట్టుబడిగా భావిస్తూ అమెరికా అడుగులకు మడుగులొత్తుతున్న వైనాన్ని మనం ఎండగట్టాల్సిన తరుణమిదే. ప్రపంచంలో కూటములుగా బలపడుతూ బలహీన దేశాలపై తమ పెత్తనం సాగిస్తున్న ప్రస్తుత తరుణంలో చావెజ్ లాంటి ఓ గొప్ప నాయకున్ని మననం చేసుకోవడమే ఆయనకు నిజమైన నివాళిగా భావించాలి.

(1954 జూలై 28న జన్మించిన హ్యూగో చావెజ్ 2013 మార్చ్ 5 నాడు మరణించాడు. 1999 నుండి 2013 వరకు వెనెజులా దేశానికి 45వ అధ్యక్షునిగా ఉన్నాడు.)

(రచయిత, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) వీ

రాజ్యమేలుతున్న కార్పొరేట్ ఫాసిజం

***మోడీ ప్రభుత్వం దేశ ప్రజలపై ప్రయోగిస్తున్న నిర్బంధాన్ని ధిక్కరిస్తూ ప్రజల గురించి రాసి, పాడినవారు మాత్రమే రచయితలు, కళాకారులు, మేధావులు అని ప్రకటించాలని అంటున్నారు* ఎం. రత్నమాల**

ఇప్పుడు దేశంలో రాజ్యమేలుతున్న కార్పొరేట్ ఫాసిజం దేశ సామాజిక వ్యవస్థను పూర్తిగా హింసాత్మకం, నేరపూరితం చేస్తున్నది. హింస వాహికగా, ఆధారంగా కార్పొరేట్ ఫాసిజం అమలవుతున్నది. దేశాన్నేలుతున్న నరేంద్రమోడీ కార్పొరేట్ ఫాసిజం ప్రతినిధి. తన సొంత పార్టీ అయిన భారతీయ జనతా పార్టీలోని తనను తప్ప మరెవరిని లెక్కచేయదు. మోడీ అధికారానికి వచ్చిన నాటి నుంచి దేశంలో మతతత్వ సంస్థలు, మతతత్వవాదులు కత్తులు, కటార్లు, గొడ్డళ్లు, బల్లాలు, బరిసెలు, పిస్తోల్లు చేతబట్టి దేశ వ్యాప్తంగా తిరుగుతూ ఆవుమాంసం తిన్నారని, బొట్లు పెట్టుకోలేదని, మరోటని, ఇంకేదో అని చెప్పి మనుషుల్ని అడ్డంగా నరుకుతున్నారు. ప్రజాస్వామిక మేధావులను కాల్చి చంపుతున్న గౌరీ లంకేశ్, దభోల్కర్ హత్యలు వంటివి ఇంకా చేస్తూనే ఉన్నారు.

ఒకప్పుడు గ్రామాల్లో బాగోతులాట ఆడేవారు. స్టేజీమీద రాజు వేషధారి ఓ కత్తి పట్టుకుని స్టేజీమీద ఇటునుంచి అటు అటునుంచి, ఈ మూల నుంచి ఆ మూలకు ఎగురుకుంటూ ధిక్కారమున్ సైతునా? ధిక్కారమున్ సైతునా, సైతునా అంటూ తిగిరిగేవాడు. ఇప్పుడు ఈ కార్పొరేట్ ఫాసిస్టు ప్రతినిధులు కూడా కత్తులు, కటారులు, గొడ్డళ్లు, పిస్తోల్లు పట్టుకుని ధిక్కారమున్ సైతునా? సైతునా? అంటూ హత్యలు చేస్తున్నారు. గోవుల్ని రక్షించాలని నినాదాలిస్తూ మనుషుల్ని భక్షిస్తున్నారు. ఒకప్పుడు మూడో, నాలుగో ఉండే మతతత్వ సంస్థలు మోడీ అధికారంలోకి వచ్చాక 30కి పైగా పెరిగాయి.

సమాజాన్ని హింసాత్మకం, నేరపూరితం చేస్తున్న కార్పొరేట్ ఫాసిజం సమాజంలో మనుషులని అమానవీకరిస్తున్నది. సమాజాన్ని అమానవీకరించే క్రమంలో కార్పొరేట్ ఫాసిజం మానవ సంబంధాల్ని అమానుషీకరిస్తున్నది. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నారనో, చేసుకోబోతున్నారనో చెప్పి స్వంత బిడ్డల్ని, కొడుకులను, కూతుళ్లను కిరాతకంగా తల్లిదండ్రులు చంపుతున్నారు. ప్రేమించలేదని, పెళ్లి చేసుకోనన్నదని చెప్పి చంపుతున్నారు. కార్పొరేట్ హింస మానవ సంబంధాల్ని కర్తపూరితం చేస్తున్నది. రక్త సంబంధీకుల్ని హత్య చేయడం లేదా ఆత్మహత్య చేసుకునే స్థితికి నెట్టడం సమాజంలో నిత్యకృత్యమై పోయాయి. పత్రికల్లో న్యూస్‌లో రోజు ఒకటి మించి కనీసం నాలుగైదైనా ఉంటున్నాయి.

హైదరాబాద్ నగర శివార్లలో రిలయన్స్ ఫ్రెష్ మొదలైన కార్పొరేట్ సంస్థలు రైతుల్ని బెదిరించో, భ్రమపెట్టో వాళ్ల వ్యవసాయ భూముల్ని బేదఖలు చేసి కూరగాయలు, పండ్లు ఫలాలు పండించి నగరంలో రిలయన్స్ ఫ్రెష్ మొదలైన మాల్స్‌లో అమ్ముతున్నారు. అక్కడ రైతులు తమ భూముల్లో తామే వ్యవసాయ కూలీలయ్యారు. ఇక్కడ నగరంలో ఈ రిలయన్స్ ఫ్రెష్ తాము శివార్లలో పండించిన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు బయట కూరగాయల బండ్లు, నెత్తిమీద కూరగాయల గంప పెట్టుకుని సందులు గొందులు తిరిగి అమ్మే వాళ్లకంటే తాము పెద్ద ఎత్తున రైతులకు తక్కువ కూలీ ఇచ్చి పండించిన వాటిని చవగ్గా అమ్మడం వల్ల ఒకేచోట అన్ని రకాల సరుకులతో పాటు కూరగాయలు దొరకడం వల్ల వినియోగదారులు సహజంగానే ఈ రిలయన్స్ ఫ్రెష్ కూరగాయలు కొంటున్నారు. గిరాకీలేక బండిమీద మార్కెట్లో, ప్రాంతీయ మార్కెట్లో అమ్మేవాళ్లు, వీధుల్లో తిరిగి అమ్మేవాళ్లు వ్యాపారం గిట్టుబాటు కాకపోవడం వల్ల ఉపాధి కోల్పోయి, అడ్డా కూలీలుగా మారుతున్నారు. అక్కడ రైతుల్ని నిర్వాసితుల్ని చేసి, వ్యవసాయ కూలీల్ని చేసిన ఈ కార్పొరేట్ సంస్థలు ఇక్కడ కూరగాయల వ్యాపారుల్ని అడ్డా కూలీల్ని చేయడం వల్ల అటు రోజూ పనిదొరకని వ్యవసాయ కూలీలైన రైతులు ఇటు అడ్డాలో ప్రతిరోజూ పనిదొరక్క ఎప్పుడో ఒకసారి దొరికే పనితో పూట గడవక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

కార్పొరేట్ శక్తుల ఆధీనంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ తోడు దొంగలే. ప్రతిపక్షానిది పైపై ప్రతిఘటన మాత్రమే. ఎప్పుడైనా కాస్త గట్టిగా మాట్లాడినా ఇప్పుడు మోడీ పాకిస్థాన్ బూచి అంటూ ఆడుతున్న నాటకంలో అందరూ ఒక్కటై ఏకతాటిపై నిలిచి అన్ని సమస్యలు విస్మరించి పాకిస్థాన్ బూతం గురించే గగ్గోలు పెడుతున్నారు కదా. ఇది కొత్తేమీ కాదు. సంక్షోభం తీవ్రమైన ప్రతిసారీ, ఒకప్పుడు చైనా, పాకిస్థాన్ అని ఇప్పుడు పాకిస్థాన్ అంటూ ఇది షరా మామూలే. పాలకులు అధికార పక్షమైన, ప్రతిపక్షమైన కార్పొరేట్ ఫాసిజం కనుసన్నల్లో మెదిలేవారే. కాదని ఎదిరిస్తే నిర్బంధం, బూటకపు ఎన్‌కౌంటర్లు పాలకుల సమాధానం.

దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ఆదివాసి ప్రజలు కార్పొరేట్ ఫాసిజాన్ని ఎదిరిస్తూ యుద్ధం చేస్తున్నారు. విలువల్ని పరిరక్షించుకుంటూ మానవీయ సమాజాన్ని నిర్మించుకుంటున్నారు. వారిపై మోడీ ప్రభుత్వం ఆపరేషన్ సమాధాన్ ఇంకా అనేక పేర్లు పెడుతూ అమానుష హింసను ప్రయోగిస్తున్నది. దండకారణ్యంలో ఆదివాసులపై కార్పొరేట్ ఫాసిస్టు ప్రభుత్వం ప్రయోగిస్తున్న మారణకాండను, విధ్వంసకాండను ప్రశ్నిస్తున్న ప్రజాస్వామిక సంస్థలు, ప్రజాస్వామిక మేధావులపై 'అర్బన్ నక్సల్స్' పేరుతో నిర్బంధానికి పూనుకుంటున్నది. భీమా కోరేగావ్ ఘటనల నేపథ్యాన్ని సాకుగా చూపి విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యుడు వరవరరావు, జర్నలిస్టు గౌతం నవలఖ,

ఎన్నికల్లో మారేది పార్టీలే

కేంద్రంలో, రాష్ట్రాల్లో మారేవి పార్టీలే కాని విధానాల్లో మార్పుల్లేవనీ, తమ అధికారం కోసం ప్రజల్ని కులాల పేర, మతాల పేర చీల్చి ఓదార్పునిచ్చే పథకాలను మాత్రమే అమలు చేస్తున్నాయనీ అంటున్నారు **జి. సత్యనారాయణ రెడ్డి**

2019 ప్రారంభంలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సెమిఫైనల్‌గా భావించబడిన ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వాలు ఏర్పడినాయి. ఈ ఎన్నికల ఫలితాలను, పరిణామాలను ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ ఓడిపోయి వారి స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. పై మూడు రాష్ట్ర ప్రభుత్వాలతో పాటుగా అదే పార్టీకి చెందిన మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పైన కూడా ప్రజల్లో ఏర్పడిన తీవ్ర వ్యతిరేకత కారణంగానే పై ఫలితాలు వచ్చాయి తప్ప, కాంగ్రెస్ పార్టీ పైన అనుకూలతతో కాదనీ, అధికారంలో ఉన్న మిజోరాంలో కాంగ్రెస్ పార్టీ ఓటమి వలన స్పష్టమవుతున్నది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఈ ఫలితాలను పెంచుకోలేకపోవడం కూడా అదే విషయాన్ని సూచిస్తున్నది.

1980 దశకంలో కేవలం రెండు పార్లమెంటరీ స్థానాలను మాత్రమే కలిగి ఉన్న బిజెపి పార్టీ 'హిందుత్వ' నినాదాన్ని చేపట్టి దాని ద్వారా తన ప్రాభల్యాన్ని, బలాన్ని క్రమంగా పెంటుకుంటూ వచ్చింది. అవినీతికి, అధిక ధరలకు, నిరుద్యోగానికి వ్యతిరేకంగా 2014 ఎన్నికల్లో మోడీ ఇచ్చిన నినాదాలు ప్రజలను ముఖ్యంగా పట్టణ మధ్యతరగతిని, చదువుకున్న యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయన పైన పెద్ద ఎత్తున ఏర్పడిన భ్రమలతో ఆ ఎన్నికల్లో బిజెపిని గెలిపించడంలో వారు ముఖ్యమైన పాత్రను నిర్వహించారు. అయితే, ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, పై రాష్ట్రాల్లో ఆ పార్టీ ప్రభుత్వాలు అమలు జరిపిన విధానాలు ప్రజలను ఆ భ్రమలను కోల్పోయేటట్లుగా చేశాయి. కాంగ్రెస్ పాలకులపై గతంలో వచ్చిన 'బోఫోర్స్ కుంభకోణం' కంటే అనేక రెట్లు పెద్దదైన భారీ 'రఫెల్ యుద్ధ విమానాల' కొనుగోలు కుంభకోణంలో మోడీ ప్రభుత్వం పీకల లోతుల్లో కూరుకుపోయింది. 'భారతదేశంలో తయారీ' (మేక్ ఇన్ ఇండియా) ద్వారా పెద్ద ఎత్తున పరిశ్రమలను నెలకొల్పడం ద్వారానూ, ఇతరత్రా కోట్లాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న ఆయన మాటలు ఆచరణలో పూర్తిగా విఫలమయ్యాయి. అదే పరిస్థితి అధిక ధరలను తగ్గించడం విషయంలోనూ జరిగింది. నోట్ల రద్దు ద్వారా ప్రభుత్వం సాధిస్తానని చెప్పిన లక్ష్యాన్ని కనీసంగా కూడా సాధించలేకపోగా, అది ప్రజా జీవితాన్ని, ఆర్థిక వ్యవస్థను చిందర వందర చేసింది. రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంలో కూడా బిజెపి నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. పై పరిస్థితుల కారణంగానే పై ఎన్నికల్లో అంతకు ముందు ఎన్నికల్లో ఎంతో మెజారిటీని సాధించిన ప్రభుత్వాలు ఘోరమైన ఓటమిని ఎదుర్కొన్నాయి.

పై రాష్ట్రాల్లోని ఎన్నికల ఫలితాలు త్వరలోనే జరుగనున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ఒక సూచికగా ఉన్నాయి. ఆ ఎన్నికల్లో బిజెపికి

ఆదివాసుల కోసం న్యాయ పోరాటం చేస్తున్న సుధా భరద్వాజ్, మహిళా ఉద్యమకారిణి సోమాసేన్, నిర్వాసితానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రశ్నించి పోరాడుతున్న దండకారణ్య ఆదివాసుల పక్షం వహించిన ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా మొదలైన వారిని నిర్బంధించి పూనా జైల్లో పెట్టి కుట్ర కేసులు బనాయించింది. కత్తులు, కటారులు పట్టుకుని హత్యలు చేస్తున్న వాళ్లని బలాదూర్‌గా తిరగనిస్తూ, కలం యోధులైన న్యాయవాదుల్ని, రచయితల్ని, జర్నలిస్టులను, ప్రజాస్వామిక వాదులపై నిర్బంధం ప్రయోగిస్తున్నది.

ఈ కార్పొరేట్ ఫాసిస్టు ప్రభుత్వం శ్రీకాకుళ, నక్సల్బరీ ఉద్యమాల స్ఫూర్తితో యాభై ఏళ్ల క్రితం రచయితలారా, కళాకారులారా, ప్రజాస్వామిక వాదులారా మీరెటు వైపు అని ప్రశ్నించిన విశాఖ విద్యార్థుల ప్రశ్నతో శ్రీకాకుళ, నక్సల్బరీ ఉద్యమాలు కత్తికలం చేతబట్టి పోరాడిన కవి సుబ్బారావు పాణిగ్రాహి స్ఫూర్తితో ఏర్పడిన విప్లవ రచయిత సంఘం వ్యవస్థాపక సభ్యుడు వరవరరావుగారు ఈ యాభై ఏళ్లుగా నిత్య నిర్బంధాలు ఎదుర్కొంటూన్నారు. విరసం ఆనాడు రచయితలారా, కళాకారులారా, ప్రజాస్వామికవాదులారా మీరెటు వైపు? పోరాడుతున్న ప్రజలవైపా, పాలకుల వైపా అన్న ప్రశ్న ఇప్పుడు ఫాసిజంపై పోరాడుతున్న, యుద్ధం చేస్తున్నవారి పక్షాన వారికోసం రాసేవారే, మాట్లాడే వారే, పాడేవారే, ఆడేవారే, రచయితలు, కళాకారులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు అని ప్రకటించాల్సిన తరుణం ఇది. నైనాబద్ధ కాలంలో లూసక్ ఇదే మాట చెప్పాడు – ఇప్పుడు కలం కంటే తుపాకి పట్టడమే తక్షణ కర్తవ్యం అన్నాడు. శ్రీకాకుళ ఉద్యమం సుబ్బారావు పాణిగ్రాహి కత్తి కలము పట్టాడు. శ్రీకాకుళ నక్సల్బరీ ఉద్యమ కాలంలో ఓ కవి 'యుద్ధ రంగంలో నిలబడి కవిత్వం చెప్పడం నాకిష్టం' అన్నాడు – అందుకని ఇప్పుడు కార్పొరేట్ ఫాసిజంపై యుద్ధం చేస్తున్న ప్రజల గురించి రాస్తే వారే కవులు, రచయితలు, పాడేవారే కళాకారులు, మాట్లాడేవారే ప్రజాస్వామికవాదులు.

(రచయిత విరసం సభ్యురాలు)

వీ

గానీ, కాంగ్రెస్‌కు గానీ సాధారణ మెజారిటీ (272) అట్లా ఉంచి, దాని దరిదాపులకు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దేశంలో అప్పుడే ఎన్నికల వేళ ప్రారంభమైంది. బిజెపియేతర ఫ్రంట్, బిజెపేతర, కాంగ్రెసేతర ఫెడరల్ ఫ్రంట్ల ఏర్పాటు కోసం సన్నాహాలు, సమాలోచనలు ప్రారంభమై త్వరలోనే ఊపందుకోబోతున్నాయి. పరిస్థితి చాలా అనిశ్చితంగా ఉంది. ఏమి జరగనున్నదన్న దానిపైన ఎవరూ ఖచ్చితంగా చెప్పగలిగిన పరిస్థితి లేదు. 1957లో ఇందిరా గాంధీ ఆంతరంగిక అత్యవసర పరిస్థితి నెలకొల్పి దేశంలో కొనసాగుతున్న కొద్దిపాటి ప్రజాస్వామిక హక్కులన్నింటిని కూడా రద్దుచేసి, దేశంలో ఒక ఫాసిస్టు పరిపాలనను నెలకొల్పింది. 1977లో జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు జనతా పార్టీగా ఏర్పడి కాంగ్రెస్‌ను ఓడించి కొద్దిపాటి ప్రజాస్వామ్యాన్ని దేశంలో పునరుద్ధరించారు.

ఈనాడు గత నాలుగున్నర సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వంలో హిందుత్వ శక్తులు గో సంరక్షణ పేరిట ముస్లిం మైనారిటీలు, దళితులపైన దాడులు జరిపి అనేక మందిని చంపేశారు. హిందుత్వ ఫాసిజాన్ని ఖండించి దానికి వ్యతిరేకంగా నిలిచిన అనేక మంది మేధావులను కూడా ఆ శక్తులు చంపివేశాయి. ఈ పరిస్థితుల్లో, 1977లో లాగే ఈనాటి హిందూ ఫాసిస్టు పాలకులను ఓడించి వారి స్థానంలో వేరే ప్రభుత్వం కేంద్రంలో రావలసిన అవసరం ఉంది. ఆ ప్రభుత్వం ప్రజల మౌలిక సమస్యలను ఏవి పరిష్కరించదు. అయినా హిందూ ఫాసిజం స్థానంలో కనీసం ప్రజాస్వామిక వాతావరణం తిరిగి నెలకొల్పబడడం తక్షణ అవసరం. దాని కోసం రానున్న ఎన్నికల్లో బిజెపిని, దానికి మద్దతుగా ముందుకు వస్తున్న పార్టీలను ఓడించడం ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం.

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాము అద్భుతమైన ఫలితాలను సాధించినట్లుగా టిఆర్ఎస్ పార్టీ నాయకులు చెప్పుకొంటున్నారు. సీట్ల లెక్కన చూసినప్పుడు 119 స్థానాలకు గాను 88 చోట్ల గెలుపొందడం అనేది పెద్ద మెజారిటీనే. కానీ, కొన్ని పశ్చిమ దేశాల్లో అమల్లో ఉన్న దామాషా ప్రాతినిధ్య పద్ధతి ప్రకారం ఆలోచిస్తే, (అక్కడ ఆయా పార్టీలు ఎన్నికల్లో పొందే ఓట్ల శాతానికి తగినట్లుగానే సీట్లు కేటాయిస్తారు) టిఆర్ఎస్ పార్టీ తెచ్చుకున్న 46.9 శాతం ఓట్లకు పొందే సీట్లు 56 మాత్రమే! అంటే సాధారణ మెజారిటీ కంటే కూడా నాలుగు స్థానాలు తక్కువే. ఎంతో ఘనమైన ఫలితాలను సాధించామని చెప్పుకుంటున్నారు. ఓటింగ్‌లో పాల్గొన్న ప్రజల్లో మెజారిటీ – 53 శాతం టిఆర్ఎస్ పార్టీకి ఓట్లెయ్యలేదన్న వాస్తవాన్ని ఎవ్వరూ పరిగణలోకి తీసుకోవడం లేదు. ఆ పార్టీకి గతంలో కంటే గణనీయంగానే ఓట్లు పెరిగినప్పటికీ, ఎన్నికల ఫలితాలను విశ్లేషించే వారెవ్వరైనా కూడా పైన పేర్కొన్న వాస్తవాన్ని కూడా గమనంలోకి తీసుకోవాలి. (ఇక కాంగ్రెస్ పార్టీకి కూడా ఓట్లు పెరిగాయనే విషయం – (3.2 శాతం) అసలు చర్చలోనే లేదు).

ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే కెసిఆర్ రెండు ముఖ్యమైన ప్రకటనలు చేశాడు. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలతో కూడిన ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కోసం తాను కృషి చేస్తాననే దానితో పాటుగా తన కొడుకు కెటిఆర్‌ను టిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ చేసినది రెండవ ప్రకటన. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ద్వారా దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు ఒక 'గుణాత్మకమైన మార్పు' కోసం కృషి చేస్తాననే కెసిఆర్ తన నాలుగున్నర సంవత్సరాల పాలనలో తెలంగాణలో ఆ విధమైన గుణాత్మకమైన మార్పు దిశలో కృషి చేస్తాడా అనే విషయాన్ని గురించే ఆలోచించాల్సిన అవసరం ఉంది.

2014 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే నక్సలైట్ ఎజెండాను అమలు పరుస్తానని, కొత్త రాష్ట్రంలో ఎన్‌కౌంటర్లనేవి ఉండబోవని ప్రకటించాడు. కాని అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగున్నర సంవత్సరాలుగా ఆయన పాలన అంతా దానికి విరుద్ధంగానే సాగింది. భారతదేశంలో నేడున్నది కనీస ప్రజాస్వామిక వ్యవస్థనే. అది నిజమైన, ప్రజల స్వతంత్ర వ్యవస్థ కాదనేది స్పష్టమే. కెసిఆర్ ప్రభుత్వం ఆ కనీస ప్రజాస్వామ్య సూత్రాలను కూడా పాటించలేదు. ధర్నాచౌక్‌ను ఎత్తివేయడం, సమ్మె చేస్తున్న కార్మికులపైన (మున్సిపల్ కార్మికులు) అణచివేత చర్యలకు పాల్పడడం, కొన్ని సందర్భాల్లో బహిరంగ సభలకు కూడా అనుమతి నిరాకరించడం, ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపేసే విధానాన్ని కొనసాగించడం అనేది దానికి కొన్ని ఉదాహరణలు మాత్రమే. మరొకపక్క ఫ్యూడల్ కుటుంబ పాలనను అమలు జరిపారు.

వారు అధికారంలోకి రాకముందు 'జై తెలంగాణ, జైజై తెలంగాణ'గా ఉన్న వారి నినాదం అధికారంలోనికి వచ్చిన తర్వాత జై కెసిఆర్‌గా మారింది. ఇప్పుడు రెండవసారి ఎన్నికల్లో గెలవగానే అది దానితో పాటుగా జై కెటిఆర్‌గా కూడా మారింది. పార్టీ స్థానంలో వ్యక్తులు, కుటుంబమే కేంద్రంగానూ, సర్వస్వంగానూ మారిపోయింది. మంత్రులందరిని నామమాత్రంగా మార్చివేసి, ఆ శాఖల్లోని విషయాలన్నింటి పైనా వారే నిర్ణయాలు తీసుకొనే పద్ధతిని కొనసాగించారు. అదే విధంగా అవినీతిని కూడా 'కేంద్రీకృతం' చేసి, ఎవరూ అవినీతికి పెద్ద ఎత్తున పాల్పడకుండా, పర్సంటేజీలన్నీ నేరుగా కెటిఆర్‌కే చేరేట్లుగా పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ విధంగా గత నాలుగున్నర సంవత్సరాలుగా ఎంత పెద్ద మొత్తాల్లో డబ్బు జమ చేసుకున్నది వారికి మాత్రమే తెలిసిన విషయం!

కెసిఆర్ తన ఫ్యూడల్, నిరంకుశ స్వభావంలో ఒక భాగంగానే నిజాం నవాబును, ఆయన పరిపాలనను పొగుడుతూ ఉంటాడు. తెలంగాణ ప్రజలందరినీ తీవ్రమైన దుర్భర దారిద్ర్యంలో ముంచిన తాను మాత్రం ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడుగా మారిపోయాడు. 1940 – 51 మధ్యకాలంలో తెలంగాణ ప్రజల పోరాట సమయంలో ప్రజల పైన ఆయన అమలు జరిపిన పాశవిక నిర్బంధకాండ చరిత్రను ప్రజలు మర్చిపోలేదు. అలాంటి రాజు కెసిఆర్ దృష్టిలో మంచి పరిపాలనాధ్యక్షుడు. హైదరాబాద్ సంస్థానాన్ని ఆయన ఎంతో 'అభివృద్ధి' చేశాడంటాడు!

నగ్నంగా మతతత్వ పునాదిపైన ఏర్పడిన మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) పైన, దాని నాయకుడి పైన కూడా కెసిఆర్ ఆ విధమైన వైఖరినే అనుసరిస్తున్నాడు. ఎన్నికల ఫలితాల అనంతరం కెసిఆర్ చేసిన ప్రకటన – 'ఆయన (ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్) గొప్ప ప్రజాస్వామ్యవాది. దేశ మేధావుల్లో ఒకరు. దేశ నిర్మాణంలో మేం ఆయనతో కలిసి పనిచేస్తాం!' అనేది గమనార్హం. ఎకన్నికల్లో ఓట్లు, సీట్లు అధికార లక్ష్యంతోనే, తన ఓటు బ్యాంకు రాజకీయాల్లో ఒక భాగంగానే

పై విధంగా ఒక ముస్లిం మతతత్వ పార్టీ, దాని నాయకత్వం పట్ల బుజ్జగించే వైఖరిని అనుసరిస్తున్నాడనేది స్పష్టమే. మరోపక్క ఆయన హిందూ మతతత్వ పార్టీ అయిన బిజెపి ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందాన్ని కొనసాగించాడనే విషయం బహిరంగ రహస్యమే!

సరిగ్గా ఆ ఎన్నికలు అధికార లక్ష్యంతోనే కెసిఆర్ కుల రాజకీయాలను, కుల సంఘాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాడు. వివిధ కులాలకు చెందిన ఓటర్లను తమ పార్టీకి అనుకూలంగా సమీకరించుకునే లక్ష్యంతో, కుల వృత్తులను ప్రోత్సహించే పేరుతో గొర్లు, చేప పిల్లలు, బర్లను పెద్ద ఎత్తున పంపకం చేస్తున్నాడు. రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కులాలను ఆకట్టుకోవడం కోసం ఆ కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామని అంటున్నాడు. వారి వారి కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడానికి అన్ని కులాల సంఘాల వారికి ఎంతో విలువైన ప్రభుత్వ భూములను ఉచితంగా కేటాయించాడు. ఈ విధంగా ఫ్యూడల్ వ్యవస్థలో ఒక భాగమైన కుల వ్యవస్థను తన ఎన్నికల రాజకీయ ప్రయోజనాల కోసం మరింత పటిష్టవంతం చేసే చర్యలకు పాల్పడుతున్నాడు.

పై విధంగా ఒకపక్క అభ్యుదయ నిరోధకమైన కులతత్వ, మతతత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తూనే, మరోపక్క తమది ప్రగతిశీల ప్రభుత్వమని, దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో ఒక గుణాత్మకమైన మార్పుకోసం కృషి చేస్తామని కెసిఆర్ ప్రకటిస్తున్నాడు. గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పేరుతో అమలు జరిపిన విధానాలు, వివిధ పథకాలు ఆ విధమైన గుణాత్మక మార్పుకు (రాష్ట్రంలో) తోడ్పడే విధంగా ఉన్నాయనే దాన్ని పరిశీలిస్తే, అలాంటిదేమీ లేదనేది స్పష్టమవుతుంది. నినాదాలు, పథకాల్లో తేడాలున్నా మౌలిక విధానాల్లో ఇతర పార్టీలకూ, టిఆర్ఎస్‌కూ ఏమీ తేడా లేదనేది స్పష్టమే.

గత నాలుగున్నర సంవత్సరాల పాలనలో వివిధ సంక్షేమ పథకాల పేరుతో టిఆర్ఎస్ ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడి, ఆత్మగౌరవంతో జీవించే విధంగా అభివృద్ధి చెందడానికి అలాంటి పథకాలు తోడ్పడవు. దానికి భిన్నంగా నెల నెలా ప్రభుత్వం నుండి వచ్చే డబ్బుల కోసం ఎదురుచూడాల్సిన యాచకులుగా అవి వారిని మార్చివేశాయి. ప్రజల జీవితాల్లో మౌలికమైన, ఒక గుణాత్మకమైన మార్పు రావాలంటే దున్నేవాని చేతుల్లోకి భూమి రావడం, ప్రజలందరికి తగిన విధంగా ఉపాధి అవకాశాలను కల్పించడం అవసరం. (ఉపాధి అంటే ఉద్యోగాలు మాత్రమే కాదు. స్వంతంగా కష్టపడి సంపాదించుకోగల అవకాశాలను, పరిస్థితులను ప్రభుత్వం వైపు నుండి కల్పించడం). ఆ వైపుగా టిఆర్ఎస్ ప్రభుత్వం ఏ చర్యలను తీసుకోలేదు. దళితులకు, గిరిజనులకు మూడు ఎకరాల చొప్పున భూమిని ఇచ్చే ఏర్పాటు చేస్తామన్న ఎన్నికల హామీ ఆచరణలో ఏమి జరిగిందో కనిపిస్తున్న విషయమే. భూమి కొని పంచుతామన్న నిర్ణయమే ఒక పెద్ద తప్పు. మిగులు భూములతో పాటుగా, దేవాదాయ భూములు, ప్రభుత్వ భూములు (ఇతరుల అక్రమ స్వాదీనంలోనే కొనసాగుతున్న) ఉన్నాయి. వాటన్నింటిని వెలికితీసి పైసా ఖర్చు లేకుండానే ఆ పేదలకు పంచవచ్చును. కాని టిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఆ వైపుగా ఆలోచన కూడా చేయలేదు.

అనేక సంవత్సరాల నుండి గిరిజనులు అడవి అంతరించిపోయిన భూములను సాగులోకి తెచ్చుకొని అనుభవిస్తున్నారు. వాటిలో కొన్నింటి పైన టిఆర్ఎస్ ప్రభుత్వం రాకపూర్వమే గత ప్రభుత్వాలు పట్టాలు కూడా ఇచ్చాయి. పై విధంగా ఆదివాసులు సాగుచేసుకుంటున్న భూముల నుండి అడవుల రక్షణ పేరుతో గిరిజనులను తొలగించడానికి టిఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున పాల్పడింది. ఆ భూముల చుట్టూ వెడల్పయిన కందకాలను తవ్వి వారు ఆ భూములను సాగుచేసుకోనీయకుండా అడ్డుకున్నారు. అనేక సందర్భాల్లో పోలీసులను పంపి కూడా వారి ద్వారా అడ్డుకున్నారు. ఈ విధంగా కొత్తగా భూములు ఇవ్వడం అట్లా ఉంచి పేదలు, ఆదివాసులు సాగుచేసుకుంటున్న భూములనుండే వారిని తొలగించే ప్రయత్నాలను ఈ ప్రభుత్వం చేసింది.

దేశంలో దానిలో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకొని ఉంది. ఆ సంక్షోభం కారణంగా దేశంలో ఇప్పటికే లక్షల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడడం జరిగింది. అది ఇంకా కొనసాగుతూనే ఉంది. తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ పాలనలో కూడా ఆ విధమైన ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. దాన్ని నివారించడానికి టిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి? రుణాలను మాఫీ చేశామన్నారు. దానివలన గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో రైతాంగానికి కలిగిన ప్రయోజనమేమీ లేదు. ఇప్పుడు 'రైతుబంధు' పథకం అమలుచేస్తామంటున్నారు. ఈ పథకం ద్వారా పంపిణీ అయిన డబ్బులో అధిక భాగం విదేశాల్లోనూ, ఇక్కడ ఉన్న భూస్వామ్య, ధనిక రైతు కుటుంబాలు, వారి వారసులకే చేరాయి. వాస్తవంగా భూమి దున్నుతున్న వారిలో కౌలుదారులను ఆ పథకం నుండే మినహాయించారు. (నిజానికి ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో కౌలు రైతులే ఎక్కువగా ఉంటున్నారని అన్ని అధ్యయనాలు స్పష్టంగా పేర్కొన్నాయి). ఇలాంటి పథకం ప్రపంచంలోనే ఎక్కడా లేదనీ, ఐక్యరాజ్య సమితి కూడా ఈ పథకం గురించి బాగా పొగిడిందనీ పెద్ద ఎత్తున ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది.

పొగడ్తలు రావలసింది ఐక్యరాజ్య సమితి నండి కాదు, ఇక్కడి రైతులు అందులో భాగమైన కౌలుదారుల నుండి. ఇక్కడి ఆర్థిక వేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు అలాంటి వారందరి నుండి రావాలి. రుణమాఫీ పథకాన్ని ఆర్థిక రంగంలోని, వ్యవసాయ రంగంలోని నిపుణులంతా కూడా వ్యతిరేకిస్తున్నారు.

రిజర్వు బ్యాంకు ఇండియా మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ 'భారతదేశం కోసం ఒక ఆర్థిక వ్యూహం' అనే అంశంపైన ఇటీవల జరిగిన సెమినార్ ప్యానెల్ చర్చలో కింది విధంగా అన్నారు. 'బ్యాంకు రుణాలను రద్దు చేయాలనే ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలి. ఏ రైతుల కోసం అయితే అవి అవసరమో అవి వారికి అందకపోగా అది రాష్ట్ర ప్రభుత్వాలను తీవ్ర ఆర్థిక భారానికి లోనుచేస్తుంది'. ఈ అభిప్రాయం రాజన్ ఒక్కరిదే కాదు, వ్యవసాయ రంగ నిపుణులు, ఆర్థిక రంగ నిపుణులు, బ్యాంకు యాజమాన్యాలు అంతా పై అభిప్రాయాన్నే బలపరుస్తున్నాయి.

వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక సమగ్రమైన ప్రణాళికలనూ, కార్యాచరణ పథకంతోనూ ముందుకు వచ్చి దాని అమలు కోసం నిర్ధిష్టమైన చర్యలు

తీసుకోవలసి ఉంటుంది. దాని ద్వారానే ఈ వ్యవస్థ పరిధిలోనే ఆ సమస్యను సంపూర్ణంగా కాకపోయినా కొంతవరకైనా పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఎంతో మెరుగుపడతాయని ఆశించిన యువతను తీవ్ర నిరాశకు గరిచేసింది కెసిఆర్ ప్రభుత్వం.

తమ సంక్షేమ పథకాలు దేశానికి దిక్సూచిగా ఉంటాయని టిఆర్ఎస్ నాయకులు చెప్పుకోవడం అతిశయోక్తినే. ఈ సంక్షేమ పథకాలనేవి వీరితోనే ప్రారంభం కాలేదు. కోల్పోతున్న తమ ప్రాభల్యాన్ని నిలబెట్టు కోవడం కోసం 1970 ప్రారంభంలోనే నాటి ఇందిరా గాంధీ నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని పెద్ద ఎత్తున ప్రారంభించింది. ఇటీవల కాలంలో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కూడా ఆ విధమైన అనేక జనాకర్షక పథకాలను అమలు జరిపింది. ఇప్పుడు కెసిఆర్ అమలు జరిపిన పథకాలు కూడా పేర్లు వేరైనా అలాంటివే. వారు అమలు జరిపిన పథకాలైనా, ఇప్పుడు టిఆర్ఎస్ ప్రభుత్వం అమలు జరిపిన పథకాలైనా పేద ప్రజల జీవితాల్లో ఎలాంటి మౌలికమైన, గుణాత్మకమైన మార్పును తీసుకరాలేదు. ఆ పథకాలన్నీ ప్రజల ఓట్లను పొంది అధికారంలోకి రావడానికి, దానిని కొనసాగించడానికే అమలు జరపబడినాయనేది స్పష్టం.

అలాంటి పథకాలనే రానున్న ఎన్నికల్లో తమ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడితే దాని ద్వారా దేశ వ్యాపితంగా అమలు జరిపి దేశ ఆర్థిక వ్యవస్థలో గుణాత్మకమైన మార్పు తీసుకొస్తామనడం ద్వారా ప్రజలను కొంతవరకు మభ్యపెట్టగలరేమో కాని, ఆ విధమైన మార్పును సాధించ లేదనేది స్పష్టం. పేదలు, ఇతర వర్గాల ప్రజలు తమ జీవితాల్లో అలాంటి మౌలికమైన, గుణాత్మకమైన మార్పును సాధించడం కోసం ఈ వ్యవస్థను సమూలంగా మార్చడం కోసం విప్లవ మార్గాన్ని చేపట్టవలసి ఉంటుంది. ఆ విధంగా మాత్రమే ఆ మార్పును సాధించుకోగలుగుతారు. పాలకవర్గాల మోసపూరిత వాగ్దానాలకు కొట్టుకొని పోకుండా వారావైపుగా కదలడం వారిముందున్న కర్తవ్యం.

పార్లమెంటరీ పంథాలో ప్రయోగాలు సిపిఐ, సిపిఐ (ఎం) పార్టీలు ఆశిస్తున్న ఫలితాలనివ్వలేవు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ, సిపిఐ (ఎం) పార్టీలు రెండూ భిన్నమైన, వేర్వేరు వైఖరులను అనుసరించాయి. వారి వైఖరులు, ఆ ఎన్నికల్లో వారు పొందిన ఫలితాల గురించి కొంత ఆలోచించవలసిన, చర్చించవలసిన అవసరం ఉంది.

సిపిఐ (ఎం) పార్టీ బహుజన వామపక్ష కూటమి (బిఎల్ఎఫ్) పేరుతో ఈ ఎన్నికల్లో పాల్గొన్నది. రాష్ట్రంలోని 27 చిన్న చిన్న పార్టీలతో కూడిన బహుజన వామపక్ష పార్టీ (బిఎల్‌పి), మరో ఏడు పార్టీల కలయికతో పై ఫ్రంట్ ఏర్పడినది. 'ఇప్పటిదాకా జరిగిన ఎన్నికల్లో వేర్వేరు పార్టీలతో పొత్తులు పెట్టుకొన్న కారణంగా కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిందే తప్ప బలపడలేదనీ, ఇక అలాంటి పొత్తులు పెట్టుకునేది లేదని' సిపిఐ(ఎం) పార్టీకి చెందిన నాయకులు ఈ ఎన్నికల సందర్భంగా పలుమార్లు ప్రకటించినారు.

దాని స్థానంలో ఇప్పుడు 'సామాజిక న్యాయం' అనే కొత్త విధానాన్ని చేపట్టారు. 'సమాజంలోని అన్ని తరగతులకు (అంటే కులాలకు) సమన్యాయం జరగడమే సామాజిక న్యాయమని, వారందరికీ రాజకీయ ప్రాధాన్యం ఉండాలనీ, అలాంటి అన్ని విషయాల్లోనూ సమన్యాయం జరిగినప్పుడు అది సామాజిక న్యాయం అవుతుందనీ, దానికి చట్టబద్ధ, రాజ్యాంగ రక్షణ కూడా ఉండాలనీ' ఈ సందర్భంగా దానిపైన పై నాయకులు వివరించారు.

సూటిగా చెప్పాలంటే కులాల ప్రాతిపధికన 'మేమెంతో మాకంత' అధికారం కావాలన్నదే పై వివరణ సారాంశం. ఈ విధానం ద్వారా ఇక్కడ మార్క్సిజపు మౌలిక సూత్రమైన వర్గం, వర్గ పోరాట దృక్పథం నుండి వైదొలిగి దాని స్థానంలో కులాన్ని ముందుకు తీసుకు వస్తున్నారనేది స్పష్టం. వర్గపోరాటం స్థానే కుల ప్రాతిపదికన కృషి చేయాలని అంటున్నారు. ఆ విధంగా మాత్రమే సమన్యాయాన్ని సాధిస్తామని అంటున్నారు.

సామాజిక న్యాయం పేరుతో కులాల్లో ప్రజల శాతాన్ని బట్టి అధికారం అప్పగిస్తే, ఆ కులాల్లోని పేదల సమస్యలు ఈ వ్యవస్థ పరిధిలోనే ఏ విధంగా పరిష్కరింపబడుతాయి? దాని ద్వారా ఈ వ్యవస్థలోనే ఆయా కులాల్లోని మరికొందరు సంపన్నులుగా మారుతారు. ఆ విధంగా సంపన్నులైనవారు అధికార, పాలకవర్గ పార్టీలో చేరిపోయి, మరింతగా తమ సంపదను పెంచుకోవడానికి ప్రయత్నిస్తారే కానీ, తమ కులంలోని వారి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించరనేది 70 సంవత్సరాల అనుభవం స్పష్టంగా మనముందున్నది.

తాము అధికారంలోకి వస్తే వెనుకబడిన తరగతికి చెందిన అతన్ని ముఖ్యమంత్రిని చేస్తామని ఈ కూటమి తరపున సిపిఐ(ఎం) నాయకులు ప్రకటించారు. 60 సంవత్సరాలకు పూర్వమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక దళితుడు ముఖ్యమంత్రి అయ్యాడు. 40 సంవత్సరాల క్రితం మరో నాయకుడు దేశానికి ఉప ప్రధాని అయ్యాడు. దేశంలోనే అత్యంత ఎక్కువ జనాభా కలిగిన రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌ను ఒక దళిత పార్టీకి చెందిన మాయావతి ముఖ్యమంత్రిగా పదవిలో కొనసాగారు. దానివలన దళిత వర్గాల్లోని ప్రజలకు ఒనగూడిన ప్రయోజనమేమున్నది?

ఈ కొత్త విధానం వారి బలాన్ని ఏమీ పెంచదని ఈ ఎన్నికల ఫలితాలు కూడా అనుమానానికి అస్కారం లేకుండా స్పష్టం చేశాయి. సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు నేడీస్థితికి చేరుకోవడానికి అసలైన కారణం పోరాట మార్గాన్ని వదిలివేసి పార్లమెంటరీ పంథాను చేపట్టడమేననేది స్పష్టం. పార్లమెంటరీ పంథాలో పీకల దాకా దిగబడి, కోల్పోతున్న తమ ప్రాభల్యాన్ని, బలాన్ని ఇలాంటి ప్రయోగాల ద్వారా తిరిగి పుద్చుకోలేరు.

ఇక సిపిఐ వారి ప్రయోగం – ప్రజా కూటమిలో చేరడం కూడా వారికి అనుకూల ఫలితాన్నేమీ ఇవ్వలేదు. పైన సిపిఐ(ఎం) పార్టీ చేసిన విమర్శనే వీరికి కూడా వర్తిస్తుంది. అయితే వారు తిరిగి పోరాట మార్గం చేపట్టలేదనేది కూడా స్పష్టమే. ఇక మిగిలింది ఇలాంటి ప్రయోగాలు చేస్తూ వాటిలో వైఫల్యాల పైన వైఫల్యాలు పొందడం మాత్రమే! వీ

(రచయిత 'పోరునేల' సంపాదకులు)

మానవ ఆలోచన భౌతిక సత్యాన్ని గ్రహించగలదా అనేది సైద్ధాంతిక ప్రశ్న కాదు. అది ఆచరణలో తేలే ప్రశ్న. సత్యాన్ని, అంటే, తన ఆలోచనకు సంబంధించిన వాస్తవికతనూ, శక్తినీ, తాను చూసే పార్శ్వాన్నీ మనిషి ఆచరణలోనే రుజువు చేయవలసి ఉంటుంది. ఆలోచన వాస్తవికమైనదా, అవాస్తవికమైనదా అనే వివాదాన్ని ఆచరణ నుంచి వేరు చేస్తే అది కేవలం పండిత చర్చే అవుతుంది.

– కార్ల్ మార్క్స్

కులం - కులాంతర వివాహాలు

- ఎం. కృష్ణ ఆదిత్య

'కులాంతర వివాహాలు - అంబేద్కర్ దృక్పథం' శీర్షికతో వీక్షణం అక్టోబర్ 2018 సంచికలో ఒక వ్యాసం ప్రచురించారు. మిర్యాలగూడలో ప్రణయ్-అమృతల కులాంతర వివాహ పరిణామాల సందర్భంగా రాసిన వ్యాసం ఇది. దీని రచయిత కత్తి పద్మారావుగారు లబ్ధప్రతిష్టులైన పండితులు, హేతువాదులు, సామాజిక-రాజకీయ రంగాల్లో ప్రముఖులు. వారి రచనల్లో వాస్తవాలు, సదాశయాలతో పాటు గందరగోళం కూడా ఉంటున్నది. పాఠకులు వాస్తవిక దృష్టితో, లోతుగా ఆలోచించాల్సిన కొన్ని విషయాలు ఇవీ:

1. కులవ్యవస్థను రద్దుచేయాలి. కులాంతర వివాహాలను ఆహ్వానించాలి, బలపరచాలి. అలాంటివారికి రక్షణ కల్పించాలి. ఇవి నిర్వివాదాంశాలు. సామాజిక తత్వవేత్త అయిన కత్తి పద్మారావుగారి గందరగోళానికి ఒకమూలం వారి భావవాద సిద్ధాంతాలు, రాజకీయాలు. అందుకే కొన్ని వాస్తవాలను గుర్తిసున్నా గందరగోళం, పరస్పర విరుద్ధ భావనలు అలాగే ఉండిపోతున్నాయి. ఈ వ్యాసంలో తమ దాడిని ప్రస్తుత పాలకవర్గాలపై ఎక్కుపెట్టడానికి బదులు, అప్రస్తుతంగా కమ్యూనిస్టులపై బాణాలు వేయడానికి పూనుకున్నారు. ఈ వైఖరి లక్ష్యసాధనకు దోహదకారి కాదు. సరికదా హానికారి.

2. మొదట రాజకీయాలను చూద్దాం. "తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ కులం పెళ్లిళ్లు, మేనరికాలు చేశారు. లౌకికభావన లేని కులాధిపత్య భావనలో వీళ్లు రాజ్యం పాలిస్తున్నారు" అని వ్యక్తిపరంగా రాశారు. "రెండు తెలుగు రాష్ట్రాల్లో కులాంతర సంస్కృతి విస్తరించడానికి ఆయా ప్రభుత్వనేతలు ఎందుకు ప్రయత్నంచేయడంలేదు?" అని ప్రశ్నించారు. వారి నుంచి అలా ఆశిస్తున్నారా? ప్రస్తుత వ్యవస్థ, ప్రస్తుత రాజ్యాంగం నీడలో కుల వ్యవస్థ ఎలా వర్ధిల్లుతున్నదీ అన్న లోతైన విశ్లేషణేమీ లేదు, కానీ కమ్యూనిస్టుల గురించి మాత్రం అసందర్భంగా ఇలా రాసారు: "ఈ పరిణామాన్ని ఆహ్వానించే చైతన్యం కమ్యూనిస్టులకు కంచుకోటైన నల్లగొండ జిల్లాలో ఎందుకులేదు? నక్సలైటు ఉద్యమానికి పెట్టని కోటైన కరీంనగర్ జిల్లాలో కుల నిర్మూలనా చైతన్యం ఎందుకులేదు? కమ్యూనిస్టులు ఇప్పటికైనా కుల నిర్మూలనను ముఖ్యమైన ఎజెండాగా ఎందుకు స్వీకరించడంలేదు?" అని రాశారు. నిజానికి "కమ్యూనిస్టు ఉద్యమానికి కంచుకోటైన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో" అంటూ తన వ్యాసం ప్రారంభవాక్యంలోనే తమ ఈ రాజకీయ దృక్పథాన్ని ధ్వనించారు.

నల్లగొండ జిల్లాలో, కరీంనగర్ జిల్లాలో కులనిర్మూలనా చైతన్యం లేదని ప్రత్యేకించి వారు తీర్మానిస్తున్నారు. ఈ వ్యాసంలో కమ్యూనిస్టు వ్యతిరేకత ఎందుకు? ఈ జిల్లాల్లో వేలకొద్ది కులాంతర వివాహాలు దశాబ్దాలుగా జరిగాయి, జరుగుతున్నాయి. కమ్యూనిస్టు, విప్లవ రాజకీయాలు కల్పించిన సామాజిక, రాజకీయ, సాస్కృతిక వాతావరణం వాటికి దోహదం చేస్తూనే ఉంది. కమ్యూనిస్టు రాజకీయాల ప్రభావం అంతగాలేని చోట్లతో పోలిస్తే ఇలాంటి చైతన్యం ఇక్కడ ఎక్కువనే గమనించవచ్చును. అయితే విప్లవాత్మకమైన సమూలమైన మార్పు ఇంకా రావల్సే ఉన్నది. సామాజిక, రాజకీయ, రాజ్యాంగపర "సంస్కరణల మార్గం" ద్వారా అది సాధ్యం కాదని గత ఏడు దశాబ్దాల అనుభవం నిరూపించింది. అయినా ఆమార్గంలోనే కూరుకుపోయారు పార్లమెంటరీ కమ్యూనిస్టులు. (గద్దర్ వారికి తాజా మిత్రులైనారు) దేశంలో, రాష్ట్రంలో కులాలకు అతీతంగా పీడిత వర్గాలను సంఘటితపరిచి ప్రజా ఉద్యమాలను నిర్మిస్తున్నది కమ్యూనిస్టు విప్లవకారులే. సాధించినదానికన్నా సాధించాల్సిందే ఎక్కువనేది నిర్వివాదాంశం.

దీనికొక ముఖ్య ప్రతిబంధకం అంబేద్కర్‌వాదమూ, అంబేద్కర్‌వాదులే. ముఖ్యంగా గత మూడు-నాలుగు దశాబ్దాలుగా అంబేద్కర్‌వాదులు పీడితవర్గాల ఉద్యమాలను చీల్చడానికి తమ శక్తికొద్దీ కృషి చేస్తూనేఉన్నారు. రాజ్యం, పాలకవర్గాలు, వారి మీడియా ఈ చీలికలకు, చీలిక వాదాలకు, కులవాద ఉద్యమాలకు తమ శక్తికొద్దీ ప్రోత్సాహం ఇస్తున్నారు. అంబేద్కర్‌వాదుల్లో అత్యధికులు పాలకవర్గ పార్టీల్లో అధికారంలో వాటాలకై పోటీపడుతూ, అవకాశవాద పద్ధతులను అనుసరిస్తున్నారు. అలా వాటాలు లభించనివారు కొందరు కొద్దిపాటి విమర్శలు, సంస్కరణవాద చర్యలతో సర్దిచెప్పుకుంటున్నారు. కులవ్యవస్థ నిర్మూలనకై వీరు చేస్తున్నది శూన్యం-ఉపన్యాసాలు తప్ప. వీరంతా కులవ్యవస్థను శాశ్వతీకరించే విధానాలకు సహకరించటమో, వాటితో రాజీపడటమో చేస్తున్నారు. ఎస్.సి. కాలనీలు, ఎస్.సి. హాస్టళ్లు, ఎస్.సి.లలో ఉపకుల సమీకరణ ఉద్యమాలు, ఎస్.సి. ఉద్యోగ సంఘాలు, క్రీమీలేయర్ అనేది లేకుండానూ, ప్రమోషన్లలోనూ రిజర్వేషన్లు మొదలైనవాటితో తమ యావజ్జీవితం గడుపుతున్నారు. నూటికి 80 మందిగా ఉన్న గ్రామీణ దళిత పేదల భూమి మొదలగు సమస్యల గురించి వారు చేసింది శూన్యం. ఇలాంటి దళితవాదులు తన లక్ష్యాన్ని ముంచేసి, స్వార్థ ప్రయోజనాలలో మునిగి తేలుతున్నారని అంబేద్కర్ తన జీవితం చివరి దశలో, ఆగ్రా ఉపన్యాసంలో వాపోయారు. తానూ ఆ గ్రామీణ పేదలకోసం ఏమీచేయలేకపోయానని చెప్పారు. ఈ పరిస్థితి ఆనాటితో పోలిస్తే ఈనాడు ఇంకా దిగజారిందనేది నిర్వివాదాంశం.

ఆయా దళిత కులాల, ఉపకులాలవారు నిచ్చెనమెట్ల సాంప్రదాయాన్ని - కొన్ని సందర్భాల్లో అంటరానితనంతో సహా - పాటిస్తున్నారు. ఈ అవలక్షణాల నిర్మూలన విషయంలో అంబేద్కర్‌వాదులు ఘోరంగా విఫలమయ్యారు. నిజానికి చాలామంది అలాంటి ప్రయత్నం కూడా చేయటంలేదు. ఉప కులాలపరంగా సైతం చీలికలను పెంచిపోషిస్తున్నారు. అటు దోపిడీ పాలకవర్గాల్లోనూ, ఇటు పీడిత కులాలపేరిట సాగుతున్న రాజకీయాల్లోనూ ఉన్న ఈ అవలక్షణాలను దాదాపు పూర్తిగా విస్మరించిన ఈ వ్యాసంలో కమ్యూనిస్టు వ్యతిరేకతను బైటపెట్టుకున్నారు రచయిత.

3) కులం అనేది కొన్ని మతవిశ్వాసాల "కారణంగా" ఏర్పడిన వ్యవస్థ

అని రాసారు. ఇదొక బహుళ ప్రచారంలో ఉన్న వాదనే. కానీ నిజం కాదు. హిందూ మతం, హిందూ ధర్మ శాస్త్రాలు అనబడేవి కుల వ్యవస్థను బలపరుస్తున్నాయనడం వేరు (అది నిజమే),అవి "కారణం" అనడం వేరు. ఈ రెండోది చెల్లని వాదన. హిందూమతం' అనబడేది పుట్టకముందే కులవ్యవస్థ ఏర్పడిఉంది. క్రైస్తవమతం, ఇస్లాం, అవి పుట్టిన తర్వాత కొద్దికాలంలోనే (ఒకటి రెండు శతాబ్దాలలోనే) నేటి భారత భూభాగంలోకి అడుగుపెట్టాయి. కానీ అవి ఇక్కడి తమ అనుయాయుల్లో కులవ్యవస్థను నిర్మూలించలేకపోయాయి. కులవ్యవస్థతో రాజీపడిపోయాయి. ఆ రెండు మతాల్లోకీ ఈ నిచ్చెనమెట్ల వ్యవస్థ చొరబడిపోయింది. శతాబ్దాలు దొర్లినా, ఈ వివక్ష పెరిగిందేకానీ, తగ్గలేదు. క్రిస్టియన్లు, ముస్లింలు కూడా నేడు పెళ్లిళ్ల స్థూలంగా కులాల వారీగానే చేసుకుంటున్నారు. "క్రిస్టియన్ మాల, యంటెక్, ఎన్నారై" వరునికి, "క్రిస్టియన్ మాదిగ, పిజి వధువుకి" సంబంధాలు కావాలని బాహాటంగా ప్రకటనలు ఇస్తూనే ఉన్నారు. అలాగే ముస్లింలలో కూడా – కాస్త తక్కువ మోతాదులో – కులం ప్రభావం పెళ్లిళ్లలో ఉంది. ఖాన్‌గారు ఖురేషీ అమ్మాయిని పెళ్లిచేసుకోడానికి సిద్ధంగా లేరు. దూదేకులవారి సంగతి అలా ఉంచండి.

4. మతం, ధర్మ శాస్త్రాలు, మనుధర్మ శాస్త్రం కూడా వర్ణాంతర వివాహాలను ఆపలేకపోయాయి. ఈ విషయాన్ని "వర్ణ వ్యవస్థ ఏ రోజు ఏర్పడిందో, వర్ణాంతర వివాహాలు అప్పుడే ఏర్పడ్డాయి. ఆ వర్ణాంతర వివాహాలను ఆపలేకపోయారు" అని ఇదే వ్యాసంలో పేర్కొన్నారు. రకరకాల వర్ణాంతర వివాహాలు ఎలా జరిగాయో, అలాంటి జంటలకు పుట్టిన వారిని ఏమంటారో కూడా కొన్ని వివరాలనిచ్చారు: నిషాదుడు, సూతుడు, చండాలుడు మొదలైనవారు. "మనువు వర్ణాంతరాన్ని నిషేధించాడు. తర్వాత తప్పక వర్ణాంతరాలకు కొత్తపేర్లు సృష్టించాడు" అని రచయిత వివరించారు. మనుధర్మ శాస్త్రంగానీ, కులవ్యవస్థ కానీ శిలాసదృశం కావు.

5. కులాంతర వివాహాన్ని అంబేద్కర్ రాజ్యాంగబద్ధం చేసారు అని రాశారు. ఇదొకరకంగా అశాస్త్రీయ, అచారిత్రక భావన. మనువు గురించి పైన పేర్కొన్నదాన్ని గమనిస్తే ఇది స్పష్టమవుతుంది. 1950 కన్నా ముందున్న కులాంతర వివాహాలు అప్పటి (1935) రాజ్యాంగానికి విరుద్ధమా? అలాంటిదేమీ లేదు. పోనీ అంబేద్కర్ "రాజ్యాంగబద్ధం చేశాక" నిచ్చెనమెట్ల వ్యవస్థ ఏమైనా రద్దయిందా? కనీసం చెప్పుకోతగ్గ స్థాయిలో తగ్గిందా? 95 శాతం పెళ్లిళ్లు ఇప్పటికీ కులవ్యవస్థకు లోబడే –దళితుల్లో వారి ఉపకుల వ్యవస్థకు లోబడే– జరుగుతున్నాయి. వర్గం, ఆస్తి, హోదా, కట్నం మొ. గీటురాళ్లు కుదిరితే ఆయా కులాల్లోని "శాఖల" మధ్య పెళ్లిళ్లకు సిద్ధపడుతున్నారు, అంతే. శతాబ్దాలుగా వర్ణాంతర వివాహాలు జరిగిన పూర్వ రంగంలో ఇదేమీ అపూర్వ సంస్కరణ కూడా కాదు. మహాభారతంలో డజన్ల కొద్దీ వర్ణాంతర వివాహాలున్నాయి. (పైన చెప్పిన నిషాదుడు, సూతుడు, చండాలుడు మొదలైన వారు మహాభారతంలో కనిపిస్తారు.)

6. కులవ్యవస్థకు మతవిశ్వాసాలు, మత ధర్మ శాస్త్రాలు "కారణం" కాదని పైనే గమనించాము. (కారణం అంతకంటే లోతైనది, భిన్నమైనది. అది వేరే చర్చ.) నిజానికి ఏకశిలాసదృశమైన, అవిచ్ఛిన్నంగా, ఏకాత్మతో కొనసాగుతున్న "హిందూమతం" కూడా లేదు. హిందూమతంలోనే అనేక సంస్కరణవాద ఉద్యమాలు కూడా పుట్టుకొచ్చాయి. ఉదా: భక్తి ఉద్యమాలు, బసవ ఉద్యమం, నారాయణగురు మొ. అలాగే సామాజిక, రాజకీయ ప్రమేయంగల మత ఉద్యమాలూ పుట్టుకొచ్చాయి. ఉదా: వీర శైవ, వీర వైష్ణవాలు. ఇవి తమ వర్గ, రాజకీయ అవసరంకొద్దీ వర్ణ వ్యవస్థను, అంటరానితనాన్ని కూడా ఏదోమేరకు సడలించడానికి ఆచరణలో కృషి చేసాయి; కానీ నిర్మూలించలేకపోయాయి. దళిత కులాల వారితో సహా కలిసి యుద్ధాలు, సహపంక్తి భోజనాలూ (చాపకూడు) రూపంలో అంటరానితనాన్ని కూడా అధిగమించాయి–కొంత కాలం పాటైనా. (ఉదా: పల్నాటి యుద్ధం, కాకతీయ సామ్రాజ్యం)

7. కులాన్ని నిర్మూలించాలంటే ... దానికి ఆధారంగా కల్పించబడ్డ దైవికతను, పవిత్రతను "ముందు" నిర్మూలించవలసి ఉంది. .. అంటే శాస్త్రాల, వేదాల అధికారాన్ని నిర్మూలించవలసి ఉందన్నమాటా అని రాశారు. మత, ధర్మ శాస్త్రాలు "కారణం" అని చెప్పటం ఎంత అశాస్త్రీయమో, అవాస్తవమో ఇదీ అంతే. మద్దతు, ప్రభావం అనడం వేరు, "కారణం" అనడం వేరు అని పైనే గమనించాం. భావవాదంతో కూడిన ఈ భావనలేవీ వాదనకు నిలబడవు. వేదాలనే ప్రామాణికంగా భావించే సంస్కరణవాద ఆర్యసమాజ్ దేశంలో కొన్ని లక్షల కులాంతర, మతాంతర వివాహాలు జరిపిందని తెల్సిన విషయమే. బహుశా ఏ హేతువాద, అంబేద్కరువాద ఉద్యమమూ ఇందులో వారికి సాటి రాదంటే అతిశయోక్తి కాదేమో. ఆర్యసమాజ్ వైదిక హిందూ సంస్కరణవాద సంస్థ. మతమే కులానికి కారణం కాదు మరి! ప్రస్తుత వ్యాఖ్య రచయిత ఇక్కడ ప్రస్తావించిన కొన్ని విషయాలు లోగడ "కోరేగావ్ సమరం – కొన్ని సామాజిక కోణాలు" అన్న వ్యాసంలో చర్చించబడినాయి. వాటిని చూస్తే ఉపయోగకరంగా ఉంటుంది. (వీక్షణం– ఏప్రిల్ 2016 సంచిక చూడండి)

8. వ్యాసంలోని ప్రధాన ధోరణి లోపాలతో కూడివున్నా, దానికి విరుద్ధమైన కొన్ని వాస్తవాలను రచయిత గుర్తించి పేర్కొన్నారు. వాటికి కొంత ప్రాముఖ్యత ఉంది. ఉదా: అ) దళితులు చదువు, హోదాలతో పైకి వచ్చినా కొద్దీ కొంత మార్పు ఉన్నది; "ప్రేమకు వారి (దళితుల) పుట్టుక అడ్డు రావడం లేదనేది ఒక చారిత్రక సత్యం" అని రాశారు. ఆ) "మైనారిటీ మతాలు కూడా కులం వూబిలోనే కూరుకుపోయి ఉన్నాయి." ఇ) పెరియార్ రామస్వామి అనుచరులమని చెప్పుకొనే కొందరు "కుల రాజకీయ నాయకులు కులం పునాదిని గట్టిపరచాలని చూస్తున్నారు." (మన దేశంలో ఆచరణలో కులతత్వంలో మునిగి ఉన్న హేతువాదులూ, నాస్తికవాదులూ, కమ్యూనిస్టులూ ఉన్న సంగతి తెల్సిందే.) ఈ) "బహుజన" రాజకీయాలు వల్లిస్తున్న కొన్ని ఓబిసి శక్తులు దళిత వ్యతిరేక ధోరణులు ప్రదర్శిస్తున్నాయి. ఉదాహరణకి "ఓబిసి కులాలు దళితులు తమ కుమార్తెలను ప్రేమించి పెళ్లిచేసుకొనడాన్ని అడ్డుకొంటున్నాయి" అని రాశారు. (అలా బాహాటంగా ప్రకటించిన తమిళనాడులోని పిఎంకె పార్టీతో డిఎంకె, ఏఐఏడిఎంకె పార్టీలు రాజకీయ కూటములు కట్టాయి. కమ్యూనిస్టులను తూలనాడే అంబేద్కరువాదులూ, వారి పార్టీలు కూడా అలాటి కూటములలో భాగస్వాములయ్యారు. కమ్యూనిస్టులూ వారితో చేరారు. నేటి ఎన్నికల రాజకీయ జగత్తులో అవకాశవాదానికి హద్దులే లేవు.) "అంబేద్కర్‌వాదులు కూడా కులాలను వదిలి పెట్టాలి"; కుల నిర్మూలనా వేదికలుంటే చాలదు. కులనిర్మూలనా వాదం ఆచరణలోకి

రావాలి అని రాశారు. ఈ విధంగా రచయిత వాస్తవిక దృష్టితో కొన్ని విషయాలు పేర్కొన్నారు. ఇది హర్షణీయం. ఇవి వారి వాదనా ధోరణిలోని లోపాన్ని ఎత్తి చూపుతున్నాయని పాఠకులు గమనించగలరు. (నిజానికిది ఈ రచయిత వ్యక్తిగత లోపంకాదు. ఇవాళ చలామణీలో ఉన్న ఒకానొక ధోరణిలో భాగం మాత్రమే.)

9. కులం పుట్టుక మొదలైన వాటి గురించి రాసే రచయితలు చాలా మంది అంబేద్కర్‌కి ఆపాదించి, కొన్ని విషయాలు తరచూ రాస్తుంటారు. అంబేద్కర్ 1916 మే 9 నాడు కొలంబియా యూనివర్సిటీలో తన తొలి థీసిస్ సమర్పించారు. తన కుల నిర్మూలనా పుస్తకం 1944 ఎడిషన్లో దీన్ని ఆయన స్వయంగా చేర్చారు. అంటే తర్వాతి కాలంలో కూడా ఆయన ఆ ప్రతిపాదనలకు కట్టుబడి ఉన్నారని చెప్పవచ్చును. అందులో "మనువు అనేవాడు వుండిఉంటే" అని మొదలు పెట్టి స్థూలంగా ఇలా అంటారు:

"ఒక విషయాన్ని నొక్కి చెప్పాలనుకుంటున్నాను....కులంగురించిన సూత్రాన్ని/చట్టాన్ని(లా'ని) మనువు ఇవ్వలేదు; ఇవ్వగలిగేవాడూ కాదు. మనువుకన్నా చాలాకాలం ముందునుంచే కులం ఉన్నది. ఆయన దాని సమర్థకుడు. అంతేకానీ, ప్రస్తుత హిందూ సమాజ వ్యవస్థని శాసించి, దాని విధి నిర్ణయం (ఆర్డెయిన్) చేయలేదన్నది ఖాయం; చేయగలిగేవాడూ కాదు." అలాగే బ్రాహ్మణ వర్గం గురించీ ఇదేమాట అంటారు: కులవ్యవస్థను ఎవరో ఒక వ్యక్తి లేదా ఒక వర్గం సృష్టించి, ఇతరులపై రుద్దారనడం తప్పు, అది అసాధ్యం." అంబేద్కర్‌కి ఆపాదించి బల్ల గుద్ది వాదించేవారు పై థీసిస్‌లోని ఈ వాస్తవిక శాస్త్రీయ భావనను లోతుగా అధ్యయనం చేసి, విశ్లేషించుకోవడం అవసరం.

10. కమ్యూనిస్టులూ, విప్లవకారుల పట్ల అసందర్భంగా, అవాస్తవికంగా, పాక్షిక దృష్టితో రాసిన రచయిత అంబేద్కర్ వాదాన్ని ఆకాశానికెత్తేశారు. కులవ్యవస్థ, అంటరానితనం వంటి వాటిని నిర్మూలించడంలో అనేక మత, సంస్కరణవాద ఉద్యమాలు విఫలమైనాయి. గత అనేక శతాబ్దాల అనుభవం ఇదే. అంబేద్కర్ నిర్మించిన ఉద్యమం కూడా అలా విఫలమైనదే. అంబేద్కర్ రాజకీయాలు ప్రారంభమై 80 ఏళ్లు దాటాయి. 1950లో ప్రసుత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ఇన్ని దశాబ్దాలు దాటినా లక్ష్యసాధనలో అంబేద్కర్‌వాదం ఆచరణలో విఫలమైంది అని కనపడ్తూనే ఉన్నది. కులపరంగా ఘోరనేరాలు చేసిన వారిని శిక్షించడానికి ఈ రాజ్యాంగంలో దశాబ్దాలు పడుతున్నది; అదీ గ్యారంటీ ఏమీలేదు. కారంచేడు, చుండూరు మొదలైన సంఘటనలు దీనికి ప్రత్యక్ష సాక్ష్యం. అయినా ఇలాంటి జంటలకు అండగా "భారత రాజ్యాంగం, రాజ్యాంగ శక్తులన్నీ తోడున్నాయి" అని శుష్కహామీ ఇస్తున్నారు రచయిత! ప్రస్తుత ప్రభుత్వ, పోలీసు, న్యాయ వ్యవస్థల దౌష్ట్యాన్ని, పక్షపాతాన్ని దశాబ్దాల అనుభవంలో చూశాక కూడా ఇలా చెప్తున్నారంటే ఏమని అర్థం చేసుకోవాలి?

"అంబేద్కర్ ఆలోచనావిధానం తీవ్రమైంది" అని రచయిత ఎంత చెప్పినా వారి కులనిర్మూలనా లక్ష్యం ఎండమావిగానే ఉన్నది. ఇది కాదనలేని సత్యం. నిజానికి అంబేద్కర్‌వాదుల్లో అత్యధికులు పాలక వర్గాలతో, వారి పార్టీలతో, వారి రాజ్యంతో షరీకై, దోపిడీ వ్యవస్థలో వాటాలకై పోటీలు పడుతున్నారు. ఇటీవలికాలంలో మనువాద, బ్రాహ్మణ బనియా పార్టీ అంటూనే బిజెపితో సైతం చేతులు కలుపుతున్నారు. బిఎస్‌పి మాయావతి దీనిలో అగ్రగణ్యులు. వారితో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేశారు. వివిధ రిపబ్లికన్ పార్టీలు, గ్రూపులు, శక్తులు (ప్రస్తుతం రాందాస్ అథవాలె), రాంవిలాస్ పాశ్వాన్, ఉదిత్ రాజ్ మొదలైనవి దానికి ఉదాహరణలు. శివసేన టైగర్లతో సైతం చేతులు కలిపిన దళిత (ప్యాంథర్) చిరుతపులులున్నాయి. (రెండూ పిల్లి జాతికి చెందినవే అంటారు కొందరు.) బిజెపి మిత్రపక్షాలుగా తమిళనాడు లోని దళిత పార్టీలు కేంద్రంలో అధికారంలో వాటాలు పంచుకున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో బిజెపి మిత్రపక్షంతో అలాగే చేతులు కలిపారు. దళిత ఎంపిలలో అత్యధికులు నేడు బిజెపిలోనే చేరి సహపంక్తి భోజనం చేస్తున్నారు.

11) పై విషయాలను వదిలేసి కమ్యూనిస్టులకు మాత్రం హితబోధ చేశారు రచయిత. పాలకవర్గాలు లోగడ అగ్రకుల తత్వాన్ని పెంచి పోషించారు. తర్వాతి దశలో కింది కులతత్వాన్ని కూడా ప్రోత్సహిస్తున్నారు. ఒకే నాణేనికి రెండువైపులు ఇవి. అవి రెండూ వర్గ పోరాటాలను, విప్లవోద్యమాలను చీల్చి దెబ్బ తీసే ఒకే వ్యూహంలో ఎత్తుగడలు. అంబేద్కర్ మరణించిన 35 ఏళ్లకు భారతరత్న ఇచ్చి, ఊరూరా విగ్రహాలు నెలకొల్పింది ఈ వ్యూహంతోనే. చివరికి సంఘ్ పరివార్ కూడా ఆయన జపం చేస్తున్నదీ అదే వ్యూహంతో. ఈ వ్యూహానికే వూడిగం చేస్తున్నారు అంబేద్కర్ వాదుల్లో అత్యధికులు. వారు తాము ఎటువైపు నిల్వదలిచారో మరోసారి ఆలోచించుకోవచ్చును. ప్రస్తుత వ్యవస్థను సమూలంగా మార్చాలనుకొనే అంబేద్కర్‌వాదులు చీలికవాదాలను వ్యతిరేకించాలి. పీడిత దళిత వర్గాల పోరాట ఐక్యతకై వారూ కృషి చేయాలి. ప్రభుత్వ డాక్యుమెంట్లలో దళిత అనే వర్గసూచిక శబ్దాన్ని కూడా వాడకూడదని, ఎస్.సి.లనే పదం మాత్రమే వాడాలని కేంద్రం ఇటీవలే ఒక ఆదేశం జారీచేసిందని గమనించాలి. అందరూ మొదలు తమలోని కులతత్వాన్ని, ఉపకులతత్వాన్ని వదులుకోవడం అవసరం. అప్పుడే అగ్రకుల తత్వాన్ని, దోపిడీ వర్గాల ఎత్తుగడలను చిత్తు చేయగల్గుతారు. అలాకాక కమ్యూనిస్టు వ్యతిరేకతని కొనసాగిస్తే అది పాలక వర్గాలకే తోడ్పడుతుంది. ఇందులో పెద్దలు కత్తి పద్మారావు గారికి మరొకరి సలహా అవసరం లేదు.

(రచయిత పాత్రికేయులు) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

వంద జవాబులు - వెయ్యి సందేహాలు

- లంకా పాపి రెడ్డి

2007 ఏప్రిల్‌లో వెలువడిన, 'చైనీస్ క్వొశ్చన్స్ అండ్ ఆన్సర్స్' అనే ఇ బుక్‌ను జి.సత్యనారాయణ రెడ్డి గారు తెలుగులోకి అనువాదం చేసి 2012లో 'చైనా వంద ప్రశ్నలు జవాబులు' అనే పుస్తకంగా అచ్చు వేశారు. అంటే ఈ, ఇ బుక్ వెలువడి పదకొండు సంవత్సరాలు అయిపోయింది. ఈ పుస్తకంలోని అంకెలు ఇప్పటికి చాలా మారి పోయాయి. అయినప్పటికీ చైనాలో జరిగిన మార్పులు, వాటి క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం ఉపయోగ పడుతుంది. అంతే కాదు అవి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అనువాదకులు, ప్రచురణ కర్తల ప్రకారం, చైనాను చాలా మంది తప్పుగా అంచనా వేస్తున్నారు. సూటిగా చెప్పాలంటే, చైనా పెట్టుబడిదారీ దేశమో, సామ్రాజ్యవాద దేశమో కాదు, ఇప్పటికీ సోషలిస్టు దేశమే అని వారి అవగాహన. ఈ అవగాహనను నిరూపించడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుందని వారి ఉద్దేశం. ఇంకా వీరి ప్రకారం చైనాలో జరిగిన మార్పుల గురించి లోతైన చర్చలు జరగలేదు. అందుకే చైనా గురించి తప్పుగా అంచనా వేస్తున్నారు అని. కాని ఇది పూర్తిగా తప్పు. చైనా గురించి అన్ని కోణాల నుండి కావలిసినంత, లోతైన చర్చ జరిగింది. ఇంకా చెప్పాలంటే తలలు వాచిపోయేంత చర్చ జరిగింది. అది ఈ పుస్తక ప్రచురణ కర్తలకు తెలవక పోతే ఇతరులది తప్పుకాదు. ప్రచురణ కర్తల అవగాహనకు అనుకూలంగా చర్చ జరిగితేనే లోతైన చర్చ, లేకపోతే కాదు అంటే ఎవరు ఏమి చేయలేరు. కాని ఆశ్చర్యం ఏమిటంటే ఈ పుస్తకం చదివితే, చైనా ఏ విధంగా పెట్టుబడిదారీ దేశంగా పరిణామం చెందిందో స్పష్టంగా అర్థం అవుతుంది. వారి అవగాహన నుండి వంద జవాబులు చదివితే వెయ్యి సందేహాలు కలుగుతాయి.

మొత్తం పుస్తకం గురించి రాస్తే అది మరో పెద్ద పుస్తకం అవుతుంది. అందుకే ప్రధానంగా మౌలిక ప్రశ్నలకే పరిమితమై చర్చించడం జరిగింది. ఈ పుస్తకంలో చైనా ఎలా 'అభివృద్ధి' చెందింది అనే విషయం పైన్నే ప్రధానంగా కేంద్రీకరించడం జరిగింది. చైనా బాగా 'అభివృద్ధి' చెందింది కాబట్టి అది సోషలిజమే అనుకోవాలి అన్నట్లు ఉంటుంది ఈ పుస్తకం తీరు. పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద దేశాలు కూడా బ్రహ్మాండంగానే 'అభివృద్ధి' చెందుతాయి. ఉత్పత్తి సంభంధాల గురించి వివరించకుండా, ఉత్పత్తి పెరుగుదలనే సోషలిజం అనే విధంగా చెప్పారు.

ఈ పుస్తకంలో ముందుగా వ్యవసాయంలో మార్పులు, సంస్కరణల గురించి చెప్పారు. ఇందు లో ప్రధానమైనది సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను రద్దు చేసి వాటి స్థానంలో రైతులకు వ్యక్తిగతంగా కాంట్రాక్టు పద్ధతిలో భూములు ఇవ్వడం. 'ప్రజా కమ్యూన్ల పద్ధతి స్థానంలో, 1983లో కుటుంబ బాధ్యతా కాంట్రాక్టు విధానం ప్రవేశపెట్టబడింది' అయితే ప్రజా కమ్యూన్లను ఎందుకు రద్దు చేశారు? వాటి నిర్మాణమే పొరపాటా? లాంటి ప్రశ్నలకు విచిత్రమైన జవాబులు తెలివిగా చెప్పారు. మార్క్సిస్టు అవగాహనకు పూర్తిగా వ్యతిరేకమైన జవాబు ఇచ్చారు. ఈ పుస్తకం ప్రకారం.... '1949 లో చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడిన తరువాత, ఫ్యూడల్ భూ యాజమాన్యాన్ని రద్దు చేసి కుటుంబం ప్రాతిపదికన భూములను తిరిగి పంపకం చేసింది ప్రభుత్వం. దీనితో వ్యవసాయం వేగంగా అభివృద్ధి చెందింది. రైతుల జీవన ప్రమాణాలు పెరిగాయి. ఈ మార్పులు మరో విడత సంస్కరణలకు ప్రభుత్వాన్ని ప్రేరేపించింది. రైతుల యాజమాన్యంలో ఉన్న భూములను ప్రభుత్వం తన యాజమాన్యంలోకి తీసుకుని, దేశవ్యాప్తంగా ప్రజా కమ్యూన్లను ఏర్పాటు చేసింది'.... అని చెప్పిన తరువాత, ఈ కమ్యూన్ల వలనే ఉత్పత్తిలో రైతులకు ఉత్సాహం, చొరవ దెబ్బతిని ఉత్పత్తి కుడా దెబ్బతిన్నదనీ అందుకే కమ్యూన్లను రద్దు చేయవలసి వచ్చిందనీ చెపుతారు. అసలు విషయంలోకి వెళ్లే ముందు ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ప్రజా కమ్యూన్లు ఒక క్రమంలో నిర్మించ బడినాయి. ప్రజా కమ్యూన్‌లన్నీ ప్రభుత్వ కమ్యూన్‌లు కావు. కాని ఈ పుస్తకంలో రైతుల భూములన్ని లాక్కొని ప్రభుత్వ యాజమాన్యంలోనే అన్ని కమ్యూన్లు నిర్మించబడినట్లుగా కావాలనే వక్రీకరించి చెప్పబడింది.

ఇక రైతుల ఉత్సాహం, చొరవ దెబ్బ తినడానికి చెప్పిన కారణాలు అన్నీ, మార్క్సిస్టు అవగాహనకు వ్యతిరేకమైనవి. 'ప్రజాకమ్యూన్లలో సంవత్సరం చివరలో రైతులు తాము పొందిన మొత్తం వర్క్ పాయింట్లకు అనుగుణంగా కొంత డబ్బు రూపంలోనూ, మరి కొంత ధాన్యం రూపంలోనూ వేతనాన్ని పొందేవారు. ఈ విధంగా రైతులు పొందే ఆదాయాల్లో పెద్ద తేడాలు ఏమి ఉండేవి కావు'... 'ఆదాయాల్లో పెద్దగా తేడా లేకపోవడంతో రైతుల్లో క్రమంగా పని చేయాలనే చొరవ లేకుండా పోయింది'... ఆహా ఏమి మార్క్సిస్టు విశ్లేషణ. దోపిడీ వర్గాలన్ని వందల సంవత్సరాలుగా చెపుతున్న పిట్ట కథలు కట్టు కథలు ఇవే. అంటే రైతుల ఆదాయాలలో తేడాలు ఉండాలన్నమాట. కొందరికి ఎక్కువ ఆదాయాలు కొందరికి తక్కువ ఆదాయాలు ఉంటేనే రైతులు పని చేయడానికి చొరవ చూపుతారన్నమాట. ఇది ఒట్టి చెత్త సిద్ధాంతం. ఆదాయాల్లో తేడాలు ఉండే ఏ సమాజంలో అయినా ఎక్కువ ఆదాయాలు పొందే వాళ్లు తక్కువగా ఉంటారు, తక్కువ ఆదాయాలు పొందే వాళ్లే ఎక్కువగా ఉంటారు. మరి అప్పుడు తక్కువ ఆదాయాల వాళ్ల చొరవ దెబ్బతినదా? ఉత్పత్తి దెబ్బతినదా? ఎందుకంటే వీళ్లే మెజారిటీగా ఉంటారు మరి. కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలో వ్యక్తిగత ఆస్తి రద్దు గురించి, దాని మీద బూర్జువావర్గపు ప్రశ్నలకు మార్క్స్, ఎంగెల్స్‌లు ఎప్పుడో జవాబు ఇచ్చారు.

'సొంత ఆస్తి రద్దు అయితే పని చేయడం అనేదే ఆగిపోతుందనీ, ప్రపంచం అంతా సోమరి తనం అలముకొంటుందనీ మరొక ఆక్షేపణ ఉంది. ఈ వాదం నిజమే అయితే, ఒట్టి సోమరితనంతో బూర్జువా సమాజం ఏనాడో భ్రష్టుపట్టి పోయి ఉండేది. ఈ సమాజంలో పనిచేసే వాళ్లు ఏమి సంపాదించుకోలేక పోవడమూ, ఏమైనా సంపాదించుకునే వాళ్లు పని చేయకపోవడమూ మనం చూస్తున్నదే కదా' (కమ్యూనిస్ట్ మానిఫెస్టో)

సొంత ఆస్తి విషయంలో సోషలిస్టు వ్యతిరేక తప్పుడు అవగాహనతో ఉన్న చైనా నాయకులు ఏ 2050 వరకో లేదా 3000 వరకో సోషలిజాన్ని ఎలా నిర్మిస్తారు? ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేయకుండా, రైతుల ఆదాయాలు సమానంగా లేకుండా సోషలిజాన్ని ఎలా నిర్మిస్తారు? అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానానికే లేదా చైనా సామ్రాజ్యవాదానికే సోషలిజం ఉన్నత దశ అనే లేబుల్ అంటిస్తారా? వీరి 'చౌరవ' సిద్ధాంతం ప్రకారం అయితే కమ్యూనిజం అసలే సాధ్యం కాదు. కమ్యూనిజంలో ఆదాయాలూ ఉండవు ఆదాయాల్లో తేడాలూ ఉండవు మరి.

అసలు ఆదాయాల్లో తేడాలు ఎలా సాధ్యం అవుతుంది? ఒక కుటుంబంలో పనిచేసేవారి సంఖ్య, ఉత్పత్తి సాధనాలు(భూమి వగైరా) ఒకే విధంగా ఉన్నప్పుడు ఆదాయాలలో తేడాలు ఉండవు. ఒక కుటుంబంలో పని చేసేవారు ఎక్కువ మంది ఉండి, దానికి అనుకూలంగా ఎక్కువ ఉత్పత్తి సాధనాలు ఉన్నా ఆదాయాల మిగులులో పెద్దగా తేడా ఉండదు. ఎందుకంటే ఖర్చు కూడా అంతే ఉంటుంది. ఇతరులను కూలికి పెట్టుకుని, దానికి అనుగుణంగా ఎక్కువ ఉత్పత్తి సాధనాలను వాడుకుని, కూలీలకు వారి శ్రమ ఫలితాన్ని పూర్తిగా ఇవ్వనప్పుడు మాత్రమే ఒక కుటుంబానికి ఎక్కువ ఆదాయం వస్తుంది. ఇదే వాస్తవం. మిగతావన్ని కట్టుకథలే.

నిజానికి సమిష్టి వ్యయవసాయం వల్లనే రైతుల ఆదాయాలు పెరుగుతాయి. వారి శ్రమను ఇతరులెవ్వరు స్వంతం చేసుకోలేరు. వారి శ్రమ ఫలితం వారికే చెందుతుంది. ఆధునిక సైన్స్, శ్రమ శక్తి, ఉత్పత్తి సాధనాలు పెద్ద ఎత్తున, ప్రణాళిక బద్ధంగా ఉత్పత్తిలో భాగమవుతాయి. దానితో ఉత్పత్తి, ఆదాయం పెరుగుతుంది. అయితే కొందరి ఆదాయం కాక అందరి ఆదాయం పెరుగుతుంది. కాని ఈ పుస్తకంలో కమ్యూన్లలో రైతుల ఆదాయాలలో తేడాలు లేవని చెప్పారు కాని గతం కంటే రైతుల ఆదాయాలలో అభివృద్ధి ఉన్నదీ లేనిదీ మాత్రం చెప్పలేదు. కావాలనే చెప్పలేదు.

రైతులు ఎవరో భూస్వాముల భూములలో పనిచేస్తూ చావకుండా బతికి ఉండడానికి సరిపోయే ఆదాయం పొందుతున్నట్లు ఉందీ పుస్తకంలో. నిజానికి సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో గతంకంటే రైతుల ఆదాయం పెరిగింది. కొందరికి మాత్రమే కాక అందరికి ఆదాయం పెరిగినందున, దాన్ని అందరికి దరిద్రం సమానంగా పంచడం అని ప్రచారం చేశారు రివిజనిస్టులు. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను విచ్ఛిన్నం చేయడానికి ఇటువంటి ప్రచారం వారికి అవసరం అయ్యింది. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను విచ్ఛిన్నం చేస్తేనే శ్రమ శక్తి మార్కెట్లోకి విడుదల అవుతుంది. అప్పుడు మాత్రమే ఇతరుల శ్రమను స్వంతం చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. అందుకే రష్యాలో అయినా చైనాలో అయినా ముందు సమిష్టి వ్యవసాయ క్షేత్రాలనే విచ్ఛిన్నం చేశారు రివిజనిస్టులు.

సమిష్టి వ్యవసాయాన్ని విచ్ఛిన్నం చేసిన తరువాత, 'ఉత్పత్తి శక్తులు' విడుదల అయ్యాయి, 'ఉత్పాదక శక్తి' పెరిగింది, కావున ఈ చర్య సరైనదే అనే వాదన కూడా చెశారు ఈ పుస్తకంలో. విచిత్రం, వీరి లెక్క ప్రకారం, సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఆటంకంగా మారాయన్నమాట. ఉత్పత్తి శక్తుల సిద్ధాంతాన్ని చైనా రివిజనిస్టులు సమయానుకూలంగా తమకు నచ్చినట్లుగా చెప్పుకున్నారు. చైనా విప్లవం విజయవంతం అయిన వెంటనే దేశం అనుసరించాల్సిన మార్గం గురించి వాద వివాదాలు జరిగాయి. ఇప్పుడు చైనాలో శ్రామిక వర్గానికి పెట్టుబడిదారీ వర్గానికి మధ్యనే ప్రధాన వైరుధ్యం ఉన్నదని మావో చెప్పాడు. క్రమ క్రమంగా దేశాన్ని సోషలిస్టు పద్ధతిలో పారిశ్రామిక వంతం చేయాలి. వ్యవసాయం సోషలిస్టు పద్ధతిలోకి పరివర్తన చెందాలి. చిన్న పరిశ్రమలు, పెద్ద పరిశ్రమలు, వర్తక వాణిజ్యాలు సోషలిస్టు పద్ధతిలోకి మారాలి అన్నాడు మావో (చైనా తాత్విక రంగాన మూడు ప్రధాన పోరాటాలు). దీనికి వ్యతిరేకంగా లీషావ్చీ చైనాలో వర్గ పోరాటం సమసి పోతుందని చెప్పాడు. చైనాలో ఉత్పత్తి శక్తులు వెనకపడి ఉన్నాయి కావున సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు నెలకొల్పడం సాధ్యం కాదు అన్నాడు. ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడమే ప్రధాన కర్తవ్యం అన్నాడు. వీరి ఉత్పత్తి శక్తుల సిద్ధాంతం ప్రకారం చైనాలో ఉత్పత్తి సాధనాల మీద ఉన్న వ్యక్తిగత యాజమాన్యాన్ని సోషలిస్టు పద్ధతిలోకి మార్చవద్దు. సోషలిజాన్ని స్థాపించకూడదు. ఎలాంటి ఆటంకాలు లేకుండా పెట్టుబడిదారీ విధానాన్ని వ్యాపించనివ్వాలి. ఇదంతా ఎందుకంటే చైనాలో ఉత్పత్తి శక్తులు చాలా వెనకబడి ఉన్నాయి. (పై పుస్తకమే). దీనికి మావో ఇలా జవాబు ఇచ్చాడు. 'ఉత్పత్తి శక్తులు, ఆచరణ, ఆర్థిక పునాది, సాధారణంగా ప్రధానమైన నిర్ణయాత్మకమైన పాత్ర వహిస్తాయి. నిజమే ఈ మాట ఒప్పుకోని వాడెవడూ భౌతికవాది కాడు. కాని కొన్ని పరిస్థితులలో ఉత్పత్తి సంబంధాలు, సిద్ధాంతం, ఉపరితలం ఇటువంటివి కూడా ప్రధానమైన, నిర్ణయాత్మకమైన పాత్ర వహించడంలో ముందుకు వస్తాయనడం కూడా మనం ఒప్పుకోవాలి. (వైరుధ్యం గురించి).

అయితే లిషావ్చీ వర్గం ఎన్ని సిద్ధాంత రాద్ధాంతాలు చేసినా 1957 వరకు చైనా ప్రధానంగా సోషలిస్టు పరివర్తనను పూర్తి చేసింది. ఈ మార్పు ఉత్పత్తి శక్తుల అభివృద్ధికీ, ఉత్పత్తి అభివృద్ధికి ఉపయోగపడింది. దీనితో లిషావ్చీ ఉత్పత్తి శక్తుల సిద్ధాంతం ఆచరణలోనూ తుత్తునియలు అయ్యింది. వెంటనే ప్లేట్ ఫిరాయించి ఉత్పత్తి శక్తుల సిద్ధాంతాన్ని తిరగేసి కొత్తగా చెప్పడం మొదలు పెట్టారు. 'ముందుకు పోయిన సోషలిస్టు విధానానికి, వెనకబడి ఉన్న ఉత్పత్తి శక్తులకు మధ్య ఉన్న వైరుధ్యమే చైనాలోని ప్రధాన వైరుధ్యం' అంటూ కొత్త పాట మొదలు పెట్టారు. (చైనా తాత్విక రంగాన మూడు ప్రధాన పోరాటాలు). ముందేమో వెనకబడ్డ ఉత్పత్తి శక్తుల కారణంగా సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు సాధ్యమే కాదన్నారు. సోషలిస్టు సంబంధాలు ప్రధానంగా ఏర్పడిన తరువాత సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలకు అనుగుణంగా ఉత్పత్తి శక్తుల స్థాయి లేదని తెలివిగా వాదించారు. ఈ రెండు వాదనలలోనూ ఉత్పత్తి శక్తుల అభివృద్ధి పేరు చాటున పెట్టుబడిదారీ వ్యవస్థను నెలకొల్పడమే వారి అసలు లక్ష్యంగా ఉన్నది. దాన్ని చరిత్ర నిరూపించింది. అందుకే కమ్యూన్ల భూమిని చిన్న కమతాలుగా రైతులకు పంచి, ఉత్పత్తి శక్తులు విడుదల అయ్యాయని చెప్పారు, విచిత్రంగా.

మావో మరణం తరువాత చైనా రివిజనిస్టు నాయకత్వం తమ ఉత్పత్తి శక్తుల సిద్ధాంతం ప్రకారం, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేసే పేరు మీద సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలను నాశనం చేసి, పెట్టుబడిదారీ వ్యవస్థను నెలకొల్పారు. అయితే 40 సంవత్సరాల తరువాత ఇప్పుడు కూడా చైనాలో

ఉత్పత్తి శక్తులు వెనకపడే ఉన్నాయా? ఉత్పత్తి శక్తులు బాగా అభివృద్ధి చెందాయని అందరికి తెలుసు. మరి ఇప్పుడు చైనా నాయకత్వం సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలను నెలకొల్పబోతున్నదా? నిజంగానే లిషావ్చీ, డెంగ్ గ్రూప్‌కు చెందిన వారు ఇప్పుడు సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు నెలకొల్పితే, 1980లలో వారు చిత్తశుద్ధితోనే కమ్యూన్‌లను రద్దు చేశారని భావించవచ్చు. డెంగ్ అనుయాయులు ఇప్పుడు ఏం చేస్తున్నారో చూస్తే అసలు విషయం అర్థం అవుతుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో చిన్న కమతాల వ్యవసాయం దీర్ఘకాలం కొనసాగదు. పెట్టుబడిదారీ వ్యవస్థ చిన్నకమతాల వ్యవసాయాన్ని మింగేసి పెద్ద ఎత్తున జరిగే కార్పొరేట్ వ్యవసాయాన్ని తీసుకుని వస్తుంది. లేదా పెద్ద ఎత్తున జరిగే సమిష్టి, సహకార వ్యవసాయం వైపుకైనా వెళ్లాలి. అంతే తప్ప మూడో మార్గం ఏది లేదు. చైనాలో ఇప్పుడు పరిస్థితి ఏదో ఒకదాన్ని ఎంచుకునే వద్దకు చేరుకున్నది. గతంలో కమ్యూన్లకు చెందిన భూమిని విడివిడి రైతులకు కాంట్రాక్టు పద్ధతిలో పంచి పెట్టారు. ఈ పంపకంలో రైతులకు కొన్ని హక్కులు మాత్రమే ఇచ్చాము, కాని భూమి కమ్యూన్లకు చెందిన భూమిగానే ఉంటుందని ప్రచారం చేసారు. ఇప్పుడు ఆ విడి రైతులు తమ హక్కులను కిరాయికి ఇచ్చుకోవచ్చని చైనా ప్రభుత్వం చట్టాలు చేసింది. అంటే తమకు కాంట్రాక్టు కింద కెటాయించిన భూములను రైతులు లీజుకు ఇచ్చుకోవచ్చన్న మాట. ఇప్పుడు పెద్ద పెద్ద వ్యవసాయ పెట్టుబడిదారులు ఈ రైతుల వద్ద నుండి భూములను లీజుకు తీసుకుని పెద్ద ఎత్తున కార్పొరేటు వ్యవసాయం చేస్తారు. విడివిడిగా వ్యవసాయం చేసిన దానికంటే భూములు లీజుకు ఇచ్చుకోవడమే చాలా లాభదాయకంగా ఉందని ఇప్పుడు ప్రచారం చేస్తారు. తరువాత రైతులందరిని షేర్ హోల్డర్లను చేస్తారు. రైతులు షేర్ హోల్డర్‌లుగా ఉన్నా, ఎవరు ఎక్కువ పెట్టుబడి పెడితే వారికే ఎక్కువ లాభాల వాటాలు చెందుతాయి. ఇంకా ఆ తరువాత షేర్లు అమ్ముకోవచ్చు అని కూడా చెప్పుతారు. క్రమంగా ఆ షేర్లను కూడా అమ్ముకునే పరిస్థితులు కల్పిస్తారు. ఇంకేముంది ఈ పెట్టుబడిదారీ కార్పొరేట్ వ్యవసాన్నే సోషలిస్టు సమిష్టి వ్యవసాయం అని ప్రచారం చేస్తారు. కాని శ్రమదోపిడి లేని గత సమిష్టి వ్యవసాయాన్ని కానీ కమ్యూన్ వ్యవస్థను కానీ పునరుద్దరించరు. ఈ రోజు చైనా నాయకత్వం స్పష్టంగా పెట్టుబడీదారీ కార్పొరేట్ వ్యవసాయాన్ని నెలకొల్పు తున్నది. అంటే వీరి ఉత్పత్తిశక్తుల సిద్ధాంతం అసలు లక్ష్యం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని నెలకొల్పడమే అని రుజువు అయ్యింది. ఇదంతా ఊహాగానాల మీద ఆధారపడి చెప్పడం లేదు. వ్యవసాయంలో కొత్త సంస్కరణల గురించి చైనాపత్రికలలో తరచుగా వార్తలు వస్తూనే ఉన్నాయి.

2018 మార్చ్ నెల 8 తేది 'క్సిన్హువా' పత్రిక ప్రకారం... 1950 లలో రైతులు తమ భూములను కమ్యూన్‌లకు అప్పచెప్పారు. 1980 లలో జరిగిన సంస్కరణలలో భాగంగా కమ్యూన్ల భూములను కాంట్రాక్టు పద్దతిలో రైతులకు తిరిగి పంచారు. 2014 ప్రారంభంలో, భూమిపై రైతులకు ఉండే యజమాన్య హక్కు, కాంట్రాక్టు హక్కు, నిర్వహణ హక్కులను వేరుచేస్తూ చైనా ప్రభుత్వం ఒక పైలెట్ సంస్కరణను ప్రారంభించింది. ఈ సంస్కరణ ప్రకారం రైతులకు కాంట్రాక్టు హక్కులు గతంలాగానే ఉంటాయి. కాని నిర్వహణ హక్కులను మాత్రం ఇతరులకు బదిలీ చేయవచ్చు. అంటే కమ్యూన్ దగ్గర కంట్రాక్టు తీసుకున్న భూమిని రైతులు బ్యాంకుల వద్ద కుదువ పెట్టుకోవచ్చు లేదా ఏదైనా కొఆపరేటివ్‌లో పెట్టుబడిగా పెట్టుకోవచ్చు లేదా షేర్ హోల్డర్‌గా ఉండవచ్చు.

2015లో హెనాన్ ప్రావిన్స్‌లోని లివింగ్ కౌంటీలో ప్రభుత్వ నియంత్రణలో ఒక 'ల్యాండ్ బ్యాంక్'ను ఏర్పాటు చేసారు. ఈ ల్యాండ్ బ్యాంకు రైతుల దగ్గర నుండి భూమి కాంట్రాక్టుకు తీసుకుంటుంది. తరువాత ల్యాండ్ బ్యాంకు ఈ భూమిని అధిక దిగుబడిని తీసే రైతులకు, వ్యవసాయ కంపెనీలకు లీజుకు ఇస్తుంది. 0.3 హెక్టార్ల భూమి గల ఒక వృద్ధ రైతు వ్యవసాయం చేయలేని పరిస్థితిలో ఆ భూమిని ల్యాండ్ బ్యాంకుకు ఇచ్చాడు. వ్యవసాయం చేయకుండానే ప్రతి సంవత్సరం 4000 యువాన్‌లు పొందుతున్నాడు. ఈ రైతు భూమిని ల్యాండ్ బ్యాంకు ద్వారా ఉన్నతమైన సమర్ధతలు కల ఒక రైతు లీజుకు తీసుకున్నాడు. ఈ ల్యాండ్ బ్యాంకు 17330 హెక్టార్‌ల భూమిని సేకరించింది. ఈ కౌంటీలో ఉన్న మొత్తం భూమిలో సగానికి కంటే ఎక్కువ భూమి ఇది. ప్రతి సంవత్సరం హెక్టార్‌కు 12000 యువాన్‌ల చొప్పున చెల్లించ బడుతాయి. ఈ లీజ్ టైం 5 లేదా 10 సంవత్సరాలు ఉంటుంది. రైతులు స్వచ్ఛందగానే ఈ కాంట్రాక్టుల పైన సంతకాలు చేస్తున్నారు.

సారవంతంగా లేని భూములపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టి, సాగు లాయకు అభివృద్ధి చేస్తుంది. హెనాన్‌లోని మెంగ్లోవ్ టౌన్ షిప్ ప్రభుత్వం 2016లో ఒక వ్యవసాయ అభివృద్ధి కంపెనీని స్థాపించింది. ఈ కంపెనీ, రైతులతో 5966 కాంట్రాక్టు ఒప్పందాలు చేసుకుని 3800 హెక్టార్‌ల భుమిని సేకరించింది. తరువాత వ్యవసాయ అభివృద్ధి కంపెనీ 136 మిలియన్‌ల యువాన్‌లు ఖర్చుపెట్టి బావులు తవ్వింది, రోడ్లు వేసింది, భూమిని అభివృద్ధి చేసింది. మెంగ్లోవ్ టౌన్‌షిప్ ప్రభుత్వం బీజింగ్ వ్యవసాయ అకాడమీ, అటవీ విభాగాల సహాయం తీసుకున్నది. ఇప్పుడు దాదాపు 10 కంపెనీలు ఆ భూములలో పంటలు పండిస్తున్నాయి.

చైనాలో అభివృద్ధి చెందుతున్న సోషలిజం ఇదే. వ్యవసాయంలో 1980లలో మొదలు పెట్టిన సంస్కరణలు కార్పొరేట్ వ్యవసాయం వద్దకు చేరుకున్నాయి. ఆశ్చర్యం ఏమిటంటే, చైనా నాయకులు ఇప్పుడు కూడా ఆభూములు కమ్యూన్‌లకు చెందినవే అని చెప్పుకుంటున్నారు. పెట్టుబడిదారీ విధానంను అభివృద్ధి చేసి సోషలిజంలోకి తీసుకువెళ్తాము అని చెప్పిన చైనా నాయకులు పెట్టుబడిదారీ విధానం నుండి పెట్టుబడిదారీ అత్యున్నదశకు చైనాను తీసుకు వెళ్లారు.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

పాఠకులు ఫిర్యాదులు, సమాచారం కోసం వీక్షణం కార్యాలయానికి పనిదినాల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 6.00 గంటలలోగా స్వయంగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. మిగతా సమయాల్లో ఫోన్ చేస్తే అది ఫ్యాక్స్‌లోకి వెళ్లి మీకు జవాబు రాదు. అప్పుడు మీరు ఫోన్ ఎత్తికూడా మాట్లడడంలేదని అనుకునే అవకాశం ఉంది. ఇది గమనించగలరు. – సం.

(... 4వ పేజీ తరువాయి)

ఓటు వేశారు. మీ సంపాదకీయం వారిని పేరుపేరున అభినందించలేదు. ఓటు వేయని ఈ ముగ్గురు మాత్రం సంఘపరివార్ కుట్రను, మీ ప్రకారం గర్హించారు. దీనర్థం ఓటు వేసిన వారందరూ సంఘపరివార్ కుట్రలో భాగస్వాములే కదా. సంఘపరివార్‌కు ఇంతమంది మద్దతుదార్లు ఉన్న సంగతి సంఘపరివార్‌కు తెలియదనుకుంటాను.

లోక్‌సభలో బీజేపికి మెజారిటీ ఉంది. అక్కడ అన్ని బిల్లులు ఆమోదింప బడుతాయి. రాజ్యసభలో వారికి మెజారిటీ లేదు. ద్వంద్వ వైఖరిని అవలంభించే ప్రధాన ప్రతిపక్షం నాయకులు ఒక విధంగా లోక్‌సభలో వ్యవహరిస్తే రాజ్యసభలో నాయకులు ఇందుకు విరుద్ధంగా వాదిస్తారు. ఓటు వేస్తారు. బిల్లులను తిప్పికొడతారు.

అయినా 124వ రాజ్యాంగ సవరణ రాజ్యసభలో ఆమోదింపబడింది. అగ్రవర్ణాల వారి ఓటు బ్యాంకును ఎక్కడ బీజేపి వారు దోచేస్తారో అని భయపడి బహిరంగంగా మేము సెక్యులరిస్టులం, జాతి, మతం, కులంకు మేము ప్రాధాన్యతనివ్వం, అందర్నీ ఒకేలా చూస్తాం అని తమ పేర్ల చివర తమ మతం, కులం, జాతి స్పష్టంగా తెలియజేసే పేర్లను బహాటంగా వాడుకునే నాయకులు 124వ సవరణ బిల్లును ఆమోదించారు. తిలక్ (బ్రాహ్మణ) తరాజు (వైశ్య) తల్వార్ (క్షత్రియ) ఇన్ తీనోంకు దో జూతే చార్ – ఈ ముగ్గురుకి నాలుగు చెప్పు దెబ్బలు కొట్టండని ప్రచారం చేసిన వారు కూడా రాజ్యసభలో ఓటు వేశారనుకుంటాను.

ఇక్కడ కూడా తమ సిద్ధాంతాలను మనసా వాచా కర్మణా పాటించే 7 మంది సభ్యులు సభ నుండి నిష్క్రమించకుండా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. వీరిని కూడా మీ సంపాదకీయం ప్రశంసించలేదు. దేశంలోని పత్రికవారు రంగుటద్దాలను వేసుకొని తమ తమ సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్నారు కాని, వాస్తవాలను ప్రచారం చేయడం లేదు.

– డా. ఎ.బి. సాయి ప్రసాద్
బెంగళూరు

రావి సుబ్బారావు గారు వీక్షణం ఫిబ్రవరి సంచికలో తమ సుదీర్ఘమైన స్పందన లేఖలో 'బీజెపిని మోడీ నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకురావడం లో మీరు కృషి చేశారు. విజయ సాధనలో మీ పాత్రకు పద్మశ్రీ అందుకున్నారు' అని ఒక అభాండం వేశారు. నాకు మూడుసార్లు – మొదటిసారి 1974లో అప్పటి కమ్యూనికేషన్ కాంగ్రెస్ మంత్రి హేమావతినందన్ బహుగుణ అహ్మదాబాద్‌లో నా యాజమాన్యాన్ని కొనియాడుతూ పద్మశ్రీ పురస్కారానికి ప్రతిపాదించారు. రెండోసారి 1976లో కమ్యూనికేషన్స్ కాంగ్రెస్ మంత్రి శంకర్ దయాళ్‌శర్మ పూణెలో నా యాజమాన్యాన్ని ప్రశంసిస్తూ ప్రతిపాదించారు. మూడోసారి 1982లో కమ్యూనికేషన్స్ కాంగ్రెస్ మంత్రి సి.ఎం. స్టీఫెన్ నాకు పద్మశ్రీ పురస్కారం కోసం ప్రతిపాదించారు. మూడుసార్లు కూడా ఇందిరా గాంధీ ప్రధాన మంత్రి హోదాలో నా పేరును తొలగించారు. కారణం, 1973లో అహ్మదాబాద్‌లో మొరార్జీ దేశాయ్ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయమని నిరాహార దీక్షకు పూనారు. ఆయన టెలిఫోన్ ట్యాప్ చేయమని నాకు భారత ప్రభుత్వం నుంచి ఆజ్ఞ వచ్చింది. దానికి సహకరించాను. కాని, ఇందిరా గాంధీగారు మొరార్జీ సంభాషణలు అన్ని నేను తెలియపరచడం లేదని అపోహతో నన్ను మొరార్జీ మిత్రునిగా, ఇందిరా వ్యతిరేకిగా నిర్ణయించుకున్నారు. పాము పగలుగా ముగ్గురు ముఖ్యమైన కాంగ్రెస్ మంత్రులు నా పేరును పద్మశ్రీకి మూడు సార్లు ప్రతిపాదించినా, ఇందిరమ్మ వీటో చేశారు. 2) టెలికాం రంగంలో, ఐటిలో ఒక ఆంధ్రప్రదేశ్ లోనే కాక, దేశమంతటా నా సేవలకు గుర్తింపు వచ్చింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకి ఐటి సలహాదారుగా మన రాష్ట్రంలోనే కాక దేశమంతటా టెలికాం ఐటి వ్యవస్థలు విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకువచ్చినందుకు నాకు విశిష్టమైన గుర్తింపు వచ్చింది. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అండ్ టెలికాం ఇంజనీర్ (ఐఇటిఇ) అల్ ఇండియా ప్రెసిడెంట్‌గా ఇంటెల్‌సట్, వాషింగ్‌టన్, ఇన్‌మార్సాట్, లండన్ గవర్నర్‌గా ఐక్యరాజ్య సమితి తరపున యెమెన్, దక్షిణాఫ్రికా, గయానా, నేపాల్ టెలికామ్, ఐటి వ్యవస్థల సంస్కరణల కోసం నా సేవలు ఉపయోగించుకోవడం ఇత్యాది ఇవన్నీ తెలిసి కాలయాపన జరిగినప్పటికీ ఎన్.విటల్, ఐ.ఎ.ఎస్, (పూర్వపు టెలికాం కార్యదర్శి, దరిమిలా సివిసి) వారి చొరవతో 2017లో నాకు పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేశారు. అంతేకాని ఆర్ఎస్ఎస్, బీజెపి సేవలకు కాదు.

3) చివరగా మార్క్సిజం, కమ్యూనిజాన్ని గురించి నేనెంతో అధ్యయనం చేశాను. విద్యార్థి దశ నుంచి 1963 వరకు మార్క్సిస్టు, కమ్యూనిస్టులతోనే నా సంబంధాలు. ఆ పార్టీ వ్యక్తిగానే గిండీ, ఇంజనీరింగ్ కాలేజీలో అల్ప సంఖ్యాకులైన తెలుగువాడినైనప్పటికీ నన్ను కమ్యూనిస్టుగానే కాలేజీ విద్యార్థి సంఘానికి ఎన్నుకున్నారు. తాతగారు రామస్వామి చౌదరి గారు జీవితాంతం – ఎందుకు? అనే ప్రశ్నతో ప్రతి విషయాన్ని విశ్లేషించి అధ్యయనం చేయమన్నారు. ఆ ప్రక్రియ వలననే గోపిచంద్ వలె, నాస్తికత్వాన్ని, సోషలిజం, కమ్యూనిజంను అధిగమించి, విశ్వజనకమైన భారతీయ ధర్మమే సనాతనమైనది, శాశ్వతమైనది, మానవత్వాన్ని, దైవత్వాన్ని మేళవించేది అనే తలపుకు వచ్చాను.

ఒక్కటి ఆలోచించండి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), కమ్యూనిస్టు పార్టీ ఈ దేశంలో ఒకే సమయంలో ఉద్భవించాయి. ఆర్ఎస్ఎస్‌తో ప్రేరేపితమైన జనసంఘ్, బీజెపి ఏ దశకు పెరిగాయి, ఎందుకు పెరిగాయి, కమ్యూనిస్టు పార్టీ 7–8 పార్టీలుగా చీలిపోయి, కొంతమంది అరణ్యాలలో, కొంతమంది పత్రికా ప్రకటనలతో ఎందుకు పరిమితమైపోతు న్నారని. ఒకరికి దేశభక్తి దేశ సమగ్రత, విశ్వమానవీయత స్ఫూర్తిదాయకాలు. మరో బృందాలకు స్తంభించిపోయిన శతాబ్దిన్నర సిద్ధాంతం, విదేశీయుల ప్రేరణ స్ఫూర్తిదాయకాలు.

– త్రిపురనేని హనుమాన్ చౌదరి
సికిందరాబాద్

అటవి హక్కుల చట్టం 2006 కింద అడవిలో నివసించే అధికారాన్ని హక్కును పునరుద్ధరించాలని గిరిజనులు పెట్టుకున్న దరఖాస్తులను అటవి శాఖ తిరస్కరించినట్లయితే ఆ గిరిజనులను అడవి నుండి పంపించి వేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఫిబ్రవరి 13న ఇచ్చిన తీర్పు అన్యాయం. ఇది రాజ్యాంగంలోని 5,6 షెడ్యూల్లను ఉల్లంఘించినట్లే అంతేకాక ఆర్టికల్ 21 జీవించే హక్కును కాలరాయడమే. అడవిలో అక్రమంగా నివసిస్తున్న గిరిజను లను జూలై 23 లోగా బలవంతంగానైనా ఖాళీ చేయించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలోని 16 రాష్ట్రాలను సుప్రీం కోర్టు ఫిబ్రవరి 20న ఆదేశించింది. 16 రాష్ట్రాల్లో సుమారు 11 లక్షల 30 వేల మంది ఉన్నట్లు నివేదికలున్నాయి. అటవి జంతువులను రక్షించాలంటూ జంతు సంరక్షణ వాదులు వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ విధమైన తీర్పు ఇచ్చింది. విచారణకు ప్రభుత్వం న్యాయవాదిని పంపించలేదు. అడవి గిరిజనులది. పిటిషన్ వేసిన వారు మాజీ అటవి అధికారులు. విచారణ లోపభూయిష్టం. కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల శాఖ స్పందించి వెంటనే తీర్పుపై 'స్టే' తీసుకొనిరావలసిందిగాను, తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని కోరుతున్నాం.

టి. శ్రీరామమూర్తి
విశాఖపట్నం

లౌకికవాదానికి, రాజ్యాంగానికి ముప్పు

గాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న 'లౌకికవాదాన్ని రక్షించు కుందాం- రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం' అనే అంశంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. హరగోపాల్ ప్రధానోపన్యాసం చేస్తూ గాంధీని హత్య చేసిన మతోన్మాదులే ఆయన చిత్రపటానికి నివాళులర్పించడం బాధాకరమన్నారు. గాంధీ నుంచి గౌరీలంకేశ్ హత్యను పరిశీలిస్తే మానవ సంబంధాల విద్వేషం కనిపిస్తోందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రత నాశనమవుతోందన్నారు. ప్రభుత్వ విధానాలను విమర్శించే వారిపై దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'ప్రరవే' పదేళ్ల వేడుకలు

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) పదేళ్ల వేడుకలు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సెమినార్ హాల్‌లో ఫిబ్రవరి 2, 3 తేదీల్లో జరిగాయి. 'స్త్రీల అస్తిత్వ చైతన్యం-సాంస్కృతిక సవాళ్లు' అనే అంశంపై జరిగిన సదస్సులో వివినమూర్తి మాట్లాడుతూ పునర్వివాహాలను నేటికీ సంస్కృతిగా స్వీకరించలేక పోతున్నామన్నారు. అనిశెట్టి రజిత అధ్యక్షత వహించగా కార్యదర్శి కె.ఎన్. మల్లీశ్వరి సదస్సు లక్ష్యాలను వివరించారు. స్త్రీలపై ఆధిపత్యం అనాదిగా ఒక్కో రూపంలో కొనసాగుతోందని, రోజుకో రూపం సంతరించుకుంటోంది తప్ప సమూల మార్పు రావడం లేదని జర్నలిస్ట్ కె. సతీష్‌చందర్ అన్నారు. ముందుగా 'కలం పట్టి.. గళం విప్పి' అంటూ 'వాక్‌విత్ రైటర్స్' పేరిట ర్యాలీని నిర్వహించారు.

హిందుత్వ ఫాసిస్టు వ్యతిరేక అవగాహన సదస్సు

బిజెపి ప్రభుత్వ హిందూ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 5న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హిందుత్వ ఫాసిస్టు వ్యతిరేక ప్రాంతీయ సన్నాహక కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. వక్తలు దేశంలో ప్రత్యర్థి పార్టీలపై పాలకపార్టీ చేస్తున్న దాడులు చూస్తుంటే పాలకుల అసహనం, ఫాసిస్టు ఆలోచనలు స్పష్టమవుతున్నాయన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ముస్లింలు, దళితులు, క్రిస్టియన్లు, ఆదివాసులు, మహిళలు, ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులపై సంఘ్‌పరివార్ దాడులు పెరిగాయన్నారు. దేశంలో పెరిగిపోతున్న అసమానతలు, అసంతృప్తులు, హింసలను దాచిపెట్టడానికి అవినీతిని ప్రధాన సమస్యగా చూపుతోందన్నారు. పాలకులు సిబిఐ, ఆర్‌బిఐ, న్యాయవ్యవస్థలను ఇలా ప్రతీ రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు.

విరసం సాహిత్య పాఠశాల

విప్లవ రచయితల సంఘం 21 సాహిత్య పాఠశాల నల్లగొండలోని ఎన్‌బిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఫిబ్రవరి 9,10 తేదీల్లో జరిగింది. దేశీ సాహిత్యం, సామాజిక చరిత్ర- మార్క్సిస్టు దృక్పథం అనే అంశం కేంద్రంగా జరిగింది. వక్తలు ఉత్పత్తి కులాల నుంచి వచ్చిన సాహిత్యమే దేశీ సాహిత్యం అని రామాయణం, మహాభారతం రాజుల ప్రయోజనాల కోసం వచ్చాయన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఫాసిజాన్ని అమలుచేస్తూ కల్బుర్గీ, పన్సారే, గౌరీలంకేశ్ తదితరులను హత్యచేసిందన్నారు. ప్రశ్నిస్తున్న వారిని పాలకులు అర్బన్ మావోయిస్టుల పేరుతో జైళ్లల్లో నిర్బంధిస్తున్నారన్నారు. బ్రాహ్మణీయ ఆధిపత్యంపై పోరాటంగా భీమా కోరేగావ్ ప్రతిఘటనను అర్థం చేసుకోవాలన్నారు. దేశంలో రెండు రాజకీయాలు ఉన్నాయని, ఒకటి ప్రభుత్వాన్ని మార్చే ఎన్నికల రాజకీయాలు, మరొకటి వ్యవస్థను మార్చే రాజకీయాలన్నారు. 'దేశీయ సాహిత్య చరిత్ర, మార్క్సిస్టు దృక్పథం', 'బుద్ధి జీవులపై నిర్బంధం' అనే అంశాలపై వక్తలు ప్రసంగించారు. దేశవ్యాప్తంగా హిందూ ఫాసిజం పెచ్చరిల్లుతోందని ప్రజలందరు కలిసి దీన్ని ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు.

కథానిలయం 22వ వార్షికోత్సవం

శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి 9, 10 తేదీల్లో కథానిలయం 22 ఏళ్ల వార్షికోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కథలను నిక్షిప్తం చేసిన కథానిలయం తెలుగు ప్రాంతాల్లో సాహితీ కేంద్రంగా ఉందని కథలో చరిత్ర, శాస్త్రీయ దృక్పథం ఉంటాయని కె. శ్రీనివాస్ అన్నారు. ప్రాచీన స్థాయి నుంచి ఆధునిక రచనల వరకు, ఆంధ్రా, తెలంగాణ రచనల్లో తేడా లేదని, భాష, భావజాలం వ్యక్తపరచడంలో మాత్రమే విభిన్నంగా ఉంటుందని అన్నారు. అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కాళీపట్నం రామారావు, కాళీపట్నం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రరవే రాష్ట్ర అధ్యక్షురాలు పుట్ల హేమలత మృతి

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) రాష్ట్ర అధ్యక్షురాలు పుట్ల హేమలత ఫిబ్రవరి 9న మరణించారు. గత కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. 1962 జూన్ 23న నెల్లూరులో జన్మించారు. హేమలత ప్రస్తుతం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పీఠంలో ఆచార్యురాలిగా పనిచేస్తున్నారు. బోల్షివిక్ విప్లవానికి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్ర.ర.వే. ప్రచురించిన 'బోల్షివిక్ విప్లవం - స్ఫూర్తి వ్యాసాలు' పుస్తకానికి హేమలత సంపాదకురాలు. దళిత, స్త్రీవాద సాహిత్యం, మహిళల సామాజిక సమస్యలపై జాగృతం చేస్తూ రచనలు చేశారు.

పెండ్యాల వామన్‌రావు మృతి

సీనియర్ పాత్రికేయులు పెండ్యాల వామన్‌రావు(91) గత కొద్ది కాలంగా శ్వాసకోశ వ్యాధికి గురై హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఫిబ్రవరి 16న మృతిచెందారు. 1928 జూన్ 12న కరీంనగర్‌లో జన్మించారు. ఆయన హిందూ దినపత్రికలో హైదరాబాద్ ఎడిషన్ బ్యూరో చీఫ్‌గా పనిచేశారు. కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వంలోని ఏపి సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్‌గా పనిచేశారు. న్యూ స్వతంత్ర టైమ్స్ ఎడిటర్‌గా పనిచేశారు. హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్‌లో విలీన పరిణామాలను సన్నిహితంగా చూసిన పాత్రికేయుడాయన.

గిట్టుబాటు ధరల కోసం కొనసాగుతున్న రైతుల నిరసన

ప్రభుత్వమే ఎర్రజొన్నలు, పసుపు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఫిబ్రవరి 13న నిరసన చేపట్టారు. ఆర్మూర్ మండలం మామిడిపల్లి చౌరస్తాలో 63వ నంబర్ జాతీయ రహదారిపై ధర్నాలు, రాస్తా రోకోలు నిర్వహించారు. రైతుల ఉద్యమాన్ని నియంత్రించడానికి పోలీసులు 144 సెక్షన్‌ను విధించినా రైతులు గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి పైగా జాతీయ రహదారిపై బైఠాయించారు. ఎర్రజొన్న పంటకు క్వింటాలుకు రు. 3,500, పసుపునకు క్వింటాలుకు రు. 15 వేల గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 26న ఆర్మూర్ నుంచి హైదరాబాద్‌కు రైతులు తలపెట్టిన పాదయాత్రను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి అడ్డుకున్నారు. దీంతో రైతులు రోడ్డుపై బైఠాయించి తమ రాస్తా రోకోలు నిర్వహించి తమ నిరసనలను తెలిపారు.

ద్వానాశాస్త్రి మృతి

సాహిత్య విమర్శకులు, అధ్యాపకులు ద్వాదశి నాగేశ్వర శాస్త్రి (ద్వానా శాస్త్రి) హైదరాబాద్‌లో ఫిబ్రవరి 26న మరణించారు. 1948, జూన్ 15న కృష్ణా జిల్లా లింగాల గ్రామంలో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంఎ తెలుగు పట్టాపొందారు. ఉభయ గోదావరి జిల్లాలలోని సాహిత్య సంస్థలు అంశంపై పరిశోధన చేశారు. నాలుగున్న దశాబ్దాల పాటు విమర్శనా రంగంలో ద్వానాశాస్త్రి ఎంతో కృషి చేశారు. సాహిత్య రంగానికి సంబంధించి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 2012లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురజాడ సాహితీ పురస్కారంతో ఆయనను సత్కరించింది. వీ

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

జార్ఖండ్‌లోని కుంతీ జిల్లా బరీ అటవీ ప్రాంతంలో జనవరి 29న జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందగా, ఒకరు గాయాలతో పట్టుబడ్డారు. కోబ్రా దళాలు కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఎఒబి జోన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఆపరేషన్ సమాధాన్' పేరుతో చేస్తున్న అణచివేతను నిరసిస్తూ మావోయిస్టులు జనవరి 31న భారత్‌బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై నిజనిర్ధారణకు వెళ్లిన హక్కుల సంఘాల నివేదిక ప్రకారం పోలీసులు స్థానిక ఆదివాసులను పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసి చంపేశారని తెలిపింది.

ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డే అరెస్టు, విడుదల

పూణెలో ఎల్గార్ పరిషత్ సమావేశం నిర్వహించి, ప్రజలను రెచ్చగొట్టి 2017లో భీమా కోరేగావ్ అల్లర్లకు కారణమయ్యాడన్న ఆరోపణలపై ప్రొఫెసర్ ఆనంద్ తెల్‌తుంబ్డేను మహారాష్ట్ర పోలీసులు ఫిబ్రవరి 2న ముంబై ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. తెల్‌తుంబ్డేను ఫిబ్రవరి 11 వరకు అరెస్టు చేయవద్దంటూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో ఆయన అరెస్టు చట్టవిరుద్ధమని అదనపు సెషన్స్ జడ్జి పేర్కొన్నారు. ఆయన్ని వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని హైదర్‌గూడ కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ఆనంద్ తెల్ తుంబ్డేతో పాటు పలువురు ప్రజా స్వామికవాదుల అరెస్టు అప్రజాస్వామికమని వారిపై పెట్టిన కేసులు కొట్టివేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల కోసం గుజ్జర్ల ఆందోళన

విద్య, ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గుజ్జర్లు ఫిబ్రవరి 10న రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ జిల్లా ఆగ్రామొరేనా జాతీయ రహదారిని ముట్టడించారు. ఆందోళనకారులకు పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ఈ నిరసన మూడు రోజుల పాటు జరిగింది. గుజ్జర్లకు 5 శాతం రిజర్వేషన్ల బిల్లును 2017లోనే రాజస్థాన్ అసెంబ్లీ ఆమోదించింది. రిజర్వేషన్ల కోటా పరిమితి 50 శాతం మించరాదనే సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఆ బిల్లు అమలును నిలుపుదల చేస్తూ ఆదేశాలిచ్చింది. గుజ్జర్లతో పాటు బంజారా, గాడియా లొహార్, రైకా, గడారియా వంటి ఇతర కులాలకు 5 శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తూ రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లను 21 శాతం నుంచి 26 శాతానికి పెంచుతూ రాష్ట్ర మంత్రి బిడి కల్లా ఫిబ్రవరి 13న రాష్ట్ర అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టారు.

జార్జి ఫెర్నాండెజ్ మృతి

కార్మిక నాయకుడు జార్జి ఫెర్నాండెజ్ (88) మృతిచెందారు. గత కొంతకాలంగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతూ ఆయన చికిత్స పొందుతూ జనవరి 29న న్యూఢిల్లీలోని తన నివాసంలో మరణించారు. 1974లో జరిగిన రైల్వే సమ్మెకు ఆయన నాయకత్వం వహించారు. ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీని ఎదిరించి, అజ్ఞాత జీవితం గడపగా ప్రభుత్వం ఆయన్ని అరెస్టు చేసి జైల్లో నిర్బంధించింది. 1994లో జనతాపార్టీ చీలిపోయాక సమతా పార్టీని స్థాపించారు. ఆయన రాసిన వాట్ ఎయిల్ సోషలిస్ట్స్, 1974 రైల్వే స్ట్రైక్, జార్జి ఫెర్నాండెజ్ స్పీక్స్ అధిక ప్రాచుర్యం పొందాయి.

ఢిల్లీలో విద్యార్థి సంఘాల ధర్నా

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి పది శాతం నిధులు కేటాయించాలని అయిదు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐడిఎస్ఓ, ఎఐఎస్‌బిల ఆధ్వర్యాన ఫిబ్రవరి 18న ఢిల్లీలోని రాంలీలా మైదాన్ నుంచి భారీ ప్రదర్శన అనంతరం జంతర్‌మంతర్‌లో దీక్ష జరిగింది. విద్యార్థి సంఘాల నేతలు దేశ వ్యాప్తంగా కె.జి నుంచి పి.జి వరకు ప్రభుత్వ నిధులతోనే విద్యా బోధన చేయాలన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని కోరుతూ మోదీ హఠావో.. దేశ్ బచావో అంటూ విద్యార్థులు నినాదాలు ఇచ్చారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లో ఆందోళనలు

అరుణాచల్‌ప్రదేశ్‌లో చాలా కాలంగా నివసిస్తున్న ఆరు కులాలకు చెందిన స్థానికేతరులకు శాశ్వత నివాస ధృవపత్రం (పిఆర్‌సి) ఇవ్వాలన్న రాష్ట్ర అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసు చేసింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు ఆందోళనలు చేపట్టారు. కర్ఫ్యూను సైతం ధిక్కరించిన నిరసనకారులు డిప్యూటీ సిఎం చౌనా మీన్ ఇంటిని తగులబెట్టారు. ఫిబ్రవరి 22న పోలీసు కాల్పుల్లో వ్యక్తి గాయపడడంతో ఆగ్రహం చెందిన స్థానికులు 24న ఇటానగర్‌లో భారీ మార్చ్ నిర్వహించారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు.

గంగానదిపై హైడ్రో ప్రాజెక్టులు వద్దు

గంగానదిపై నిర్మిస్తున్న నాలుగు జల విద్యుత్తు ప్రాజెక్టులను నిలిపి వేయాలని సామాజికవేత్తలు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 24న హరిద్వార్‌కు చెందిన స్వామి శివానంద నేతృత్వంలో ఢిల్లీలోని ఇండియా గేట్ నుంచి జంతర్ మంతర్ వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సామాజిక ఉద్యమకారిణి మేధా పాట్కర్ మాట్లాడుతూ జల విద్యుత్తు ప్రాజెక్టులను రద్దు చేయాలంటూ ఆత్మబోధానంద 123 రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్నా ఆయనతో చర్చలు జరిపేందుకు కేంద్ర మంత్రి గడ్కరీ సుముఖత చూపకపోవడం, గంగానది తీర ప్రాంతంలో జరుగుతున్న స్టోన్ క్రషింగ్‌వల్ల నదీ ప్రవాహానికే ఆటంకం ఏర్పడుతోందన్నారు. ఉత్తరాఖండ్‌లో గంగ ఉపనది అలకనందపై నిర్మిస్తున్న తపో భట్వారీ డ్యాముల వల్ల పర్యావరణ సమతుల్యత తీవ్రంగా దెబ్బతింటుందని స్వామి శివానంద ఆందోళన వ్యక్తం చేశారు.

కల్తీ సారాకు బలి

ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సోం రాష్ట్రాలలో కల్తీ సారా తాగి ..... మంది చనిపోయారు. ఫిబ్రవరి 7న ఉత్తరాఖండ్‌లో సాహరన్‌పూర్, ఖుషీనగర్‌లో, అలాగే ఉత్తర్‌ప్రదేశ్‌లోని హరిద్వారలో కల్తీ సారా తాగి 116 మంది చనిపోయారు. వందలాది మంది తీవ్ర అస్వస్థకు గురై ఆసుపత్రిలో చేరారు. ఫిబ్రవరి 21న అస్సోంలోని గోలాఘాట్, జోర్హాట్ జిల్లాలో కల్తీ మద్య సేవించి 158 మరణించారు. దాదాపు మూడు వందల మందికి పైగా తీవ్ర అస్వస్థతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్‌లు, ఆత్మాహుతి దాడి

కశ్మీర్‌లో కుల్గాం జిల్లా కెల్లాం దెవ్‌సర్‌లో ఫిబ్రవరి 10న భద్రతా బలగాలకు మిలిటెంట్లకు మధ్య జరిగిన కాల్పుల్లో ఐదుగురు మిలిటెంట్లు మరణించారు. ఫిబ్రవరి 14న జమ్మూ నుంచి శ్రీనగర్‌కు హైవే పై వెళుతున్న సిఆర్‌పిఎఫ్ కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి జరిగింది. కాన్వాయ్‌లోని ఒక బస్సును పేలుడు పదార్థాలతో నిండి ఉన్న ఒక కారుతో పేల్చి వేయడంతో అందులోని 44 మంది జవాన్లు మరణించారు. ఫిబ్రవరి 22న బారాముల్లా జిల్లా వార్‌పొరా ప్రాంతంలో మిలిటెంట్లకు భద్రతా బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు మిలిటెంట్లు మృతిచెందారు. ఫిబ్రవరి 24న కుల్గాం జిల్లా టురిగామ్‌లో భద్రతా బలగాలకు మిలిటెంట్లకు మధ్య కాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లతో పాటు ఒక డిఎస్‌పి, ఒక జవాను మృతిచెందారు. వీ

బెల్జియంలో నిరసనలు

బెల్జియం రాజధాని బ్రెసెల్స్‌లో వాతావరణ మార్పులపై పౌరులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేశారు. జనవరి 28న రాజధానిలో దాదాపు డెబ్బై వేల మంది ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు తక్షణమే కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. పునర్వినియోగ ఇంధనాన్ని మరింతగా వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టాలని, ముందు తరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించడానికి ఇప్పటి నుంచే కార్యాచరణకు దిగాలని అన్నారు. ఫ్రాన్స్ వ్యాప్తంగా వేలాది మంది మానవహారాలుగా ఏర్పడి, బహిరంగ సభలు నిర్వహించి నిరసన కార్యక్రమాలు చేశారు.

మెక్సికోలో కార్మికుల సమ్మె

పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలను 20 శాతం మేరకు పెంచాలని డిమాండ్ చేస్తూ మెక్సికోలో కార్మికులు సమ్మె చేశారు. జనవరి 29న జరిగిన ఈ సమ్మెలో హిరైకా డీ మటామోరస్ ప్రాంతంలోని యాభై కర్మాగారాల్లో పనిచేస్తున్న దాదాపు డెబ్బై వేల మంది పాల్గొన్నారు. పనిచేస్తున్న ప్రదేశాల్లో శుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని, మౌలిక వసతులు, వైద్య సదుపాయం కల్పించాలని, కంపెన్సేషన్ బోనస్ చెల్లించాలని, పని గంటలు తగ్గించాలని కార్మికులు ప్రధానంగా డిమాండ్ చేశారు.

దక్షిణ ఆఫ్రికాలో ప్రైవేటీకరణపై నిరసనలు

ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న సంస్థలను ప్రైవేటీకరించబోతున్నట్లు దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నేషనల్ యూనియన్ ఆఫ్ మెటల్ వర్కర్స్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా (నమ్‌సా), నేషనల్ యూనియన్ ఆఫ్ మైన్ వర్కర్స్ (నమ్) నిరసన ప్రదర్శనలు చేశారు. జనవరి 30న ప్రిటోరియా నగరంలో ప్లకార్డులు, బ్యానర్లతో ప్రభుత్వం తీసుకున్న ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ (ఐపిపి)కి వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించారు. ప్రైవేట్ సెక్టార్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. యూనియన్లతో ఎలాంటి సంప్రదింపులు చేయకుండా ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణమే ఈ ఐపిపి విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జింబాబ్వేలో ఉపాధ్యాయుల నిరసన

జింబాబ్వేలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఫిబ్రవరి 10న తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ సమ్మె చేశారు. జింబాబ్వే టీచర్స్ అసోసియేషన్, ప్రొగ్రెసివ్ టీచర్స్ యూనియన్ ఇచ్చిన ఈ సమ్మె పిలుపులో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారిలో 80 శాతం మంది పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం చెల్లిస్తున్న జీతాలు సరిపోవడం లేదని ఉపాధ్యాయులు అన్నారు. ప్రభుత్వం తక్షణమే తమ జీతాలు పెంచాలంటూ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని, సమ్మెలో పాల్గొన్న కాలానికి జీతాలు చెల్లించమని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులపై చర్యలు చేపడతామని ప్రభుత్వం హెచ్చరించింది.

ఇరాన్‌లో ఆత్మాహుతి దాడి

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఫిబ్రవరి 14న ఆత్మాహుతి దాడి జరిగింది. సైనికుల వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని మిలిటెంట్లు దాడి చేశారు. ఈ దాడిలో ఇరవై ఏడు మంది సైనికులు మరణించారు. మరో పదమూడు మంది తీవ్రంగా గాయపడ్డారు. అమెరికా మద్దతిచ్చిన షా పాలన 1970లో ముగిసి ఇస్లామిక్ విప్లవం 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇరాన్ నేతలంతా విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులు, నేతల భద్రత కోసం వెళ్తున్న సైనికులను లక్ష్యంగా చేసుకొని జైషే అల్ ఆదిల్ సంస్థకు చెందిన మిలిటెంట్లు ఈ దాడికి పాల్పడ్డారు.

నైజీరియా అధ్యక్షుడిగా బుహారీ

నైజీరియా అధ్యక్ష పదవికి ఫిబ్రవరి 16న ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు, ప్రొగ్రెసివ్ కాంగ్రెస్ పార్టీ నేత ముహమ్మద్ బుహారీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ నేత అటీకు అబూబాకర్ మధ్య పోటీ నెలకొంది. ఫిబ్రవరి 26న ఇండిపెండెంట్ నైజీరియా ఎలక్టోరల్ కమిషన్ (ఐఎన్ఇసి) ఎన్నికల ఫలితాలను విడుదల చేసింది. ఎన్నికల్లో బుహారీకి 15.2 మిలియన్ (56 శాతం) ఓట్లు రాగా, అబూబాకర్‌కు 11.3 శాతం ఓట్లు వచ్చాయి. దీంతో బుహారీ మరోసారి అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. మరో నాలుగేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

స్పెయిన్‌లో భారీ నిరసన

స్పెయిన్ రాజధాని బార్సిలోనాలో ఫిబ్రవరి 17న భారీ నిరసన ప్రదర్శన జరిగింది. కాటలోనియా వేర్పాటువాదులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ రెండు లక్షల మంది ప్లకార్డులు, పసుపు, నీలం, ఎరుపు రంగు బ్యానర్లు ప్రదర్శించి నిరసన ప్రదర్శనలు చేశారు. కాటలోనియా స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న 12 మంది నేతలను స్పెయిన్ ప్రభుత్వం అరెస్టు చేసింది. వీరిపై ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటుకు ఉసిగొల్పినట్లుగా అభియోగాలు మోపారు. నేరం రుజువైతే వీరికి పదిహేను సంవత్సరాల జైలు శిక్ష పడుతుంది. మూడు నెలల పాటు వీరిపై విచారణ కొనసాగుతుంది. ఈ విచారణను వెంటనే నిలిపివేసి వారిని విడుదల చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

సెనెగల్ ఎన్నికలు

సెనెగల్ అధ్యక్ష పదవికి ఫిబ్రవరి 24న ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 65 లక్షల మంది పౌరులు ఓటు వేశారు. మేకీ సాల్ 57 శాతం ఓట్లతో మరోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. సెనెగల్‌ను ప్రగతి నడిపించగలిగే సామర్థ్యం అధ్యక్షుడు సాల్‌లో ఉందని సెనెగల్ ప్రధాని డియోనె అన్నారు.

వెనిజులా తాజా పరిణామాలు

వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను గద్దె దించేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిందిగా వివిధ దేశాల అధ్యక్షులు ఐక్యరాజ్య సమితికి విజ్ఞప్తి చేశారు. హైతీలోని నలభైకు పైగా రాజకీయ, సామాజిక, వాణిజ్య సంఘాలు మదురోకు మద్దతుగా నిలిచాయి. రాజ్యాంగం ప్రకారం వెనిజులాకు చట్టబద్ధమైన అధ్యక్షుడు మదురోనేనని ఆయా సంఘాలు ఒక డిక్లరేషన్‌ను ప్రకటించాయి. అమెరికా కీలుబొమ్మ జుయాన్ గైడో ప్రభుత్వాన్ని గుర్తించేందుకు నిరాకరించాయి. వెనిజులాపై అమెరికా ప్రేరేపిస్తున్న రాజకీయ, ఆర్థిక దాడులను అరికట్టాలని యూరోపియన్ యూనియన్ (ఇయు)కు బోలీవియా అధ్యక్షుడు ఎవో మొరెల్స్ విజ్ఞప్తి చేశారు. అమెరికా జోక్యాన్ని వ్యతిరేకిస్తూ లాటిన్ అమెరికా నాయకులు ముందుకు రావాలని కోరారు. మరోవైపు వెనిజులాపై ఆర్థిక వ్యవస్థను మరింత దెబ్బతీసేందుకు అమెరికా మరిన్ని ఆంక్షలు మోపడానికి చూస్తోంది.

అఫ్ఘనిస్తాన్‌లో అంతర్యుద్ధంతో భారీగా మరణాలు

అఫ్ఘనిస్తాన్‌లో అంతర్యుద్ధం కారణంగా భారీగా సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారని ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన నివేదికలో తెలిపింది. గత ఏడాది కాలంలో 3,804 మంది చనిపోయారని, ఇందులో 927 మంది చిన్నారులు ఉన్నారని అంది. అమెరికా ప్రత్యేక బలగాలు తాలిబన్లను నిర్మూలించేందుకు జరిపిన దాడుల్లో కూడా సామాన్య పౌరులు మరణిస్తున్నారు. మరోవైపు తాలిబన్లు తమ పట్టు కోసం పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలపై, అధిక జనావాసాలపై చేసే దాడుల కారణంగా పౌరులు అధిక సంఖ్యలో మరణిస్తున్నారని తెలిపింది. అఫ్ఘనిస్తాన్ నేతలకు, తాలిబన్లకు మధ్య జరుగుతున్న శాంతి చర్చలు కొనసాగుతుండగానే తాలిబన్లు దాడులకు పాల్పడుతున్నారు. బగ్లాన్ ప్రావిన్స్‌లో ఫిబ్రవరి 5న పోలీస్ చెక్‌పాయింట్‌పై దాడి చేసింది. ఈ దాడిలో పదకొండు మంది పోలీసులతో సహా 21 మంది మరణించారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుదుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(జనవరి 1 నుండి జనవరి 31, 2019 వరకు తెలంగాణలోని 9 జిల్లాలు (850), ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాలలో (794) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1644)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	4	-	24	21	8	9	3	3	3	1	1	1	-	29	36	-	-	-	3	-
హైదరాబాద్	-	-	-	13	15	7	6	5	6	6	9	6	7	8	26	14	-	-	-	-	-
కరీంనగర్	-	4	2	7	9	3	4	2	2	2	4	5	2	7	22	19	-	-	-	-	-
ఖమ్మం	-	3	-	7	6	1	2	1	1	7	-	3	-	3	29	10	-	-	-	-	2
మహబూబ్‌నగర్	-	-	1	2	2	4	2	3	4	2	4	3	2	4	36	1	-	-	-	-	-
మెదక్	1	9	2	4	6	8	9	12	2	2	4	5	2	15	19	19	-	-	-	1	-
నల్గొండ	-	6	-	6	8	2	3	2	1	2	3	5	2	6	28	18	-	-	-	-	-
నిజామాబాద్	-	2	-	3	6	2	3	2	1	1	2	4	-	3	24	13	-	-	-	-	-
వరంగల్									వివరాలు అందలేదు												
వికారాబాద్	-	2	-	2	2	3	4	1	2	3	2	3	6	4	18	13	-	-	-	-	-
తెలంగాణ	**2**	**30**	**5**	**68**	**75**	**38**	**42**	**31**	**22**	**28**	**29**	**32**	**22**	**46**	**231**	**143**	**-**	**-**	**-**	**4**	**2**
అనంతపురం	-	3	-	7	18	-	2	1	-	6	2	9	13	5	45	-	-	-	-	-	-
చిత్తూరు	-	1	-	2	3	4	2	-	1	2	2	3	6	2	9	3	-	-	-	-	-
కడప	-	1	-	1	-	-	-	-	-	-	-	-	-	-	10	4	-	-	-	-	-
గుంటూరు	-	-	-	3	4	2	3	3	1	2	2	4	2	5	22	16	-	-	-	-	-
కృష్ణా	-	-	-	4	6	4	3	2	3	5	2	4	-	3	18	12	-	-	-	-	-
కర్నూలు	-	2	-	6	8	3	4	2	2	5	4	6	3	6	22	18	-	-	-	-	-
తూర్పు గోదావరి	-	2	-	3	5	6	4	4	-	3	5	2	2	3	30	28	1	-	-	3	-
ప్రకాశం	-	-	-	2	4	2	2	1	1	2	2	3	-	3	16	13	-	-	-	-	-
శ్రీకాకుళం									వివరాలు అందలేదు												
పశ్చిమ గోదావరి	-	-	-	3	5	2	2	1	1	2	2	3	-	2	17	12	-	-	-	-	-
నెల్లూరు	-	-	-	3	4	1	2	2	1	2	2	4	1	3	18	14	-	-	-	-	-
విజయనగరం	-	-	-	4	5	4	4	3	2	3	1	2	-	3	11	10	-	-	-	-	-
విశాఖపట్నం	-	1	-	10	12	-	2	1	-	2	1	4	2	-	30	16	-	-	-	7	
ఆంధ్రప్రదేశ్	**-**	**10**	**-**	**48**	**74**	**28**	**30**	**20**	**12**	**34**	**25**	**44**	**29**	**35**	**248**	**146**	**1**	**-**	**-**	**10**	**-**



భీమా కోరేగాం 12 - వి.వి.

ఎన్. వేణుగోపాల్

స్వేచ్ఛా సాహితి ప్రచురణ

పేజీలు: 72
వెల: రు. 50

ప్రతులకు:
వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్: 040 66843495; **అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో**


సహచరులు

వరవరరావు

నయనోదయ ప్రచురణలు

ప్రతులకు:
పి. హేమలత
ఫ్లాట్ నెం. 419, హిమసాయి హైట్స్, స్ట్రీట్ నెం. 6,
జవహర్‌నగర్, హైదరాబాద్ - 500 020.
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

పేజీలు: 120
వెల: రు. 100



విరసం ప్రచురణలు

నేను చావును నిరాకరిస్తున్నాను



సాయిబాబా అండాసెల్ కవిత్వం


జి.ఎన్. సాయిబాబా

పేజీలు: 136
వెల: రు. 125

ఇప్పుడు కావల్సింది

అర్బన్ మావోయిస్టులే

పాణి
వరలక్ష్మి



పేజీలు: 104
వెల: రు. 100

ప్రతులకు


డి.వి. రామకృష్ణారావు, ఎం.ఐ.జి.-14, ఎ.పి.ఐ.సి. కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040. ఫోన్: 9989189250
నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్. ఫోన్: 040-24652387;
నవ తెలంగాణ, చిక్కడపల్లి, హైదరాబాద్ - 500 020. ఫోన్: 040-27608107;
అనేక బుక్‌స్టాల్, ఏలూరు రోడ్, విజయవాడ-520 002. ఫోన్: 8977493465; **ఇతర ప్రముఖ పుస్తక షాపులు**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 212 - March 2019 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/2/2019 ● Postal Regn. No. HD/1100/2017-19

Date of Posting : 29th, 30th

రచన : సమతాశ్రీధర్

తప్పక చదవాల్సిన నవల



* 'మీ అందరిలెక్క, ఇస్తట్లో అన్నం కూరలు పెట్టుకుని కడుపునిండా తినే అందమైన బతుకు కాదన్నా మాది. కుక్కలు చించిన ఇస్తర్లలాంటియన్నా మా బతుకులు. పందులు బొర్లే రొచ్చుగుంట బతుకులన్నా మాయి. ఆ రోత బతుకులు మీ అసుంటోల్లు ఇననుగూడా ఇనలేరు'.....

* 'ఈ భూమ్మీద అందరూ ఎట్టా పుట్టారో, మేము అట్టానే పుట్టినాము. పుటకలో తేడాలేదు. కాళ్ళూ సేతులు రకతంలో తేడాలేదు. ఆవుల్ని పూజిస్తారు. కప్పలకి పెల్లిల్లు సేస్తారు. సాటిమనుషులుగా పుట్టిన మమ్మల్ని అంటుకుంటేనే అసహ్యాపడి పసుపునీల్లు జల్లుకుంటారు. ఈ భూమిని దున్ని సాగుజేసి, కట్టలు కట్టి చెరువులు చేసి, యంత్రాలు దిప్పి ఈ సమస్త సంపదను తయారుచేస్తున్న మమ్మల్ని, కుక్కల కన్నా పందుల కన్నా హీనంగా సూస్తావున్నారు. ఇది నాయమేనా, ఎప్పటికైనా ఇది మారతా దంటావా'?....

* 'పాత పురాణేతిహాసాలకి కొనసాగింపుగా, వాటికి ప్రక్షిప్తాలు చేర్చడానికి కావలసిన సరంజామాను తయారుచేయడానికి కవులు, కళాకారులు, రచయితలు రాజ్యం విసిరేసిన ఎంగిలి మెతుకులు గతకటంలో వారు తమ వంతు పాత్ర నిర్వహించడానికి సిద్ధంగానే ఉంటారు'.....

* 'కులసంఘాల నాయకులు, రాజ్యం సృష్టించిన ఎంగిలిమెతుకులగాళ్ళనే సత్యం, ప్రజలకు అర్థమైనప్పుడు సహజంగా, వర్గస్పృహతో తప్పనిసరిగా ఆలోచిస్తారు'...

* 'కార్మికవర్గం చేతిలో ఆయుధంగా ఉండవలసిన మార్క్సిస్ట్ తత్వశాస్త్రం, ఆధిపత్య కులాలవారు ఆర్జించడానికి ఆభరణంగా మారడం, భారత రాజకీయాలలో ఒక విషాద రాజకీయ పరిణామం'....

* 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా విప్లవ ప్రచారం, అందుకు ఎన్నికలలో పాల్గొనటం అనే ఎత్తుగడ ద్వారా, ప్రజాస్వామ్య ముసుగును బహిర్గతం చేద్దామను కుని, అందులోకి దిగినవారు ఆ పార్లమెంటరీ ప్రజాస్వామ్య రొచ్చులో, ఆ దుర్గంధాన్ని అంటించుకుని, భ్రష్టుపట్టిపోయి, ఆ మురికిలో ఇంకా ఏదోవుందని, ముట్టెతో కెలుకుతూ పొరకలాడటం, ప్రజలు గమనిస్తున్న వాస్తవం'.....

* 'విప్లవం ఎప్పుడూ అరాచకం కాదు. విప్లవం అనేది శాంతి స్థాపనలో జరిగే ఒక ఘర్షణ–తిరుగుబాటు మాత్రమే'.......

పేజీలు : 244 **వెల : రూ. 80/-**

మొదటి ముద్రణ: జనవరి, 2019

ప్రతులకు: సమతా నర్సింగ్ హోమ్, 15/9/455, కవిరాజనగర్, ఇల్లందు క్రాస్‌రోడ్, ఖమ్మం – 507 002 సెల్ : 98481 56198

Advt.

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao